THE LARGEST CIRCULATED TELUGU WEEKLY

స్వాతి

₹20
20.4.2018

ESTABLISHED 1984

సమరస వారపత్రిక



మెదడు చెప్పేమాట


అనుబంధాలే అగాధాలను సృష్టిస్తే...?
మీ
GEMINI
టివి లో
SOUTH INDIA
shopping mall
Presents
ఏప్రిల్ 16 నుండి
సోమ - శుక్ర
రాత్రి 7 గం॥లకు
మావిడాకులు
ఇప్పుడే సన్ నెక్స్ట్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని
ఈ కార్యక్రమాన్ని వీక్షించండి ఎప్పుడైనా ఎక్కడైనా
SUN NXT
DOWNLOAD NOW
/GeminiTV /GeminiTV



THE LARGEST CIRCULATED TELUGU WEEKLY

స్వాతి సపరివార పత్రిక

FOUNDER PROPRIETOR EDITOR : VEMURI BALARAM



పాఠక దేవుళ్ళకు నమస్కారం

ఎడిటర్
వేమూరి బలరామ్

ESTABLISHED 1984 | సంపుటి 34 | 20.4.2018 | సంచిక 42

అనిల్ బిల్డింగ్స్ సూర్యారావుపేట పోస్ట్ బాక్స్ 339 విజయవాడ 520 002

The only way to show our love for the messenger, is by living by his message

ముఖచిత్రం కైరా అద్వానీ

శ్రద్ధాభావన

ఏ విషయంలోనైనా సంయమనం అవసరం. దానివల్ల శరీరం ఆరోగ్యంగా వుంటుంది.

మనిషికి దీర్ఘాయువు లభిస్తుంది. ఈ గుణాలు శ్రద్ధ ద్వారానే ఉదయిస్తాయి. శ్రద్ధవల్ల సదాలోచన, సద్భావనలు అలవడతాయి.

ఫలితంగా- మామూలు మెదడు సైతం ఋషి తుల్యమైన మేధస్సుతో నిండిపోతుంది.

ఈ గుణాలు మంచిగంధంలా చల్లని సువాసన వెదజల్లుతాయి.ఆలోచనకు తగినదిశ లభించడంతో, మనిషి కార్యకలాపాలు ఉత్కృష్టతతో నిండుతాయి. ఫలితంగా చేకూరే సాఫల్యాలు వరాలుగా, పరిగణించబడతాయి.

శ్రద్ధ ఆత్మీయతగా, సువ్యవస్థగా పరిణతి చెందుతుంది.కుటుంబాలలో సహకారం సౌజన్యాలతో కూడిన వాతావరణం నిర్మాణమవుతుంది. అలాంటి వాతావరణం కలిగిన కుటుంబాలలో ఉత్తమపౌరులు జన్మిస్తారు.

ధనంవల్ల సౌకర్యాలను సమకూర్చుకోవచ్చు. భోగవిలాసాలకు అవసరమయ్యే సాధనాలను సమీకరించుకోవచ్చు. ఐతే వీటివల్ల అహంకారం పెరగడం తప్ప ఒరిగేదేమీ లేదు.

శ్రద్ధను అలవరుచుకోవడంద్వారానే కుటుంబాన్ని ఆత్మీయత అనే సూత్రంతో ఏకం చేయగలుగుతాము. అలాంటి కుటుంబాలలో వాతావరణం, పేదరికంలో సైతం ధనిక వాతావరణం కన్నా హెచ్చుగా సంతోషాన్ని ఇస్తుంది.

భార్యాభర్తల మధ్య, సోదరీ సోదరుల మధ్య తల్లిదండ్రులకూ, సంతానానికి మధ్య ఆత్మీయత ఔదార్యాలతో నిండిన సేవాభావనలు పొంగిపొరలితే,ఆ కుటుంబం ఆనందంగా వుంటుంది.

-యుగశక్తి గాయత్రి

చందాను www.swatipublications.com వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చు

E-mail: advtswati@gmail.com swativja@eth.net

విడిప్రతి ₹20 12 నెలలకు ₹1076
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిల్) ₹6666 (100 డాలర్లు)

Editor : VEMURI BALARAM Swati Publications Anil Buildings Suryaraopet Vijayawada 520 002 Printed and Published by the owner VEMURI BALARAM
Printed at Anil Swati Press Autonagar Vijayawada Cover at Kala Jyothi Process Pvt.Ltd., Hyderabad

Tel.: (0866) 243 1862 243 4017 Advt. 243 1233 Mktg. 243 3938 Fax: 0866-243 0433



అత్యధిక సర్క్యులేషన్‌గల ఏకైక తెలుగు వారపత్రిక

సాక్షి

6.4.2018

చందమామ రావే కథ 'బ్రహ్మ ముడి' చాలా బాగుంది.

కామెడీ కథ 'ప్రకృతి వైద్యం' చాలా బాగుంది. 'స్వధర్మం' కథ ఇంట్రెస్టింగ్‌గా సాగింది.'నిద్ర అవసరం' స్పెషల్ ఫీచర్ బాగుంది. 'B హ్యాపీ', 'చిలిపి' శీర్షికలు ఫన్నీగా ఉంటున్నాయి.

చిన్నా ఖమ్మం

'సదాచారం అవలక్షణాలను దూరం చేస్తుందన్న' 'సత్యాన్వేషణ' సుభాషితం అనుసరణీయం, ఆచరణీయం. 'విధి' కథ బాగుంది.

ఎన్.సుభాష్ చంద్రబోస్ విశాఖపట్నం

గాంధీగారి గొప్ప మనసు తెలిపే ఉదంతాన్ని శ్రీరామశర్మగారు చాలా చక్కగా ఉదహరించారు.

స్టీఫెన్‌హాకింగ్ గురించి డా॥జె.భాగ్యలక్ష్మిగారు ఇచ్చిన వివరాలు క్లుప్తంగా ఉన్నా, ఆయన జీవితంలో ప్రధానాంశాలను స్పృశించారు.

'అత్తఫలం' పేరు విపరీతంగా ఉన్నా కథాకథనం చక్కగా ఉంది.

'అంతా రాజకీయమే'లో ముఖ్యమైన విషయాలను చెప్పారు.

'చిలిపి' శీర్షిక చాలా బాగుంది.

'హృదయం ఎక్కడున్నదీ...' సీరియల్ ఆసక్తిగా సాగుతోంది.

డా॥ శివభూషణం కర్నూలు

మగువలకు అందాల ఆకర్షణ కలిగించే 'గోటిమీద బొమ్మ' ఫీచర్ బాగుంది. నిద్రను దూరంచేసే సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్‌లు, టీవీలో వచ్చే నైట్‌షోలకు దూరంగా వుండాలని'నిద్ర అవసరం'లో ఎంతో తెలిపారు.

బాంధవ్యాల్లో దంపతుల నడుమ కలిసి గడపకపోవటానికి నేడు స్మార్ట్ ఫోన్లు వారిని దూరం చేస్తున్నాయి అని 'ఏ జంట అయినా' స్పెషల్ ఫీచర్‌లో తెలిపిన తీరు ఆకట్టుకుంది.

'అత్తఫలం', 'స్వధర్మం', 'విధి' కథలు బాగున్నాయి.

తేనేటి రమ్యదీప్తి సత్తెన్నపల్లి

'అత్తఫలం'కథలో సునిశిత శృంగారంతో పాటు హృద్యమైన సందేశం ఉంది. చిలిపి హాస్యాన్ని అందిస్తోంది.

'అంతా రాజకీయమే' శీర్షిక ద్వారా నేటి రాజకీయాలు తెలుస్తున్నాయి.

'వేట', 'సామ్రాట్ సముద్రగుప్త' 'హృదయం ఎక్కడున్నది', 'మనిషిలో మనిషి' సీరియల్స్ వారంవారం ఉత్కంఠగా సాగుతున్నాయి. కథలు, స్పెషల్ ఫీచర్స్, శీర్షికలన్నీ బాగున్నాయి.

ఎ.వి.సోమయాజులు కాకినాడ

'సత్యాన్వేషణ'లో 'మత్స్యావతార విశేషాలతోపాటు మిగిలిన అంశాలు మమ్మల్ని భక్తిభావంతో ముంచెత్తివేశాయి. 'చందమామరావే' శీర్షికలో బ్రహ్మచారి కథ ఆకట్టుకుంది.

విధిని దాటతరమా అని 'విధి' కథ చదివాక అనిపించింది.

కరణం శివానందరావు కర్నూలు

వచ్చేవారం స్పెషల్

నిద్రకు, బరువుకు లింకు

ఇది మంచి సమయం



12.4.2018 నుండి 16.4.2018 వరకు శ్రీ విలంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, కృష్ణపక్షం. 17.4.2018 నుండి వైశాఖమాసం, శుక్లపక్షం.

12.4.2018 గురువారం
తిథి: ఏకాదశి ప. 8.13 వరకు
నక్షత్రం:శతభిషం రా. 3.18 వరకు
వర్జ్యం: ఉ. 9.21-11.04 వరకు
దుర్ముహూర్తం : ప. 10.03-10.52 వరకు. మ. 2.59-3.48 వరకు
రాహుకాలం: మ.1.38-3.09 వరకు
మంచి సమయం : ఉ.6.00 నుండి 7.40 వరకు
సూర్యోదయం: 5.51కి
సూర్యాస్తమయం: 6.16కి

13.4.2018 శుక్రవారం
తిథి: ద్వాదశి ప. 9.04 వరకు
నక్షత్రం:పూర్వాభాద్ర తె.4.13 వరకు
వర్జ్యం: ప. 9.56-11.36 వరకు
దుర్ముహూర్తం:ప.8.24 నుండి 9.13 వరకు. మ. 12.30-1.19 వరకు
రాహుకాలం: ప.10.34-12.05 వరకు
మంచి సమయం : మ. 2.20 నుండి 3.40 వరకు
సూర్యోదయం: 5.50కి
సూర్యాస్తమయం: 6.16కి

14.4.2018 శనివారం
తిథి: త్రయోదశి ప. 9.12 వరకు
నక్షత్రం: ఉత్తరాభాద్ర తె. 4.28 వరకు
వర్జ్యం: మ. 1.55-3.32 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5.55-7.34 వరకు
రాహుకాలం: ప. 9.00-10.38 వరకు
మంచి సమయం: సా.4.00-5.00 వరకు
సూర్యోదయం: 5.50కి
సూర్యాస్తమయం: 6.17కి

15.4.2018 ఆదివారం
తిథి: చతుర్దశి ప. 8.38 వరకు
నక్షత్రం: రేవతి తె. 4.05 వరకు
వర్జ్యం: సా. 4.16-5.51 వరకు
దుర్ముహూర్తం: సా. 4.36 నుండి 5.25 వరకు
రాహుకాలం: సా.4.42-6.14 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 5.49కి
సూర్యాస్తమయం: 6.17కి

16.4.2018 సోమవారం
తిథి: అమావాస్య ఉ. 7.27 వరకు.
వైశాఖ శుద్ధ పాడ్యమి తె.5.47 వరకు
నక్షత్రం: అశ్విని రా. 3.12 వరకు
వర్జ్యం: రా. 11.20-12.52 వరకు
దుర్ముహూర్తం : మ. 12.31 నుండి 1.20 వరకు. మ. 2.58-3.47 వరకు
రాహుకాలం: ఉ. 7.32-9.04 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 5.48కి
సూర్యాస్తమయం: 6.17కి

17.4.2018 మంగళవారం
తిథి: విదియ రా. 3.45 వరకు
నక్షత్రం: భరణి రా. 1.57 వరకు
వర్జ్యం : మ. 12.17-1.47 వరకు
దుర్ముహూర్తం: ప. 8.26-9.15 వరకు రా.10.57-11.46 వరకు
రాహుకాలం: మ. 3.10 నుండి 4.41 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 5.47కి
సూర్యాస్తమయం: 6.17కి

18.4.2018 బుధవారం
తిథి : తదియ రా. 1.30 వరకు
నక్షత్రం: కృత్తిక రా. 12.27 వరకు
వర్జ్యం: మ. 1.12-2.42 వరకు
దుర్ముహూర్తం : ప. 11.42 నుండి 12.31 వరకు
రాహుకాలం: మ.12.06 నుండి 1.38 వరకు
మంచి సమయం: ఉ. 5.00 నుండి 5.30 వరకు
సూర్యోదయం: 5.47కి
సూర్యాస్తమయం: 6.17కి

* ఏకాగ్రతను అసలు కోల్పోకు.

ఒక చిన్నమాట



భావప్రకటనకు స్వేచ్ఛ ఉంది. శాంతియుతంగా నిరసన తెలుపుకోటానికి స్వేచ్ఛ ఉంది. తమ తమ మత విశ్వాసాలకు సంబంధించిన పండుగలు సాంప్రదాయబద్ధంగా చేసుకుంటూ శాంతియుతంగా ఊరేగింపులు చేసుకునే వీలుంది. భిన్నత్వంలో ఏకత్వమంటూ 'వసుధైవ కుటుంబకమ్' (వసుధే కుటుంబం)అని విర్రవీగే అవకాశముంది.

కాని ప్రతి అడుగు వెనకా, ప్రతి నిరసన వెనకా, ప్రతి ఊరేగింపులోనా అగ్నిజ్వాలలు వెలగక్కుతూ, రక్తధారలు కురిపిస్తూ హింస ఎందుకు చోటుచేసుకుంటుంది? ఎందరు గాయపడ్డారు, ఎందరు మరణించారు, ఎంత ఆస్తి ధ్వంసమయింది అని లెక్కలు కట్టుకుంటూ అందరూ హింసను ఖండిస్తూ, ఎవరినో ఒకరిని నిందిస్తూ, మరెవరిమీదో నెపంవేస్తూ జీవితాలెందుకు నెట్టుకొస్తుంటాం?

అందరూ మానవతావాదులే. అందరూ న్యాయం కోసం పోరాడేవారే. హక్కుల పరిరక్షణ అంటూ ఆందోళనచేసేవారే. వీటన్నిటి మధ్య బడబాగ్నిలా, దావానలంలా హింస ఎందుకు వ్యాపిస్తుంది?

సుప్రీమ్‌కోర్టు షెడ్యూల్డ్‌క్యాస్ట్స్, షెడ్యూల్డ్‌ట్రైబ్స్‌కు సంబంధించిన చట్టం విషయంలో ఇచ్చిన ఒక తీర్పు మూలంగా భారత్‌బంద్‌ను ఏర్పాటుచేసి ఎంత హింసకు ఒనగూడారు! ఆ మరణాలు, ఆ గాయాలు, ఆ అగ్నిజ్వాలలు, ఆ ఆయుధాలు అవసరమా?

ఇంతకూ సుప్రీమ్‌కోర్టు ఏమి చెప్పింది? ఎస్.సి./ఎస్.టి. ప్రివెన్షన్ ఆఫ్ అట్రోసిటీస్ యాక్టు విషయంలో (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన వారిపై జరిగే దురాగతాలు, దుష్కృత్యాలను నిరోధించే చట్టము) నేరస్తులను అరెస్టుచేయటం గాని, క్రిమినల్ కేసులు నమోదు చేయటంగాని వాటంతట అవే జరగవని,

ప్రభుత్వోద్యోగి విషయంలో అతనిని నియమించిన అధికారంనుండి అనుమతి తీసుకుని నిర్బంధంలోకి తీసుకోవాలని, ప్రైవేటు పౌరుల విషయంలో కూడా చట్టరీత్యా విచారణచేసి నిర్బంధంలోకి తీసుకోవాలని కోర్టు తీర్పునిచ్చింది.

ఏ కేసునైనా మొదటి విచారణ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు చేస్తారని, నేరారోపణ నిజమా కాదా అని విచారిస్తారని తెలియజెప్పింది. చట్టంకింద తప్పుడు కేసులు నమోదు కాకుండా ఈ సవరింపు కోరడమైంది.



డాక్టర్ జె.భాగ్యలక్ష్మి
E-mail: jbhagyalakshmi43@yahoo.in

ఈ సవరణతో దళితుల మీద మరింతగా నేరాలు పెరిగిపోతాయేమో ననే భయం వ్యాపించింది. భారత్ బంద్‌లో సుప్రీమ్‌కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు ప్రదర్శించినా మధ్యప్రదేశ్,ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లలో తీవ్రస్థాయిలో ఆందోళనలు జరిగి ఎంతో హింసాకాండకు దారితీశాయి.

ప్రాణనష్టమూ జరిగింది. ఈ కేసును పునర్విచారించవలసిందని కేంద్ర ప్రభుత్వం సుప్రీమ్‌కోర్టును అర్థించింది. సుప్రీమ్ కోర్టు పునర్విచారణవాదనలు వినటానికి సిద్ధంగా ఉంది. "మా తీర్పు చట్టానికి వ్యతిరేకం కాదు కాని నిర్దోషులు శిక్షకు గురికాకూడదు అనేదే లక్ష్యం" అని వివరించటమయింది.

"అణగారినవర్గాల హక్కును అత్యున్నతంగా చూస్తాం. కాని నిర్దోషుల హక్కునుకూడా తీసివేయలేము" అని చెపుతూ ఫిర్యాదు చేసినవారికి చట్టం కింద నష్టపరిహారం వెంటనే చెల్లించటమవుతుంది అని కోర్టు స్పష్టం చేసింది.

ఎస్.సి., ఎస్.టిల హితాలు పరిరక్షిస్తామనికూడా ప్రభుత్వం పదేపదే చెపుతోంది.

ఒక అవకాశంకోసం ఎదురుచూసి,లేకపోతే ఒకటి సృష్టించుకుని తమ పబ్బంగడుపుకోవాలనే రాజకీయ పార్టీలు ముఖ్యంగా ఎన్నికల సందర్భంలో ప్రవర్తిస్తుంటాయి.లోక్‌సభ ఎన్నికలలో సుమారు 80 సీట్లపై దళితుల అధికారం ఉండగా మరో 80 సీట్లపై వారి ప్రభావముందని విశ్లేషకులు అంటారు.

ఇటువంటి పరిస్థితిలో దళితుల సంక్షేమానికి, శ్రేయస్సుకు పాటుపడని పార్టీ ఏది ఉంటుంది?

ఏ లోపం వచ్చినా, ఏ లోపం ఉన్నా ఆ నేరంఎదుటివారిదే కాని తమది కాదు అనే వాదన వినవస్తుంది. మన రాజకీయాలన్నీ విడగొట్టే రాజకీయాలేగాని సమైక్యత, సుహృద్భావాలు లక్ష్యంగా ఎవరూ పని చేయటంలేదన్నది స్పష్టమే.

కర్ణాటకలో సంఖ్యాబలంలోను, రాజకీయశక్తిగాను లింగాయతులది బలమైనవర్గమే. వారు తమది ప్రత్యేకమైన మతమని ఎన్నాళ్ళగానో చెపుతున్నారు. వీరిలో కొందరు మౌనంగానూ ఉన్నారు. పదవిలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా మిన్నకుండి ఇప్పటికిప్పుడు లింగాయతులను-

ప్రత్యేక మతంగా గుర్తించాలని సిఫారసును కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. వీరశైవుల సమస్యా ఉంది. ఒక వైపున వెనకబడిన తరగతుల రిజర్వేషనూ కావాలి. మరో పక్కన మైనారిటీ స్థాయీ కావాలి.

అసలు భారతదేశంలో మెజారిటీ వర్గమే లేదనేది మరో వాదన. హిందూ మతమేమిటో న్యాయస్థానమే నిర్వచించలేదు.శైవులు,వీరశైవులు, సనాతనులు, వైష్ణవులు ఇంకెందరు తమ తమ విశ్వాసాలకు కట్టుబడి ఉన్నారో! తమకు చెందిన గ్రామదేవతలను, కొండదేవతలను పూజించేవారు మరెందరో! ఈ విధంగా ఛిన్నాభిన్నం చేసుకుంటూ పోతే మిగిలేది ఏకత్వంలో భిన్నత్వమే.

ఎన్నికల ముందే ప్రత్యేక గుర్తింపుకోసం, వెనకబడినతనంకోసం, మైనారిటీ స్థాయికోసం మొత్తానికి రిజర్వేషన్లకోసం వాదనలు వినవస్తాయి. యాభైశాతానికి మించి రిజర్వేషన్లు కుదరవనే తీర్పుంది.

ఐనా ప్రాంతీయ ప్రభుత్వాలు కొన్ని వర్గాలను శాంతపరచటానికి రిజర్వేషన్లు అసెంబ్లీలో ఆమోదించి కేంద్రప్రభుత్వానికి పంపుతారు. చట్టప్రకారం కుదరదనే జవాబు వస్తుంది. అప్పుడు పాపాల భైరవునిగా ఎవరిని నిలబెడతారు?


'విప్పింగ్ బాయ్' అనే సాంప్రదాయంలో ధనవంతుల, జమీందార్ల బిడ్డలను ఉపాధ్యాయులు దండించరు. వారు తప్పుచేస్తే ఎదురుగా ఉన్నవాడికి దెబ్బలు పడతాయి. నిజంగా ఎన్నికలు ఎన్నెన్ని మార్పులు తెస్తాయోకదా!

క్యాన్సర్‌కు రోబోటిక్ రేడియో సర్జరీ - రేడియేషన్ థెరపీలో అత్యాధునిక 'సైబర్‌నైఫ్'

టెక్నాలజీ రంగంలో, ఈ స్పీడ్ యుగంలో రాకెట్ వేగంతో మానవాళి ముందుకు దూసుకు పోతోంది. నిన్న ఉన్న మోడల్స్ ఇవ్వాళ, ఇవ్వాళ ఉన్నవి రేపటికి అవుట్ డేటెడ్ (పాతవి) అయిపోతున్నాయి. టెక్నాలజీ అన్నా ఆధునికత అన్నా ఇష్టం వున్నవాళ్లు కొత్తదనాన్ని అంది పుచ్చుకోవటంలో పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయినా మానవాళికి అంతు చిక్కని ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. అలాంటి వాటిలో క్యాన్సర్ ఒక సవాల్ వంటిది. ఎప్పుడు ఈ కణాలకు ఆన్సర్ చెప్పుదామా అని నిరంతర పరిశోధనలు జరుగుతూనే ఉంటాయి. ట్రీట్‌మెంట్స్‌లో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటూనే ఉంటాయి. ఇప్పుడిప్పుడే ట్రీట్‌మెంట్స్‌లో కొత్తదనాలతో అంతు చిక్కని కణం మీద విజయం సాధించే దిశగా అడుగులు వేస్తున్నాము. అంతు చిక్కకుండా, అంతే లేకుండా విస్తరించే క్యాన్సర్ కణాలను ట్రీట్‌మెంట్స్‌తో కంట్రోల్ చేయడమే కాకుండా త్వరగా ట్రీట్‌మెంట్ అయ్యేటట్లు చెయ్యటం, దుష్ఫలితాలను బాగా తగ్గేటట్లు చూడటము ఈ కొత్తదనాల ముఖ్య లక్ష్యంగా ఉంటుంది. అటువంటి లక్ష్యాలతో క్యాన్సర్‌కు రేడియేషన్ థెరఫితో సమాధానం చెప్పటానికి వచ్చిన అత్యాధునికత 'సైబర్‌నైఫ్'.

మనలో చాలా మందికి ఇప్పటికి క్యాన్సర్ కణానికి కత్తి తగిలితే ఇంకా ఎక్కువ వేగంతో విస్తరిస్తుంది అనే అపోహలు ఉన్నాయి. అదికేవలం అపోహ మాత్రమే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. లేటు దశలో సర్జరీ చేయించు కున్నప్పుడు ఎటువంటి ఉపయోగంలేని పరిస్థితులలో ఏర్పడిన అనుమానంగా పేర్కొనవచ్చు. తొలి దశలో గుర్తించినప్పుడు క్యాన్సర్ కణాలు ఉన్న భాగాన్ని చుట్టూ ఉన్న టిష్యులను, లింఫ్‌నోడ్స్‌ను తీసివేయటం ద్వారా పూర్తిగా నయం చేయడం కూడా సాధ్యం అవుతుంది. అయితే ఇప్పుడు కొన్ని సందర్భాలలో కత్తి కూడా అవసరం లేకుండా సర్జరీ చేయగలగటం ఒక గొప్ప పరిణామంగా చెప్పుకోవచ్చు. మెదడు, వెన్నెముక, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, ప్యాంక్రియాజ్ వంటి భాగాలలో వచ్చిన కణితులను, సర్జరీ చేయటం కష్ట సాధ్యంగా ఉన్నప్పుడు, చాలా చిన్నగా ఉన్న కణితులను ఇలా అనేక సందర్భాలలోనే కాకుండా ఒక్కొక్కసారి క్యాన్సర్ కాని కణితులను కూడా ఎటువంటి కోత లేకుండా మిస్సైల్ టెక్నాలజీతో కణితిని మాత్రమే టార్గెట్ చేస్తూ, చుట్టు ఉన్న కణాలను ఏమాత్రం నాశనం చేయకుండా మటుమాయం చేయగలిగే ఈ రేడియేషన్ పద్ధతిని రోబోటిక్ రేడియో సర్జరీ అంటారు. మనిషి ఇచ్చే సూచనలతో క్యాన్సర్ కణాలే లక్ష్యంగా, శరీరంలో ఏభాగానైనా చేరగలిగి ఖచ్చితమైన ట్రీట్‌మెంట్ అందించే ఈ రేడియేషన్‌ను 'సైబర్ నైఫ్' అని కూడా అంటారు.

120 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న రేడియేషన్‌ను 1896 నుండి క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌కు ఉపయోగిస్తూ వస్తున్నారు. మరీ ముఖ్యంగా నోబెల్ బహుమతి గ్రహీత మేరిక్యూరి, పోలోనియం, రేడియమ్ వంటి రేడియో యాక్టివ్ ఎలిమెంట్స్‌ను కనుగొన్నాక ఈ ట్రీట్‌మెంట్ మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. శతాబ్ది కాలంలో ఈ థెరఫిలో ఊహించని మార్పులు, ఆధునికతలు చోటు చేసుకున్నాయి. 1970 కు ముందు CT సహాయంతో 2-D గా ఉండే రేడియేషన్, 1970 తర్వాత MRI తర్వాత 1980 లలో PET వంటి వాటితో 3-D గానే కాకుండా ఇమేజ్ గైడెడ్ రేడియేషన్ థెరఫి కూడా ఇవ్వగలుగుతున్నారు. బ్రాకీథెరఫి, స్టీరియో టాక్టిక్ రేడియేషన్, రేడియో ఐసోటోపీ థెరఫి, ఇమేజ్ గైడెడ్ రేడియేషన్‌లతో IMRT, IGRT, వంటి ఎన్నో కొత్త పద్ధతులు ఈ థెరఫిలో చోటు



సైబర్‌నైఫ్® VSI

చేసుకుంటున్నాయి. అయితే రేడియేషన్‌ను తగిన మోతాదులో ఇవ్వక పోవటం వలన, క్యాన్సర్ కణం లొంగక పోవటం కాని మోతాదు ఎక్కువ అయిన సంధర్భాలలో ఇతర అవయవాలకు రేడియేషన్ ప్రభావం వలన క్యాన్సర్ వచ్చి మరణాలు సంభవించిన సందర్భాలూ ఉన్నాయి. రేడియేషన్ పరిమాణాన్ని 'గ్రే' లతో పోలుస్తారు. 10 'గ్రే' లతో జుట్టు ఊడిపోవటం జరిగితే 45 'గ్రే' లను మించితే శాశ్వతంగా ఊడిపోయే ప్రమాదం ఉంటుంది. రేడియేషన్ క్యాన్సర్ కణితికే కాకుండా ఇతర అవయవాలకు, కణాలకు సోకినప్పుడు అనేక రకాల సైడ్ ఎఫెక్ట్స్ తలెత్తుతూ ఉంటాయి. వీటిలో కొన్ని తాత్కాలికం అయితే మరికొన్ని శాశ్వతంగా ప్రభావం చూపించేవీ ఉంటాయి.

వాంతులు, వికారం, వాపు, రేడియేషన్ ఇచ్చిన ప్రాంతంలో చర్మం కమిలి పోవటం, సాగే గుణం కోల్పోవటం, నోటిలో పుళ్లు, జుట్టు రాలి పోవటం, సంతానలేమి సమస్యలు అంటే రేడియేషన్ ఇచ్చిన అవయం మీద ఆధారపడి ఇలా రకరకాలైన సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. ఇవ్వన్ని రేడియేషన్ తీసుకునేటప్పుడు ప్రక్క భాగాలకు ఆ ప్రభావం ఏర్పడటం వలన తలెత్తేవి. బ్రెస్ట్‌క్యాన్సర్‌కు రేడియేషన్ తీసుకున్నప్పుడు గుండె మీద ప్రభావం పడటం, బ్రెయిన్ ట్యూమర్‌కు ఇచ్చే రేడియేషన్ వలన చురుకుదనం, గుర్తించే శక్తి కోల్పోవటం కూడా జరగవచ్చు. కత్తి అవసరం లేకుండా రేడియేషన్‌తో రేడియో సర్జరీ చేసి కణితిని తొలగించగలగటం ఇప్పుడు పెన్సిల్ బీమ్‌తో అంటే పాయింటెడ్‌గా రోబొట్‌లతో మనిషి ఇచ్చే సూచనల సహాయంతో చేయ గల్గుతున్నాము.

సైబర్‌నైఫ్‌గా పిలువబడే ఈ రోబోటిక్ రేడియో సర్జరీ వలన ఉపయోగాలు ఈ విధంగా ఉంటాయి.

01. 5 లేక 6 వారాలలో ఇచ్చే రేడియో థెరఫి, సైబర్‌నైఫ్ సహాయంతో ఒకటి లేక 5 రోజులలోనే పూర్తి చేయవచ్చు.
02. నొప్పి అస్సలు ఉండదు.
03. మత్తుమందు, రేడియేషన్ ఇచ్చేటప్పుడు ఫ్రేమ్ (Frames) అవసరం లేదు.
04. ఊపిరి బిగపట్టాల్సిన అవసరం లేదు.
05. క్యాన్సర్ కణాల మీద మాత్రమే రేడియేషన్ ప్రభావం ఉండటం.
06. ఎటువంటి విశ్రాంతి అవసరం లేదు.
07. శరీరంలో ఎంత చిన్న కణితి ఎక్కడ ఉన్నా ఖచ్చితమైన రేడియేషన్‌ను అందించగల్గటం.
08. కొన్ని సంధర్భాలలో సర్జరీ అంటే భయపడే వారికి నిమిషాలలో కోత లేకుండా కణితిని తొలగించగలగటం.
09. క్యాన్సర్ కాని మెనింజియోమాస్, పిట్యూటరి గ్రంధిలోని కణతులు, మెదడులోపల, బయట ఉండే కణతులు, వెన్నెముక మీద వచ్చే కణతులను తొలగించగలగటం.
10. రేడియేషన్‌తో తలెత్తే దుష్ఫలితాలను గణనీయంగా లేదా పూర్తిగా లేకుండా చేయగలగటం.

మొదలైనవి ఈ రోబోటిక్ రేడియో సర్జరీ అయిన 'సైబర్‌నైఫ్'తో ఉండే ఉపయోగాలు. రోగి వయస్సు, క్యాన్సర్ దశ, కణితి గ్రేడింగ్, క్యాన్సర్ కణితి ఉన్న అవయవం మొదలగు అంశాలను బట్టి క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌ను అందులో భాగంగా అవసరమయితే కొన్ని సంధర్భాలలో ఈ రోబోటిక్ రేడియో సర్జరీని నిర్ణయించటం జరుగుతుంది. కొన్ని సార్లు క్యాన్సర్ తిరగ బెట్టిన అవయవానికి లేదా వాల్యూమెట్రిక్ మాడ్యులేటెడ్ ఆర్క్ థెరఫి (Volumetric Modulated Arc Therapy / VMAT) ఇంకా ఇతర రేడియేషన్ పద్ధతులతో పాటు ఈ సైబర్‌నైఫ్ ట్రీట్‌మెంట్ అవసరం కూడా ఉండవచ్చు.

(సశేషం)

డా.మోహన వంశీ
MS,DNB,FRCS (Edinburg)
MCh(Surg Onco)
Dip. Lap. Surg. (France)
Ph: 9848011421
Kurnool : 08518 273001
Guntur : 0863 2223300

హెల్త్ బిట్స్

కాంతి కరువైతే!

సరైన వెలుతురు లేనిచోట పిల్లలు చదవకూడదు. ఆ విషయం పిల్లలకు చెప్పే పెద్దలు లైట్లు ఆపి స్మార్ట్ ఫోన్‌తో ఆడుకుంటారు.

ఇలా తక్కువ కాంతి వాతావరణంలో పనిచేసే వారికి జ్ఞాపకశక్తిసమస్యలు తలెత్తుతాయి.ఏ విషయం సరిగా అర్థంచేసుకుని నేర్చుకోలేరు.

కాంతి ఆఫీసుల్లో ఉద్యోగుల పనిసామర్థ్యాన్ని దెబ్బ తీస్తుందనే విషయం తెలుసుకోవాలి.

తక్కువ స్థాయి కాంతిలో పనిచేస్తే దాని ప్రభావం మెదడుమీద పడుతుంది. మెదడులోని 'హిప్పో క్యాంపస్' అనే భాగంమీద పడే ప్రభావంవల్ల దాని సమర్థత 30 శాతం పడిపోవటాన్ని గమనించారు. నేర్చుకుని, జ్ఞాపకం పెట్టుకోవటంలో పాత్ర వహించేది 'హిప్పో క్యాంపస్' భాగం.

మెదడులో ఉత్పత్తి అవ్వాల్సిన నాడులను, హిప్పో క్యాంపస్‌లను బంధాన్ని ఆరోగ్యకరంగా ఉంచేకీలక పదార్థం ఉత్పత్తి కాంతి ప్రభావాన జరుగుతుంది. పగటివేళ కళ్ళమీద తగినంత కాంతి పడితేనే మెదడు చురుకుగా వ్యవహరిస్తుంది. గాలి, వెలుతురు ధారాళంగా వుండేటువంటి చోట కూర్చోండి అని పెద్దలు ఎందుకు చెపుతారో అర్థమైందా! ◆

నెమ్మదిగా తినండి


ఏదో తినాలి కాబట్టి తింటున్నాం అనే ధోరణి కొందరిది. ఎవరో తరుముకొస్తున్నట్టుగా గబగబా మింగేసే పద్ధతి మరి కొందరిది. దీనికి భిన్నంగా ఆహారం తీసుకోవటం అనేది ఒక పద్ధతిలో,

తినే ఆహారంమీదే దృష్టిపెట్టి, తింటున్న ఆహారాన్నిఇష్టంగా స్వీకరించాలనే భారతీయుల పద్ధతే సరైనది అని జపాన్ పరిశోధకులు అంటున్నారు.

పొట్ట పెరగకుండా వుండాలన్నా,బరువు పెరగకూడదన్నా నెమ్మదిగా తినటం అవసరం. రాత్రి భోజనం తర్వాత మరే చిరుతిండ్లు తినకూడదు. భోజనానికి, నిద్రకు మధ్యలో రెండుగంటల సమయం ఉండాలి.

భోజనం విషయంలో నియమాలను పాటించేవారు, నెమ్మదిగా తినేవారు భారీకాయులయ్యే ప్రమాదం నలభైరెండు శాతం తక్కువగా వుంటుంది. వేగంగా తినేవారికి పొట్ట పెరుగుతుంది, డయాబెటిక్ ఇబ్బందులు వయసుతోవస్తాయి.

అయిష్టంగా ఆహారం తీసుకోకూడదు. మనసును ఆహారంమీద పెట్టి తీసుకోవాలి. ◆



Courtesy : SAVVY

ఇంటి ప్లాస్టిక్‌తో ముప్పు

ఇంట్లో ఒకరు సిగరెట్ తాగుతూ పొగ వదులుతుంటే ఆ పొగను పరోక్షంగా పీల్చి అనారోగ్యాన్ని తెచ్చుకోవటం తెలిసిందే. ఆదే పద్ధతిలో ఇంటిలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులవల్ల కుటుంబసభ్యులందరి ఆరోగ్యం చెడుతున్నది.

ఇప్పుడు ఇంటినిండా ప్లాస్టిక్ కుర్చీలు, ప్లాస్టిక్ ఆట వస్తువులు, ప్లాస్టిక్ వంట ఇంటి సీసాలు వాడుతున్నారు. దుస్తులు కూడా ప్లాస్టిక్ ఫైబర్‌తో తయారవుతున్నాయి. ఈ ప్లాస్టిక్ వస్తువులనుండి వెలుపలికి వస్తున్న ప్లాస్టిక్ రేణువులు డైనింగ్ టేబుల్ నిండా పడుతున్నాయి. తినే ఆహారం మీద పడుతున్నాయి.

భోజనం చేసే 20 నిమిషాల కాలంలో ప్రతి ఒక్కరి ప్లేట్‌లో దాదాపు 140 నుండి 150 ప్లాస్టిక్ రేణువులు పడుతున్నాయి. అవి కడుపులోకి చేరతాయి. సంవత్సర కాలంలో ఈ ప్లాస్టిక్ రేణువులు 60 వేలనుండి లక్ష రేణువులు జీర్ణనాళంలోకి చేరతాయి.


Courtesy : ABHYAAN


Courtesy : VANITHA

మెట్లే మేలు

ఆడవారి వయసులో ఒక దశ అయిన మెనోపాజ్‌కి ముందు తర్వాత ఆరోగ్యంలో మార్పులు కనిపిస్తాయి. అందులో ఎముకల బలహీనత, మోకాళ్ళనొప్పులు వంటివి ఉంటాయి. ఇటువంటి వయసుకు ముందు నుండే జాగ్రత్తలు అవసరం.

శరీర వ్యాయామం తగ్గించవద్దు. ప్రత్యేకంగా జిమ్‌కి వెళ్ళలేమనేవారు ఇంటిపనులను చెయ్యండి. అపార్ట్‌మెంట్‌ల్లో వుండేవారు మెట్లు ఉపయోగించాలి. మెట్లు ఎక్కి పై ఫ్లోర్స్‌కి చేరడం అలవాటుచేసుకుంటే రక్తపోటు అదుపులో వుంటుంది.

కాలి కండరాలు బలహీనపడవు. మెట్లు ఎక్కడం ఒక మంచి వ్యాయామం. గుండె ఆరోగ్యానికి, కొవ్వు కరిగించటానికి, రక్తంలో లిపిడ్ స్థాయికి, ఎముకల బలహీనత తగ్గుదలకు మెట్లు ఎక్కే అలవాటు మేలు చేస్తుంది. మెనోపాజ్‌కి ఐదారేళ్ళ ముందునుండే ఈ జాగ్రత్తలు మొదలుపెట్టాలన్నది సూచన. ◆

ఒత్తిడిని జయిస్తేనే...

ఒత్తిడి అనేది ఆధునిక మనిషి జీవితంలో ఒక భాగమైంది. చాలా సహజంగా భావోద్వేగాలలో వచ్చిన మార్పుల కారణంగా మనిషి ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తోంది. మానసికంగా, శారీరకంగా వచ్చే సమస్యలకు ఒత్తిడే కారణం అవుతోంది. గుండెజబ్బులు రావడానికి ప్రధానమైన సమస్య గుండె సంబంధిత వ్యాధులు.

"ఒక వ్యక్తి చేసే పని, అతను నివసించే ప్రదేశం, పనిచేసే చోట, ఇంట్లో అతని భావోద్వేగాలు అతని జీవనప్రమాణాన్ని నిర్ధారిస్తాయి".

- జోహాన్నెస్ గ్రోస్, డచ్ వైద్యనిపుణుడు

గుండె జబ్బులకు ఒత్తిడి ఎలా కారణం..?

- మానసిక ఒత్తిడి కారణంగానే గుండెజబ్బులు వస్తాయని ఎన్నో పరిశోధనల ద్వారా స్పష్టమైంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా గుండె-జబ్బులకు మానసికఒత్తిడే కారణం.
- స్ట్రెస్ కారణంగా శరీరంలోని స్ట్రెస్ హార్మోన్స్ అడ్రినలిన్, కార్టిసాల్ అధికంగా విడుదల అవుతాయి. ఇవి గుండె జబ్బులకు దారి తీస్తాయి.
- స్ట్రెస్ కారణంగా శరీరంలోని స్ట్రెస్ హార్మోనల్, న్యూరో కెమికల్ మార్పుల వస్తాయి. వీటి కారణంగా మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.
- స్ట్రెస్‌కు గురైన వాళ్లు తక్కువ వ్యాయామం చేస్తారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు పొగతాగడం, మద్యపానానికి అలవాటు పడతారు.
- మానసిక ఒత్తిడితో బాధపడేవారికి సరైన నిద్రలేకపోవడం కూడా గుండెజబ్బులకు కారణం అవుతుంది.
- కుటుంబంలో వెనకటితరాల వారికి గుండె-జబ్బులు ఉన్నట్లయితే ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే.. గుండెపోటు రావచ్చు
- రక్తం గడ్డకట్టి గుండెజబ్బులకు దారితీయవచ్చు.
- కుటుంబంలో ఎవ్వరికీ గుండెజబ్బులు లేకపోయినా. దీర్ఘకాలంగా ఒత్తిడికి లోనవు-తున్నవారిలో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుంది.
- రక్తనాళాల్లో ఏర్పడే అడ్డంకుల వల్ల హార్ట్‌ఎటాక్ రావచ్చు.
- విపరీతమైన ఒత్తిడివల్ల గుండె స్పందనల్లో మార్పులు వస్తాయి. ఇవి గుండెపోటుకు దారి తీయడంతో పాటు హఠాత్మరణానికి కారణం అవుతాయి.
- ఒత్తిడి కారణంగా శరీరం రక్తపోటు, కొలెస్ట్రాల్, చక్కెర స్థాయిలు పెరుగుతాయి.
- ఇప్పటికే గుండె వ్యాధి ఉన్న వ్యక్తులలో, ఆకస్మిక ఒత్తిడి కారణంగా రక్తనాళాలు పూర్తిగా మూసుకుపోతాయి.. రక్తనాళాలు చిట్లిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ కారణంగా సడన్ కార్డియాక్ డెత్ సంభవించవచ్చు.
- ఇప్పటి వరకు జరిగిన అనేక పరిశోధనల్లో దీర్ఘకాలిక పని ఒత్తిడి, వైవాహిక బంధంలోని ఆవేదన వల్ల మానసికఒత్తిడి పెరుగుతుందని స్పష్టమైంది. ఎక్కువగా మగవారిలో కార్డియాక్ డెత్ సంభవించడానికి ముఖ్యమైన కారణాలుగా గుర్తించారు.

ఒత్తిడిని ఎలా గుర్తించవచ్చు..

దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక అంశాలు ఒత్తిడిని కలిగిస్తాయి. మానసికఒత్తిడిని గుర్తించడానికి కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఇవి ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటాయి.

సహజంగా కనిపించే లక్షణాలు..

- నిద్ర రాకపోవడం
- కండరాల నొప్పులు
- తలనొప్పి
- విపరీతమైన అలసట

మానసిక పరమైన లక్షణాలు..

- అధిక భయము,
- ఆందోళన,
- నిరుత్సాహం, శక్తి కోల్పోవడం
- చిరాకు, నిస్పృహ
- ఆహారపు అలవాట్లలో మార్పులు ఆకలి ఎక్కువగా ఉండటం లేదా ఆకలి లేకపోవడం

ఎవరు ఎక్కువగా ఒత్తిడికి లోనవుతారు?

ఒత్తిడి అనేక రూపాలలో ఉంటుంది. ఇది అన్ని వయసుల వారిని ప్రభావితం చేస్తోంది. అభద్రతాభావంతో బాధపడేవారు ఎక్కువగా ఒత్తిడికి లోనవుతారు. సమాజం మద్దతు లేనివారు, ఒంటరిగా జీవించేవారు మానసికసమస్యలతో బాధపడుతుంటారు.

ఒత్తిడికి కారణాలు..

వారివారి జీవితాల్లో ఎదురయ్యే అంశాలపై, వ్యక్తిగత కారణాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.

- కుటుంబంలో వచ్చే సమస్యలు
- కుటుంబీకులకు, ఆత్మీయులకు జబ్బులు రావడం
- ఆప్తుల మరణం
- అధిక పని ఒత్తిడి
- కొత్త ఉద్యోగంలో చేరడం చేరడం లేదా నిరుద్యోగ సమస్య
- రోజూ ఎదురయ్యే గొడవలు
- ఆర్థిక సమస్యలు మొదలైన సమస్యలతో బాధ పడేవారు ఎక్కువగా ఒత్తిడికి లోనవుతారు.

ఒత్తిడిని ఏలా జయించాలి..?

ఒత్తిడి నుంచి బయటపడేందుకు అనేక పద్ధతులు ఉన్నాయి. జీవనవిధానంలో మార్పులతో ఒత్తిడిని జయించవచ్చు. నిపుణులైన వైద్యుడి సలహాసూచనలు తీసుకుంటే మరింత ప్రభావ-వంతంగా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు.

1. ఆహార అలవాట్లతో: ఎక్కువగా ఆహారం తీసుకోవడం, మద్యం తాగడం ఒత్తిడి తగ్గిసాయని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు.. ఇవి ఒత్తిడిని పెంచుతాయి.

2. ధూమపానం: సిగరెట్లు, పొగాకు సంబంధిత ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యానికి ప్రమాదం. ఈ వ్యసనాల నుంచి బయటపడితేనే ఒత్తిడిని జయించవచ్చు.

3. వ్యాయామం: నడక, ఏరోబిక్ వ్యాయామంతో ఒత్తిడితగ్గుతుంది. వ్యాయామం చేసే సమయంలో విడుదలయ్యే ఎండార్ఫిన్లు మానసిక ప్రశాంతతనిస్తుంది.

4. ఒత్తిడి కలిగించే వాటికి దూరంగా: దైనందిన జీవితంలో ఎదురయ్యే కొన్ని అంశాలు ఒత్తిడిని కలిగిస్తాయి. వాటికి దూరంగా ఉండే ప్రయత్నం చేయాలి.

5. వాస్తవికతకు దగ్గరగా: చాలా మంది జీవితంపై చాలా ఆశలు పెట్టుకుంటారు. మంచిదే.. కానీ, వాస్తవికతను తెలుసుకోవాలి. తమలోని నైపుణ్యాన్ని గుర్తించి అందుకు తగిన విధంగా జీవితాన్ని మలుచుకునే ప్రయత్నం చేయాలి. సాధించగలిగే లక్ష్యాలపై దృష్టి పెట్టాలి.

6.తగినంత విశ్రాంతి, ఆహారం, నిద్ర ఎంతో అవసరం

7. పాజిటివ్ థింకింగ్: సానుకూల దృక్పథం అనేది మనిషిని సంతోషంగా ఉంచుతుంది. ఆనందం ఆందోళనను జయించవచ్చు.

8. యోగా, ధ్యానం: మానసిక ప్రశాంతతను ఇవ్వడంలో యోగా, ధ్యానం బాగా దోహద పడుతాయి.

జీవితంలో ఒత్తిడి భాగం, కానీ అధిక ఒత్తిడి అనర్థదాయకం. గుండెజబ్బులకు ప్రధానకారణమైన ఒత్తిడిని జయిస్తే... జీవితకాలాన్ని పెంచుకున్నట్లే.



Dr. Ramesh Gudapati

MD,DM,Interventional Cardiologist

(Former Interventional Fellow at ICPS, Paris, and National Heart Center, Singapore)

స్టార్ హాస్పిటల్స్, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్.

ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నం

ప్రజాస్వామ్యంలో రాజకీయపార్టీల అంతిమ లక్ష్యం అధికారం. రాజకీయ నేతల అంతిమ లక్ష్యం అత్యున్నత పదవి. ఇందుకు భారతదేశంలోని రాజకీయపార్టీలు కాని, నేతలు కాని అతీతం కాదు. కోరుకున్న పదవి దక్కదని తేలిపోయినప్పుడు పదవీ కాంక్ష లేదంటారు.

అధికారం దక్కే అవకాశం కనిపించని పార్టీలు మాత్రమే ప్రజాసేవకోసమే మా పార్టీ అంటారు. అదంతా ప్రజలకోసం చెప్పే మాటలు.

వాస్తవంలో ప్రతి ఎన్నికల ముందు పార్టీలది, నేతలది గెలుపు మీద, అధికారంమీద, పదవులమీద దృష్టి. ఇప్పుడు ఢిల్లీలో జరుగుతున్న రాజకీయ హడావుడి నేపథ్యం అదే.

2019 ఎన్నికలకు ఇంకా ఒక సంవత్సర సమయం ఉంది. ఐనా ఢిల్లీలో ఇప్పటికే విందు రాజకీయాలు జోరందుకున్నాయి. పార్టీలు,నేతలు చాలా బిజీబిజీగా మంతనాలతో, ఎత్తుగడలతో బిజీగా వున్నాయి.

అధికారంలో వున్న బిజెపి ఎన్నికలను ముందుకు తెస్తుందనే ఆలోచనతో ఈ ఎన్నికల హడావుడిని మిగిలిన రాజకీయపార్టీలు మొదలుపెట్టాయి.

లోక్‌సభ ఎన్నికలకు జాతీయపార్టీలు ఆలోచించటం సహజం. కాని ఈసారి ప్రాంతీయ పార్టీలు అన్నింటికన్నాముందుగా చొరవను ప్రారంభించాయి. ప్రాంతీయపార్టీలన్నీ ఒకే రాగం పలికితే బాగుంటుందనే అభిప్రాయం వారిలో బలపడింది.

కలిసికట్టుగా తమప్రయోజనాలను పరిరక్షించుకోవాలన్న అభిప్రాయానికి సూత్రప్రాయంగా వచ్చారు. అందుకే ప్రాంతీయపార్టీల మధ్య మంతనాలు ఊపందుకుని ఫెడరల్ ఫ్రంట్ అనే పేరు తెరమీదకు వచ్చింది.

తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. ప్రత్యేకంగా కలకత్తా వెళ్ళి బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో మంతనాలు జరిపినపుడు 'ఫెడరల్ ఫ్రంట్' అనే మాట ఆయన నోటినుండి వచ్చింది.

ఆ ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య చర్చలు అంత సాఫీగా జరగలేదని, మమతాబెనర్జీకి కొన్ని సందేహాలు ఉన్నాయన్నది వార్త. ఈలోగా 'సీన్' ఢిల్లీకి మారింది.

చొరవ ప్రాంతీయపార్టీలు తీసుకుంటే తాము వెనకబడిపోతామన్న ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ బిజెపిని వ్యతిరేకించే పార్టీలన్నింటినీ ఒక తాటి మీదికి తెచ్చే యత్నం చేసింది.

అయితే కాంగ్రెస్‌ని రాహుల్‌గాంధీ నడిపిస్తాడన్న ఆలోచన చాలా ప్రాంతీయపార్టీలకు నచ్చని విషయం. ప్రాంతీయపార్టీల నేతలందరూ రాహుల్‌గాంధీకన్నా వయసులో, రాజకీయ అనుభవంలో పెద్దలు.

అటువంటివారంతా రాహుల్‌గాంధీ వంటి అపరిపక్వ కాంగ్రెస్ అధ్యక్షుడిని నాయకుడిగా అంగీకరించలేమన్న పరోక్ష సందేశం ఇచ్చారు. వారి మంతనాలన్నీ సోనియాగాంధీతోనే జరుగుతున్నాయి.

ఇది బిజెపియేతర పక్షాల తొలి సంప్రదింపుల యత్నమే కాబట్టి దీనినుండి ఏదో గొప్ప ఫలితం వస్తుందని అనుకోవటంలేదు.

అయితే ప్రాంతీయపార్టీలు మాత్రం దేశంలో తాము బలీయమైన శక్తిగా తయారయ్యామని, కలిసికట్టుగా కేంద్ర ఆధిపత్యాన్ని ప్రశ్నించగలగటం అవసరమని ఆ పార్టీలు భావిస్తున్నాయి.

ఆ విషయాలు ఆ యా ప్రాంతీయపార్టీల నేతల నోటివెంట వినిపిస్తున్నాయి.

దేశ రాజకీయాలమీద అవగాహనవున్నవారెవరికీ ప్రాంతీయపార్టీలు ఫెడరల్ ఫ్రంట్ గురించి మాట్లాడటం ఆశ్చర్యం కలిగించదు. చరిత్ర పునరావృతమవుతుందనే అనుకుంటారు.

ఒకప్పుడు తృతీయపక్షం, ఆ తర్వాత యునైటెడ్ ఫ్రంట్, ఆపైన నేషనల్ ఫ్రంట్ లాగానే ఇప్పుడు ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటును ప్రాంతీయపార్టీలు ప్రతిపాదిస్తున్నాయి. జాతీయ రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడినప్పుడల్లా తృతీయ పక్షం బలం పుంజుకుంటున్నది. స్వతంత్రభారతదేశం తొలి రెండు దశాబ్దాలు కాంగ్రెస్‌దే పెత్తనం.



న్యాయవ్యవస్థలో నానాటికి ప్రభుత్వజోక్యం ఎక్కువ అవుతోంది.
-జస్టిస్ చలమేశ్వర్, సుప్రీమ్‌కోర్ట్ జడ్జి

తొలిసారిగా 1967లో జాతీయ రాజకీయాలమీద కాంగ్రెస్ పట్టు సడలి, ప్రాంతీయపార్టీలు కొన్ని రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చాయి.

తమిళనాడు మినహా మిగిలిన రాష్ట్రాలలో తిరిగి కాంగ్రెస్ ఆధిపత్యం సాధించినా ఆపైన రెండు దశాబ్దాలలో పలు ప్రాంతీయపార్టీలు రాష్ట్రాలలో బలపడ్డాయి. కాంగ్రెస్ బలహీనపడటంతో సంకీర్ణ రాజకీయాలు మొదలయ్యాయి.

దాదాపుగా మూడు దశాబ్దాలుగా కేంద్రంలో సంకీర్ణప్రభుత్వాలే నడుస్తున్నాయి.

ఆ ప్రభుత్వాలలో ప్రాంతీయపార్టీలకు సముచిత స్థానం లభిస్తున్నది.

2014 ఎన్నికల్లో బిజెపి స్వయంగా మెజారిటీ సాధించినా నేడు నరేంద్రమోడీ నడుపుతున్నది సంకీర్ణ ప్రభుత్వమే. ఎన్.డి.ఎ. ప్రభుత్వంలో నిన్న మొన్నటివరకు పాలుపంచుకున్న తెలుగుదేశంతో సహా పలు ప్రాంతీయపార్టీలు భాగస్వాములే.

2014లో బలహీనపడిన కాంగ్రెస్ పార్టీ గడచిన నాలుగేళ్ళలో సరిగా కోలుకోలేదు.

కాబట్టి తిరిగి ప్రాంతీయపార్టీలే బిజెపిని ఢీకొనగలిగిన పార్టీలనుకుంటున్నాయి.

ప్రాంతీయపార్టీల విశ్వాసం బలపడటానికి ఇటీవల ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికలలో బిజెపి ఓడిపోవడం అనే అంశంతోపాటుగా గత ఎన్నికల గణాంకాలు దోహదపడుతున్నాయి.

2014 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన బిజెపి ఆ తర్వాత జరిగిన 9 లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఒక్కటి మాత్రమే గెలిచింది. ఐతే అదే సమయంలో బిజెపి పలు రాష్ట్రాలను గెలుచుకుంది.

ఇది ఒక రకమైన విచిత్రం. ఒకవైపు కేంద్రప్రభుత్వం కొన్ని ప్రాంతాలలో విశ్వాసం కోల్పోతుండగా మరి కొన్ని చోట్ల బిజెపికి ఆదరణ పెరుగుతున్నది.

2014 ఎన్నికల గణాంకాలు బిజెపికి వ్యతిరేకంగా ఉన్నాయి. ఆ ఎన్నికల్లో బిజెపి 282 సీట్లు గెలుచుకున్నప్పటికీ ఆ పార్టీకి దక్కిన ఓట్లు కేవలం 31 శాతం మాత్రమే.

అంత తక్కువ ఓట్ల శాతం అంత ఎక్కువసంఖ్యలో సీట్లుగెలుచుకోవటం అనేది భారతదేశంగా గతంలో ఎన్నడూ జరగలేదు. ఆ ముప్పై ఒక్క ఓట్లశాతం

- కొత్త ఉత్సాహంలో ప్రాంతీయ పార్టీలు
- ముమ్మరమైన ఫెడరల్ ఫ్రంట్ యత్నం
- కాంగ్రెస్ మద్దతుపై సందేహాలు
- 'మోడీ హటావో' నినాదం

ఆలిండియా స్థాయిలో వచ్చినట్లు గణాంకాలు చెపుతున్నా నిజానికి ఆ పార్టీ బలంగా వున్న చోట అధికంగా దక్కిన ఓట్ల వల్ల జాతీయ సరాసరి ఓటుశాతం ముప్పై ఒకటికి పెరిగింది.

గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో యాభై శాతానికి మించిన ఓట్లు లభించాయి. ఢిల్లీ, కర్ణాటక, యు.పి. జార్ఖండ్‌ల్లో నలభై శాతానికి మించి ఓట్లు వచ్చాయి.

2014 ఎన్నికల్లో బాగా దెబ్బతిన్నప్పటికీ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్. అన్ని రాష్ట్రాలలో పార్టీ నిర్మాణం, విశ్వాసపాత్రులైన ఓటర్లు కలిగిన పార్టీ కాంగ్రెస్. అయినా కాంగ్రెస్. బిజెపిలు రెండింటికీ కలిపి వచ్చిన ఓట్లు 50 శాతం కన్నా కొంచెం ఎక్కువ.

భారతీయ జనతాపార్టీకి దాని మిత్రపక్షాలవల్ల మరో ఏడు నుండి ఎనిమిది శాతం ఓట్లు అదనంగా లభించాయి.కాంగ్రెస్‌కి దాని మిత్రపక్షాలతో కలిపి వచ్చిన సీట్లు ఇరవై మూడు శాతం.

అంటే జాతీయస్థాయిలో ప్రధానపక్షాలుగా వున్న ఎన్.డి.ఎ., యు.పి.ఎ.ల ఓట్ల శాతం కలిపినా అది అరవై ఒక్క శాతం మాత్రమే. అంటే మిగిలిన ముప్పై తొమ్మిది శాతం ఓట్లు ప్రాంతీయపార్టీల చేతిలో వున్నాయి. ఇది అధికారం సాధించిన ఎన్.డి.ఎ. ఓట్లతో సమానం.

పైగా 2014 ఎన్నికల సమయంలో బిజెపితో వున్న మిత్రపక్షాలలో తెలుగుదేశం, శివసేనలు బయటకు వచ్చాయి. అకాలీదళ్ కూడా మద్దతు విషయం సందేహంగా వున్నది. బీహార్‌లో నితీష్‌కుమార్, రామ్ విలాస్ పాశ్వాన్‌లు రెండవ ఆలోచనలలో పడ్డారు.

కాబట్టి 2019లో బిజెపి ఓటుశాతం బాగా తగ్గుతుందనేది ప్రతిపక్షాల అంచనా.

అందుకే ఇప్పుడు ఫెడరల్ ఫ్రంట్ పేరుతో అంత హడావుడి చేస్తున్నది. అయితే లెక్కలలో 2కు రెండు కూడితే నాలుగు అవుతుందేమోకాని రాజకీయాలకు ఆ కూడికలు, తీసివేతలు వర్తించవు.

గతంలో తృతీయఫ్రంట్‌లు రాజ్యమేలినప్పటికీ ప్రాంతీయపార్టీలతో కూడిన ఆ ఫ్రంట్‌లు అటు కాంగ్రెస్ మద్దతుతోనో లేక బిజెపి మద్దతుతోనో మాత్రమే ప్రభుత్వం ఏర్పాటుచెయ్యగలిగాయి.

స్వతంత్రంగా మెజారిటీ సాధించిన చరిత్ర ప్రాంతీయపార్టీల ఫ్రంట్‌కి లేదు.గతంలో వి.పి.సింగ్, చంద్రశేఖర్, దేవెగౌడ, ఐ.కె.గుజ్రాల్ వంటివారు ప్రధాని పదవిని చేపట్టినా అందులోవారు కూర్చున్నది రెండేళ్ళలోపు మాత్రమే.

తిరిగి ఆ ప్రాంతీయపార్టీలే చీలిపోయి అటు కాంగ్రెస్‌కో ఇటు బిజెపికో మద్దతు పలికాయి.

ప్రాంతీయ పార్టీలు జాతీయ పార్టీలకు తోకలాగా పనిచేశాయే కాని స్వతంత్రంగా వ్యవహరించలేక పోయాయి.

అయితే నేటి పరిస్థితి వేరు. ఇప్పుడు ప్రాంతీయ పార్టీలన్నింటికీ తమ మనుగడపై భయం వుంది.

బి.జె.పి. విస్తరణను అడ్డుకుంటే తప్పించి రాజకీయంగా తాము బతకలేమన్న నమ్మకానికి వచ్చాయి ప్రాంతీయ పార్టీలు.

ఉత్తరప్రదేశ్‌లో బి.జె.పి గెలుపు బి.ఎస్.పి.ని భారీగా దెబ్బతీసింది. మహారాష్ట్రలో శివసేనకూడా బి.జెపి. దెబ్బకు వెనకపడింది.

బెంగాల్‌లో బి.జె.పి. విస్తరించి వామపక్షాలు, కాంగ్రెస్‌లను వెనక్కి నెట్టింది. తృణమూల్ కాంగ్రెస్‌ని ఒణికిస్తున్నది. బి.జె.పికి బెంగాల్‌లో పెరుగుతున్న ఆదరణ మమతా బెనర్జీ పీఠాన్ని కదిలిస్తోంది.

సిద్ధాంతాలు, గతంలోని శత్రుత్వాలు వంటివన్నీ గుర్తుపెట్టుకుంటే పూర్తిగా దెబ్బతింటాయన్న భావనతోనే బద్ధశత్రువులైన ఎస్.పి., బి.ఎస్.పిలు చేతులు కలిపాయి. యు.పిలో అద్భుతమయిన విజయం సాధించి, బి.జె.పికి షాక్ ఇచ్చారు.

సైద్ధాంతిక శత్రువులయిన వామపక్షీయులకు మమతా బెనర్జీ స్నేహహస్తం అందిస్తున్నది. ఉత్తరప్రదేశ్ గెలుపు స్ఫూర్తితోనే ఫెడరల్ ఫ్రంట్‌కి ఒక రూపం ఇవ్వనున్నారు.

వచ్చే ఎన్నికలను జాతీయ అంశాలమీద జరిగే పోటీగా కాక, ఆ యా రాష్ట్రాలలోని అంశాలమీదకు మళ్ళించాలన్నది ప్రాంతీయ పార్టీల ఎత్తుగడ.

ఎ.పిలో ప్రత్యేక హోదా అంశం, తెలంగాణలో ముస్లిమ్ రిజర్వేషన్, కర్ణాటకలో లింగాయత్‌లను మైనారిటీలుగా పరిగణించే అంశం,

తమిళనాడులో హిందీ వ్యతిరేకత, మహారాష్ట్రలో రైతాంగ సమస్యలు, ఉత్తరప్రదేశ్, బీహార్, ఎమ్.పి., రాజస్థాన్‌లలో దళితులమీద దాడుల అంశం వాటిని ప్రచారంలోకి తెచ్చి ఎక్కడికక్కడ బి.జె.పి. వ్యతిరేకతను ప్రజలలోకి బలంగా చొప్పించాలన్నది ప్రాంతీయ పార్టీ నేతల ఆలోచన.

2014లో లాగా బి.జె.పికి మెజారిటీ రానివ్వకూడదన్న పట్టుదల ప్రాంతీయ పార్టీలన్నింటిలో వుంది. ఆ విషయంలో కాంగ్రెస్‌దీ అదే బాట.

బి.జె.పికి 200 కన్నా తక్కువ సీట్లు వస్తాయన్న అంచనా ఆధారంగా ప్రాంతీయపార్టీలు తమ రాజకీయాలను నడుపుతున్నాయి.

ప్రాంతీయ పార్టీల మధ్య కేంద్రప్రభుత్వం మీద వ్యతిరేకత అనే ఒక్క అంశం తప్పించి సైద్ధాంతిక సంబంధత్వం లేదు. ప్రాంతీయ పార్టీలది గతంలో కాంగ్రెస్ వ్యతిరేకత, నేడు బి.జె.పి. వ్యతిరేకత.

నాడు ఎలాగైనా ఇందిరాగాంధీని ఓడించాలన్న కోరిక.నేడు నరేంద్రమోడీని తొలగించాలన్నకోరిక.

తృతీయ ఫ్రంట్‌కి పేరు మారవచ్చేమోగాని ప్రాతిపదిక ఒకలానే వుంటున్నది. ఆ వ్యతిరేక ఎన్నికల ఫలితాలు వెలువడేవరకే కలిపివుంచుతున్నది.

ఫలితాలు వెలువడి కాంగ్రెస్, బి.జె.పిలలో ఏది బలమయిన పక్షంగా నిలబడితే అటువైపు కొన్ని ప్రాంతీయ పార్టీలు వెళ్ళిపోతున్నాయి.

మంత్రిపదవులు ఆశచూపి ప్రాంతీయపార్టీలను తమవైపు తిప్పుకోవటం సులభమని జాతీయపార్టీలకు తెలుసు.ప్రాంతీయపార్టీలన్నింటినీ కలిపి వుంచగలిగిన బలమైన నాయకుడు లేడు.

తమ రాష్ట్రాలను వదిలి జాతీయస్థాయిలోనాయకత్వం చేపట్టే ధైర్యం ప్రాంతీయపార్టీల నాయకులకు లేదు. తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్న ప్రకటనతో చంద్రబాబునాయుడు, మమతా బెనర్జీలు ప్రాంతీయ పార్టీల నేతల మనసుల్లో నీరసం తెప్పించారు.

సీనియర్ నేతలు, ప్రజామద్దతు వున్న ప్రాంతీయ నేతలు ఢిల్లీ రాజకీయాలను చేపట్టేందుకు సిద్ధం అవకపోతే ఫెడరల్ ఫ్రంట్ భవిష్యత్తు నేషనల్, యునైటెడ్ ఫ్రంట్‌ల చరిత్రకన్నా భిన్నంగా వుండబోదు.

బి.జె.పి మీద ఓటర్లలో వ్యతిరేకత వుంది. కాని ఆ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవటంలో ప్రాంతీయ పార్టీలు ఏమేరకు విజయం సాధిస్తాయన్నది ప్రశ్న. టి.డి.పి., టి.ఆర్.ఎస్., బి.జె.పి. వంటి పార్టీల పుట్టుక, ఎదుగుదల కాంగ్రెస్ వ్యతిరేకత ఆధారంగా జరిగినవి.

అటువంటి పార్టీలు తిరిగి కాంగ్రెస్‌కి అనుకూలంగా వున్నట్టు సంకేతాలు ఇవ్వగలవా!

తమ స్వప్రయోజనాలను వదులుకుని జాతీయ స్థాయిలో ఢీకొనటానికి సిద్ధమవుతాయా! ఇదీ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో ఎదురయ్యే సవాలు.

ఆ సవాలును అధిగమించి బి.జె.పి. వ్యతిరేకతను, కాంగ్రెస్ అనుకూలత అంశంలో ఒక నిర్దిష్ట నిర్ణయం తీసుకునేందుకు ప్రాంతీయ పార్టీలన్నీ కర్ణాటక శాసన సభ ఎన్నికల ఫలితాలకోసం ఎదురుచూస్తాయి.

కర్ణాటకలో బి.జె.పి. గెలిస్తే ఫెడరల్ ఫ్రంట్ రూపు దిద్దుకోదు.బి.జె.పి ఓడితే కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం వస్తుంది. ఫెడరల్ ఫ్రంట్‌ని ఏర్పాటు చేయటంలో పూర్తి సహకారం అందిస్తుంది.ఫెడరల్ ఫ్రంట్‌కి మద్దతుగా నిలబడుతుంది.

ఫెడరల్ ఫ్రంట్‌ది, కాంగ్రెస్‌ది 'మోడీ హటావో' నినాదమే కాబట్టి ఆ లక్ష్యమే వాటిని కలిపివుంచుతుంది. అయితే స్వయంగా ఫెడరల్ ఫ్రంట్ మెజారిటీ సీట్లు గెలుచుకోవటమే జరిగితే అది దేశ రాజకీయాలలో మరుపురాని మార్పు అవుతుంది.

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు



సింహాచల రహస్యాలు

ఏ దేవాలయంలోనైనా సరే ఆ దేవుడికి ఏవో ఉత్సవాలనగానే సకుటుంబంగా బయల్దేరడం- స్వామిని దర్శించడం- మొక్కుబళ్ళని తీర్చుకోవడం- స్వామి అన్నప్రసాదాన్ని తినడం- ప్రసాదాన్ని కొని తెచ్చి మన చుట్టుపక్కలవారందరికీ పంచడంతో మన తీర్థయాత్రా- ఉత్సవ పర్యటనా పూర్తయిపోతోంది సర్వసాధారణంగా..

నాటి ఋషులంతా దైవదర్శనమంటే ఇలాగే ఉండాలని భావించారా? కాదుగా!

దైవదర్శనం అంటే ఇంత మాత్రమే అయ్యే పక్షంలో అన్నన్ని గోపురాలూ, శిల్పకళా అర్చనావిధానాలూ... ఇవన్నీ ఎందుకు?

నిజమైన దైవదర్శనమంటే- దేవాలయానికి వెళ్ళడం, మూల విరాట్టుని దర్శించడంతో పాటు- ఆ క్షేత్రంలోని అన్ని విశేషాలనీ పూర్తిగా అర్థం చేసుకోవడంతో పాటు, ఇతరులక్కూడా వివరించి చెప్పగలిగేస్థాయిలో చూసిరావడమని అర్థం. ఈ నేపథ్యంతో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని చూద్దాం!

అన్నీ విచిత్రాలే

సహజంగా దేవాలయాలు ఎక్కువ సంఖ్యలో తూర్పుముఖంగా ఉంటాయి. కొన్ని దక్షిణముఖంగా కూడా కన్పిస్తాయి. అయితే ఈ ఆలయం పశ్చిమ ముఖంగా ఉంటుంది.

ఏ దైవాన్ని చూసినా ఆయన చేతులూ, పాదాలూ కన్పిస్తూ మనకి అభయాన్నీ, వరాన్నీ ప్రసాదిస్తూ ఉంటాయి. అయితే ఈ స్వామి పాదాలు భూమిలో కప్పబడివున్న కారణంగా పాదాలు కన్పించవు.

విగ్రహాలు ఉంటే నిలబడిన రీతిలో (స్థానక విగ్రహం) పడుకున్న భంగిమలో (శయన విగ్రహం) కూచున్న విధంగా (ఉపవిష్ట విగ్రహం) కన్పిస్తాయి.

అయితే ఈ స్వామి తాను నిలబడ్డ తీరులో కన్పిస్తున్నా కంఠం దగ్గర, కుడిభుజం దగ్గర, కుడి పాదం దగ్గరా ఒంపులతో కన్పిస్తూ(త్రిభంగి విగ్రహం) ఒక పక్కకి ఒరిగినట్లు ఉంటారు.

ఏ దైవానికైనా రోజూ దర్శనమిచ్చే సంప్రదాయం ఉంటుంది. ఈయనమాత్రం వైశాఖ శుద్ధ తృతీయ

చందనోత్సవం : 18.4.2018

(అక్ష తదియ) నాడు మాత్రమే ఒకరోజుపాటు నిజ (తనదైన) రూప (సహజరూపంతో) దర్శనాన్ని ఇస్తారు తప్ప మరి ఏ రోజునా నిజదర్శనాన్ని అనుగ్రహించరు.

దేవతలందరికీ రెండు కళ్ళుమాత్రమే ఉంటూంటే ఈయనకి మాత్రం మూడు కళ్ళు (నుదుటిమీద మరో కన్ను) ఉంటాయి.

తిథి, వార, నక్షత్ర, యోగ కరణాలేమీ పరిశీలించకుండా ఎవరికైనా సరే అక్షతదియ (వైశాఖ శుద్ధ తృతీయ-చందనం ఒలుపు ఉత్సవం) నాడు అక్షరాభ్యాసాన్ని పిల్లలకి నిర్వహిస్తారు.

కావడానికిది వైష్ణవ నామాలతో కనిపించే దేవతలతో విష్ణుక్షేత్రంగా అన్పిస్తున్నా, శివాలయంలో లాగా నవగ్రహాలూ సూర్యరథం (**అసౌ ఉ యో వ సర్పతి నీలగ్రీవో విలోహితః**) సహస్రఘట జలాభిషేకం సోమసూత్రం... ఇలాటి సంప్రదాయాలు కన్పిస్తాయి.

అంతేకాదు, ఊర్ధ్వలింగస్వామి (ఊర్ధ్వరేతం విరూపాక్షమ్... (శివరూపం)) శిల్పం కన్పిస్తుంది.

ఇలా ఎన్నో కన్పిస్తాయి.

వీటి వెనక ఉన్న విశేషాలని ఆధ్యాత్మికంగా, చారిత్రకపరంగా, సామాజికంగా అనుకుందాం!

ఆధ్యాత్మిక రహస్యం

హిరణ్యకశిపుడు తన పుత్రుడయిన ప్రహ్లాదుణ్ణి వధించాలని నిశ్చయించుకుని తూర్పు సముద్రం లోనికి చొచ్చుకుని వున్న పర్వతం పైభాగానికి పుత్రుణ్ణి పట్టుకుపోయి ఆ కొండ కొమ్ము నుండి సముద్రంలోకి పడిపోయేలా కోపంతో విసిరేశాడు.

ప్రహ్లాదుడు మనసా వాచా కర్మణా శ్రీహరిని 'త్రాహి!' (రక్షించు) అంటూ బిగ్గరగా హృదయపూర్వకంగా ప్రార్థించాడు.

రాక్షసజాతిలో శ్రీహరికి ప్రహ్లాదుడు అత్యంత ప్రియుడు **(ప్రహ్లాదశ్చాస్మి దైత్యానామ్)**

కాబట్టి వెంటనే అలా సముద్రంలో పడిపోబోతున్న ప్రహ్లాదుణ్ణి సముద్రంలో పడిప్రాణాలు పోకుండా రక్షించాడు.

తానింకా అప్పటికి హిరణ్యాక్ష వధని పూర్తిచేశాడే గాని వరాహ రూపాన్ని మార్చుకోలేదు. ఇంతలో తన భక్తునికి ఈ ఉపద్రవం వచ్చిపడిందని గ్రహించి నారసింహ రూపంగా తనని కంగారు కంగారుగా మార్చుకోదలిచి జారిపోతున్న పట్టుపంచెని ఎడమచేత్తో తన ఎడమవైపు నడుంవద్ద గట్టిగా పట్టుకున్నాడు.

ఈ సంరంభాన్ని గమనించిన గరుత్మంతుడు అతి శీఘ్రవేగంతో తనవద్దకి రాగానే అతని ఆయాసాన్నీ గ్రహించి తన కుడిచేతి వ్రేలితో అమృతాన్ని అతని నోటిలోనికి పోస్తూ స్థిరంగా ఉండిపోయాడు.

అంత ఎత్తైన ఆకాశమార్గం నుండి ఒక్కమారుగా ప్రహ్లాద రక్షణకోసం నేలమీదికి దూకేసేసరికి ఆయన పాదాలు రెండూ బలంగా గుచ్చుకుపోయాయి భూమిలోనికి.

ఇప్పుడు పరిశీలించి చూస్తే వరాహ అవతార రూపాన్ని విడవని కారణంగా ఆదివరాహముఖం దాని తరువాత వేయదలిచినది నరసింహావతారమైన కారణంగా నరరూపం,

ఆ వెనుక భాగంలో సింహానికుండే తీరు తోకలతో కన్పిస్తూ మంగళాలని ప్రసాదిస్తూ- శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామిగా మనకి అర్థమవుతూ దర్శనాన్ని ఇస్తాడు (**త్రాహీతి వ్యాహ రంతమ్... పాతుమాం నారసింహః**) స్వామి.

చారిత్రక రహస్యం

కృతయుగంలో పురూరవచక్రవర్తి ఊర్వశిని పెండ్లాడి విమానంలో ఆకాశంలో ఎగురుతూంటే ఈ ప్రదేశానికి రాగానే ఇక్కడ ఆగిపోయిందట విమానం. ఏమిటి కారణమైవుంటుందని గాలిస్తే ఎక్కడా ఏమీ కన్పించలేదు.

రాత్రి కలలో కన్పడిన స్వామి తనకోసం వెదక వలసిందనీ పుట్ట కన్పిస్తుందనీ, ఆ పుట్ట పైభాగంలో మాలతీలత ఉంటుందనీ దానిపక్కనే గాంగధార అనే పేరిట పుణ్యజల ప్రవాహం కనిపిస్తుందనీ చెప్పాడు.

అలాగే వెదికి స్వామిని కనుగొన్న పురూరవుడు సహస్ర ఘటాలతో గాంగ ధార జలంతో అభిషేకించి మళ్ళీ పంచామృతాలతో అభిషేకించి స్వామిని బయటికి తీయబోతే పాదాలు లేవాయనకి.

మళ్ళీ రాత్రి కలలో కన్పించిన స్వామి-

'కలియుగంలో తన దర్శనం పాదాలు లేకుం డానే ఉంటుందని చెప్తూ, పుట్టలో నుండి తీసిన తన రూపానికి గంధ చర్చ (పూర్తిగా చందనంతో కప్పి వేయడం) చేయవలసిందని చెప్తూ, ప్రతి సంవత్సరం ఆ ఒక్క రోజునే (ఆ రోజే అక్షయ తృతీయ) నిజరూప దర్శనం అనుగ్రహిస్తానన్నాడు.

అందుకే ఆ ఒక్కరోజునే నిజరూప దర్శనం- మిగిలిన అన్ని రోజులూ చందనం కప్పిన రూపంతోనే దర్శనం. భూమికి గంధవతి (సువాసన కలది- మట్టి మీద వర్షపు చినుకులు పడితే వాసన తెలుస్తుంది) అనే పేరుందికాబట్టి అప్పటివరకూ భూమిలో దాగిన ఆ స్వామి అప్పటినుండీ గంధం (చందనం)లో కప్పే తనని ఉంచాలని ఆదేశించాడు.కాబట్టి ఈ ఆలయం పురూరవ చక్రవర్తి కాలంనాటిదని తెలుస్తుంది.

అక్ష తదియనాడు 3 మణుగుల (125 కేజీలు) చందనం, వైశాఖ పూర్ణిమనాడు మరో 3 మణుగుల చందనం, అలాగే జ్యేష్ఠ ఆషాఢ పూర్ణిమల్లో మరో 3+3 మణుగుల చందనాన్నీ స్వామికి- మరపట్టిం చడం కాకుండా మనుషులు చందనపు ముక్కల్ని సానలమీద అరగదీసి మరీ కప్పుతారు. దీంతో 500 కేజీల చందనంలో కప్పబడివుంటాడాయన.

చిత్రమేమంటే చందనం ఒలిచిన రోజున అంటే అక్ష తదియనాడు సింహాచల పరిసర ప్రాంతాలన్నీ మరింత వేడిమితో ఉంటాయి.

స్వామి ఉగ్రమూర్తి కదా మరి! హిరణ్యకశిపుణ్ణి వధించిన ఆవేశం, క్రోధం మరెక్కడికి పోతాయి? వాతావరణంలో ప్రవేశిస్తాయి.

గాంగధార సమం తీర్థమ్
ఆధి వ్యాధిహరం నృణామ్।
నరసింహ సమో దేవః త్రైలోక్యే నాస్తి నిశ్చయః॥

గాంగధారతో సమానమైన జలప్రవాహం శారీరక, మానసిక వ్యాధుల్ని తొలగించగల ఓషధీ శక్తి ఉన్నది. ఈ ప్రవాహం కూడా వైద్యుడైన నరసింహస్వామి (వేద్యో వైద్యః...) చెంతన ఉన్న కారణంగా ఇక్కడి కొచ్చి నరసింహస్వామిని నిత్యం సేవిస్తూ-

40 రోజులపాటు స్నానాన్ని గాంగధారలో చేస్తే



దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయనేది అను భవంలో కనిపించే సత్యం. నరసింహస్వామి మూల మంత్రం 32 అక్షరాలతో ఇలా ఉంటుంది.

ఉగ్రం వీరం మహావిష్ణుం
జ్వలంతం సర్వతోముఖమ్।
నృసింహం భీషణం భద్రమ్
మృత్యు మృత్యుం నమామ్యహమ్॥ అని.

ఈ 32 బీజాక్షర సమానమైన అక్షరాలకి సరిపడిన 32 నారసింహ రూపాలనీ, గుడి గోడలని ప్రదక్షిణం చేస్తూండే వేళ దర్శించుకోవచ్చు.

ఇది ఒకప్పుడు శివాలయమనే గట్టి ప్రతీతి కూడా ఉంది. అంతరాలయంలో పైన కన్పించే నవగ్రహాలూ, స్వామికి చేయబడే సహస్రఘటాభిషేకం, స్వామికి ఉండే మూడు నేత్రాల విధానం-

రోగాలని నయంచేసే శక్తి ఈయనకుండడం (ప్రథమో దైవ్యో భిషక్) ఆలయం క్రిందభాగంలో భైరవవాగు (భైరవ వాక) ఉండడం,

కొర్రలనే ఒక తీరు ధాన్యంతో పాయసాన్ని చేసి (మసురాళ్ళ మే...) నైవేద్యంగా పెట్టడం, శివుని భార్య అయిన అమ్మవారి తలలో ఉండే పుష్పాల్లో ఒకట యిన సంపెంగ పూలని పూజలో వాడడం (చంపకా శోక పున్నాగ...)... ఇలా అనేకాధారాలు కన్పిస్తాయి శివాలయార్చనం సాగిందనడానికి.

గాంగధార అనే పేరు ఈ ప్రవాహానికుండడం మరింత బలమిస్తోంది ఈ ఆలోచనకి.

సామాజిక రహస్యం

సమాజంలో కన్పించే అందరూ ఒకరేననీ, ఒకరు ఎక్కువా, ఒకరు తక్కువా కాదని తెల్పుతూ, జాలర్లు (జాలమంటే వల, జాలర్లంటే సముద్రంలో వలలని వేసి ఆ వేట ద్వారా జీవించేవాళ్ళు ఈ దైవానికి అత్తింటి వారి బంధువులు.

అందుకే రథోత్సవం నాడు రథాన్ని వాళ్ళే లాగు తారు.వీరి భక్తి చెప్పుకోలేనంత రమ్యంగా ఉంటుంది. దాదాపు 32 కి.మీ. నిడివికల గిరిప్రదక్షిణని సునాయా సంగా చే(సే)స్తారు. వృద్ధాప్యం వంటి కారణా లతో ఎవరైనా చేయ లేక పోతే సంవత్సరానికొక్క మారు ఆలయంలో 108 ప్రదక్షిణల చొప్పున క్రమంగా మూడు సంవ త్సరాలు చేస్తే అది గిరి ప్రదక్షిణతో సమానం.

ఇక సదస్యం (స్వామి కల్యాణమయ్యాక చేయ బడే వేదమంత్ర ఆశీర్వ చనం)లో వీరు గౌరికా హణ వీణకాహణ- రంబు-రండోలు మొద లైన చిత్ర విచిత్ర వాద్యా లతో తమ భక్తిని చాటు కుంటారు ఆచార్యస్వాములవారితో సమానంగా.

సమాజంలో అందరూ కలిస్తేనే ఉత్సవమని తెలియ జేస్తూ స్వామికి పూసిన చందనానికి బీటలు రాకుండా ఉండేందుకు కస్తూరి, ఆడించిన పసుపు, చందనం అనే మూటినీ కలిపిన మిశ్రమాన్ని దైవానికి సమ ర్పించుకుంటారు- ఆ స్వామికి అతుక్కునివున్న చందనానికి పూతగా పూసేందుకు.

హోదాలని మరిచి వీరు-వారు అనే భేదం లేకుండా చందనస్వామి మహానసానికి (వంటశాల) ఆ అడవిలో దొరికే ఎండుకర్రలని తెచ్చి ఇస్తారు. తలనీలాలు సమర్పించుకుని అడవి చందనాన్ని ఆ బోడితల లకి రాసుకుని అడవి సంపెంగ పూమాలలని మెడలో వ్రేలాడేసుకుని చక్కని నృత్యాలని చేస్తారు.

పసుపుపచ్చని కొండగోగు పూలని కోసి కుల మత వర్గ వర్ణ స్త్రీ బాల వృద్ధ తరుణ భేదం లేకుండా భక్తులకి సమర్పిస్తూ దైవాలందరిమీదా వేయవల సిందిగా ప్రార్థిస్తారు.

కొందరైతే కోడెదూడ(ల)ని స్వామికి సమర్పిస్తూ సంతానంకోసం ప్రార్థిస్తారు. ఆలయంలో కన్పించే గర్భస్తంభం (కప్పస్తంభం కాదు)లో నృసింహస్వామి దాని గర్భంలో ఉన్నాడని నమ్ముతూ భక్తితో కౌగి లించి ప్రణమిల్లుతారు.

తన్నో నారసింహః ప్రచోదయాత్

డా॥ మైలవరపు శ్రీనివాసరావు

వెన్నెల సాక్షిగా...

₹10,000 బహుమతి కథ

"ఇది మా గోల్డెన్ జూబ్లీ మ్యారేజ్ డే" మురిసెంగా భార్య సుజాతవంక చూస్తూ అన్నాడు రాజగోపాల్.

"అవును, పెళ్ళయి యాభై సంవత్సరాలయినా నాకయితే ఏ అయిదారేళ్ళ క్రితమో అయినట్లుగా ఉంది" ఆరాధనగా భర్తవంకచూస్తూ అంది సుజాత.

తన్మయత్వంగా పరస్పరం చూసుకుంటున్న ఆ వృద్ధ దంపతుల వంక ఆశ్చర్యంగా చూశారు యువ దంపతులుశరణ్య, కార్తీక్‌లు.తమకు పెళ్ళయి మూడేళ్ళయినా కాలేదు. కానీ మూడు యుగాలయినట్లుగా ఉంది. ఈ వృద్ధ దంపతులకేమో పెళ్ళయి యాభై ఏళ్ళయినా ఐదు సంవత్సరాలయినట్లుగా ఉందట! ఎందుకలా? ఎక్కడుంది లోపం?! ఈ కొద్దికాలానికే తమది కలహాల కాపురమైపోయింది.

"ఇన్ని సంవత్సరాల కాలంలో ఎప్పుడయినా గొడవలుపడి విడిపోదామనిపించిందా తాతయ్యా?" నవ్వులాటకు అడిగినట్లుగా అడిగింది శరణ్య.

"అదేం ప్రశ్ననే పిచ్చితల్లీ" మనవరాలిపై చిరాకు పడింది సుజాత.

"ఏ దంపతుల కాపురాల్లోనయినా గొడవలూ, కలహాలూ, అలకలూ సహజమేనే అమ్మడూ. మేమూ అందుకు అతీతులమేం కాదు. ఎన్నో మార్లు గొడవలు పడ్డాం, అలకలు పూనాం, మౌనవ్రతాలు పాటించాం కానీ విడిపోదామనుకునే ఆలోచన రాలేదు మాకు" నవ్వుతూ అన్నాడు రాజగోపాల్.

"అవును నిజమేనర్రా, మాకా ఆలోచనే ఎప్పుడూ రాలేదు. ఈ కాలం పిల్లల వ్యవహారమే నాకర్థం కావట్లేదు. చిన్నచిన్న విషయాలకు విడాకులంటూ కోర్టుకెక్కుతున్నారు" అంది సుజాత.

"నిజానికి మాకన్నా మీరే ఎంతో అదృష్టవంతులు. ఇద్దరిమధ్యా గొడవలు రావడానికి అవకాశాలు చాలా తక్కువ"

"ఎందుకని తాతయ్యా?" అడిగాడు కార్తీక్.

"మావన్నీ అప్పుడు ఉమ్మడి కుటుంబాలు. అందుకే కాపురాల్లో కుటుంబసభ్యుల ప్రమేయం ఎక్కువ ఉండేది. తల్లిదండ్రులకు డబ్బుసహాయం చేయవలసివచ్చేది, తమ్ముళ్ళని చెల్లెళ్ళని చదివించాల్సివచ్చేది. వాళ్ళకి పెళ్ళిళ్ళు చేయాల్సివచ్చేది. ఎన్నోరకాల బరువు బాధ్యతలుండేవి. అందుకే భార్యాభర్తల మధ్య ఎక్కువగా గొడవలు జరిగేవి.

ఇప్పుడు మీకా సమస్యలు లేవు. డబ్బులు పరంగా ఇబ్బందుల్లేవు. భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తున్నారు. మీ తల్లిదండ్రులకు పెద్దగా డబ్బు సహాయం చేయాల్సిన అవసరంలేదు. బరువుబాధ్యతలుకూడా లేవు"

"అవును తాతయ్యా"

"అయినా మీరు మా అంత అన్యోన్యంగా కాపురాలు చేసుకోవట్లేదు.

పైగా ప్రతిచిన్న విషయానికీ విడాకులదాకా వెళ్ళిపోతున్నారెందుకో మాకర్థం కావడంలేదు"

"నిజమే తాతయ్యా" అంది శరణ్య. అవునన్నట్లుగా తల ఊపాడు కార్తీక్. ఇద్దరిలోనూ ఏదో అపరాధ భావన!

సుజాత రాజగోపాల్ దంపతుల అమ్మాయి ఉమాదేవి కూతురు శరణ్య. రాజగోపాల్ పదవీవిరమణ చేసి విద్యానగర్‌లో ఉంటుండగా ఉమాదేవి దంపతులు దిల్‌సుక్‌నగర్‌లో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రభుత్వంవారిచ్చే ఎల్‌టీసీ సౌకర్యంపై కేరళ వెళ్ళారు. అక్కడినుంచే ఉమాదేవి కూతురు శరణ్యకు ఫోన్‌చేసి "తాతయ్యా అమ్మమ్మల పెళ్ళి రోజు ఈనాడు... రాత్రికి అల్లుడిగారితో కలిసి వెళ్ళి సెలబ్రేట్ చేయండి" అని చెప్పింది.

అందుకే గచ్చిబౌలి నుండి విద్యానగర్‌కు వచ్చారు శరణ్యా, కార్తీక్‌లు. నిజానికి ఇంత దూరం రావడానికి కార్తీక్‌కు ఇష్టం లేదు.

పైగా శరణ్యపై విముఖత. కానీ శరణ్య ఓ మెట్టు దిగి వేడుకోవడంతో అర్థమనసుతోనే వచ్చాడు.


"మీ గోల్డెన్ జూబ్లీ మ్యారేజ్‌డేని గ్రాండ్‌గా సెలబ్రేట్‌చేసుకుందాం పదండి మినర్వాకి గాని చట్నీస్‌కి గాని వెళ్దాం" అంది శరణ్య.

"సెలబ్రేట్ చేసుకుందాం కానీ ఈ రోజుకాదు వచ్చే ఆదివారం కాముని పున్నమిరోజు. ఈ పూటకి మీ అమ్మమ్మ నీకిష్టమని కట్‌పొంగల్, కార్తీక్‌కు ఇష్టమని సేమ్యాపాయసం చేసింది"


"కాముని పున్నమి రోజున సెలబ్రేట్ చేసుకోవడమేంటి తాతయ్యా. ఏమిటారోజు ప్రత్యేకత" అని అడిగాడు కార్తీక్ "పెళ్ళిరోజు ఈనాడే కద" ఆశ్చర్యం

సెల్ : 90102 84700

గంగుల నరసింహారెడ్డి







ధ్వనించిందతని కంఠంలో.

"అవునర్రా... దానికో ప్రత్యేకత ఉంది" చిరునవ్వుతో భర్త చెబుతుండగా ముసిముసినవ్వులు నవ్వింది సుజాత.

"చెప్పండి తాతయ్యా అదేంటో ప్లీజ్ ప్లీజ్" ఉత్సుకతతో అంది శరణ్య.

"ఆ ప్రత్యేకత ఏంటో తెలుసుకోవాలంటే ఆదివారం రాత్రి మా అత్తగారి ఊరికి అంటే మీ అమ్మమ్మ వాళ్ళ ఊరికి మీరు రావాలి మాతోపాటు"

ఏం జవాబివ్వాలో తోచక కార్తీక్‌వైపు దీనంగా చూసింది శరణ్య.

"అవునర్రా మీరిద్దరూ తప్పనిసరిగా మాతోపాటు రావాలి. మేం నడవలేకపోతున్నాం. మీతోడు కావాలి" తనుకూడా కార్తీక్ వంక చూస్తూ అంది సుజాత.

ఆ దంపతులంటే తనకు మొదటినుండీ చాలా మంచి అభిప్రాయం ఉన్నందున "సరే, వస్తాంలెండి" అని ఒప్పుకున్నాడు కార్తీక్.

కృతజ్ఞతగా అతనివంక చూసింది శరణ్య.

ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్ నుండి బయలుదేరి రాత్రి ఎనిమిది గంటలకు ఆ ఊరికి చేరుకుంది వాళ్ళు నలుగురూ ప్రయాణిస్తున్న కారు. మార్గమధ్యలోనే రాత్రి భోజనంగా అల్పాహారం చేసి వచ్చారు.

"ఊరు దాటి ముందుకు పోవాలి" అన్నాడు రాజగోపాల్ కారును నడుపుతున్న కార్తీక్‌ను ఉద్దేశించి. కారు ఊళ్ళోంచి వెళ్తోంది.

"ఇదిగో ఈ స్కూలులోనే నేను చిన్నప్పుడు చదువుకున్నాను. ఈ శివాలయం దగ్గరే రోజూ ఆడుకునేవాళ్ళం. అదుగో ఆ వేపచెట్టు ప్రక్కనే మా ఇల్లు ఉండేది..." తన్మయత్వంగా చెబుతోంది సుజాత కారు అద్దాల్లోంచి చూపిస్తూ.

"ఇప్పుడా ఇల్లు లేదా అమ్మమ్మా"

"నేనొక్కదాన్నే సంతానం కావడంతో ఇల్లూ పొలమూ నాకే ఇచ్చారు కానీ హైదరాబాద్‌లో ఇల్లు కట్టడానికై ఊళ్ళోని ఇల్లూ, పొలమూ మా బాబాయి కొడుకు ప్రకాశ్‌కి అమ్మేశాడు అప్పట్లో"

కారు ఊరు దాటింది.

"అదిగో వెలుగు గుట్ట, అక్కడికే వెళ్ళాలి మనం" ఎంత దాచుకున్నా దాగని ఉద్వేగం సుజాత స్వరంలో ధ్వనించింది.

అందరూ తలవంచి చూశారు. నిజంగానే పండు వెన్నెల్లో వెలిగిపోతూ సార్థకనామధేయంతో ఉందా గుట్ట. గుట్ట మధ్యలో మండుతున్న నెగడు, డప్పుల చప్పుడు, కోలాటమాడుతున్న జనసందోహం వారిలో ఉత్సుకతని కలిగించాయి.

"నానమ్మా, ఆ గుట్టపై ఏదైనా గుడి ఉందా?" అడిగాడు కార్తీక్.

"లేదు బాబూ, ఒకటి రెండు సార్లు ఆంజనేయ స్వామి గుడి కడదామని ప్రయత్నాలు చేస్తే ఏవో అవాంతరాలు వచ్చి ఆగిపోయాయట. అప్పటినుండి అది గుడిలేని గుట్టగానే ఉండిపోయింది.



కన్నుకొట్టిందంటే

కన్నుకొట్టి కల్లోలం రేపిన ప్రియా ప్రకాష్ వారియర్ భలేగా పాపులర్ అయిపోయింది. తొలి మలయాళచిత్రం 'ఒరు ఆదార్ లవ్' ఇంకా థియేటర్లలోకి రాకముందే అనేకమంది చిత్ర నిర్మాతల దృష్టి ఆమెపై పడింది.

ఓపక్క టాలీవుడ్‌లోకి తెచ్చే ప్రయత్నాలు సాగుతుంటే ఇంకోవైపు బాలీవుడ్ నిర్మాణ సంస్థలూ ప్రియపట్ల ఆసక్తిని చూపుతున్నాయట. ఈ విషయాన్ని ఇటు తెలుగునాట, అటు ఉత్తరాదినకూడా అధికారికంగానే చెప్తున్నారు.

ఒక సినిమాకూడా తెరపై ఆవిష్కృతం కాకుండానే ఇంత పాపులర్ అయిందంటే... ఆపైన ఇంకేలా వుంటుందో కదా!

బల్లపరపు బండలు ఎక్కువగా ఉన్నందున అమావాస్యకి అటూ ఇటూ వారం రోజులు తప్పా మిగతా రోజుల్లో ఆ గుట్ట రాత్రిళ్ళు ప్రకాశవంతంగా కనిపిస్తూ ఉంటుంది. అందుకే దానికి 'వెలుగు గుట్ట' అని పేరు వచ్చింది"

"మరి గుడిలేని ఆ గుట్టపైన ఈ రాత్రి ఆ జనాలేంటి,ఆ సందడేంటిఅమ్మమ్మా"అడిగిందిశరణ్య.

"పగటి పూట ప్రతిరోజూ పశువుల్నీ గొర్రెల్నీ మేపడానికి కొందరు వెళ్తుంటారు. కాని ఊరు జనం మొత్తం మాత్రం సంవత్సరంలో రెండుసార్లు వెళ్తుంటారు. గుట్టకి దాదాపుగా పై ప్రాంతంలో ఓ జమ్మి చెట్టు అంటే శమీవృక్షం ఉంది.

అందుకే దసరారోజు సాయంత్రం ఊరంతా మేళతాళాలతో వెళ్తారు. అలాగే గుట్ట మధ్యభాగంలో చాలా సమతల ప్రదేశం ఉంది. అక్కడ కాముని పున్నమి రోజున కామదహనం చేసి కోలాటాలు ఆడతారు. ఈ రోజు అదే సందడి" వివరించింది సుజాత. కారు గుట్టను సమీపించింది.

వీరిరాక కొరకే ఎదురుచూస్తున్నట్లుగా అక్కడ ఓవ్యక్తి నిలబడి ఉన్నాడు. కారునుచూసి ఎదురు వచ్చి చేయి ఊపాడు. "కారు ఆపు కార్తీక్. అతడు మా కజిన్ ప్రకాశ్" అంది సుజాత. పరిచయాలు నమస్కారాలయ్యాయి.

'కారు ఆ కామదహనం చోటుదాకా వెళ్తుంది పదండి" అంటూ వెనకసీట్లో సర్దుకున్నాడు ప్రకాశ్. వీరు అక్కడికి చేరుకునేసరికి అక్కడ కోలాటం పూర్తయి జనం కిందికి వస్తున్నారు.

కారునుచూసి అందరూ ఆగారు. ప్రకాశ్ కారు దిగి వారివద్దకు వెళ్ళాడు. ఎవరు వాళ్ళు ఎందుకొచ్చారని అడుగుతున్న వారికి ప్రకాశ్ చెబుతున్న మాటలు కారుదిగిన నలుగురికే వినిపించాయి.

"మా అక్కయ్య పెళ్ళయిన నాలుగు రోజుల తరువాత రాత్రి ఇదే కాముని పున్నమి వేడుకలని చూడ్డానికి గుట్టపైకి వచ్చారట. పెళ్ళయి యాభై సంవత్సరాలయిందని గుర్తుగా మళ్ళీ ఇప్పుడొచ్చారు. ఆ ఇద్దరు పిల్లలూ ఆమె మనవరాలూ, మనవరాలి భర్త..."

అందరూ వెళ్ళిపోయారు. ప్రకాశ్ ప్రసాదంగా ఉడకబెట్టిన శనగలు తెచ్చి ఇచ్చాడు వారికి.

"ఓ గంటసేపు ఇక్కడ గడిపి వస్తాం ప్రకాశ్. నీవు ఇంటికి వెళ్ళిపో. రాత్రి భోజనం కూడా చేశాం మేము. నీవేం ఏర్పాట్లు చేయకు" అన్నాడు రాజగోపాల్.

"సరే బావగారూ" అంటూ వెళ్ళిపోయాడు ప్రకాశ్. ఇప్పుడా గుట్టపై ఆ నలుగురే మిగిలారు.

"ఇప్పుడు చెప్పండి తాతయ్యా, ఈ రోజు ప్రత్యేకతఏంటో, అందులో ఈ వెలుగుగుట్ట పాత్ర ఏంటో" అంది శరణ్య,ఆ వృద్ధదంపతులకేసి తిరిగి నవ్వుతూ.

"చెబుతాను. అందుకేగా మిమ్మల్ని రమ్మంది. మనం ఇప్పుడు జమ్మిచెట్టుదాకా వెళ్ళాలి. మమ్మల్ని పట్టుకొని గుట్టఎక్కడానికి సాయంచేయండి.నడుస్తూ చెప్పుకుందాం" అన్నాడు రాజగోపాల్.

కార్తీక్ రాజగోపాల్‌కి చేయి అందిస్తే శరణ్య తన అమ్మమ్మను పట్టుకుని ముందుకు నడిచింది.

"నీవు మొదలుపెట్టు సుజాతా, పిల్లలు చాలా ఆతృతగా ఉన్నారు" అన్నాడు రాజగోపాల్.

"మీరైతేనే బాగా చెబుతారేమో, సరే నేను ప్రారంభిస్తాను. నేనేమైనా మర్చిపోతే మీరు సరిచేస్తుండండి" అంది సుజాత.

"సరే కానీయి" అన్నాడు రాజగోపాల్ ఉత్సాహంగా. ఆ దంపతులిద్దరి మాటల్లో యాభై సంవత్సరాల క్రిందటి గతం దృశ్యరూపం దాల్చింది.

"అమ్మా, అలా వెలుగు గుట్టదాకా వెళ్ళివస్తాం. మన ఊరి కామదహనం వేడుకల్ని చూసొద్దామంటున్నారు" రాత్రి ఏడు గంటలవుతుండగా తల్లిని అడిగింది సుజాత.

"ఈ రాత్రి కార్యక్రమం తెలుసుగా, తొందరగా రండి" కొత్తగా పెళ్ళయిన కళతో వెలిగిపోతున్న కూతుర్ని మురిపెంగా చూస్తూ అందామె.

"తెలుసులేవే. తొందరగా వచ్చేస్తాం" సిగ్గుపడింది సుజాత.

"ఆ కామునిపున్నమిరోజునే శోభనం ఏర్పాటు చేశారు పెద్దలు వారిద్దరికీ. నవదంపతులు బయలుదేరి వెళ్తుండగా "వెన్నెల్లో కూర్చుని చిరుతిండి తినడం బావుంటుంది" అంటూ తల్లి సుజాతకు ఓ ప్లాస్టిక్ బుట్ట అందించింది.

ఆ గుట్టపైన కామదహనం వేడుకల్లో ఉన్న జనమంతా ఆ ఇద్దరికేసి ఉత్సుకతగా చూడసాగారు. అది గమనించిన ఓ పెద్దాయన "ఇంకాస్త పైకి వెళ్ళండమ్మా బావుంటుంది" అని సలహా ఇచ్చాడు.

జనమంతా అలా చూస్తుండడంతో దంపతులిద్దరికీ ఇబ్బందిగానే ఉంది. అలా గుట్ట ఎక్కుతూ పైదాకా వెళ్ళిపోయారు.

అక్కడ చదరంగా ఉన్న పెద్ద రాతిబండ కనిపించడంతో ఇద్దరూ కూర్చున్నారు.

ప్లాస్టిక్ బుట్టలోంచి లడ్డూలు తీసింది సుజాత. ఒక లడ్డూనే చెరిసగం పంచుకున్నారు.

గాజు సీసాలోని నీళ్ళతో చేతులు కడుక్కున్నారు. ఫ్లాస్కు తెరచి గ్లాసులోకి ఒంపింది. వేడి పాలు పొగలు గక్కుతున్నాయి.

"అబ్బో స్వీటుతోపాటు పాలు కూడానా, అయితే మన ఫస్ట్‌నైట్ ఇక్కడే జరుపుకోవాలని అత్తయ్యగారి ఉద్దేశ్యం కాబోలు"నవ్వుతూ అన్నాడు రాజగోపాల్.

"అయ్యో, ఇక్కడా?!" సిగ్గుపడింది సుజాత.

అతని చేతిలోని సగం తాగిన పాలగ్లాసు అందుకుందామె. అతడామె దగ్గరికి జరిగి ఎడంచేతిని ఆమె నడుంపై వేశాడు.

ఒంటినిండా తీయని ప్రకంపనలతో పాలు త్రాగడాన్ని ముగించేసి అతనిమీదికి ఒరిగింది.

ఆమెనే అతన్ని తనకేసి లాక్కుందో లేక అతడే ఆమెపైకి ఒరిగాడో తెలియనంతగా పరస్పరం పెనవేసుకుని కఠిన రాతిబండపై వాలిపోయారు.

కొద్దిసేపటి తరువాత ఇద్దరూ కొత్త అనుభవాన్ని

చవిచూసిన ఆనందంలో క్రిందికి దిగడం ప్రారంభించారు. ఒకచోట ఆగింది సుజాత. ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూశాడు రాజగోపాల్.

"ఇది జమ్మిచెట్టు, ప్రతి దసరాపండుగ రోజు సాయంత్రం ఊరంతా ఇక్కడికి వస్తారు" అందామె ఆ చెట్టుకు మొక్కుతూ.

"వచ్చి ఏం చేస్తారు?"

"పూజారి పూజచేసిన తరువాత అందరూ ఆకుల్ని తెంపుకుని పరస్పరం ఇచ్చుకుంటూ సమవయస్కులయితే శుభాకాంక్షలు తెలుపుకుంటారు. పెద్దవాళ్ళ నుండయితే ఆశీస్సులు పొందుతారు.

పైగా మేమంతా చీటీలపై 'శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశనం, అర్జునస్య ధనుర్ధారి, రామస్య ప్రియదర్శిని" అని రాసి చెట్టు మొదట్లో ఉంచి మొక్కుతుంటాం. కొందరైతే ఆ చీటీలను భూమిలో కొంతలోతున పూడ్చిపెడ్తారు"

ఓ నిమిషంపాటు ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఏం మాట్లాడలేదు రాజగోపాల్. అందుకు అతనివంక ప్రశ్నార్థకంగా చూసిందామె.

"నాకో ఆలోచన వచ్చింది. మనమూ చెరో చీటీ రాసి ఈ సీసాలో ఉంచి ఇక్కడే ఓ చోట పాతిపెడదాం. కొన్నేళ్ళ తరువాత వచ్చి కలిసి చదువుకుందాం. ఇప్పుడు మాత్రం నేను రాసింది నీవు చూడకూడదు, నీవు రాసింది నేను చూడను, "సరేనా?" నవ్వుతూ అన్నాడతడు.

"సరే సరే, తమాషాగాఉంది మీ ఆలోచన.ఏమని రాయాలి. ఎన్ని సంవత్సరాల తరువాత ఇక్కడికి రావాలోకూడా చెప్పండి" తనూ నవ్వుతూ అంది.

"నా గురించి కాని ఈనాటి అద్భుతమైన అనుభవం గురించి కానీ, మన భవిష్యత్ దాంపత్య జీవితం గురించి కానీ ఏదయినా రెండు మూడు వాక్యాల్లో రాసి సంతకం పెట్టి ఇవ్వు. నేనిలాగే రాస్తాను" అంటూ జేబులోంచి రెండు మడతలుగా ఉన్న తమ పెళ్ళికార్డును ఒకవైపు చింపి ఆమెకిచ్చాడు.

పదినిమిషాల్లో ఇద్దరూ చీటీలు రాసి ఖాళీ అయిన నీళ్ళసీసాలో పెట్టి శమీవృక్షానికి ఎడంగా ఉన్న పెద్ద రాయి పక్కన చిన్నగోయి తీసి పూడ్చిపెట్టారు.

"ఎన్ని సంవత్సరాల తరువాత రావాలో చెప్పనేలేదు మీరు" అంది సుజాత.

"సరిగ్గా యాభై సంవత్సరాల తరు వాత అంటే 2017వ సంవత్సరం ఇదే కాముని పున్నమిరోజున వద్దాం" "అబ్బో యాభై సంవత్సరాలా?!" ఆశ్చర్యంగా అడిగింది.

"ఇప్పుడలాగే అనిపిస్తుంది కాని చూస్తూండు,రోజులు ఎంత తొందరగా గడిచిపోతాయో"

"నిజంగానే రోజులు ఇట్టే గడిచిపోయాయి. అప్పుడే యాభై సంవత్సరాల కాలం గడిచిపోయిందా అని ఆశ్చర్యంవేస్తోంది" అంది సుజాత శమీ



వృక్షాన్ని సమీపిస్తూ.

"ఇక్కడే ఇక్కడే తవ్వండి" అన్నాడు రాజగోపాల్. అతని కంఠంలోని ఉద్వేగం మిగతా ముగ్గురికీ తెలుస్తూనే ఉంది.

వృద్ధ దంపతులని ఓ రాతిశిలపై కూర్చుండబెట్టి యువదంపతులు గట్టి కర్రముక్కలతో తవ్వగా తొందరలోనే ఆ సీసా బయటపడింది.

"అదే సీసా అదే, తెరవండి" ఆతృతగా అంది సుజాత. మూత రాలేదు.

జాగ్రత్తగా సీసాను పగలగొట్టి పట్టుకుంటే చినిగిపోతున్నకాగితాలను వెలికి తీశాడు కార్తీక్. పదిలంగా తీసికెళ్ళి తాతయ్యకి అందించాడు.

అపురూపంగా ఓ కాగితాన్ని విప్పాడు రాజగోపాల్. అది అతడు రాసినదే. దాన్ని కార్తీక్ చూస్తూ పెద్దగా చదివాడు. "సుజా, నిన్ను నేను నా ప్రాణప్రదంగా చూసుకుంటాను మన దాంపత్యజీవితం రాబోవు తరాలకు ఎంతో ఆదర్శప్రాయంగా ఉంటుంది"

సుజాత రాసిన చీటీని శరణ్య చదివింది.

"మీరు భర్తగా లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నాకు భవిష్యత్తు నందనవనంలా గోచరిస్తుంది" రెండు నిమిషాలపాటు ఉద్వేగంతో ఆ నలుగురూ ఏమీ మాట్లాడలేకపోయారు.

"నిజంగానే నేను అదృష్టవంతురాలినండీ" అంటూ అతని చేతుల్లో తన మొహాన్ని ఆన్చి ఆనందబాష్పాలురాల్చింది సుజాత. "నీకన్నా నేను ఎక్కువ అదృష్టవంతుణ్ణి సుజా" ఆమె తల నిమురుతున్న రాజగోపాల్ కళ్ళలోనూ తడి.

"వారికి ఏకాంతం కల్పించడానికి శరణ్యా, కార్తీక్‌లు కనులతోనే సైగ చేసుకుని నిశ్శబ్దంగా కదిలి గుట్టపైకి నడిచారు. ఆ ఇద్దరి యువ దంపతుల మనసుల్లో ఏదో కదలిక.

ఎక్కడో ఘనీభవించి ఉన్న ఆభిజాత్యాలేవో కరిగిపోతున్న భావన. ఆ వృద్ధ దంపతుల అనురాగాన్నీ, అనుబంధాన్నీ చూసిన తర్వాత ఇన్నిరోజులుగా తాము ఏమి కోల్పోయామో అర్థమవుతోంది వారికి.

ఇద్దరూ గుట్టపైకి చేరుకున్నారు. విరగకాస్తున్న పండు వెన్నెల ఇద్దర్నీ వివశుల్ని చేస్తోంది. ఇక తట్టుకోలేకపోయింది శరణ్య.

అతన్ని దగ్గరికి లాక్కొని తమకంగా ముద్దిచ్చి "సారీ కార్తీక్, ఇకనుండి నేను పూలిష్‌గా ప్రవర్తించను. నీవు నిజానికి చాలామంచివాడివి. జీవితాంతం నీతోనే కలిసి ఉంటాను. నిన్ను వదులుకోను"

"నేనుకూడా చాలాసార్లు సిల్లీగా ప్రవర్తించాను శరణ్యా నన్ను క్షమించు. ఈ వెన్నెల సాక్షిగా మన మిద్దరం కలిసి జీవిద్దాం" అంటూ ఆమెను హత్తుకొని ప్రతిముద్దు ఇచ్చాడు.

అతని ముద్దును మురిపెంగా ఆస్వాదిస్తూ అతన్ని ఆసాంతం అల్లుకుపోయిందామె.

రంగస్థలం రంగమ్మత్త

ఎప్పుడూ గ్లామర్ విందుల చిందులు కురిపించే అనసూయ 'రంగస్థలం'లో రంగమ్మత్త పాత్రలో ప్రేక్షకుల్ని అబ్బురపరిచింది.

మేకప్ లేకుండా, డీగ్లామరస్‌గా బాగా చేసిందన్న ప్రశంసల్ని దక్కించుకున్నది. "మొదట్లో నా సంశయాలను సుకుమార్ గారికి చెప్పాను. నాపాత్ర హైలెట్‌కాగలదన్న భరోసా ఇచ్చారు.

నా పాత్రను ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటున్న తీరు సంతోషాన్ని ఇస్తోంది. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లోని ప్రజలు మహిళల్ని అత్త అని, మగవారిని బాబాయ్ అని పిలుస్తుంటారు. అదేమాదిరి 'రంగస్థలం'లో నన్ను రంగమ్మత్తగా పిలిచారు. సుకుమార్‌గారు, చరణ్‌లు కూడా నన్ను ప్రశంసించారు. నా పర్‌ఫార్మెన్స్ నచ్చిందన్నారు. నేనూ సంతోషంగా ఉన్నా" అంటోంది.



డబ్బుకోసమే మీడియా నాపై తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది.

-రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు

అంతా రాజకీయమే

చెప్పినంత సీన్ లేదు

కలకత్తావెళ్ళి మమతాబెనర్జీతో మంతనాలు జరిపి తాను ఫెడరల్ ఫ్రంట్‌ని ప్రపోజ్ చేసిన తొలి నేతగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. ప్రచారం చేసుకునే యత్నం చేశాడు.

అయితే కలకత్తాలో సీన్ ఆయన అనుకున్న రీతిలో లేదన్నది ఇప్పుడు తెలుస్తున్న విషయం. మమతాబెనర్జీ మోడీ విషయంలో బద్ధవ్యతిరేకి.

నిన్నమొన్నటివరకు కె.సి.ఆర్.ది మోడీ అనుకూల విధానం. హఠాత్తుగా కె.సి.ఆర్. నరేంద్ర మోడీ వ్యతిరేకిని అని రావటం మమతాబెనర్జీకి నమ్మదగ్గదిగా అనిపించలేదట.

ఇప్పటికే కె.సి.ఆర్. తన కూతురు కవితకు కేంద్రంలో మంత్రిపదవి కోసం ప్రయత్నిస్తున్నాడని, కె.సి.ఆర్. సామాజిక వర్గపు గవర్నర్ మోడీకి, కె.సి.ఆర్.కి మధ్య మంతనాలు కొనసాగిస్తున్నాడన్నది మమతాబెనర్జీ సమాచారం.

అందుకే ఆమె సంయుక్త పత్రికా సమావేశానికి ఉత్సాహం చూపలేదు. బలవంతంమీద వచ్చి నిలబడినా ఆమె ముఖంలో ఆ సమావేశంవలన ప్రయోజనం ఏమీ లేదన్న విషయం స్పష్టంగా కనిపించింది. తొలి యత్నమే ఇలా వికటించిందేమిటనేది కె.సి.ఆర్. బాధ. ◆

నితీష్ కష్టాలు

బీహార్ సి.ఎమ్. నితీష్‌కుమార్‌కి కొత్త కష్టాలు మొదలయ్యాయి. ఒకటి మొన్నటి లోక్‌సభ, శాసనసభ ఉపఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీ ఆర్.జె.డి. గెలిచింది. ఆ పార్టీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ అవినీతి కేసులో శిక్షపడి జైలులో వుండి కూడా తన పార్టీని గెలిపించుకున్నాడు.

లాలూప్రసాద్ యాదవ్ కొడుకు యాదవుల ఓట్లకోసం అత్యంత తెలివితేటలతో ప్రచారం నిర్వహిస్తున్నాడు. దానితో బి.సి. నేతగా నితీష్‌కున్న ఇమేజ్ కొంచెం కొంచెం తగ్గుతోంది.

ఈలోగా బి.జె.పి. మరింత చురుకుగా బీహారు రాజకీయాలలో వ్యవహరిస్తోంది. అగ్రవర్ణాల ఓట్లు బి.జె.పివైపు వెళ్ళిపోతున్నాయి. ఇలా అయితే వచ్చే ఎన్నికల్లో తన పరిస్థితి ఏమిటనేది నితీష్ భయం. 'మహాకూటమి' అనే ఆలోచన చేసిందీ, దానికి ఒక రూపం ఇచ్చిందీ నితీష్.

నరేంద్రమోడీని ఢీకొనే ప్రతిపక్ష నేతగా గుర్తింపుతెచ్చుకుంది నితీష్. ఇప్పుడు అవన్నీపోయి భారతీయ జనతా పార్టీకి తోక పార్టీగా, బి.జె.పి. పెత్తనం చేస్తుంటే ఏమీ చెయ్యలేని నిస్సహాయుడిలా మిగిలిపోయాడు నితీష్‌కుమార్. ◆

ఫోటోల భయం

రాజకీయనాయకులు అందరికీ ఒక్కసారిగా ఫోటోల భయం పట్టుకుంది. ఇటీవల దేశం వదిలి పారిపోయిన నీరవ్ మోడీ ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి గ్రూప్ ఫోటో దిగిన విషయం కాంగ్రెస్ వెలుగులోకి తెచ్చింది.

ఏ సంబంధం లేకుండానే ఆ మోడీ ఈ మోడీ గ్రూప్ ఫోటోలోకి వచ్చాడా! అని కాంగ్రెస్ ప్రశ్నించింది. దీనితో బి.జె.పి.ని దెబ్బకొట్టామనుకుంది కాంగ్రెస్. కాని ఇప్పుడు బి.జె.పి. ఐటి విభాగం గతంలో పత్రికల్లో వచ్చిన కాంగ్రెస్ నేతల ఫోటోలన్నీ వడకడుతోంది.

ఇప్పటికే కలకత్తా బ్యాంక్ కుంభకోణంలో అరెస్టు అయిన శివాజీ పంజా అనే వ్యక్తి బెంగాల్ సి.ఎమ్. మమతాబెనర్జీతో కలిసివున్న ఫోటోను బయటపెట్టింది. ఇక కర్ణాటక ఎన్నికల ప్రచార సమయంలో, ఆపైన 2019 ఎన్నికల సమయంలో కొత్త కొత్త ఫోటోలను వెలుగులోకి తీసుకురాబోతున్నారు. ఇప్పుడు అన్ని పార్టీల నేతలకు ఫోటోల భయం పట్టుకుంది.

ఎప్పుడు ఏ నేరస్తుడితో వున్న ఫోటో బయటకు వస్తుందోనన్నది కంగారు. ◆

ఎదురుచూస్తున్నాడు

నరేంద్రమోడీ మంత్రివర్గంలోని రామ్‌విలాస్ పాశ్వాన్ అధికారం ఎటు ఉంటే అటు మొగ్గుచూపే నాయకుడిగా ఇప్పటికే పేరుగడించాడు. ఎవరితో అయినా జట్టు కట్టగల నేర్పు అతనిది.

2014లో మోడీవెంట నడిచిన ఈ దళిత నేత 2019 ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ గాలి ఎటు మళ్ళుతుందోనని లెక్కలు కడుతున్నాడు. అందుకోసం ఎన్.డి.ఎ.లో ఉన్న దళిత ఎమ్.పి.లతోనే కాదు, ఇతర పార్టీల ఎమ్.పి.లతో కూడా రహస్య మంతనాలు జరుపుతున్నాడు.

మోడీ ప్రభుత్వంమీద దళిత వర్గాలలో ఎటువంటి అభిప్రాయం ఉందనేదానిమీద సర్వేలు చేయిస్తున్నాడు. ఈ అంశాలలో ప్రతికూల, అనుకూల అభిప్రాయాలు రెండూ రావటంతో రామ్‌విలాస్ పాశ్వాన్ తన కొడుకును ఉత్తర భారత దేశ పర్యటనకు పంపుతున్నాడు.

అలా అంతా తిరిగి ఏదో ఒక అభిప్రాయంతో కొడుకు వచ్చినతర్వాత తన తదుపరి నిర్ణయం ప్రకటించాలనేది పాశ్వాన్ ఆలోచన. అందుకే కొత్త సమాచారంకోసం ఎదురుచూపులు. ◆

ఏ చరిత్ర గెలుస్తుందో

కర్ణాటక ఎన్నికల వేళ అక్కడి ప్రధాన రాజకీయ పక్షాలైన బి.జె.పి., కాంగ్రెస్‌లు రెండూ తమ గెలుపుకు అక్కడ ఎన్నికల చరిత్రను నమ్ముకుంటున్నాయి. 1980లతర్వాత కర్ణాటకలో ఏ పార్టీకూడా వరసగా రెండుసార్లు ఎన్నికలు గెలవలేదు.

పాలక పక్షాన్ని కాదని ప్రతిపక్షానికి అధికారం ఇస్తారు. 2013లో బి.జె.పి.ని ఓడించి కాంగ్రెస్‌ని గెలిపించారు. 2018 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉందికాబట్టి చరిత్ర ప్రకారం గెలుపు తమదే అనుకుంటున్నారు బి.జె.పి.వారు.

అయితే ఈ విషయానికి భిన్నంగా కాంగ్రెస్ వారు మరో చరిత్ర చెపుతున్నారు.

కర్ణాటక ఓటర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని వ్యతిరేకించే పార్టీని గెలిపిస్తుంటారు.

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కర్ణాటకలో జనతా పార్టీ గెలిచింది.

కేంద్రంలో ఎన్.డి.ఎ. అధికారంలో ఉన్నప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్‌ని గెలిపించారు.

కాబట్టి ఇప్పుడు కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్నందున ఓటర్లు మమ్మల్ని గెలిపిస్తారు అంటున్నారు కాంగ్రెస్‌వారు. ◆

చివరి యత్నంగా

ఎన్ని రకాల పదవులు అనుభవించినా ప్రతి నేత మనసు ప్రధాని పదవిమీదే వుంటుంది.

అందునా పదవులమీద అత్యంత మక్కువ కలిగిన శరద్‌పవార్‌లాంటి నేత అస్సలు ఊరుకోగలడా! అందుకే ఇప్పుడు అనారోగ్యాన్ని కూడా లెక్కచేయక, ఎక్కడ లేని ఉత్సాహం తెచ్చుకుంటూ ప్రతిపక్షాల సమావేశాలలో పాల్గొంటున్నాడు. తాను కాంగ్రెస్ పార్టీలో నుండి బయటకు వచ్చింది సోనియాగాంధీ ప్రధాని పదవిని ఆశించటంవల్లనే అన్నాడు శరద్‌పవార్.

ఆ విధంగా ఆమెను తప్పించాడు, ఈసారి పోటీలోనుండి. మహారాష్ట్రలో శివసేనలోని రెండు వర్గాలను మచ్చిక చేసుకుంటున్నాడు.

అన్ని ప్రాంతీయ పార్టీల నేతలను హడావుడిగా కలుస్తున్నాడు. వయసు, ఆరోగ్యం ఆయనకు వ్యతిరేకంగా వుంటే ఆయనేంటి ప్రధాని పదవి ఇమ్మంటాడు అంటున్నాయి ఇతర పార్టీలు.

ఢిల్లీలో ఎడతెగని ప్రతిపక్ష చర్చలన్నీ శరద్‌పవార్ డిమాండ్ చుట్టూనే నడుస్తున్నాయి. శరద్‌పవార్‌ని కాదనలేవు అలాగని ఆయన డిమాండ్‌ని అంగీకరించలేని సంకటస్థితి ప్రతిపక్షాలది.

సత్యాన్వేషణ



శ్రీ వరాహ స్తుతి

**వసతి దశన శిఖరే ధరణీ
తవలగ్నా
శశిని కళఙ్కకలేవ నిమగ్నా
కేశవ ధృత సూకర రూప
జయ జగదీశ! హరే!**

నీ కోరకొనయందు అంటివున్న భూగోళం
చంద్రునిలోని మచ్చలా వుంది.
వరాహావతారం ధరించిన ఓ స్వామీ,
జగదీశా! హరీ! నన్ను కాపాడు. ❐

వరాహ జయంతి

(తేది : 13.4.2018)

ప్రతి వస్తువునీ చివరికి ప్రపంచాన్ని కూడా కేవలం హిరణ్య (ధన) అక్ష (దృష్టితో మాత్రమే) విధానంతో చూసేవాడు హిరణ్యాక్షుడు.

వాడికి ధనంతో కొలవడం తప్ప మరో గమ్యమే లేకపోతూ, చెప్పలేనంత ధనం (ఐశ్వర్యం) దాగినదిగా భూమిని సముద్రం లోనికి పడేశాడు.

దాంతో భూమిలో ఉన్న మనందరికీ ప్రాణాలే నిలువ వీలులేని స్థితి దాపురించగానే, హిరణ్య (అమోఘమైన ఐశ్వర్యం) గర్భ (తనలోదాగిన శ్రీహరి)విధానంతో భూమిని తన ముట్టెనుండి సృష్టించిన కోరతో పైకి తెచ్చి మనని బ్రతికించాడు.

ఆ యజ్ఞవరాహంగా అవతారాన్ని ధరించినటువంటిరూపమే ఆదివరాహరూపం. ఆయన జన్మ దినమే వరాహ జయంతి. ❐

ఓషధుల నిలయం

సింహాచలక్షేత్రాన్ని కేవలం ఓ దైవం ఉన్న పవిత్రమైన పర్వతంగా భావించడం నిజమే.

అయితే అక్కడ కొండలమీద తానికాయ, కరక్కాయ, ఉసిరికాయ అనే త్రి-ఫలాలు ఏ విధమైన మందులు కూడా వాడబడకుండా సంపూర్ణ ఓషధీశక్తి కలిగినవి లభిస్తాయి.

వనమహోత్సవం పేరిట ఏవేవో చెట్లని ఆదరాబాదరగా నాటెయ్యడం కాకుండా ఓషధీశక్తి నిండిన వృక్షాలని ఇక్కడినుండి తీసుకునివెళ్ళి మార్గాలకి అటూఇటూ పక్కలవేసి జాగ్రత్తగా పెంచితే వాతావరణ కాలుష్యం హరింపబడడమేకాక, వెళ్ళేవచ్చే జనుల ఆరోగ్యం ఆ చెట్లమీదినుండి వచ్చే గాలుల కారణంగా బాగుపడుతుంది.

ఎంతో అరుదుగా లభించే శతావరి, సంజీవని, తెల్లబెరడ, పాతాళగరుడ, తీపిమిరప వంటివి లభిస్తాయి ఈ కొండల్లో. ❐

{ సేవాదృక్పథంతో చేసే త్యాగంలోనే మనిషికి ఆనందం, తృప్తి లభిస్తాయి. }

ఒడిశా సంప్రదాయాలుంటాయి

పూరీలో జగన్నాథస్వామి పోలికలు ఈ అర్చనా విధానాల్లో కన్పిస్తాయి సింహాచలంలో.

ఒకప్పుడు అక్కడి ఆలయ అర్చకులే ఇక్కడ పాంచరాత్రాగమ విధానం ప్రకారం అర్చనాదుల్ని చేస్తూండేవారు.

కొర్రలనే ధాన్యంతో పాయసం చేసి నివేదించడం, కర్రలపొయ్యిమీదనే స్వామికి వంటని వండడం, వంటశాల (మహారసం అని పేరు)లోకి నేరుగా వచ్చి పడుతూండే అమృతధార అనే నీటిప్రవాహంతో మాత్రమే వంట చేయడం-

వంటని ప్రారంభించే వేళ, వంట పూర్తిగా అయిందన్న వేళ ఆ విషయాన్ని తెలియజేస్తూ ఓ చిత్రమైన పద్ధతిలో గంటలని కొట్టడం,

పూరీలోలాగా 'అమృతకుండ్' అనే పేరిట ప్రత్యేక ప్రసాదాన్ని స్వామికి సమర్పించడం, ఆలయ గోపుర నిర్మాణవిధానం... ఇలా అనేకం జగన్నాథస్వామి ఆలయంతో పోలికలతో కన్పిస్తాయి. ❐

క్షేత్రం గొప్పదనం

ఒక దైవం ప్రతిష్ఠింపబడితే చాలు అది పవిత్ర దేవాలయమే అని అంటాం. మరి సింహాచలస్వామి పురూరవ చక్రవర్తిచేత ప్రతిష్ఠింపబడినవాడు. పైగా కృతయుగం కాలంలో.

'కృతే స నారసింహోభూత్' కృతయుగంలో దైవం నరసింహుడే కదా! ఆలయ సమీపంలో ప్రవాహం ఉంటే దాన్ని తీర్థం అంటాం.

ఇక్కడ ఉన్నది సెలయేరు-కాలువ-నది కానేకాదు. నదులన్నీ తనలో కలిసే సముద్రం.

అందునా తూర్పు సముద్రం.

అందుకే ఇది క్షేత్రం. సూర్యోదయ సూర్యాస్తమయ కాలాల్లో ఈ క్షేత్రంలో మనముంటే ఆ సూర్యబింబ దర్శనం అత్యానందకరం. S



మెదడు చెప్పే మాట

ఆరోగ్యవంతమైన జీవనశైలిలో సరైన, తీరైన బరువు కలిగిఉండడం అంతర్భాగం. అధిక బరువు, స్థూలకాయం, డయాబెటిస్, గుండెజబ్బులు, బ్రెయిన్‌స్ట్రోక్, క్యాన్సర్లు, అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి అనేక రుగ్మతలకు కారణమవుతాయి.

ఇటువంటి తీవ్రమైన అనారోగ్యాలనుంచి పరిరక్షించుకోవడంకోసం తప్పనిసరిగా అదనపు బరువు వదిలించుకోవాల్సిన అవసరముంటుంది.

బరువు తగ్గడంలో ఆరోగ్యవంతమైన డైట్ భాగం అయివుంటుంది.

క్రమంతప్పని వ్యాయామాలు తప్పనిసరి. ఇవన్నీ కూడా తెలిసిన విషయాలే. పదేపదే ప్రతి ఒక్కరూ చెప్పుకునేవే. బరువు తగ్గడానికి అవసరమైన కార్యకలాపాలను అనుసరించడానికి సహకరించే అంశాల్లో మెదడు కీలక పాత్ర వహిస్తుంది. ఎందుకంటే ఆహార నియంత్రణ, తినే విధానాలను మెదడు క్రమబద్ధీకరించే మెకానిజం కొనసాగుతుంటుంది.

» హైపోథాలమస్ పాత్ర

హైపోథాలమస్ మెదడులో వుండే ఎండోక్రైన్ గ్రంథి. ఆహార ప్రవర్తనా నియంత్రణలో ఎంతో లోతుగా పనిచేస్తుంది.

దీనికి ఆకలి, సంతుష్టి కేంద్రా లుంటాయి. ఆకలి వేసినప్పుడు తినడానికి, కడుపు నిండాక ఆపేయడానికి దోహదపడేవి. ఇవి అనేక రసాయనాలు లేదా హార్మోన్ల ద్వారా పనిచేస్తాయి.

» లెప్టిన్

ఇది కూడా 'హార్మోన్ ఆఫ్ ఎనర్జి ఎక్స్‌పెండిచర్'గా ఉంటుంది. ఆకలిని అడ్డుకోవడం ద్వారా శక్తి సమతౌల్యాన్ని క్రమబద్ధీకరిస్తుంది. తక్కువ ఆకలివుంటే తక్కువ ఆహారం తింటారు. బరువు తగ్గుతారు.

స్థూలకాయుల్లో లెప్టిన్ రెసిస్టెన్స్ ఉంటుంది. అంటే ఆకలికి నియంత్రణ ఉండదు. లెప్టిన్ అధిక స్థాయిల్లోఉంటేఅధికఆహారం తింటూంటారు.డయాబెటిక్ గలవారిలో ఇన్సులిన్ రెసిస్టెన్స్‌లాంటిదే ఇది.

» ఘ్రెలిన్

దీనిని కూడా హంగర్ హార్మోన్‌గా పిలుస్తారు. ఇది ఆకలిని ఉద్దీప్తం చెయ్యడంలో హైపోథాలమస్‌పై పనిచేస్తుంది. ఘ్రెలిన్ పనితీరు లెప్టిన్‌కు పూర్తి వైరుధ్యంగా ఉంటుంది. ఆహారం తిన్న తర్వాత ఘ్రెలిన్ స్థాయిలు బాగా తగ్గిపోతాయి.

తదుపరి ఆహారంతీసుకునే సమయానికిముందు తిరిగి పెరిగి, ఆకలిని ఉద్దీప్తం చేస్తాయి.

అంటే ఆహార ప్రవర్తనను క్రమబద్ధీకరించడానికి లెప్టిన్, ఘ్రెలిన్ స్థాయిల నడుమ సమతౌల్యం వుండాలి. ఇవన్నీ మెదడులోని రసాయనాలు, గ్రంథులకు సంబంధించి అయితే, ఆహార ప్రవర్తనను మెదడులోని ఆహ్లాదకేంద్రాలు మరోరకంగా ప్రభావితం చేస్తుంటాయి. మనుగడ కోసం ఆహారం తప్పనిసరిగా కావాలి. ఈ విషయాన్ని అలా ఉంచితే ఆహ్లాదానికి, ఆహారానికి నడుమ కూడా విడదీయరాని అనుబంధం ఉంటుంది. మనం బాగా సంతోషంగా ఉన్నప్పుడు ఎక్కువ ఆహారం తింటుంటాం.

దీనికి వ్యతిరేక విషయమూ ఉంది. మనస్సు కోరినదాన్ని తిన్నప్పుడు సంతోషం కలుగుతుంది. సంతృప్తి దక్కుతుంది. ప్రతి సెలబ్రేషన్‌లో, పార్టీలో వివిధ పదార్థాలుంటాయి. ఈ సందర్భాలలో దాదాపు అందరూ అధికంగానే తింటారు.

అంటే సెక్స్, ఆటలు లేదా సినిమాలు చూడడం వంటి ఇతర ఆహ్లాదపూరిత కార్యకలాపాల మాదిరే ఆహార సంబంధిత ఉద్దీపనకూడా మెదడుల్లో ప్రభావితం అవుతుంది. డోపమైన్ అనే న్యూరోట్రాన్స్‌మీటర్

ద్వారా మెదడు ప్రభావితం చేస్తుంది.

అన్ని ఆహార రకాలు మెదడులోని రివార్డు కేంద్రాలను ఉద్దీప్తం చేస్తాయి. తీపి పదార్థాలు లేదా కేక్స్, చాక్లెట్స్, శీతల పానీయాలు మొదలైన ఎక్కువ క్యాలరీ పదార్థాల ప్రభావాలు అధికంగా ఉంటాయి. అందుకే కొందరు వ్యక్తులు స్వీట్లు, కేకుల వంటివి ఎక్కువ తినడానికి ఉత్సాహపడతారని అర్థం చేసుకోవాలి. కడుపు నిండుగా ఉన్నా కాని ఆహ్లాదపూరిత భావాలు డిజర్టులు తినడానికి ఫోర్స్ చేస్తాయి.

కొంతకాలానికి తినడమనేది ఓ ఎడిక్షన్ అవుతుంది కూడా. అంటే ఆల్కహాల్, స్మోకింగ్ ఎడిక్షన్ మాదిరి అన్నమాట. ఆహారానికి ఎడిక్ట్ అయిన వ్యక్తులు తినడాన్ని, కడుపునింపే చర్యగా కంటే ఆహ్లాదపూరిత చర్యగా పరిగణిస్తారు.

ఇటువంటి ప్రవర్తన వల్ల అధిక బరువుతో స్థూలకాయులైపోతారు. కౌన్సెలింగ్, సైకియాట్రీ కన్సల్టేషన్ ఇటువంటి పరిస్థితిలో అవసరం అవుతాయి.


Courtesy : SANANDA

» ప్రత్యేక సెన్స్‌లు

ఆహారం ఛాయిస్‌లు, ఇష్టాల విషయంలో అనేక కారణాలు కీలకపాత్ర వహిస్తుంటాయి. రూపం, వాసన, రుచి అనేవి కలగలిసిఉంటాయి.

- ఆహారం నుంచి వెలువడే ఘుమఘుమలు ఆకలిని, తినాలన్న కోరికను పెంచుతాయి.
- ఏదైనా పదార్థాన్ని అందంగా, పొందిగ్గా అలంకరించి వడ్డించినప్పుడు మనసు అటే లాగేస్తుంది.
- ఇక పదార్థాల రుచిది తిరుగులేని కీలకపాత్ర. ఇది ఆకలిని, ఇంకా ఇంకా తినాలన్న కోరికను పెంచుతుంది. పదార్థాల వాసన, రూపు, రుచి వంటి సెన్సేషన్లను ప్రత్యేక మెదడు కేంద్రాలు గుర్తించి, ప్రశంసిస్తాయి. ఫలితంగా ఆయా వ్యక్తుల ఆహార ప్రవర్తన ప్రభావితం అవుతుంది.

మెదడు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆహారం తినే ప్రక్రియను ఏ విధంగా ప్రభావితం చేస్తుందన్న అవగాహన ఉన్నప్పుడు, ఆహారవిధానాల విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడానికి వీలు కుదురుతుంది.

సమస్యను గుర్తించి, నియంత్రణలో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమతులాహారం తీసుకోగలుగుతారు.

వి. హేమలత

▶■ సీరియల్

వేట



"సార్.. మీరు ఎక్కడ ఉన్నారు సార్? మీ ఫ్లాట్‌లో అగ్నిప్రమాదం జరిగింది సార్" టకటకా చెప్పుకెళ్తున్నాడు గార్డు.

"వెంటనే మిమ్మల్ని కాంటాక్ట్ చేయాలనుకున్నాను సార్. కానీ, మీ ఫోన్ నెంబర్ నా దగ్గర లేదాయే..." అన్నాడు.

"అగ్ని ప్రమాదమా? ఎప్పుడు జరిగింది?" అడిగాడు వినోద్‌నాయక్.

"తెల్లవారుజామున సార్. ఉరుములు, పిడుగులు పడి పెద్ద వాన వచ్చింది. అప్పుడు ఒక పిడుగు సరాసరి మీ పెంట్‌హౌస్ మీద పడింది. షార్ట్ సర్క్యూట్ అయి మంటలు అంటుకున్నాయి" చెప్పాడు గార్డు.

"మై గాడ్. ఇప్పుడు నా ఫ్లాట్ పరిస్థితి ఏమిటి?" తనుకూడా గొంతులో ఆందోళనపలికిస్తూ అన్నాడు.

"ఫైర్ డిపార్ట్‌మెంట్‌వాళ్ళు వచ్చి మంటలు ఆర్పారు సార్. కానీ మీ సామాను ఒక్కటి కూడా మిగల్లేదు. అన్నీ కాలిపోయాయి"

న్యూక్లియర్ బాంబ్ సంగతి ఎలా అడగాలో వినోద్ నాయక్‌కి అర్థం కాలేదు.

"మొత్తం కాలిపోయాయా?"

"అవును సార్. టెస్టులు చేయుటానికని, కొంత సామాను ఫైర్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు పట్టుకెళ్ళారు"

గుండె ఆగినట్లయింది వినోద్ నాయక్‌కి.

ఫైర్ డిపార్ట్‌మెంట్ వాళ్ళకి బాంబ్ సంగతి ఇప్పుడు తెలియకపోయినా కాసేపటి తరువాతైనా తెలుస్తుంది. ఇక తను ఢిల్లీ వెళ్ళటం ప్రమాదకరమని అర్థమయింది.

కానీ ఆ సంగతి గార్డుకు తెలియకూడదు కాబట్టి, "నేను రెండు రోజుల్లో వస్తాను. అన్ని విషయాలూ అప్పుడు చూస్తాను... ప్రస్తుతానికి నేను చేయగలిగింది మాత్రం ఏముంది?" అన్నాడు.

"సరే సార్. కానీ ఒకాయన పోలీస్ డిపార్ట్‌మెంట్ నుండి వచ్చి మీ వివరాలు అడిగారు సార్. మీ ఫ్లాట్ కూడా వెతికారు. మీ ఫోటో ఉందా అని అడిగారు"

అంటే బాంబ్ సంగతి పోలీసులకు తెలిసిపోయిందా? మరి ఏ వార్తల్లోనూ ఎందుకు చెప్పటంలేదు? ఇంత త్వరగా పోలీసులు తన ఫ్లాట్‌దాకా వచ్చారంటే తను తీవ్రమయిన ప్రమాదంలో ఉన్నానని అతనికే అర్థమయింది.

కాకపోతే తను ముందే, తన ఫోటో ఎవరికీ దొరకకుండా జాగ్రత్తపడటం మంచిదయింది. ఆలోచనల్లో నుండి బయటపడి, "నా ఫోటో అడిగారా?" అన్నాడు.

"అవున్సార్. కానీ రిజిస్టర్లో ఉండవలసిన మీ ఫోటో లేదు సార్. అందుకని నేను ఇవ్వలేదు"

నవ్వుకున్నాడు వినోద్ నాయక్. కానీ అతని మొహం మీద నవ్వు ఎక్కువసేపు నిలవలేదు. "కానీ... మీ ఫోటో ఒకటి 302లో ఆయన ఫోన్‌లో ఉంది సార్. అది తీసుకున్నారు" చెప్పాడు గార్డ్.

"షిట్..." అంటూ ఫోన్ పెట్టేశాడు వినోద్ నాయక్. అతను ఇంకాసేపు మాట్లాడిఉంటే, వచ్చిన వ్యక్తి తన క్రెడిట్ కార్డ్ బిల్ తీసుకువెళ్ళాడని కూడా తెలిసేది. అతనికి తను పూర్తిగా ఇరుక్కుపోయానని అర్థం

పుట్టగంటి గోపీకృష్ణ

జరిగిన కథ (4)


రిటైర్డ్ జనరల్ మరియు నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ ధర్మేంద్రను ఢిల్లీలో ఆయన పిలుపుతో వెళ్ళికలుస్తాడు అవినాష్. రెండేళ్ళ క్రితం జరిగిన సంఘటన ధర్మేంద్రకు చెబుతుంటాడు. అప్పట్లో ఇంఫాల్‌లో వుండే ఇండియన్ ఫోర్స్ యూనిట్‌కి అధికారి అవినాష్.

గుజరాత్‌లో బాంబుపేలుళ్ళకు పాల్పడిన ఉగ్రవాదుల బృందం, వారి లీడర్ ఖలీఫాతో పాటు మోరే దగ్గర మయన్మార్ సరిహద్దులు దాటబోతున్నారని ఇంటెలిజెన్స్ రిపోర్ట్ వచ్చేసరికి వారిని వేటాడతాడు అవినాష్.

అక్కడున్న లోకల్ ఎమ్ఎల్ఏ, ఉగ్రవాది ఖలీఫా పారిపోవడానికి సాయపడుతుండగా మొత్తం అందర్నీ కాల్చేస్తాడు. దాంతో తమ ఆర్డర్స్ లక్ష్యపెట్టలేదని కమాండో అధికారిగా వున్నతనని ట్రాన్స్‌ఫర్‌చేస్తారు పైఅధికారులు.

జరిగిన సంఘటనను ధర్మేంద్ర దృష్టికి తీసుకువస్తాడతను. కొన్నివందలమందిని చంపడానికిఅడ్డంవస్తున్నాడని ఓ ఎమ్.ఎల్.ఎ.ని చంపావు. ఇప్పుడు కొన్ని లక్షలమందిని న్యూక్లియర్ బాంబుతో చంపబోయిన ఉగ్రవాదులను నీవు చంపాలంటూ ఓ ఎస్సైన్‌మెంట్‌ని అవినాష్‌కి అప్పగిస్తాడు ధర్మేంద్ర.

న్యూక్లియర్ బాంబ్ పేల్చబోయిన దుర్మార్గులను ఎలిమినేషన్ చేయి, RAW డైరెక్టర్‌తో నేమాట్లాడతానని చెప్పేసరికి అర్జెంటుగారంగంలోకి దిగుతాడు అవినాష్. అనుమానితులలో వినోద్‌నాయక్‌కోసం సెర్చింగ్ మొదలెడతాడు అవినాష్.వినోద్‌నాయక్ మనాలీలోని ఓ రిసార్ట్ లాబీలో వుంటాడు. ఇక చదవండి.



సీరియల్

అయింది. పోలీసులు తనను వెతుకుతున్నా రన్నది నూటికి నూరుశాతం నిజం.

కానీ వారికి తన అసలు పేరు తెలియదు. తను ఎక్కడ ఉన్నాడో తెలియదు. వారికి తెలిసిందల్లా తన ఫోటో మాత్రమే. ఆ ఫోటో పట్టుకుని ఇంత పెద్ద దేశంలో తనను వెతకగలరా?

కానీ ఇప్పుడు ఈ ఫోన్ చేసి తను మరో పొరపాటు చేశాడు. వాళ్ళుకనుక మరోసారి గార్డు దగ్గరకు వెళ్తే, ఈ ఫోన్ కాల్ గురించి చెప్తాడు. తను మనాలీలోని హోటల్ నుండి ఫోన్ చేసినట్లు తెలిసిపోతుంది. కాబట్టి అర్జంటుగా ఈ హోటలే కాదు ఈ ఊరినే వదిలి వెళ్ళాలి. ఆ మాట అనుకోగానే, లేచి నిలబడ్డాడతను. అతని కడుపులోకి చేరిన స్కాచ్ అతన్ని తిన్నగా నడవనివ్వటంలేదు.

అలానే తూలుతూ తన రూమ్ వైపు నడిచాడతను. రూము తలుపు తెరచి కీని హోల్డర్‌లో పెట్టాడు. రూమంతా లైట్లు వెలిగాయి.

అలానే లోపలకు నడిచి తన బ్యాగ్ కోసంచూశాడు. అది తెరచి ఉంది. తను కిందకు వెళ్ళేటప్పుడుదానిని క్లోజ్ చేసి వెళ్ళిన గుర్తు ఉంది. మరి దీన్ని ఎవరు తెరిచారు? అతని ప్రశ్నకు జవాబుగా అన్నట్లు "దాన్ని నేనే తెరిచాను..." అన్న మాటలు వినిపించాయి.

గిరుక్కున వెనక్కి తిరిగి చూశాడు. అప్పటిదాకా అతను గమనించలేదు గానీ రూము మరోమూల ఉన్న ఒక చైర్లో ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. "హేయ్! ఎవర్నువ్వు. నేను సెక్యూరిటీని పిలుస్తాను" అంటూ డోర్ వైపు నడవబోయాడు వినోద్ నాయక్.

"అప్పుడు నేను పోలీసుల్ని పిలుస్తాను. నీకు ఇష్టమేనా?" అంటూ, లేచి నిలబడ్డాడు అవినాష్. పోలీస్ అనేమాట వినగానే నోటమాటరానట్లు నిలబడిపోయాడు వినోద్ నాయక్.

అవినాష్ ఢిల్లీ నుండి ఈ హోటల్ రూమ్ వరకు చేసిన ప్రయాణం, పెద్దగా కష్టపడకుండానే జరిగింది. అతను ఢిల్లీలో వినోద్ నాయక్‌కి వచ్చిన క్రెడిట్ కార్డ్ బిల్లు పట్టుకుని సంబంధిత బ్యాంకుకు వెళ్ళి అధికార ఐడీ చూపించాడు.

పదినిమిషాల్లో వినోద్ నాయక్ బుక్ చేసుకున్న హోటల్ వివరాలు బ్యాంకు ద్వారా తెలిశాయి. అక్కడ నుండి సరాసరి విమానంలో కులు చేరుకున్నాడు. అక్కడ నుండి గంటన్నరలో మనాలీ చేరాడు. అక్కడ వినోద్ నాయక్ ఉన్న హోటల్ ఏదో తెలుసు కాబట్టి అక్కడకు చేరుకున్నాడు.

ఎవరినీ అడగకముందే, అక్కడ లాబీలో కూర్చుని ఉన్న వినోద్ నాయక్ కనిపించాడు.

302 పెద్దాయన ఇచ్చిన ఫోటో ఉండటంతో అతన్ని గుర్తించటం పెద్ద కష్టం కాలేదు. అయితే అతనితో మాట్లాడేముందు అతని రూము తలుపు, దొంగతాళం చెవితో తెరచి లోపలకు వెళ్ళాడు.

అక్కడ అతని సామానంతా వెతికినా పనికివచ్చే సమాచారం లభించలేదు. దానితో వినోద్ నాయక్ ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తూ, అక్కడే



నిర్ణయాలు మార్చుకోను

పదేళ్ళకుపైగా పరిశ్రమలో జోరు తగ్గకుండా కెరీర్ కొనసాగిస్తున్న కాజల్ అగర్వాల్ ఫలితాలపట్ల ఆశలు, అంచనాలతో తానెప్పుడూ నిర్ణయాలు మార్చుకోలేనని చెప్తున్నది.

"సినిమాల ఎంపిక సమయంలో చాలా సంఘర్షణకు గురవుతుంటా. నా సినీ అనుభవం దృష్ట్యా కాజల్ ఈసారి ఎటువంటి కథ ఎంచుకుంటుందో అని నా అభిమానులు అంచనాలు వేస్తుంటాను. కాబట్టి నేను చాలా జాగ్రత్తగా వుండాలి కదా. అదృష్టవశాత్తూ మొదటినుంచీ కథల విషయంలో, ఎంపిక విధానంలో నాకంటూ కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. వాటికి అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటున్నాను తప్ప మార్చుకోవడంలేదు. ఫలితాల గురించో, ఇతరత్రానో ఆలోచిస్తూ నా నిర్ణయాలను మార్చుకోలేదు, మార్చుకోను" అని చెప్పింది కాజల్.

కూర్చుని ఉన్నాడు అవినాష్. "నా రూమ్‌లోకి వచ్చి, నన్నే బెదిరిస్తావా?" మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ అన్నాడు వినోద్‌నాయక్.

"నిన్ను బెదిరిస్తామని నేను చెప్పలేదే..." అతని దగ్గరకు వస్తూ అన్నాడు అవినాష్.

"అయినా అంత భయపడేవాళ్ళు చేయాల్సిన పనా నువ్వుచేసింది?"

"నేనేం చేశాను...?" నిలబడటానికి కాళ్ళలో శక్తి లేనట్లు మంచం మీద కూలబడుతూ అన్నాడు, వినోద్ నాయక్.

"ఏం చేశావో నీకు తెలుసు. నాకు తెలుసు. ఇప్పుడు తెలియాల్సిందల్లా ఎవరు చెయ్యమంటే చేశావన్నదే" అప్పటిదాకా ఉన్న ధైర్యం సడలిపోవటంతో పెద్దగా ఏడవసాగాడు వినోద్ నాయక్.

అతన్ని డిస్టర్బ్ చేయకుండా నాలుగు నిమిషాలు ఆగాడు అవినాష్. అతని ఏడుపుకాస్త తగ్గిందనుకున్నాక "చెప్పు. నీచేత ఇదంతా ఎవరు చేయించారు?" అని అడిగాడు.

"తెలియదు. వాళ్ళు ఎప్పుడూ నన్ను కలవలేదు" వెక్కుతూ అన్నాడు.

"ఇష్టం లేకపోతే ఎందుకు చేశావ్?"

"నేను ఇష్టపడి ఈ పని చేయలేదు. నా చేత బలవంతంగా చేయించారు"

"ఏం జరిగిందో వివరంగా చెప్పు"

"ముందు నువ్వెవరో చెప్పు. పోలీసువా?"

"కాదు"

"మరినీకు ఈ విషయంలో ఆసక్తి ఎందుకు?"

"నాకు ఏవిషయం మీద ఆసక్తి ఉండాలో, ఏ విషయంమీద ఆసక్తి ఉండకూడదో నువ్వెలా నిర్ణయిస్తావ్? ముందు నీ వివరాలు చెప్పు"

"నేను కెమికల్ ఇంజనీరింగ్ చదివాను. మొదటినుండి నాకు పేలుడు పదార్థాలంటే ఎట్రాక్షన్. బజార్లో దొరికే మామూలు వస్తువులతో పేలుడు పదార్థాలు ఎలా చేయవచ్చో పూర్తి వివరాలు ఇంటర్‌నెట్లో దొరికేవి. వాటిని చదివేకొద్దీ ఆ పరిజ్ఞానాన్ని పరీక్షించి చూడాలన్న కోరిక పెరిగిపోయింది. కానీ అది చట్టవిరుద్ధమని నాకు తెలుసు.

అందుకే రహస్యంగా నా పరిశోధనలు చేసుకునేవాడిని. ఆ పేలుడుపదార్థాలు పనిచేస్తున్నాయో లేదో పరిశీలించడానికి ఊరి బయటకు తీసుకువెళ్ళి వాటిని పేల్చి చూసుకునేవాడిని.

ఒకసారి రద్దీగా ఉన్న ఢిల్లీ మార్కెట్లో బాంబ్ పేలి నలుగురు చనిపోయారు. దానికీ, నాకూ ఏ సంబంధమూ లేదు. అందరూ చదివినట్లే నేను కూడా ఆ విషయాన్ని పేపర్లో చదివాను. వెంటనే ఆ విషయాన్ని మరచిపోయాను కూడా.

రెండు రోజుల తరువాత నాకు పోస్టులో ఒక కవర్ వచ్చింది. అందులో ఒక డి.వి.డి. ఉంది. ప్లే చేసి చూశాను. పేలుడుపదార్థాలకి సంబంధించి నేను నెట్లో సెర్చ్ చేసిన విషయాలు, పేలుడు పదార్థాలు చేయటానికి బజార్లో నేను వస్తువులు కొనటం, ఊరిబయట అవి పేలుతున్నాయో లేదో పరీక్షించటం... అన్నీ రికార్డ్ చేసి ఉన్నాయి.

అవన్నీ వాళ్ళు ఎప్పుడు ఎలా రికార్డ్ చేశారోనాకు తెలియదు. అంతేకాదు... ఢిల్లీలో జరిగిన పేలుడుకు, నాకు సంబంధం అంటకడుతూ కొన్ని రుజువులు కూడా అందులో ఉన్నాయి.

అవన్నీ వాళ్ళు ఎలా క్రియేట్ చేయగలిగారో నాకు అర్థం కాలేదు. కానీ, వాటిని చూసిన ఎవ్వరికయినా నిజంగా ఆ బాంబుపేలుడుకు సూత్రధారిని నేనే అని అనిపించక మానదు.

అవన్నీ చూసి నేను బెదిరిపోయాను. చేయని నేరం నుండి తప్పించుకోవటానికి వాళ్ళు ఏం చెప్తే అది చేయటానికి సిద్ధమయ్యాను. అయితే ఆశ్చర్యకరంగా వారు నన్ను ఏమీ బాధించలేదు.

అసలు నన్ను కలవలేదు. అన్నీ ఫోనుల ద్వారానే జరిగాయి. వాళ్ళు నాకు కావలసిందల్లా సమకూర్చారు. ఒక పెంట్‌హౌస్ కొనిచ్చారు. వాళ్ళడిగిందల్లా ఒకటే నా హాబీని కొనసాగించమని. కాకపోతే దాని స్థాయిని పెంచారు. న్యూక్లియర్ బాంబ్ ఎలా చేయాలో అనుభవం గడించమన్నారు.

ఒకసారి నాకు థియరిటికల్ నాలెడ్జ్ వచ్చాక, అది చేయటానికి కావలసిన వస్తువులన్నీ నాకు సమకూరుస్తామని చెప్పారు.

వారి మాట కాదంటే ఒక టెర్రరిస్టుగా ముద్రవేసి ఎన్‌కౌంటర్ చేయిస్తామన్నారు"

"అందుకని నువ్వు నిజంగా టెర్రరిస్టుగా మారిపోయావన్నమాట"

"నాకు ఇంకో మార్గం కనిపించలేదు"

"నువ్వు చేయబోయిన పని అదృష్టంకొద్దీ ఆగింది. అదే జరిగిఉంటే ఎన్ని లక్షల మంది చనిపోయేవారో నీకు ఎప్పుడూ అర్థమవలేదా?"

"వాళ్ళు నిజంగా న్యూక్లియర్ బాంబ్ పేలుస్తారని

అనుకోలేదు. బాంబుకు కావలసిన పరికరాలు నాకు చేరటానికి ఇరవై నాలుగు గంటల ముందు కూడా ఆ విషయం నాకు తెలియదు"

"పోనీ తెలిశాక అయినా వారికి సహకరించకుండా ఉండవలసింది" వినోద్ నాయక్ చెప్పటానికి సమాధానం లేక తలవంచుకున్నాడు. 'తోటి మనిషి ప్రాణాలంటే విలువలేని ఇతనికి మానవసమాజంలో బ్రతికే హక్కులేదు' అనుకున్నాడు అవినాష్.

"దయచేసి నన్ను వదిలెయ్యి. నా దారిన నేను పోతాను. ఇక జీవితంలో ఎవరికీ హాని చెయ్యను" బ్రతిమలాడుతున్నట్లు అన్నాడు వినోద్ నాయక్.

ఎదుటిమనిషిని, అక్కడకక్కడే చంపాలన్న కోరికను అణచుకోవటానికి శ్రమపడవలసి వచ్చింది అవినాష్‌కి.

తన ఒక్కడిప్రాణం కోసం ఇంత లబలబలాడుతున్న వ్యక్తి, లక్షలాది ఎదుటి వ్యక్తుల ప్రాణాలను తృణప్రాయంగా చూడటం, అతనికి ఎదుటిమనుషుల ప్రాణాలంటే ఎంత చులకనో చెప్తోంది.

కానీ, కోపాన్ని అణుచుకోవాలి. మిగిలిన అయిదుగురి ఆచూకీ తెలుసుకోవలసిన బాధ్యత కూడా తన మీద ఉంది. అందుకే మాటలు కొనసాగిస్తూ "నీ మాటల్లో నిజాయితీ నిరూపించుకోవటానికి నీకు ఒక అవకాశం ఇస్తాను..." అన్నాడు.

"ఏమిటి?" ఆశగా చూస్తూ అడిగాడు.

"నీతో పాటు ఈ ప్రాజెక్టులో ఎంతమంది పని చేశారు?" అడిగాడు అవినాష్.

"అయిదుగురు"

"వారి వివరాలు చెప్పు. నిన్ను నేనే స్వయంగా ఇక్కడ నుండి తప్పిస్తాను"

"సారీ! వారి వివరాలు నాకు తెలియదు"

"అయితే నేను నీకు సహాయం చెయ్యలేను. ఇప్పుడే పోలీసులను పిలుస్తాను" ఫోన్ మీదకు చేయి పోనిస్తూ అన్నాడు అవినాష్.

"వద్దు, వద్దు..." బ్రతిమలాడుతున్నట్లు అన్నాడు వినోద్ నాయక్. "నా మాటలు నమ్ము. ఆ అయిదుగురు ఎవరో, ఎక్కడనుండి వచ్చారో నాకు అసలు తెలియదు. మేమెవరమూ ఒకరితో ఒకరు మాట్లాడకూడదని కండిషన్ పెట్టారు. ఒకరి వివరాలు ఒకరు తెలుసుకోవద్దన్నారు. అందుకే, మేము ఎవరమూ ఒకరి వివరాలు ఒకరు తెలుసుకోలేదు.."

"మీరుకలిసి కొన్నిగంటలున్నారు. అసలుమాట్లాడకుండా లేరు. అన్నిమాటల్లో, ఎవరోఒకరు ఏదోఒక క్లూ వదలకుండా ఉండరు. నువ్వు చేయవలసిందల్లా అది గుర్తుచేసుకోవటమే..."

"నాకేమీ గుర్తురావటంలేదు.." తలను రెండుచేతుల మధ్య పెట్టుకుంటూఅన్నాడు వినోద్‌నాయక్.

"నీకు ఆ విషయాలు గుర్తు రావటంమీద నీ ప్రాణాలు ఉండటమో, పోవటమో డిసైడవుతుందంటే గుర్తువస్తుందేమో ప్రయత్నించు"



నా ప్రపంచం

'పెళ్ళిచూపులు' పిల్ల రీతూవర్మ వ్యక్తిగతాన్ని కదిలిస్తే అంతులేనన్ని కబుర్లు చెప్పింది.

"కుటుంబం, స్నేహితులు, సినిమా ఇవే నా ప్రపంచం. నేను తిండి బాగా తినేస్తుంటా. దాన్ని కరిగించుకునేందుకు జిమ్‌లో కసరత్తులూ చేస్తుంటాననుకోండి. సౌకర్యంగా ఉండే వస్త్రధారణే నా ఫ్యాషన్‌ట్రెండ్. ఖాళీ దొరికినప్పుడు వంటగదిలోకి దూరిపోయి ప్రయోగాలు చేస్తుంటాను.

వ్యక్తిగతంగా వెరీ సింపుల్. తమిళంలో ఆసక్తికరమైన కథల్లో నటించే అవకాశాలు వస్తున్నాయి కాబట్టి అక్కడి చిత్రాలు ఎక్కువగా చేస్తున్నాను. తెలుగు కథలూ వింటున్నా" అంటున్నది.

"అంటే నన్ను చంపుతావా?"

"నాకు మిగిలినవారి వివరాలు కావాలి. వాటి కోసం ఏమయినా చేస్తాను"

అవినాష్ మాటలు వింటే వినోద్ నాయక్ వెన్నులో నుండి వణుకు వచ్చింది. ముఖ్యంగా 'ఏమయినా చేస్తాను' అని ఏ ఎమోషనూ లేకుండా చెప్తున్న అవినాష్ మాటలు వింటుంటే, అతను అన్నంత పనీ చేస్తాడనటంలో ఎలాంటి సందేహమూ కలగటంలేదు.

"నన్ను ఆలోచించుకోనివ్వు..."

"నీ ఇష్టమొచ్చినంత సమయం తీసుకో. కానీ మూడు నిముషాలు మించకూడదు" వాచీ చూస్తూ అన్నాడు అవినాష్. అతని మాటల్లోని వ్యంగ్యాన్ని పట్టించుకోకుండా, కళ్ళు మూసుకుని ఆలోచనలను కేంద్రీకరించటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, దానికి ముందు, తరువాత... తమ మధ్య జరిగిన సంభాషణలను రివైండ్ చేసుకుంటున్నాడు.

మూడు నిమిషాలకు ముందే, "ఒక చిన్న విషయం గుర్తుకువస్తోంది..." అన్నాడు.

"ఏమిటది?"

"వాళ్ళలో ఒకతను రియల్‌ఎస్టేట్ వ్యాపారి"

"ఎలా చెప్పగలవు?"

"అతను నా పెంట్‌హౌస్‌కు వచ్చిన దగ్గర నుండి అవే విషయాలు మాట్లాడాడు. ఇక్కడ ఫ్లాట్ల రేట్లు ఎలా ఉన్నాయో అడిగాడు.

కన్‌స్ట్రక్షన్ యాక్టివిటీలో ఉన్న ప్రాబ్లమ్స్ చెప్పుకొచ్చాడు. నేను ఫ్లాట్ రేటుచెప్తే దేశ రాజధాని కాబట్టి ఇక్కడ రేట్లు ఇంకా ఎక్కువ ఉంటాయనుకున్నానన్నాడు. దీని కంటే తమ ఏరియాలో రేట్లు ఎక్కువ ఉన్నాయన్నాడు"

"నువ్వు చెప్పే విషయాల వలన అతను ఎక్కడ నుండి వచ్చాడో ఎలా తెలుస్తుంది?" అడిగాడు అవినాష్.

"తెలుస్తుంది. అతనున్న ఏరియాలో రియల్ ఎస్టేట్ రేట్లు, ఢిల్లీ కంటే ఎక్కువ ఉండేవనీ, స్టేట్ డివైడయ్యాక డిమాండ్ కొద్దిగా తగ్గిందనీ, ఇప్పుడు మళ్ళీ పుంజుకుంటుందనీ... చెప్పాడు"

"ఐ.సీ..." ఆలోచనగా అన్నాడు అవినాష్. అతని మనసులో ఆ సిటీ ఏదోఒక చిన్న ఐడియావచ్చింది.

"అతను వేస్తున్న వెంచర్‌కి ఒక పక్క మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మరో పక్క ఐనాక్స్ థియేటర్స్ ఉన్నాయని చెప్పాడు. అక్కడ రెండు సార్లు బోరు వేస్తే నీళ్ళుపడలేదనీ, మూడోసారి పడ్డాయనీ చెప్పాడు"

"స్టిల్... ఇవన్నీ సగం వివరాలే. కనీసం అతని పేరు కూడా చెప్ప లేదు నువ్వు"

"అతని పేరు తెలియదు. కానీ, అతని బుగ్గమీద నల్లటి మచ్చ ఉంటుంది. చాలా దూరం నుండి కూడా అతని మొహం మీద ఉన్న ఆ మచ్చ, కొట్టొచ్చినట్లు కనపడుతుంటుంది"



ఎక్కడైతే ముఖాముఖీ పోటీ జరుగుతుందో అక్కడ బి.జె.పి. ఓడిపోతుంది. -మమతా బెనర్జీ, బెంగాల్ సి.ఎమ్.

"ఇంకా వేరే వారి వివరాలు చెప్పు"

"నాకు ఇంతకంటే ఏమీ గుర్తురావటం లేదు"

ఆ తరువాత అతన్ని ఎంత రెట్టించినా, పెద్దగా వివరాలేమీ బయటపడలేదు.

"సరే! పద వెళ్దాం..." అన్నాడు అవినాష్.

"ఎక్కడకి"

"ఇక్కడే ఉంటే మరికాసేపట్లో పోలీసులు వస్తారు. ముందు హోటల్ ఖాళీ చేసి బయటకు నడువు" అన్నాడు అవినాష్.

"హడావుడిలో హోటల్ ఖాళీచెయ్యటం అవసరమా? ఇలానే వెళ్ళిపోతే ఎవరు పట్టించుకుంటారు?" అని అన్నాడు వినోద్‌నాయక్.

"అవసరమే! బిల్లు నువ్వు ముందే కట్టినా ఖాళీ చెయ్యకుండా మాయమయితే, అనవసరంగా హోటల్ వాళ్ళ దృష్టిలో పడతావు.

పోలీసులకు వాళ్ళే చెప్పవచ్చు. కాబట్టిసామాను సర్ది, హోటల్ వెకేట్ చెయ్యి"

చకచకా సామాను బ్యాగులో కుక్కి హోటల్ రిసెప్షన్ దగ్గరకు వచ్చాడు వినోద్ నాయక్.

"ఈ టైములో డ్రైవ్ చేయటం సేఫ్ కాదు సర్" తాగి ఉన్న అతని స్థితి చూసి చెప్పాడు హోటల్ మేనేజర్.

"డోంట్ వర్రీ" బ్యాగు తీసుకుని బయటకు వచ్చాడు అతను.

వినోద్ నాయక్ హోటల్ బయటకు వచ్చేటప్పటికి అతని కారు రెడీగా ఎంట్రన్స్ దగ్గర ఉంచారు హోటల్‌సిబ్బంది. "ఈ పరిస్థితుల్లో నువ్వు డ్రైవ్‌చేస్తే ప్రమాదం. నేను డ్రైవ్ చేస్తాను..." అంటూ వచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు అవినాష్.

"ఎక్కడకు తీసుకువెళ్తున్నావ్?" అంటూ అతని పక్కన కూర్చున్నాడు వినోద్ నాయక్.

"ముందు కులు వెళ్దాం. తరువాత ఎక్కడకు వెళ్ళాలో అప్పుడు ఆలోచిద్దాం..." కారును ముందుకు పోనిస్తూ అన్నాడు అవినాష్.

కారు కులూ దారి పట్టింది. భయంకరమయిన మలుపులు ఉండే ఘాట్ రోడ్డు అది. కారు పావుగంట ప్రయాణించిందో లేదో... తీసుకున్న మందు ప్రభావంతో వినోద్ నాయక్ నిద్రలోకి జారిపోయాడు.నిట్టనిలువుగా ఉన్న లోయ అంచు దగ్గర కారు ఆపి కిందకు దిగాడు అవినాష్.

శబ్దం రాకుండా కారు డోర్ వేసి, కారు వెనక్కి నడిచి దాన్ని నెమ్మదిగా తోశాడు. హ్యాండ్ బ్రేక్ వేయని కారు పల్లంలోకి జారింది.

వంద అడుగులు కూడా ప్రయాణం చేయకముందే చక్రాల కింద నేల ముగిసిపోవటంతో కారు కింద లోయలోకి జారింది.

ఒకటి, రెండు, మూడు పల్టీలు కొట్టటం వరకు లెక్కపెట్టాడు అవినాష్. ఆ తరువాత అది ఎన్ని పల్టీలు కొట్టిందో చీకట్లో కనపడలేదు.

కొద్దిసేపటి తరువాత లోయలో కింద ఎక్కడో కారు నేలని తాకిన శబ్దం వినిపించింది. మరికొన్ని సెకండ్ల తరువాత భగ్గుమంటూ అంటుకున్న అగ్ని కీలలు కారును అలుముకున్నాయి.

తను చేసిన పనికి ఏమాత్రం విచారం కలగలేదు అవినాష్‌కి. ఏ మాత్రం మానవత్వం లేకుండా లక్షల మందిని చంపబోయిన అతనికి ఈ భూమ్మీదజీవించే హక్కులేదని అతను మనస్ఫూర్తిగా నమ్మాడు.

ఆ లోయ దగ్గర చెట్లచాటున ముందే దాచి వుంచిన ఒక బైకు బయటకు తీసి దాన్ని ముందుకు దూకించాడు అవినాష్.

ఇంకా ఉంది

సవాళ్ళు స్వీకరిస్తా

అవకాశాలు రావడమే అన్నింటికన్నా గొప్ప విషయం కాబట్టి వచ్చిన మంచిఅవకాశాలను సద్వినియోగం చేసుకుంటాననంటున్నది రాశీఖన్నా.

"ప్రేక్షకులు మెచ్చే మంచిపాత్రలతోపాటు డ్యాన్సులు, పాటలుకూడా కీలక అంశాలే.

అందుకే అన్నింటా ప్రతిభ చూపేందుకు నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటాను.

నిజానికి, ఇప్పటి పరిస్థితుల్లో మంచి అవకాశం రావడం అన్నది అతిపెద్ద విషయం. వాటికి న్యాయం చేయాలి. అందుకే ఎటువంటి సవాళ్ళను అయినా స్వీకరించడానికి నేనెప్పుడూ సిద్ధంగానే వుంటాను" అని ఫ్రాంక్‌గా చెప్పింది రాశీఖన్నా.



జాక్వెలిన్ ఫెర్నాండెజ్

శ్రీలంకబ్యూటీ జాక్వెలిన్‌ఫెర్నాండెజ్ తనఅందాల రహస్యాలను, తాను మెచ్చే స్టయిల్‌ను తన ఇష్టాలను ఇలా వివరించింది.

▸ **ఆహార పానీయాలు :** నేను రోజంతా చాలినంత నీరు, గ్రీన్‌టీ తాగుతుంటా. ఏవి తిన్నా పోషకాలుండే విధంగా జాగ్రత్త పడుతుంటా. అవి ఆరోగ్యప్రదంగా వుండాలి. ఇవన్నీ నా అందాన్ని పరిరక్షిస్తుంటాయి

▸ **చర్మ పరిరక్షణ :** క్లెన్సింగ్, టోనింగ్, మాయిశ్చరైజింగ్ ప్రక్రియను పడుకోవడానికి ముందు చేపడుతుంటా.చర్మాన్ని మాయిశ్చరైజ్ చేసుకోవడానికి బాడీ షాప్ వంటి బ్రాండ్స్ ఉపయోగిస్తా

▸ ***శిరోజాల రక్షణకోసం:*** ప్రతిరోజూ నూనె పెట్టుకుంటాను. కాని, నిరంతర షెడ్యూల్‌వల్ల కొన్నిసార్లు ఆయిలింగ్ కోసం సమయాన్ని కేటాయించలేక పోతుంటా. అందువల్ల నా శిరోజాలు అందంగా కనపడడంకోసం ట్రెసెమ్మెఉత్పత్తుల్ని ఉపయోగిస్తా

▸ **మేకప్ మెళుకువలు :** లిప్‌గ్లాస్ లేకుండా నేను అస్సలు ఉండలేను. నా మేకప్ బాక్స్‌లో ఇది తప్పకుండా ఉంటుంది. బాడీషాప్ ఉత్పత్తులు కూడా అనేకం నా బాక్స్‌లో ఉంటాయి

▸ **ఎక్కువగా హైలెట్ చేసుకునేది :** మేకప్ చేసుకునే సమయంలో నా పెదవులపై ఎక్కువగా ఫోకస్ చేస్తుంటా

▸ **డైట్ జాగ్రత్తలు :** ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తాను. డైలీ డైట్‌లో సలాడ్లు, ఆరోగ్యపూరిత జ్యూస్‌లు, సూప్‌లు వుంటాయి

▸ **తినకుండా ఉండలేనివి :** బ్రౌనీలు

▸ **వ్యాయామ తీరుతెన్నులు :** యోగా, పోల్ ఎక్సర్‌సైజులు, కార్డియో, డ్యాన్స్ చేస్తుంటా

▸ **స్టయిల్ స్టేట్‌మెంట్ :** సెక్సీ


▸ **నచ్చే డిజైనర్లు :** క్రిస్టియన్ డయర్, అనైత ష్రాఫ్ అదజానియా, స్టెఫనా రోలాండ్, లీజీన్స్ చాలా సౌకర్యంగా వుంటాయి. నా శారీరక పోశ్చర్‌కు ఇవి బాగా సూటవుతాయి

▸ **నచ్చే షూ :** నాకు బాగా ఇష్టమైన షూ బ్రాండ్స్ ప్యూమా, సోఫియా వెబ్‌స్టర్

▸ **ఇష్టపడే పరిమళాలు :** బాడీషాప్ పర్‌ఫ్యూమ్స్ నాకు బాగా ఇష్టం

▸ **ఇష్టపడే బ్యాగ్‌లు :** ఆండ్ర్యు జివెన్, గుస్సి

▸ **నా స్టయిల్ ఐకాన్లు :** బాలీవుడ్‌లో సోనమ్‌కపూర్, కంగనా రనౌత్, దీపికా పడుకొనె, హాలీవుడ్ నటి గిగి హదీద్ నా స్టయిల్ ఐకాన్లు



Courtesy : SAVVY

వారఫలం

ఏప్రిల్ 12 నుండి 18, 2018 వరకు

పిడపర్తి వీరేశ్వరశాస్త్రి, పిడపర్తి భాస్కర సుబ్రహ్మణ్యశాస్త్రి
సెల్ : 94921 56064



మేషం

అశ్విని, భరణి, కృత్తిక 1వ పా. రోజులు సంతృప్తికరంగా సాగుతాయి. ఖర్చులను సమర్థించుకోగల్గుతారు.కుటుంబంలో ఉత్సాహాలుంటాయి.వృత్తి,ఉద్యోగ,వ్యాపారాలలో ఒత్తిడిలను సమర్థించుకోగలుగుతారు. ఆరోగ్యమందు మంచిమార్పులు ఏర్పడగలవు. నూతన వస్తువులను కొనుగోలు చేసుకోగలరు. సంతానపు అభివృద్ధి విషయంలో ఇతరులతో పోలికలకు దూరంగా ఉండాలి.బంధువర్గాన్ని మీ వ్యవహారాలకు దూరంగా ఉంచండి. గురు. శుక్ర, సోమ వారాలు అనువైనవి.



వృషభం

కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా. ఈవారంలో అప్రమత్తతలు అన్నిటా అవసరం. విమర్శలకు దూరంగాఉండండి. ఇతరులు సహకరించట్లేదను భావములను దరిచేరనీయకండి. ఖర్చులకు తగిన ఏర్పాట్లు అవసరమవుతాయి. చేపట్టుకొన్న పనులు మందకొడిగా సాగగలవు. ఏకపక్ష నిర్ణయములకు దూరంగా ఉండండి. బంధువర్గపు రాకపోకలు ఇబ్బందులను ఏర్పరచు సూచనలున్నాయి. ఈ రాశివారికి శని, ఆది, బుధ వారములు అనువైనవి.



మిథునం

మృగశిర 3, 4పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా. ముఖ్యమైన విషయాలను పట్టుదలలతో అనుకూలింపచేసుకుంటారు. వివాదాలను ఏర్పరచు విషయములందు సంయమనములు అవసరం. క్రయ,విక్రయములందు అనుభవజ్ఞుల సలహాలకు ప్రాధాన్యతనీయండి. సంతానానికి శుభాలను ఏర్పరచగల్గుతారు. వాహన,యంత్రాదుల వాడకంలోను, భాగస్వామి ఆరోగ్యవిషయాలలో మెలకువలు అవసరం, అనవసర ఖర్చులు చేయగలరు. శని, ఆది, సోమ వారాలు అనువైనవి.



కర్కాటకం

పునర్వసు 4వ పా, పుష్యమి, ఆశ్లేష.వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలను మీదైన తరహాలో చేపట్టుకోగలరు. మీరంటే ఒక గుర్తింపును ఏర్పరచుకోగల్గుతారు. ఆర్థికంగా బలపడడానికి ప్రయత్నాలు ముమ్మరంగా సాగించగలరు. స్థిరాస్తులపట్ల నూతన విద్యలపట్ల ఆసక్తి ఏర్పడతుంది. అనవసరమైన ఒత్తిడులు ఏర్పరచుకోకుండా తెలివిగా వ్యవహరించుకోవాలి. ఉన్నతవిద్యలకు అవకాశాలు ఏర్పడతాయి. గురు, శుక్ర వారాలలో అన్నిటా మెలకువలు అవసరం.



సింహం

మఖ, పూర్వఫల్గుని,ఉత్తరఫల్గుని 1వ పా. ఉన్నతమైన భావములతోను, మానసికమైన సంతృప్తితోను వ్యవహరించుకోగలరు. సహకరించువారు పెరుగుతారు. బంధుమిత్రవర్గం నుండి అసహనములు పొందగలరు. సంతానపు వ్యవహారములు కొన్ని చికాకులు గురిచేయగలవు. చేపట్టుకొన్న పనులు సంతృప్తికరంగా సాగుతాయి. ఆదాయములు బావుండి ఖర్చులకు తగిన ప్రయోజనములను ఏర్పరచుకోగలరు.ముఖ్యమైన వ్యవహారాలలో పెద్దల మార్గదర్శకములు పొందగలరు. ఈ రాశివారికి గురు, శుక్ర, బుధ వారాలు అనువైనవి.



కన్య

ఉత్తరఫల్గుని 2, 3, 4పా, హస్త, చిత్త 1, 2పా. ఈ వారంలో ఎదురుచూస్తున్న వ్యవహారాలు కొన్ని ప్రతికూలించుటచే చికాకుపొందు సూచనలున్నాయి. ఖర్చులు కొన్ని ఊహించనివి ఏర్పడుటచే సర్దుబాటులకు తగిన ఏర్పాట్లు ఉంటాయి. మీ వ్యవహారములను స్వయంగానే చూసుకోండి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో అధికారు లతో సంయమనములు అవసరం. ఆదిత్య ఆరాధనలు తప్పనిసరి చేయండి. గురు, శుక్ర, శని, ఆది వారములు అనువైనవి.



తుల

చిత్త 3, 4పా, స్వాతి, విశాఖ 1, 2, 3 పా.ముఖ్యమనుకొన్న పనులను పట్టుదలలతో పూర్తిచేసుకోగలరు. సంప్రదింపులను వేగవంతం చేస్తారు. తరచూ కోపావేశములకు, ఉద్రేకములకు గురికాగల సూచనలున్నాయి. ఖర్చులకు తగినట్లుగా ప్రయోజనములు ఏర్పరచలేకపోతారు. బంధువర్గం రాకపోకలు పెరుగుతాయి. మీ ప్రమేయంతో శుభకార్యనిశ్చయములు వంటివి ఉంటాయి. నూతన ఒప్పందములను కొన్నిటిని పూర్తిచేసుకొంటారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి. వీరికి శని, ఆది, సోమ వారాలు అనువైనవి.



వృశ్చికం

విశాఖ 4వ పా,అనూరాధ, జ్యేష్ఠ. మీ అవసరాలకు తగినట్లుగా ఆదాయములుంటాయి. ప్రణాళికాబద్ధంగా పనులను చేపట్టుకొని పూర్తిచేసుకోగలరు. కుటుంబమున మీ ప్రతిపాదనలకు గుర్తింపులేర్పడుటయేకాక అమలులో పెట్టగలరు. నూతన వస్తువుల కొనుగోలు వ్యవహారములందు స్వీయ ఆలోచనలకు ప్రాధాన్యతనీయండి. అనారోగ్యభావనలు తగ్గగలవు. నూతన విషయములను తెలుసుకోగలరు. మాట తొందరపాటుతనములేర్పడకుండా మెలకువలు అవసరం.వీరికి ఆది, సోమ, బుధ వారములు అనువైనవి.



ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పా. అహంభావములు ఆధిపత్య ధోరణిలు పనికిరావు. మిత్రుల వంటివారిచే సహకారములు, ఇచ్చిపుచ్చుకోవడాలు ఏర్పడతాయి. ఖర్చులు ఒకదానివెంట ఒకటి ఏర్పడినా సమర్థించుకోగలుగుతారు. చిన్నవనైనా నిశ్చితమైన మనస్సుతో యత్నించుకోవాలి. బంధుమిత్రుల కలయికలు ఉంటాయి. వస్తుజాగ్రత్తలు అవసరం. ఉద్యోగములందు సంయమనములు పాటించుకోవాలి. వివాహాది శుభకార్య నిశ్చయములు అనుకూలిస్తాయి. ఈ రాశివారికి గురు, శుక్ర, బుధ వారములు అనువైనవి.



మకరం

ఉత్తరాషాఢ 2, 3, 4పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2పా. మానసికంగా కొంత అలజడి ప్రభావములున్నా అన్నిటా ఆశాజనకముగా వ్యవహరించుకోగలరు. కుటుంబవ్యక్తుల సహకారములచే ముఖ్యమనుకొన్న పనులను పూర్తిచేసుకోగలరు. సంతానమునకు మేలుతనములేర్పరచగలరు. గౌరవములను ఆశించక కర్తవ్యములకు ప్రాధాన్యతనీయండి. డబ్బుకు ఇబ్బంది ఉండదు కాని ఖర్చులను నియంత్రించుకోవాలి. ఈ రాశివారికి శని, ఆది, సోమ వారములు అనువైనవి.



కుంభం

ధనిష్ఠ 3, 4పా, శతతార, పూర్వాభాద్ర 1,2, 3పా. ఆర్థికంగా హుషారునిచ్చు సంఘటనలు, అవకాశాలు ఏర్పడతాయి. చెల్లింపులను పూర్తిచేసుకోగలరు.ఆత్మీయులతో శుభకార్యాలను పూర్తిచేసుకోగలరు. పనులు అనుకొన్నట్లుగా వేగవంతం కాగలవు. దూరప్రయాణములను చేపట్టవలసిరావచ్చును.ఆరోగ్యం సంతృప్తికరము. బాధ్యతలను పెంచుకొంటారు. వ్యవహారాలను, ఒప్పందాలను చేపట్టి పూర్తిచేసుకోగలుగుతారు. నూతన పరిచయాలు, తద్రీత్య ప్రయోజనాలుంటాయి. వీరికి గురు, శుక్ర, సోమ వారాలు అనువైనవి.



మీనం

పూర్వాభాద్ర 4వ పా, ఉత్తరాభాద్ర, రేవతి. బంధుమిత్రుల రాకపోకలు, కుటుంబమున నూతన ఉత్సాహములు ఉంటాయి. ప్రయత్నకార్యములను అనుకూలింపచేసుకొంటారు. మానసిక సౌఖ్యాలను పొందగలరు. ప్రభుత్వతరహా పనులను పూర్తిచేసుకోగల్గుతారు. స్థిరాస్తులను ఏర్పరచుకోగలరు. నూతనమైన వ్యాపార వ్యవహారములను చేపట్టుకోగలరు.పెట్టుబడులందు పునరాలోచనలతో సాగండి. ఈ రాశివారికి శని, ఆది, బుధ వారములు అనువైనవి.

పనిలోనే ఆనందించేవానికి ఫలితంపైన ఆలోచన ఉండదు.

అనిల్

In the well-being of one's own nation is one's own well-being

మాట్లాడాలి

పెద్దవాళ్ళు పనులతో బిజీ అయిపోయి, పిల్లల చేతికి ఏ సెల్‌ఫోన్లో, వీడియోగేమ్‌లనో ఇచ్చేసి లేదా కార్టూన్ నెట్‌వర్కుల వంటివి పెట్టి టెలివిజన్ ముందు కూర్చోపెట్టి తమ పనులు ముగించేసుకుంటుంటారు.

ఇక వాళ్ళకు కథలు, కబుర్లు చెప్పే తీరిక ఉండదు, అవసరమూ లేదనుకుంటారు.

కాని, తల్లిదండ్రులు పిల్లలతో ఎంత ఎక్కువగా మాట్లాడితే, పిల్లల మెదడు ఎదుగుదల అంత బావుంటుందని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. పెద్దవాళ్ళు ఎంత ఎక్కువగా కబుర్లు చెప్తుంటే వారిలో ఎదిగేకొద్దీ ఉచ్చారణ, భాష, భావం అంతగా అవగతమవుతాయని నిపుణులు సిఫార్సుచేస్తున్నారు.



ఆహారం తినడం లేదా?

ఎన్ని రకాల పదార్థాలు తయారు చేసినా తిండి తినడానికి మారాంచేసే పిల్లలు చాలామంది తారసపడుతుంటారు. ఇలా ఆహారం తినకపోవడానికి అనేక కారణాలుంటాయి.

విటమిన్‌ల లోపంగల పిల్లలకు ఆహారంపట్ల ఆసక్తి ఉండదు.

ఏడాది నుంచి ఐదేళ్ళ వయస్సుగల పిల్లల్లో ఈ సమస్య మరీ ఎక్కువ.

పిల్లలకు భోజన సమయానికి, చిరుతిండ్లు తినే సమయానికి నడుమ ఎక్కువ ఖాళీ వుండేలా చూడాలి. తగినంత శారీరక వ్యాయామం వుంటే ఆకలి బాగా ఎక్కువ అవుతుంది. ఈ దిశగా వారిని ప్రోత్సహిస్తూండాలి.

పిల్లలు ఆహారం తినే సమయంలో టెలివిజన్ చూడడం, ఫోన్‌లతో ఆటలు, వీడియో గేమ్స్ వంటి వాటిని అనుమతించవద్దు.

ఆహారాన్ని తినిపించే విషయాల్లో ఎక్కువ నిర్బంధాలు ఉంటున్నా వారికి తిండిపై ధ్యాస తగ్గిపోతుంది.

బొమ్మల పజిల్

ఈ రెండు బొమ్మలలో గల వ్యత్యాసాలను గుర్తించండి.

పెద్ద దెబ్బలు ఎందుకు తగలవు?

చిన్న చిన్న జీవులు అంటే సీతాకోకచిలుక, తూనీగ, ఈగ, బొద్దింకవంటి వాటికి పెద్ద దెబ్బలు తగలవు.

ఎందుకంటే వాటి శరీర ఉపరితల వైశాల్యం వాటి ఘనపరిమాణంకంటే చాలా ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల భూమి గురుత్వాకర్షణశక్తి వాటిపై చూపించే ప్రభావంకంటే గాలివంటివి వాటి ఉపరితలంపై చూపించే ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఏదైనా ఎత్తుగా గల ప్రదేశం నుంచి కిందకు పడిపోయినప్పుడు పెద్ద జీవులతో పోల్చితే చిన్న జీవులకు తక్కువ దెబ్బలు తగులుతాయి.

ఒక్కోసారి పడేవిధానాన్నిబట్టిఅసలు దెబ్బలు తగలకపోవచ్చు కూడా.

అవి కిందపడుతున్నప్పుడు గాలిలోకి ఎగురుతున్నట్లు ఉంటుంది.

పాలు తాగితే చాలదు

పాలు పిల్లలకు పౌష్టిక ఆహారమే అయినప్పటికీ ఆ కారణంగా అదే పనిగా ఎక్కువ పాలు తాగిస్తూవుండాల్సిన పని లేదు. ఎన్ని పాలు అవసరం అన్న సందేహం తలెత్తుతుంటుంది.

పిల్లల బరువులో ప్రతి కిలోకు 30 మిల్లీలీటర్ల పాలు ఇస్తే సరిపోతుంది. అంతే కాని, అదే పనిగా ఎక్కువసార్లు పాలు తాగిస్తుంటే కడుపు నిండిపోయి, మిగతా ఆహారంపట్ల వారికి మనస్సుండదు. దీనివల్ల ఇతరత్రా విటమిన్ల లోపం ఏర్పడుతుంది.


ముఖ్యంగా ఐరన్, పీచు తగ్గిపోతాయి. కాబట్టి వారికి అన్ని రకాల ఆహారపదార్థాలూ ఇస్తూండాలి.

మంచి నడవడిక

పిల్లలకు విలువలు, నిజాయితీని చిన్నప్పటినుంచి ఇంటిసభ్యులే అలవరచాలి. ఇంట్లో అందుకు తగిన వాతావరణం వుండాలి.

ఎటువంటి పరిస్థితిలోనైనా నిజమే చెప్పాలని, ఒకవేళ నిజం చెప్పడంవల్ల ఇబ్బందులు ఎదురైతే అందుకు సారీ చెప్పేయాలని కూడా వారికి వివరించాలి. పెద్దవారిని గౌరవించడం,తోటివారిని ప్రేమించడంవంటి మంచి నడవడికను వారికి నేర్పించాలి.

ప్రతి విషయానికి కోపం తెచ్చుకోవడం, ఎదుటివారిపై ద్వేషం పెంచుకోవడం సరైనవి కావని వారికి వివరిస్తుంటే నెమ్మదిగా వారిలో మంచి గుణాలు పెరుగుతాయి.





ఒత్తిడి తల

తలనొప్పి అనేది బయటకు కనిపించే లక్షణమే కానీ అదే అనారోగ్యంకాదు. తలనొప్పి రావటానికి కారణాలు అనేకం. అందులో ఒక కారణం ఒత్తిడి. శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతున్నవారంతా తలనొప్పి అనుభవిస్తారు.


కారణం తెలియటంలేదు కాని తలనొప్పి వేధిస్తున్నది అనేవారందరి మనసులో ఏదోతెలియనిఆదుర్దా, దానికి కారణంగా ఒత్తిడి వుందనే అర్థం.

ఒత్తిడి అనేది మనసుకు సంబంధించినదే అనుకోకండి. నిద్ర లేకుండా వరుసగా సెకండ్ షో సినిమాలు చూసినా తలనొప్పి వస్తుంది.

అది శరీరం మీద పడిన ఒత్తిడికి ప్రదర్శితమయ్యే స్పందన. ఇష్టంలేకపోయినా ఎవరింటికో వెళ్ళాల్సి వచ్చినా, వారి ఎదురుగా కూర్చుని వారికబుర్లు వినాల్సి వచ్చినా తలనొప్పి మొదలవుతుంది.

అది మనసుమీద పడుతున్న ఒత్తిడి ప్రభావం.

ఈ తలనొప్పి ఫిర్యాదులు యుక్త వయసులో వున్నవారు ఎక్కువగా చేస్తుంటారు. మగవారికన్నా ఆడవారిలో తలనొప్పులు ఎక్కువ. అందుకు కారణంవారి ఇష్టతకు వ్యతిరేకంగా పనిచేయాల్సిన పరిస్థితులు. అయితే అన్ని రకాల తలనొప్పులను ఒకే రకమైనవి అనలేరు.



Courtesy : SANANDA

ఎందు కొస్తాయి

ఒత్తిడితో తలనొప్పులు వస్తాయని అంగీకరించినా అలా ఎందుకు జరుగుతుందనేదానిమీద స్పష్టతలేదు. కొన్నిరకాల కారణాలను ఒత్తిడి తలనొప్పి తెచ్చేవిగా గుర్తించారు.

ఇందులో శరీరానికి సంబంధించినవి, మనసుకు సంబంధించినవి కూడా వున్నాయి.

పని ఒత్తిడి, శరీరానికి తగినంత విశ్రాంతి కరువవటం, నిద్రపోకపోవటం, పెరిగిన పనిగంటలు, తాగాల్సినంత నీరు తాగకపోవటం, వేళకు ఆహారం తినకపోవటం, పోషకపదార్థాల లోపం వంటివన్నీ ఒత్తిడి తలనొప్పులను తెస్తాయి. కొన్ని రకాల అలవాట్లు కూడా తలనొప్పిని పెంచుతాయి.

కంటిమీద పడిన ఒత్తిడి సులభంగా తలనొప్పి తెస్తుంది.

కంటిచూపు సమస్యలు, సరైన కళ్ళ అద్దాలు ధరించకపోవటం, టెలివిజన్

పట్టవచ్చు. పార్శ్వనొప్పి వున్నవారు ఒత్తిడికి గురికాకుండా వుండటం మంచిది.

ఏ అంశాలవల్లవారికి పార్శ్వనొప్పి వస్తున్నదీ అర్థం చేసుకుని వాటినుండి దూరంగా వుండాలి.

ఆదుర్దా, అధికంగా పనిచేయటం, పని ఒత్తిడి,

లక్షణాలు

ఒత్తిడికి గురైనప్పుడు వచ్చే తలనొప్పులు తాత్కాలికమైనవి, ఎప్పుడైనా రావచ్చు. వచ్చినంత వేగంగా తగ్గిపోతాయి. అరుదుగా మాత్రమే ఆ తలనొప్పి ఎక్కువరోజులు నిలుస్తుంది.

నెలలో పదిహేనురోజులు దాటి తలనొప్పినిలిస్తే అది దీర్ఘకాల సమస్య అవుతోందని అర్థం. కొందరిలో ఒత్తిడి తలనొప్పులు, పార్శ్వతలనొప్పులు కలిసివస్తాయి. ఒత్తిడి తలనొప్పితో మొదలై దానిని పార్శ్వ తలనొప్పిలోకి తీసుకువెళతాయి.

పార్శ్వ తలనొప్పి వచ్చినప్పుడు కాంతిని చూడలేరు.ధ్వని భరించలేరు. కడుపులో తిప్పటం, వాంతి వచ్చేలా అనిపించటం, తలలో ఒకవైపు మాత్రమే తలనొప్పి రావటం జరుగుతుంటుంది. ఇది కూడా ఒకరకమైన ఒత్తిడివల్ల వచ్చేవే.

వాతావరణంలో హఠాత్తుగా వచ్చిన మార్పు, ఋతుమార్పులు, కొన్నిరకాల రసాయనాలవాసన ఘాటువంటివి పార్శ్వనొప్పిని పెంచుతాయి.

ఒత్తిడివల్ల వచ్చే తలనొప్పి మొత్తం తలంతటికీ వుంటుంది. తలవెనక భాగం, కనుబొమ్మ పైభాగంలో నొప్పి మొదలవుతుంది.

ఈ నొప్పి స్థిరంగా వుంటుంది. కాంతి, ధ్వనులను తట్టుకోవటం కష్టంగా వుంటుంది. మాడు భాగంలో లాగేస్తున్నట్టుగా వుంటుంది. నొప్పిని భరించలేక జుట్టు లాక్కోవటం, మాడుమీద కొట్టుకోవటం వంటివి చేస్తుంటారు.

పార్శ్వనొప్పి సమస్య వున్నవారికి ఒత్తిడి జత కూడితే సమస్యలు అధికమవుతాయి. పార్శ్వనొప్పి ప్రారంభమవుతున్నదని వారికి అర్థమవుతుంది.

కళ్ళముందు ఏవో మెరుపులు వంటివి కనిపిస్తాయి. అటూ ఇటూ గజిబిజిగా తిరుగుతున్న గీతలు కనిపిస్తాయి. తల తిరగటం, ఏమీ అర్థం కాని గందరగోళం, ముఖం, చేతులు తిమ్మిరిగా అనిపించటం వంటివి వస్తాయి.

ఈ లక్షణాలు నెమ్మదిగా ప్రారంభమై ఒక అర గంట సమయంలో తీవ్రస్థాయికి చేరతాయి.

ఆ సమయంలో కడుపులో తిప్పటం, తల తిరుగుడు వంటి ఇబ్బందులు కనిపిస్తాయి.

ఈ పరిస్థితి కొన్ని గంటలనుండి రెండు, మూడురోజుల వరకు వుండవచ్చు.

పార్శ్వనొప్పి నుండి బయటకు వచ్చిన తర్వాత నీరసంగా వుంటుంది. ఏ పనీ చెయ్యాలనిపిం చదు-దేనిమీదా దృష్టిపెట్టలేరు. సాధారణస్థితికి చేరి తిరిగి తమ పనులలో నిమగ్నమవటానికి మరో 24 గంటలు

నొప్పులు తగ్గేదెలా


Courtesy VANITHA

ముందు ఎక్కువ గంటలు గడపటం, కంప్యూటర్‌తో ఎక్కువ సమయం పనిచేయుటం వంటివాటివల్ల కంటిమీద ఒత్తిడి పడి తలనొప్పి తెస్తుంది.

సరైన కాంతి లేనిచోట పుస్తకాలు చదవటం, పక్కకు పడుకుని చదవటం, జుట్టు బాగా బిగించి కట్టుకోవటం వంటివి కూడా తలనొప్పిని తెస్తాయి.అతి వ్యాయామంవల్ల తలనొప్పి వస్తుంది.

కొన్ని రకాల ఆహారపదార్థాలు తిన్నప్పుడు తల నొప్పులు వస్తాయి. కొందరి శరీరానికి కొన్ని రకాల పదార్థాలు పడవు. అటువంటి పదార్థాలు తినటంవల్ల కూడా తలనొప్పి రావచ్చు.

జంక్‌ఫుడ్ తిన్నా, నిలవవున్న ఆహారంతీసుకున్నా, మలబద్ధకం ఏర్పడినా తలనొప్పి వస్తుంది. ఎక్కువ మంది ఒకేగదిలో గుమికూడినప్పుడు ఒకరు పీల్చిన గాలిని మరొకరు పీల్చినా, సిగరెట్ పొగ ప్రభావానికి గురైనా, కాఫీ వంటి పానీయాలు పరిమితిని మించి తాగినా తలనొప్పులు వస్తాయి.

ఇవి అన్నీ శరీరం ఒత్తిడికి గుర వటంవలన వచ్చే తలనొప్పులు.

తలనొప్పులకు దూరంగా

కారణం తెలుసుకుంటే తలనొప్పులనుండి త్వరగా బయటపడగలుగుతారు. శరీరాన్ని ఒత్తిడికి దూరం చేసేందుకు అవసరమైన వ్యాయామం, రిలాక్సేషన్ పద్ధతులను పాటించాలి.

శారీరక వ్యాయామం చాలా అవసరం. అందులో ఫిజియోథెరపీ, ధ్యానం, యోగా, సమయ విని యోగం వంటివి ముఖ్యమైనవి.

క్రమబద్ధజీవన విధానంవల్ల ఒత్తిడి ప్రభావం పరిమితంగా వుంటుంది. ఉదయంవేళ సరయిన సమయానికి లేచి, చల్లనిగాలిలో కొద్దిసేపు నడవటం వల్ల కొత్త ఉత్సాహం వస్తుంది.

సమయపాలనవల్ల ఆఫీసుకు చేరటంలో ఎటు వంటి ఒత్తిడి వుండదు. రాత్రివేళ నిద్రకి సరైన సమయం కేటాయించాలి. ఉదయం లేదా రాత్రి వేళ కొంత సమయం ధ్యానానికి కేటాయించాలి.

వాతావరణ మార్పులు, పరిసరాల మార్పులు, మత్తు పానీయాలు తాగటం, కొన్ని ఆహార పదార్థాలు తినడం వంటి పలు అంశాలలో దేనివల్ల ఒత్తిడి పెరిగి, పార్శ్వనొప్పి వస్తున్నదో గమనించి వాటికి దూరంగా వుండటం మంచిది. ◆

రిలాక్స్‌అయ్యే పద్ధతులు నేర్చుకోవాలి. అందులో ముఖ్యమైనది శ్వాసక్రియ.

గట్టిగా గాలిపీల్చి వదలటంవల్ల కండరాలన్నీ రిలాక్స్ అవుతాయి. పని మధ్యలో అయినా కొంత సమయం శ్వాసక్రియ వ్యాయామం చేయాలి. ఊపిరితిత్తులనిండా గాలిపీల్చి నెమ్మదిగా ఆ గాలిని వదలటంద్వారా కొత్తశక్తి శరీరానికి, మనసుకు అందుతుంది. ఇష్టమైన సంగీతం, మూడ్‌ని మార్చే సంగీతం తక్కువస్థాయి ధ్వనిలో వినటం చేస్తే శరీర మంతా తేలికపడుతుంది.

ఈ తరంవారు నిద్రను, ఆహారాన్ని నిర్లక్ష్యంచేసి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు.

వేళకు తిండి, నిద్రను మరువకూడదు. అర్థంలేని అలవాట్లవల్ల ఇబ్బందులుపడుతున్నారు.

అందులో సిగరెట్, మత్తు పానీయాలున్నాయి. శారీరక బరువు విషయంలో జాగ్రత్తగా వుండాలి. మనసులోని గందరగోళాన్ని తొలగించగలిగిన మార్గం యోగా, ధ్యానం.

ఆ రెండింటికీ సమయం కేటాయించాలి. తమంత తాముగా ఏవో ఒక రకమైన మందులను మింగే వారందరికీ తలనొప్పులు తప్పవు.

పెయిన్ కిల్లర్స్‌ని అతిగా వాడే వారికి ఒత్తిడి తలనొప్పులు వస్తాయి. యువతను ఏస్పిరిన్ వంటి మందులకు దూరంగా వుంచాలి.

అతిగా ఏస్పిరిన్ వాడితే శరీరంలోని కీలక అంగాలన్నింటిమీదా ప్రభావం చూపుతుంది. అర్థంలేని మందులతో శరీరాన్ని బలహీనపరుచుకుంటే ఆ తర్వాత వచ్చే అనర్థాలన్నింటికీ బలవ్వాల్సివస్తుంది. అందులో ఒకటి అంతులేని తలనొప్పి సమస్య.

ఒత్తిడి తలనొప్పులను భరించటం కన్నా అవి రాకుండా చూసుకోవటం మంచిది. ఇవన్నీ చేతిలో వున్న పనులే.

ఆఫీసులో సరైన భంగిమలో కూర్చుని పని చేయుటం, కంప్యూటర్ తెరమీదనుండి కళ్ళను మధ్య మధ్యలో పక్కకు మళ్ళించడం చేయాలి.

కళ్ళు ఎండిపోనివ్వకుండా వుండాలి. వల్లమాలిన ఉద్యోగ బాధ్యతలను అంగీకరించి తలనొప్పులు తెచ్చుకుంటున్నారు.

ఇంటి బాధ్యతను, ఆఫీసుబాధ్యతను 'బ్యాలెన్స్' చెయ్యటం అవసరంలేని వారికి ఇంటిపనులు, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నానన్న అపరాధభావన పెరుగుతుంది. అది కొత్త ఒత్తిడిని తెస్తుంది.

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఒత్తిడి తలనొప్పి సమస్య ఏర్పడినప్పుడు ఆ బాధించే భాగంమీద చల్లని ఐస్‌ప్యాక్ లేదా వేడి బ్యాగ్ పెట్టుకోండి.

ఏ తరహా బ్యాగ్ 'రిలీఫ్' ఇస్తుందో దానిని వినియోగించండి. కాఫీ వాడకాన్ని తగ్గించాలి.

ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్ కలిగిన పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలి.

శరీర మర్దన, ఆక్యుపంక్చర్ వంటివి కూడా శరీరానికి మేలుచేస్తాయి. ఒత్తిడినుండి బయటపడేసి తలనొప్పులకు దూరంగా వుంచుతాయి.

వైద్య సహాయం

ప్రాథమికంగా జాగ్రత్తలు తీసుకున్నా, రిలాక్సింగ్ పద్ధతులు పాటించినా తలనొప్పులు వేధిస్తున్నా, ఒక్కసారి వచ్చినదానికన్నా తీవ్రత పెరుగుతున్నా, పలు శారీరకభాగాలలో నొప్పులు వస్తున్నా, తరచుగా బాధ కలుగుతున్నా వెంటనే వైద్యుని సంప్రదించటం అవసరం.

గతంలో వాడిన మందులు పనిచేయుటంలేదని భావించినా, ఇదివరలో వచ్చిన తలనొప్పికన్నా భిన్నమైన తలనొప్పి వచ్చినా వెంటనే వైద్యుని సంప్రదించి తగిన చికిత్సను తీసుకోవాలి.

తరచుగా, తీవ్రంగా వచ్చే తలనొప్పులను నిర్లక్ష్యం చేయవద్దు.

టి.సుదర్శన్

కామెడీ కథ

వాసు... వాసంతి... వాట్సాప్



విరించి

కాలింగ్‌బెల్ మోగింది. బాబిగాడిచేత హోమ్ వర్క్ చేయిస్తున్న వాసంతి "మీ నాన్న వచ్చినట్లున్నారురా! నువ్వు చేస్తుండు..." అని లేచివెళ్ళి తలుపు తీసింది. వాసు ఉస్సూరుమంటూ లోపలికి వచ్చి సోఫాలో కూలబడ్డాడు.

వాసంతి ఫ్యాన్ స్పీడు పెంచింది. గబగబా కిచెన్ లోకి వెళ్ళి గ్లాసు చల్లటినీళ్ళు తెచ్చి ఇచ్చింది. అంతే వేగంగా వెళ్ళి గీజర్ ఆన్ చేసింది.

నీళ్ళుతాగి షూస్‌విప్పి బయటపెట్టి, బెడ్‌రూమ్‌లోకి వచ్చాడు వాసు. కట్టుకున్న బట్టలువిప్పి, టవల్ కట్టుకుని బాత్‌రూమ్‌లోకి దూరాడు. పది నిమిషాల్లో స్నానం చేసివచ్చేటప్పటికి బాబిగాడి హోమ్‌వర్క్ అయిపోయినట్లుంది. వాడు ఆడుకోవడానికి పోయాడు. వాసు సోఫాలో కూర్చుని టీవీ ఆన్ చేశాడు.

వాసంతి ఓ చేత్తో వేడివేడి పకోడీలు, మరో చేత్తో నీళ్ళ గ్లాసుతో వచ్చింది. టీవీలో రిమోట్‌తో చానళ్ళు మారుస్తూ రిలాక్స్ అయ్యాడు.

వాసంతి కూడా వచ్చి సోఫాలో కూర్చుంది.

"ఈ రోజు బాగా అలిసిపోయినట్లున్నారు" అంది వాసంతి చిరునవ్వుతో.

ఆ నవ్వంటే వాసూకు ఇష్టం. "నువ్వుమాత్రం ఇంటిపని, వంటపనితో అలిసిపోవడంలేదా" అన్నాడు వాసంతిని దగ్గరకు తీసుకుంటూ.

ఇద్దరూ కలిసి చిన్నారి పెళ్ళికూతురు చూసేటప్పటికి ఏడుగంటలయ్యింది.

మధ్య మధ్యలో వాసంతి కిచెన్‌లోకి వెళ్ళివస్తూ వంట పూర్తిచేసింది. ఆడుకోవడానికి వెళ్ళిన బాబిగాడు రాగానే అన్నం తినిపించి, కాసేపు చదివించి పడుకోబెట్టింది. ఆ తరువాత ఇద్దరూ కలిసి భోజనం చేశారు.

సరిగ్గా పదిగంటలకల్లా లైట్స్ ఆఫ్ చేశారు. సరిగ్గా పదేళ్ళనుంచి ఇదే వాళ్ళ దినచర్య.జీవితం సంతోషంగా గడిచిపోతోంది. 'గృహమే కదా స్వర్గసీమ' అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు వాసు.

ఉదయాన్నే కాలింగ్‌బెల్ మోగడంతో పేపర్‌వాడో, పాలవాడో అయివుంటుందని వాసంతి లేచి తలుపు తీసింది. ఎదురుగా ట్రాలీ బ్యాగ్‌తో తమ్ముడు సుందరం. "ఎప్పుడొచ్చావురా స్టేట్స్‌నుంచి? వచ్చే ముందు ఫోన్ చెయ్యకపోయావా?" అంది తమ్ముడ్ని ఆప్యాయంగా లోపలికి ఆహ్వానిస్తూ.

"రెండు రోజులయ్యింది అక్కా! మన ఊరుకు వెళ్ళా... ఈ రోజు మా అత్తారి ఊరు వెళ్తా. మిమ్మల్ని సర్‌ప్రయిజ్ చేద్దామని చెప్పకుండా ఇదిగో ఇలా వచ్చా" అన్నాడు సుందరం.

ఆ మాటలకి వాసూ లేచి వచ్చాడు. ఆవిడ తరుపు వాళ్ళు ఆత్మబంధువులని బామ్మర్దిని చూసి "హల్లో... దేశంలోకి ఎప్పుడొచ్చావ్?" అన్నాడు.

"మొన్నే బావా! బాగున్నావా? బాబిగాడేడి?" అన్నాడు సుందరం.

ఈ హడావుడికి బాబిగాడూ లేచాడు. వాడిని పలకరించి ఓ అరగంటలో కాలకృత్యాలు ముగించుకుని వచ్చాడు సుందరం. బాబిగాడికి ఆటవస్తువులు, బావగారికి ఓ వాచీ, అక్కయ్యకు ఆండ్రాయిడ్ ఫోన్ అమెరికా నుంచి తెచ్చినవి ఇచ్చాడు.

"థాంక్స్‌రా తమ్ముడూ! కానీ నాకు వాడటం రాదురా" అంది వాసంతి ఓపక్క ఆనందపడ్తూనే.

"బావలాగా నువ్వు అవుట్‌డేటెడ్‌గా ఉంటే ఎలా అక్కా? అప్‌డేట్‌గా ఉండాలి. ఫేస్‌బుక్, వాట్సాప్ అన్నీ ఇన్‌స్టాల్ చేసి రాత్రి నేను వెళ్ళేలోపు నీకు నేర్పిస్తాగా" అన్నాడు సుందరం.

బాబిగాడు స్కూలుకు, బావగారు ఆఫీసుకు వెళ్ళాక అక్కయ్యకు ఆండ్రాయిడ్ వాడటం నేర్పి, అర్జంటు పని వుందని ఆ రాత్రే గౌతమికి హైదరాబాద్ వెళ్ళిపోయాడు సుందరం.

మర్నాడు సాయంత్రం వాసు ఆఫీసునుంచి వచ్చి కాలింగ్‌బెల్ కొట్టాడు.

ఎప్పట్లా తలుపు తెరుచుకోలేదు. మళ్ళీ కొట్టాడు. కొట్టగా కొట్టగా "అబ్బబ్బా! ఏమిటండీ ఆ కంగారు? చేయి ఖాళీ లేదు. పన్లో ఉన్నాను. వస్తున్నాను?" అంటూ ఓ చేత్తో స్మార్ట్‌ఫోన్‌తో తలుపుతీసింది.

వాసు అలవాటు ప్రకారం ఉసూరుమంటూ సోఫాలో కూలబడ్డాడు.

వాసంతి రెండు చేతులతోటీ టచ్ స్క్రీన్ ఆపరేట్ చేస్తూ దివానుమీద కూర్చుంది.

"ఫ్యాన్" అన్నాడు వాసు. సమాధానంలేదు.

"ఫ్యాన్... ఫ్యాన్.." అన్నాడు కోర్ట్ బంట్రోతులా మూడుసార్లు.

"మీ ప్రక్కనే ఉందిగా స్విచ్. వేసుకోండి" అంది. వాసు ఫ్యాన్ స్విచ్ ఆన్ చేశాడు.

షూ విప్పి బయటపెట్టి, గీజర్ ఆన్‌చేసి, డ్రస్ మార్చుకుని స్నానం చేసి వచ్చాడు.

దివాన్‌మీద కూర్చున్న వాసంతి చేతివేళ్ళు టచ్ స్క్రీన్‌మీద ఇంకా నాట్యమాడుతూనే ఉన్నాయి.

తినడానికి ఏమయినా ఉన్నాయేమోనని భోజనాల బల్లమీద చూశాడు. ఏమీలేవు. వంటగదిలో వెతికాడు. ఉపయోగం లేదు. మళ్ళీ హాల్లోకి వచ్చాడు.

"తినడానికి ఏమీలేవా?" అన్నాడు నీరసంగా.

"ఆ డబ్బాలో బిస్కట్స్ ఉన్నాయి. తినండి" అంది సెల్‌ఫోన్‌లోంచి తలెత్తకుండానే.

డబ్బా వెతుక్కుని నాల్గు బిస్కట్లు తిన్నాడు.

"టీ!" అన్నాడు మళ్ళీ ఆశగా.

"ఆ చేత్తో కాస్త టీ పెట్టేయండి. చేతకాకపోతే పంచదార నేనువచ్చి వేస్తాను" వేళ్ళు స్క్రీన్‌మీద చకచకా టైప్ చేస్తూనే తలెత్తకుండా చెప్పింది వాసంతి. టీ పెట్టి రెండు కప్పుల్లో పోసి తెచ్చాడు.

"కాస్త తాగిపెట్టు" అన్నాడు వాసు.

సమాధానం లేదు.

"బాబిగాడేడీ?" అన్నాడు.

"ఇక్కడ లేడా? అయితే ఆడుకోవడానికి వెళ్ళినట్లున్నాడు" అంది వాసంతి.

"హోమ్‌వర్క్?"

"అబ్బ! వచ్చి చేస్తాడులెండి. ఒక్క పదినిముషాలు ప్రశాంతంగా కూర్చోండి" అంది.

వాసు నెమ్మదిగా టీ చప్పరిస్తూనే టి.వి. ఆన్ చేశాడు. వాసంతి తల ఎత్తలేదు.

టీ తాగకుండానే చల్లారిపోయింది. టీవీలో చిన్నారి పెళ్ళికూతురు కూడా అయిపోయింది.

వాసూకు వాసంతి ప్రవర్తన వింతగా ఉంది.

పెళ్ళయి పదేళ్ళలో ఇన్నాళ్ళూ వాసంతి వేరు. ఇప్పుడు వాసంతి వేరుగా ఉంది. అసలు తను వాసంతేనా? సిన్మాల్లోలాగా ద్విపాత్రాభినయమా?" అన్న అనుమానం వచ్చింది వాసూకు.

"వాసంతీ?"అని పిల్చాడు అనుమానిస్తూనే నెమ్మదిగా. అసలు వాసంతైతే వెంటనే పలుకుతుంది. నకిలీ అయితే అటూ ఇటూ చూస్తుందని, కానీ వాసూ మాటలు వినే స్థితిలో లేదు. చూశాడు... చూశాడు.

"ఏమిటిది? ఇదేం బాగాలేదు" అన్నాడు చాలా సీరియస్‌గా.

"అయ్యో! దీన్ని వాట్సాప్ అంటారండీ. వీడియోలు, ఇమేజెస్, మెసేజ్‌లు, చాటింగ్... ఎంత బాగుందో! బుజ్జిముండ" అంది దాన్ని ముద్దెట్టుకుంటూ.

"పెట్టుకున్నది చాలుగానీ... ఇక అది కాస్త బంద్ చెయ్యి..." అన్నాడు వాసు అసహనంగా. "ఒక్క నిమిషం" అని ఓ పది నిమిషాలకు ముగించింది.

ఇంతలో బాబిగాడు మాసిన బట్టలతో ఆటల నుంచి వచ్చాడు. వాడు స్కూలు యూనిఫామ్ మార్చలేదు. ఆ బట్టలతోటే ఆటకు పోయొచ్చినట్లున్నాడు. స్కూలునుంచి వచ్చాక అసలు

జోరుమీదున్నది

సొట్టబుగ్గల తాప్సీ తీరు, జోరు ప్రస్తుతం టాప్ రేంజ్‌లో వున్నాయి. బాలీవుడ్ సినిమాల జోరుతో కెరీర్ పరుగు లంకించుకున్నది.

అనురాగ్ కాశ్యప్ దర్శకత్వంలో 'మన్ మార్జియాన్' సినిమాలో నటిస్తున్నది. తెలుగులో ఆది పినిశెట్టితో కలిసి ఓ సినిమా చేస్తున్నది.

'ముల్క్' అనే చిత్రానికీ సంతకాలు చేసింది. హాకీ ప్లేయర్ కథతో తీస్తున్న 'సూర్మా' సినిమాలోనూ తాప్సీ తళుక్కుమంటుంది.

అంటే చేతిలో దాదాపు అరడజనుకుపైగా సినిమాలున్నాయన్నమాట. వీటికితోడు ప్రమోషన్లు, బిజినెస్సూ ఉండనేవున్నాయి.



వాడు ఏమయినా తిన్నాడో లేదో, హోమ్‌వర్క్ చేశాడో లేదో తెలియదు.

వాసంతిమీద ప్రేమకొద్దీ వాసు గట్టిగా ఏమీ అనలేకపోతున్నాడు.

"పోయి స్నానం చేసిరారా!" అని, సెల్‌ఫోన్‌తోటే వంటగదిలోకి దూరింది వాసంతి.

రోజూ స్కూలునుంచి రాగానే వాసంతి వాడిచేత దగ్గరుండి స్నానం చేయిస్తోంది.

బాబిగాడు ఏడుస్తూ బాత్‌రూమ్‌లోకి దూరాడు. సెల్‌ఫోన్ పంచదార డబ్బామీద పెట్టి, బియ్యం కడిగి కుక్కర్ పెట్టింది. నాలుగు బంగాళాదుంపలు కట్ చేసి మూకుడులో పడేసింది.

ఈలోపులో వాట్సాప్‌లో టంగు... టంగుమని మెసేజ్‌లు వస్తున్నాయి. మళ్ళీ వాట్సాప్ ఆన్‌చేసింది. వీడియోలు, ఇమేజెస్, జోక్స్ చూసి అవి ఒకళ్ళవి మరొకళ్ళకు ఫార్వర్డ్ చేసేస్తోంది.

బాబిగాడి 'నిక్కర్‌కోసం' ఇంటి పైస్లాబ్ ఎగిరిపోయేలా ఏడుపుగానీ, వాసు అన్నం తగలడుతోంది చూడు' అన్న గావుకేకగానీ వాసంతి ఏకాగ్రతను భగ్నం చెయ్యలేకపోయాయి.

వాసంతి వాట్సాప్‌లో లీనమయిపోయింది. పక్క ఫ్లాట్ ఆంటీనుంచి వాట్సాప్ కాల్ వస్తూంటే ఆన్సర్ చేసింది. "చెప్పండి ఆంటీ!" అంది హుషారుగా.

"వాసంతీ! ఈ రోజు మీ ఇంట్లో బంగాళాదుంప కర్రీ చేస్తున్నావా?" అందావిడ.

"అవును ఆంటీ! పొటాటో ఫ్రై... ఎలా చెప్పారు?" అంది కుతూహలంగా. కూర ఘుమఘుమలు వాళ్ళ ఇంటిదాకా వెళ్ళాయనే నమ్మకంతో.

"వాసన వస్తూంటేనూ" అందావిడ.

"అవునా ఆంటీ! అంత బాగుందా? నేను ఏ కర్రీ చేసినా అంతే ఆంటీ" అంది వాసంతి.

"అన్నీ అలాగే మాడుస్తావా?"

"మాడవడమా?" అని స్టౌకేసి చూసింది. నల్లటి పొగలు వస్తున్నాయి.

ఒక్కసారి ఉలిక్కిపడి కాల్ కట్‌చేసి స్టౌ బర్నర్స్ కట్టేసింది వాసంతి. హాల్లో లేచి నిలబడి వాసు జుట్టు పీక్కుంటూ పిచ్చాడిలా చూస్తున్నాడు. బాబిగాడు దిగంబర స్వామిలా ఇల్లంతా తిరుగుతున్నాడు.

"ఇప్పుడే వంటయ్యింది. ఐదు నిమిషాల్లో పెట్టేస్తాను. కూర్చోండి" అని-

"నువ్వేమిటిరా? పెద్దాడివయ్యావ్. తొమ్మిదేళ్ళొచ్చాయ్, నిక్కర్ వేసుకోలేవూ? వెధవ అరుపులూ నువ్వూను" అంటూ గదమాయించింది, ఏదో ఆ రోజే వాడు అకస్మాత్తుగా పెద్దాడైపోయినట్లు.

'సరేలే, కొత్త ఫోన్ మోజు' అనుకున్నాడు వాసు.

ఉడికీ ఉడకని తెల్లని అన్నంలో నల్లని బొగ్గుల్లాంటి బంగాళాదుంపల మ్యాచింగ్ ఏమిటో వాసుకు అర్థంకాలేదు. "అయ్యయ్యో! కొంచెం ఎక్కువ వేగిందండి" అంది వాసంతి నొచ్చుకుంటూ.

"కాదు. కొంచెం మాడిందంతే" అన్నాడు మెచ్చుకుంటూ. ఆ రోజుకు కూరే మాడింది. మర్నాటినుంచి వాసు పొట్టమాడటం మొదలైంది. కొత్తఫోన్‌లో వాట్సాప్, ఫేస్‌బుక్‌మోజు దినదినప్రవర్ధమానమవుతోంది.

అర్ధరాత్రిదాకా వాట్సాప్ మెసేజ్‌లు, ఆలస్యంగా నిద్రలేవడం, బాబిగాడు ఆటో వచ్చినా రెడీ కాలేకపోవడం, వాసుకు లంచ్ క్యారేజ్ ఆలస్యం చేయడం నిత్యకృత్యమైపోయింది.



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవటం ద్వారా ఆదాయం పెంచుకునే మార్గాలున్నాయి.

-వి.కె.సారస్వత్, నీతి ఆయోగ్ సభ్యుడు

పదిరోజుల్లో సీను పూర్తిగా మారిపోయింది. లేచి నప్పట్నుంచి సెల్‌ఫోన్... దాంట్లో వాట్సాప్ వదలడం లేదు వాసంతి. దినచర్య పూర్తిగా మారిపోయింది.

ఎప్పుడూ క్లాస్ ఫస్ట్ వచ్చే బాబిగాడు యూనిట్ టెస్ట్‌లో ఫెయిలయ్యాడు. వాడి క్లాస్ టీచర్ డైరీలో చాలా సీరియస్‌గా రాసింది- పేరెంట్స్‌ను వచ్చి ప్రిన్సిపాల్‌ను కలవలమని, లేకపోతే టి.సి ఇచ్చేస్తారని.

వాసుకు వాళ్ళ బాస్ చార్జి మెమో ఇచ్చాడు. ఆఫీస్‌కు రోజూ ఆలస్యంగా వస్తున్నాడని, పనిలో అన్నీ తప్పులు దొర్లుతున్నాయని, ఎందుకు సస్పెండ్ చెయ్యకూడదో చెప్పమని. వాసు తలపట్టుకున్నాడు.

సుందరం వాళ్ళక్కను ప్రేమించి పెళ్ళిచేసుకున్న పాపానికి ఇంత ద్రోహం చేస్తాడనుకోలేదు. సుందరం చేసిన ద్రోహానికి ఏం చేసినా పాపం లేదనుకున్నాడు. మర్నాడు వాసంతిని తీసుకుని స్కూలుకు వెళ్ళి బాబిగాడి ప్రిన్సిపాల్‌ను కలిశాడు.

బాబిగాడు రెగ్యులర్‌గా హోమ్‌వర్క్ చెయ్యడం లేదని, చాలా డల్‌గా ఉంటున్నాడని, యూనిట్ టెస్ట్‌ల్లో ఫెయిల్ అవుతున్నాడని, తగిన శ్రద్ధ తీసుకోకపోతే టి.సి ఇచ్చేస్తామని చెప్పింది ప్రిన్సిపాల్.

వాసంతేం మాట్లాడలేదు. తలవంచి సీరియస్‌గా వాట్సాప్ మేసేజ్‌లు చూసుకుంటోంది. వాసూకు తలవంపుగా ఉంది. తలకొట్టేసినట్లుగా ఉంది.

ప్రిన్సిపాల్‌ను ఎలాగో బ్రతిమాలుకుని, ఇకనుంచి శ్రద్ధగా చదివిస్తామని హామీ ఇచ్చి, బాబిగాడ్ని తీసుకుని ఇంటికి బయలుదేరారు. స్కూటర్ ఇంటివైపు కాకుండా వేరే రూట్లో వెళ్తోంటే "ఇలా ఎక్కడికండీ?" అంది వాసంతి కుతూహలంగా.

"గోదాట్లోకి" అన్నాడు వాసు తాపీగా.

"ఓహో! గోదావరి గట్టుకా?" అంది వాసంతి సరిజేస్తూ.

సమాధానం చెప్పకుండా స్కూటర్ గోదావరిగట్టుకు పోనిచ్చాడు. పుష్కర ఘాటుకు రాగానే స్కూటర్ ఆపాడు. ముగ్గురూ దిగారు.

"అబ్బ! ఎంత హాయిగా ఉందండీ ఇక్కడ!" అంది వాసంతి గోదావరిమీదనుంచి వచ్చే చల్లని గాలిని ఆస్వాదిస్తూ, అప్పుడే సూర్యాస్తమయమవుతోంది. వాసూకు అప్పుడే జ్ఞానోదయమవుతోంది.

"ఇంకా హాయిగా ఉంటుంది నీ సెల్‌ఫోన్ ఓసారి ఇలా ఇస్తే" అన్నాడు వాసు. గోదావరి అందాలు సెల్‌ఫోన్‌లో బంధిస్తాడేమోనని సెల్‌ఫోన్ ఇచ్చింది.

"నీకు ఈ సెల్‌ఫోన్ ఎక్కువ ఇష్టమా? ఈ సెల్‌ఫోన్ ఇచ్చిన మీ తమ్ముడు సుందరం ఎక్కువ ఇష్టమా" అన్నాడు వాసు. "అదేం ప్రశ్నండీ! సెల్‌ఫోన్‌కు, వాడికీ పోలికేమిటీ? వాడి కాలిగోటికి సరిపోదు ఈ సెల్‌ఫోను"అంది వాసంతి.

"అవునా...?" అన్నాడు వాసు ఆశ్చర్యపోతూ.

వాసంతి తలూపింది.

తన వాచీకూడా తీశాడు. సెల్, వాచీ చేత్తో పట్టుకున్నాడు. "చిన్న మ్యాజిక్. నువ్వు ఓ పది అడుగులు వెనక్కివేసి ఓసారి కళ్ళుమూసుకో" అన్నాడు.

మ్యాజిక్ ఏదో చేస్తాడేమోనని వెనక్కి వెళ్ళి కళ్ళు మూసుకుంది. రెండు నిముషాల తర్వాత "కళ్ళు తెరు" అన్నాడు. కళ్ళు తెరిచింది వాసంతి.

"ఏ మాయ చేశారు?" అంది నవ్వుతూ వచ్చి.

"ఏం మాయం చేశారు అని అడుగు. చెప్పరా బాబీ" అన్నాడు వాసు.

"గోదార్లోకి నాన్న విసిరిన వాచీకంటే నేను విసిరిన సెల్‌ఫోనే ఎక్కువ దూరం వెళ్ళిందమ్మా.." అన్నాడు బాబిగాడు చాలా ఉత్సాహంగా గంతులు వేస్తూ.

"అయ్యో! అయ్యో! అదేం చేసిందండీ. మా తమ్ముడిచ్చిన నిక్షేపంలాంటి సెల్‌ఫోన్ కాస్తా ఎందుకు గోదార్లోకి విసిరేశారు" అంది కోపంగా.

"మీ తమ్ముడ్ని విసిరేయలేను కనుక" అన్నాడు కొండంత భారం తగ్గిన భావనతో.

ముగ్గురూ మౌనంగా ఇంటికి వచ్చారు.

వాసంతి ఆ రాత్రి నిరాహారదీక్ష చేసింది. మౌన వ్రతం పాటించింది. మంచంమీద మూడంకె వేసి వాసును పస్తు పడుకోబెట్టింది.

ఆ దీక్ష, వ్రతం, మూడంకె ఓ నాలుగు రోజులు కొనసాగింది. అయిదో రోజు వాసుమీద జాలేసి కాస్త పట్టు సడలించింది. అయిదో రోజు సాయంత్రం వాసు ఎప్పట్లాగే ఆఫీస్‌నుంచి కాలింగ్‌బెల్ కొట్టాడు. ఈసారి వాసంతి నవ్వుతూ తలుపు తీసింది.

కొంచెం ఆశ్చర్యపడి, మరికొంచెం సంతోషించి యధాప్రకారం ఉసూరుమంటూ సోఫాలో కూలబడ్డాడు. వాసంతి ఫ్యాన్‌వేగం పెంచింది.గ్లాసు మంచి నీళ్ళిచ్చింది. గీజర్ ఆన్ చేసింది. బాబిగాడి హోమ్‌వర్క్ అయిపోయింది. వేడివేడి పకోడీ, టీ రెడీ.

"ఓసారి కళ్ళుమూసుకో, మళ్ళీ చిన్న మ్యాజిక్" అన్నాడు వాసు టీ తాగుతూ.

"ఈసారి నన్నే మాయం చేస్తారా ఏమిటీ?" అంది నవ్వుతూ కళ్ళుమూసుకుని. ఓ నిమిషం ఆగి "ఓకె! కళ్ళు తెరు" అన్నాడు. వాసంతి కళ్ళు తెరిచింది. చేతిలో సెల్‌తో నవ్వుతున్నాడు వాసు.

"అరే! సేమ్ సెల్. కొత్తది కొన్నారా?" అంది వాసంతి ఆశ్చర్యపోతూ.

"లేదు. అదే సెల్. నీ వాట్సాప్ పిచ్చి తగ్గించాలని బాబిగాడు, నేను ఆడిన నాటకం. నువ్వు ఆ రోజు వెనక్కి వెళ్ళి కళ్ళుమూసుకోగానే సెల్ జేబులో వేసుకుని బాబిగాడి చెవిలో చెప్పాను ఏం చెప్పాలో, వాడు చెప్పాడు. నువ్వు నమ్మావు" అన్నాడు వాసు వాసంతిని దగ్గరకు తీసుకుంటూ.

"మంచి పని చేశారు. ఏదైనా వ్యసనంగా మారనంతకాలం సమస్యలేదు. లేకపోతే కొంప కొల్లేరయిపోతుంది" అంది వాసంతి వాస్తవాన్ని గ్రహించి.

"ఆ విషయం నీకు తెలియాలనే అలా చేశాను. ఇదిగో నీ ఫోన్, నీ ఇష్టం" అన్నాడు వాసు సెల్‌ఫోన్ ఇస్తూ. "వద్దు స్వామీ! నాకు సాదా ఫోనే ఇవ్వండి. ఫోన్ ఫోన్‌లాగే ఉపయోగిస్తా" అంది వాసంతి.

మగవాడికి మందు, సిగరెట్లులాగే ఆడవారికి వాట్సాప్, ఫేస్‌బుక్‌లు వ్యసనాలైతే సంసారానికి ఎంత హానికరమో ఇద్దరికీ అర్థమైంది. దాంతో ఇప్పుడు ఇద్దరూ 'గృహమేకదా స్వర్గసీమ' అంటూ మళ్ళీ పాత యుగళగీతం పాడుకోవడం మొదలుపెట్టారు.



ప్రజలను ఆకర్షించగలిగినవారే అధికారంలో నిలబడతారు.

-కె.సి.ఆర్., తెలంగాణ సి.ఎమ్.

సరైన పునాది

'జంబలకిడి పంబ' సిద్ధి ఇద్నానికి తొలి సినిమా. సినిమా కబుర్లు సిద్ధి సంతోషంగా ఏకరువు పెట్టింది. "పూర్తి వినోదాత్మక చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతులు పంచుతుంది.


కొన్ని టెస్ట్ షూట్‌ల తర్వాత నన్ను కథానాయికగా ఎంపిక చేశారు. మంచి చిత్రంలో పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉంది.

నటనకు ప్రాధాన్యంగల పాత్ర. ఎన్నో రాష్ట్రాల్లో ఆడిషన్లు నిర్వహించి మరీ నన్ను ఎంపిక చేసుకున్నారంటే చాలా చాలా సంతోషిస్తున్నాను.

ఈ సినిమా నాకు, కెరీర్‌కు సరయిన పునాది కాగలదని భావిస్తున్నాను..." అంటూ ఆశాభావాన్ని వ్యక్తంచేసింది సిద్ధి ఇద్నాని.




చందమామ రావే



బతకడానికి దారి

జగపతి తన పెళ్ళాం, పిల్లల బాధ్యత ఏమీ పట్టించుకునేవాడు కాడు. అతని పూర్వీకులు ఒకప్పుడు బాగా బతికారు. ఆ వాసన జగపతిని పూర్తిగా వదలలేదు. అతను తెలిసిన వాళ్ళందరిదగ్గరా అప్పులు చేసి, కొంతకాలం నెట్టుకొచ్చాడు.

ఆ అప్పులు మితిమీరిపోయి, అవి తీరే దారి కన బడక, అప్పులవాళ్ళ కంటపడకుండా ఉండటానికి



జగపతి చీకటితోటే ఇల్లు వదిలి, అడవిలో రోజంతా తిరిగి, చాలా చీకటిపడి ఇంటికి రాసాగాడు.

ఈలోపల అప్పులవాళ్ళు వచ్చి, జగపతి భార్యను నానా మాటలూ అని వెళుతుండేవారు. చూసి, చూసి, ఆమె విసిగిపోయి "నీకేం మగమహారాజువు! అడ్డమైన తిరుగుళ్ళూ తిరిగి అర్ధరాత్రి ఇల్లు చేరుతావు.

అప్పులవాళ్ళకు సమాధానం చెప్పలేక నేను చచ్చి పోతున్నాను. అందరూ రేపు తెల్లవారగానే వస్తారట. ఇంటిపట్టున ఉండు" అన్నది.

ఆ రాత్రి జగపతికి నిద్రపట్టలేదు. రేపు అప్పుల వాళ్ళకు ఏంచెప్పుకోవాలి? వాళ్ళబాకీలు ఎలా తీర్చాలి? వాళ్ళంతా కలిసి తనను చితకతన్నితే తన పరువు ఏమవుతుంది? అంతదాకా ఎందుకు? అతనికి అప్పులవాళ్ళ ముఖాలు చూసే ధైర్యం కూడా లేదు.

తనమీద తనకే రోతపుట్టింది. అతను చీకట్లోనే ఇంటినుంచి బయలుదేరి, ఊరి చివర మర్రిచెట్టు దగ్గర పాడుబడిన బావి దగ్గ రికి వెళ్ళాడు. అందులో దూకి ఆత్మహత్య చేసుకోవటానికి నిశ్చయించుకున్నాడు.

అతను బావిలోకి దూకబోతూండగా ఆ బావిలో నుంచి ఒక పిశాచం బయటికి వచ్చి, జగ పతిని ఎగాదిగా చూసి-

"నీకు మతి ఉన్నదా, లేదా? భూతప్రేతాలు తిరిగే వేళ ఈవైపువచ్చావు దేనికి?"అని అడిగింది.

జగపతి పిశాచానికి తన కథ అంతా చెప్పి "బత కటం ఎలాగూ సాధ్యం కాకనే చావటానికి వచ్చాను. పక్కకు తప్పుకో!" అన్నాడు.

పిశాచం కంగారుగా అతన్ని ఆపి, "అంతపని చెయ్యకు! నేను కూడా క్షణికావేశంలో అనాలోచితంగా నీలాగే ఇం దులోదూకి, ఇలా మారాను.

తరువాత నా భార్యాపిల్లలూ పడ్డ కష్టాలు ఇంతా అంతా కాదు. నా మాట విని తిరిగి వెళ్ళిపో!" అన్నది.

"ఇప్పుడు నేను చావక పోయినా, తెల్లవారి అప్పుల వాళ్ళు నా ప్రాణాలు తీసేస్తారు"అన్నాడు జగపతి.

పిశాచం చప్పున బావిలోకి దూకి, వెంటనే పెద్ద బంగారు నాణెంతో తిరిగి వచ్చి, "దీంతో నీ అప్పులు తీర్చుకో. మళ్ళీ ఈ ఛాయలకు రాకు!" అన్నది.

జగపతి ఆ నాణెం తీసుకుని, ఆనందంతో ఇంటికి వెళ్ళి, జరిగినదంతా తన భార్యకు చెప్పాడు.

ఆమె అంతా విని, "నీ తెలివి తెల్లవారా! ఇచ్చిందే చాలునని ఒక్క నాణెం తెచ్చావా? ఇంకాసిని అడిగి తీసుకురాకూడదూ?" అన్నది.

జగపతి "అవును సుమా!" అన్నాడు.

ఆ నాణెంతో జగపతి అప్పులన్నీ తీరి పోగా, మూడు రోజులపాటు ఇంటిల్లిపాదికీ రాజవైభోగంగా జరిగిపోయింది.

నాలుగోరోజు జగపతితో అతని భార్య "ఈ రాత్రికి నువ్వు మళ్ళీ చావటానికి బావిదగ్గరికి వెళ్ళు" అన్నది.

జగపతి అలాగే బావివద్దకు వెళ్ళి, అందులో పడబోయినట్టు నటించాడు. పిశాచం బయటికి వచ్చి-"మళ్ళీ నీకు ఈ పాడుబుద్ధి పుట్టిందేం?" అని అడిగింది.

"ఏం చెయ్యమంటావు? అప్పులైతే తీర్చగలిగాను గాని, బతకడానికి మార్గం ఏదీ కనిపించటంలేదు" అన్నాడు జగపతి.

పిశాచం మారు మాట్లాడకుండా బావిలోకి వెళ్ళి, మరో బంగారునాణెం తెచ్చి జగపతికి ఇచ్చింది.

జగపతి దానితో ఇంటికి చేరుకొని, పదిరోజులు జల్సాగా గడిపి, మళ్ళీ బావి దగ్గరికి వచ్చి, "నా ఖర్మ! నాకు ఏమీ పని దొరకటంలేదు. పెళ్ళాన్నీ, పిల్లల్నీ పోషించలేకుండా ఉన్నాను!" అని పిశాచానికి చెప్పి, మూడోసారి బంగారునాణెం పట్టుకుపోయాడు.

ఈసారి జగపతి భార్య దాన్ని కరిగించి చేతు లకు గాజులు చేయించుకున్నది.

మర్నాడే మళ్ళీ జగపతి బావి దగ్గర హాజరయ్యాడు. పిశాచం కనిపించి, అప్పుడే వచ్చావేమని అడిగింది.


"నాకు విసుగెత్తిపోతున్నది. చేద్దామంటే ఏ పనీ దొరకదు!" అన్నాడు జగపతి.

"నాకూ విసుగుగానే ఉంది. నువ్వు ఈ కుళ్ళు మనుషుల మధ్య బతకలేవు. బావిలోకి దూకెయ్యి. హాయిగా ఇద్దరమూ కబుర్లు చెప్పుకుంటూ కాల క్షేపం చేద్దాం!" అన్నది పిశాచం.

జగపతి పైప్రాణాలు పైకి ఎగిరాయి. అతను కంగారుగా వెనక్కిపోయి "పని దొరుకుతుందేమో మరోసారిచూస్తాను" అంటూ ఇంటికేసిపరిగెత్తాడు.


"నేను సహాయం చేస్తున్నంత కాలమూ నీకు పని దొరకదు. ఇప్పుడిక తప్పకుండా దొరుకుతుంది. బతకడానికి దారి కనిపించి తీరుతుంది" అనుకున్నది పిశాచం.

ఎం.కామేశ్వరరావు





డా॥జి. సమరం



Model KARISHMA SHARMA Courtesy : THE MAN

సి.ఎస్. భీమవరం

మా ఇంటిపక్కనే ఒక ఎయిడ్స్ రోగి ఉన్నాడు. అతను ఇవాళో రేపో పోయేటట్లు ఉంటాడు. మా ఏరియాలో దోమలు చాలా ఎక్కువగా ఉంటాయి. అతన్ని కుట్టిన దోమలు మాకు కూడా కుడితే ఎయిడ్స్ వచ్చే ప్రమాదం ఉందా? రోజూ మాకు ఇదే భయం. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోమంటారు?

దోమలు కుట్టడంవల్ల ఎయిడ్స్ వ్యాధి రాదు.

ఎయిడ్స్ రోగిని కుట్టిన దోమలే ఆరోగ్యవంతుడిని కుట్టినప్పటికీ ఆ వ్యాధి సంక్రమించదు. అందుకని మీరు నిర్భయంగా ఉండండి.

ఎమ్.ఎస్. కావలి

నాకు హోమోసెక్స్ అలవాటుంది. స్త్రీలమీద ఎటువంటి వ్యామోహం ఉండదు.

ఇంట్లో పెళ్ళికి ఎంతో ఫోర్సుచేస్తున్నారు. నా అలవాటుగురించి వాళ్ళకి చెప్పలేకపోతున్నాను. పెళ్ళి చేసుకుంటే భార్యతో సంభోగం చేయలేనని నా పూర్తి నమ్మకం. నాకు చచ్చిపోవాలని ఉంది.

మీరిచ్చే సమాధానాన్నిబట్టి రైలుకింద పడాలా, వద్దా అనేది నిర్ధారించుకుంటాను. ప్లీజ్ నన్ను అర్థం చేసుకోండి. వెంటనే జవాబు ఇవ్వండి.

హోమోసెక్స్ అలవాటు ఉన్నప్పటికీ మారాలనుకుంటే మారడం కష్టం కాదు. బిహేవియర్ మాడిఫికేషన్ థెరపీద్వారా తేలికగా మారతారు.

హోమో సెక్సువల్ ఫీలింగ్స్ కలగడం మీ తప్పు కాదు. చాలావరకు జీన్స్ కారణం. జీన్స్ కారణం అయినప్పటికీ సైకలాజికల్ ట్రీట్‌మెంట్‌ద్వారా హోమోసెక్స్‌వల్ ఫీలింగ్స్‌ని అధికమించవచ్చు.

మీకున్న హోమోసెక్స్ అలవాటుని మీ పేరెంట్స్‌కి చెప్పండి. తప్పు ఏమీ లేదు. వాళ్ళు మిమ్మల్ని చక్కగా అర్థంచేసుకుంటారు. డాక్టర్‌కి చూపిస్తారు. మిమ్మల్ని మామూలు మనిషిగా మారుస్తారు. అంతేతప్ప ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం తప్పు. మీరూ అందరి లాగానే మామూలు అవుతారు.

బి.ఎల్. భీమవరం

నా వయస్సు 18 సంవత్సరాలు. ఇంటర్మీడియట్ చదివాను. నాకు సెక్స్ కోరికలు విపరీతంగా అనిపిస్తాయి. బోర్లాపడుకుని దిండుకు నా రొమ్ములని గట్టిగా నొక్కిపట్టుకుని ఆ కల్గే స్పందనలని ఎంజాయ్ చేస్తాను. యోనిదగ్గర రకరకాలుగా ఒరిపిడి కలిగించు

సంపూర్ణ ఆనందపు సెక్స్ సోపానాలు

‘తినగ తినగ వేము తియ్యనుండు’ అని శతకకారుడు అని వుండవచ్చు గాని చేయగ చేయగ దంపతుల మధ్య సెక్స్ బోర్‌గా వుండన్నది వాస్తవం. దంపతుల్లో తమ సెక్స్ జీవితానికి అర్థం లేదనిపించటం ఏదోక దశలో జరుగుతుంటుంది.

యాంత్రికంగా సెక్స్‌లో పాల్గొంటూ అందులో పొందాల్సిన తృప్తినిపొందలేక సంసార జీవితం నిరాశ, నిస్పృహలతో నడుస్తుంది. ఎందుకు సంసారం చేస్తున్నామో తెలియని పరిస్థితి వచ్చిందంటే ఆ దాంపత్య జీవితంలో ఇబ్బంది మొదలవుతుంది.

అటువంటి భావం కలగగానే విదేశాలలో దంపతులు విడిపోతారు. విడాకులు తీసుకుని కొత్త బంధం, కొత్త వాతావరణంతో జీవితంలో కొత్త ఉత్సాహం, తృప్తి పొందుతారు.

విడాకులనేది సమాజం అంగీకరించటం అన్ని సంస్కృతులలో ఒకేలా లేదు. మన దేశంలో విడాకుల రేటు పెరుగుతున్నా, దానికి సామాజికంగా అంగీకారం అంతగా లేదు. పైగా విడాకుల తర్వాత జీవితంలో కొత్త ఉత్సాహం, కొత్త సుఖాలు వస్తున్నాయని చెప్పేవారు తక్కువగానే వున్నారు.

అందుకే తమ జీవితంలోని సెక్స్ సంబంధంలో ఏర్పడిన లోటును అర్థంచేసుకుని, సంసారబంధంలోకి కొత్త ఉత్సాహం తెచ్చుకోవటం అవసరం. ఇందుకోసం మరెక్కడో వెతుక్కోనక్కరలేదు. తమ జీవితాలను తరచి చూసుకుంటే చాలు.

సెక్స్ జీవితం సంపూర్ణంగా అనుభవించే దంపతులు వున్న లక్షణాలను, వారు అనుసరించే పద్ధతులను అర్థంచేసుకుంటే ప్రతి ఒక్కరూ సెక్స్‌ని సంపూర్ణంగా అనుభవించగలుగుతారు. లోపాలు వుండని మనుషులు వుండరు. సెక్స్ విషయంలోనూ లోపాలుంటాయి. వాటిని అర్థంచేసుకుని అంగీకరించిన దంపతులదే అసలైన ఆనందం.

సెక్స్‌కోసం తగిన సమయం, తగిన వాతావరణం అంటూ పెట్టుకోని దంపతులు బాగా ఆనందించగలుగుతారు. రెండు మనసులు, రెండు శరీరాలు, కోరిక...వాటికి మాత్రమే విలువనిచ్చి హాయిగా, ఎప్పుడైనా, ఎక్కడైనా సెక్సీ ఆనందం పొందుతారు.

సెక్స్ అనేది ఒక పద్ధతిలో మొదలై అలా క్లైమాక్స్‌కి చేరటం అనేది చక్కని ఆలోచనే అయినా, సెక్స్‌ని ఆనందించే దంపతులు ప్రతిసారీ అటువంటి పద్ధతిలోనే సెక్స్‌లో పాల్గొనాలనుకోరు.

మూడ్ వచ్చినప్పుడు అతివేగంగా సెక్స్‌ను ముగించగలిగిన అవకాశాన్ని వదులుకోరు.

వేకువజామున, అవకాశం దొరికిన మధ్యాహ్న సమయాన్ని వదులుకోరు దంపతులు. వేళాపాళా వుండకూడదన్న సూత్రాన్ని నమ్మిన దంపతులే అత్యధిక ఆనందం పొందుతారు. తమ శరీరాలగురించిన సందేహాలున్నవారు సెక్స్‌ని ఆనందించలేరు.

మనసుతో ఇష్టపడిన తర్వాత,మనసులో కోరిక పెరిగిన తర్వాత శరీర పాత్ర తగ్గుతుంది. అందుకే పొట్ట వుందనో, మరేదో లోపం వుందనో వీరు అనుకోరు. తామిద్దరి దృష్టి ముఖంమీదుంటుంది. కళ్ళలోకి చూసి కోరిక పెంచుకోగలరు. అసలు తమ శరీర రూపంగురించి మరచిపోయి సెక్స్‌ను ఆనందంగా అనుభవించటమే దాంపత్య రహస్యం.

ఏ దంపతులైతే సెక్స్‌లో స్వార్థంగా వ్యవహరించరో వారు సెక్స్‌ని సంపూర్ణంగా ఆనందిస్తారు.తమ తృప్తిని మాత్రమే చూసుకోక భాగస్వామి సుఖానికి ప్రాధాన్యతనిచ్చేవారికి సెక్స్ సుఖంలో లోటుండదు.

దంపతులు ఒకరి కోరికను మరొకరు వ్యక్తీకరించుకునేందుకు మొహమాటపడరు. ఎలా చేస్తే బాగుంటుందో భాగస్వామికి చెప్పుకోగలుగుతారు. అటువంటి దంపతులలో సెక్స్ ఆనందం అధికమవుతుంది. అసంతృప్తికి తావుండదు.

సెక్స్‌లో సంపూర్ణ ఆనందానికి ఒకరి మీద మరొకరికి పూర్తి నమ్మకం అవసరం. ఎటువంటి సందేహాలకూ తావులేని సంసార జీవితం గడిపే జంటలు సంపూర్ణ ఆనందం పొందుతారు.

వారి మధ్యవున్న మానసిక సంబంధాన్ని మరింతగా పెంచేది సెక్స్ అనే విశ్వాసం కలిగిన జంటలు సెక్స్‌ని బాగా ఆనందించగలుగుతారు.

ఈ విషయాలను అర్థంచేసుకున్న జంటలలోనే సెక్స్ జీవితం సుఖ, సంతోషాలతో సాగుతుందనేది పరిశోధకులు తేల్చిన విషయం. ◆

కుని తృప్తిచెందుతాను. సెక్సువల్ ఫీలింగ్స్‌ని తట్టుకోలేకపోతున్నాను. నా పేరెంట్స్ మాకు పెళ్ళి చేయాలనే చూస్తున్నారు. సంబంధాలు కుదరడంలేదు.

నేను కాస్త నల్లగా, లావుగా ఉంటాను. అందువల్లే ఎవరూ నన్ను చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. అయినప్పటికీ నాలో సెక్సువల్ ఫీలింగ్స్ విపరీతంగా చెలరేగుతున్నాయి. రాత్రిపూట కలలు కూడా సెక్స్ కలలే వస్తున్నాయి.

స్మార్ట్ ఫోన్‌లో కూడా ఎక్కువగా రొమాంటిక్ షార్ట్‌ఫిల్మ్స్‌నే చూస్తుంటాను. ఇవన్నీ మీకు చెబుతూ ఉంటే నన్ను ఒక బజారు మనిషిగా భావించకండి. నేను ఉన్నవాళ్ళ కుటుంబంలోనే పుట్టాను.

అయినా బజారు మనిషిగా సెక్స్ ఆలోచనలు మహా ఇబ్బందిపెడుతున్నాయి. వీటిని ఎలా తట్టుకోవాలో నాకు తెలియడంలేదు. పెళ్ళి నిశ్చయమయ్యే నాటికి నేను సెక్స్‌కి పనికిరాకుండాపోతానని భయం వేస్తోందికూడా. నన్నీ ఊబినుంచి రక్షించండి.

యుక్తవయస్సు వచ్చిన కొందరు అమ్మాయిలలో, అబ్బాయిలలో ఓవర్ సెక్సువల్ ఫీలింగ్స్ ఉంటాయి. ఆ సెక్సువల్ ఫీలింగ్స్ థ్రిల్‌ని ఇవ్వడమే కాకుండా పిచ్చివాడిగా చేసేస్తాయి. అనుక్షణం అదే ఆలోచన, అదే మాట ఉంటుంది.

కొందరు సెక్స్ ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నప్పటికీ వాటిని తట్టుకుని అణుచుకుంటారు. మామూలుగా ఉంటారు.

మీలాంటివాళ్ళల్లో సెక్స్ ఆలోచనలని కంట్రోల్ చేసుకునే శక్తి ఉండదు. పైగా వాటిని అధికమించాలనే ఆలోచన కూడా ఉండదు. మనస్సులో కలిగిన రొమాంటిక్ ఫీలింగ్స్‌తో కొట్టుకుపోతుంటారు.

మీలాంటివాళ్ళు కౌన్సిలింగ్‌ద్వారా, సైకోథెరపీ ద్వారా తప్పకుండా సెక్స్ కోరికల తీవ్రతనుండి బయటపడగలరు. కోరికలని కంట్రోలు చేసుకోవడంలో యోగా కూడా తోడ్పడుతుంది.

యోగాని రోజూ కాస్త ఎక్కువ సమయం ప్రాక్టీసు చేయండి. దాంతోపాటు మనస్సుని వేరే పనులలో నిమగ్నం చేయండి. ఒంటరిగా ఉండకుండా స్నేహితులతో, బంధువులతో కలిసి పనులు చేయడం, కబుర్లు చెప్పుకోవడం చేయండి.

నలుగురిలో ఉన్నప్పుడు రొమాంటిక్ టాక్ వచ్చినప్పటికీ సభ్యతగా ఉండదని, మనస్సుని కంట్రోల్ చేసుకోవడం అలవాటు అవుతుంది. మీరు నల్లగా, లావుగా ఉన్నప్పటికీ ఎప్పటికైనా పెళ్ళి అవుతుంది.

మీ స్వయంతృప్తి అలవాటు మిమ్మల్ని పనికి రాకుండా చేయదు. నిశ్చింతగా ఉండండి.

హెచ్.ఆర్. హైదరాబాద్

కొందరు పురుషులు స్త్రీలని ఏడిపించి, హింసించి తెగ ఆనందిస్తారు. స్త్రీ ఏడుస్తుంటే అదేమీ పట్టకుండా సంతోషంగా గెంతులేస్తారు. హుషారుగా శృంగారంలో కూడా పాల్గొంటారు. ఇటువంటివాళ్ళని ఏమనాలి? వీళ్ళు మనుషులా, పశువులా?

స్త్రీని హింసించి, ఆమె ఏడుస్తూ ఉంటే సంతోషించేవాళ్ళు, ఆమె ఏడుపు పట్టనట్లు సెక్స్‌లో పాల్గొనేవాళ్ళని శాడిస్టులంటారు.

వీళ్ళకి స్త్రీని హింసించి, ఏడిపించి ఆపైన సెక్స్‌లో పాల్గొంటే ఎంతో ఆనందం అనిపిస్తుంది.

ఇటువంటి పరిస్థితి ఒక విధమయిన మానసిక వైపరీత్యం. వీళ్ళకి మానసిక చికిత్స కావాలి.

కాగ్నెటివ్ బిహేవియర్ థెరపీ, ఎవర్షన్ థెరపీ వంటి మానసిక చికిత్సలతో సెక్సువల్ వైపరీత్యాన్ని సరిదిద్దవచ్చు.

డా॥ జి.సమరం వాసవ్య నర్సింగ్‌హోమ్ బెంజిసర్కిల్ విజయవాడ 520 010 ఫోన్ 0866-2472370 E-mail drsamaram@hotmail.com www.gsamaram.com

హృదయం ఎక్కడున్నదీ...?

నెమ్మదిగా యశస్వివైపు ఒక్కో అడుగు వేస్తూ నడిచి రాసాగాడు విష్ణు. ఎందుకెందుకు? అతని ఫీలింగ్స్ అతని చూపుల ద్వారా తెలుస్తూనే ఉన్నాయ్! ఎన్నడూ లేనిది అతని చూపులకు ఆమె కలవరపడిపోయింది.

తన కలవరం అతనికి తెలియకూడదని ఆమె గభాల్న తల వంచేసుకుంది చుబుకం వెళ్ళి ఛాతీని తగిలేలా! ఆమె కన్రెప్పలు బిడియంతో బరువెక్కి వాలిపోయాయ్! ఇద్దరిమధ్యా అంగుళం చోటు కూడా లేనంత దగ్గరగా వచ్చాడతను. ఆమె ఊపిరి బిగపట్టింది.

డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి

స్వర్గలోకాల్లో పూచిన పువ్వుని అపురూపంగా రెండు అరచేతుల్లో పట్టుకున్నట్టుగా ఆమె ముఖాన్ని పట్టుకున్నాడు. కాంతులీనుతున్న ఆ ముఖబింబం, ముక్కుమీద పడ్డ ఆ కుంకుమ!

అతనికి ఆగలేదు. వంగి, ఆ కనుబొమ్మలమధ్యన సున్నితమైన ఓ చిన్ని ముద్దు, బిడియంతో వాలిన ఆ కన్రెప్పల పైన లలిత లలితంగా రెండు ముద్దులు, ముద్దుకే ముద్దొచ్చే ఆ బుగ్గలపై మరో రెండు మెత్త మెత్తని ముద్దులు పెట్టాడు.

అతని శ్వాస వేగం అధికమైంది. తనని తాను నిగ్రహించుకుంటూ ఒక్కక్షణం ఆమె ముఖం మీద నుంచి తన ముఖాన్ని జరిపి చూశాడు. అదిరే అధరం, రుధిర వర్ణంలో మోము, వివశత్వంలో మేను!

"కూర్చుందాం రా!" ఆమె భుజాల చుట్టూ చేతిని వేసి పసిపాపని నడిపించి తీసుకువచ్చినట్టుగా తీసుకుని వచ్చి సోఫాలో కూర్చోపెట్టాడు.

తలుపు తీసి, డోర్ స్టాపర్‌ని పెట్టి వచ్చి తనింకో సోఫాలో కూర్చున్నాడు. ఇంతలో నీతూ వచ్చేసింది. యశస్వి తలెత్తి నీతూని చూడలేక ఒళ్ళో ఉన్న చేతుల్ని చూసుకుంటూండిపోయింది.

అతను నార్మల్‌గా ఉండటానికి ప్రయత్నిస్తూ ఆ హాల్లో ఓ మూలన ఉన్న వయొలిన్‌ని చూస్తూ "నీతూ! ఆ వయొలిన్.." అంటూ ఆగిపోయాడు.

యశస్వి ఉలిక్కిపడి తలెత్తింది.

"ఆ వయొలిన్ తనదే డ్యాడ్! యశు వయొలిన్ ఎంత బాగా ప్లే చేస్తుందో తెల్సా?" అడిగింది నీతూ.

"ఈజిట్?" కళ్ళల్లోకి చూస్తూ అడిగాడతను.

ఆమె చిన్నగా తలూపి, "అంత లేదు. నీతూ ఊరికే అలా చెప్తోంది" కంగారుపడింది.

"నీతూ సంగతి నాకు తెలుసు కదా?" అంటూ నవ్వాడతను.

"యశూ! పోనీ ఒక్క సాంగ్ ప్లే చేయొచ్చు కదా?" నీతూ అడిగింది.


ఆ మాటతో యశస్వి నవ్వేసి, "వద్దులే! ఇప్పుడు ప్లే చేస్తే అదేదో సామెత చెప్పినట్టుంటుంది" అంది. వాళ్ళిద్దరూ కూడా నవ్వేశారు.

"ఐ విల్ మేకే మూవ్!" అంటూ లేచాడతను.

"యశూ! ప్లీజ్! విష్ణుని సీ ఆఫ్ చేసి వచ్చే బాధ్యత నీదే!" నీతూ చెప్పింది.

"ఇట్సోకే!" అన్నాడతను.

యశస్వికి బిడియం తగ్గింది. "ఇట్స్ నాట్ ఓకే!"



జరిగిన కథ (10)

ఏనుగుమీద వున్న పల్లకీలోకి ఎక్కుతారు యశస్వి, విష్ణు. ఆమెకు ఐలవ్‌యు చెప్పి గులాబీ ఇస్తాడు. సిగ్గుపడుతుంది యశస్వి.

చందనంతో చేసిన మైసూరు ప్యాలెస్ బొమ్మను ఆమెకు గిఫ్ట్‌గా ఇస్తాడు. మైత్రేయి మెయిల్ పంపిస్తుంది.

అందులో తనూ, బిందు సహజీవనం చేయనున్నామని తెలియజేస్తుంది. ఇద్దరు ఆడవాళ్ళు జంటగా బ్రతకడమేమిటని అసహజంగా అనిపిస్తుంది యశస్వికి.

విష్ణు, యశస్వి ఇద్దరూ గాఢంగా ప్రేమలో పడతారు. తన తాతగారికి జరగబోయే సహస్ర చంద్రదర్శనానంతర శాంతి కార్యక్రమంగా తన ఇంట్లో జరిగే గెట్ టు గెదర్‌కు అందర్నీ ఆహ్వానిస్తాడు విష్ణు. యశస్వినికూడా రమ్మని చెప్తాడు.

యశస్వి నీతూతోసహా సహస్రచంద్రదర్శన కార్యక్రమానికి హాజరవుతుంది. తల్లి సురేఖను యశస్వికి పరిచయం చేస్తాడు విష్ణు.

కాబోయే కోడలుగా భావించి సంతోషపడుతుంది సురేఖ. ఆ కార్యక్రమానికి వచ్చినవారందరూ యశస్వి, విష్ణుల జంట బావుందనుకుంటారు. ఫ్లాట్‌కొచ్చాక ఆ జంటకు ప్రైవసీకల్పించి పక్కకు తప్పుకుంటుంది నీతూ. ఇక చదవండి.

అతడ్ని ఇమిటేట్‌చేస్తున్నట్టు చెప్పి,తలుపు తీసింది.

నీతూ నవ్వేసింది. లిఫ్ట్ దిగి బయటకు రాగానే అన్నాడతను. "నేను వెళ్తాను. నువ్వుండిపో!"

"ఊహు!" కారుదాకా వస్తాను" చిన్నపిల్లలా చెప్తూ అతని చెయ్యిపట్టుకుంది.

'ఇంకాస్సేపు నాతో ఉండొచ్చు కదా'న్న అభ్యర్థన! అతను సరేనన్నట్టు నవ్వాడు.

ఆమె వస్తే తనకూ బావుంటుంది. కానీ తీరా కారు దాకా వచ్చాక ఆమెని వదిలేసి ఒక్కడే కార్లో కూర్చుని కారు స్టార్ట్ చేయగలడా?

ఆమె అదంతా ఏమీ పట్టించుకోకుండా అతనితో పాటే బయటకు వచ్చేసింది.

వెన్నెల రాత్రులు కావటంవల్ల వీధులనిండా వెన్నెల పరుచుకుంది. కారు దగ్గరికి వెళ్ళాక "నేను బయలే్దరనా మరి?" అడిగాడు.

"ఇంకొక్క ఫైవ్ మినిట్స్ ఉండొచ్చు కదా?" బ్రతిమాలుతున్నట్టే అడిగింది.

"టైమ్ ఎంతయ్యిందో తెల్సా?" నవ్వుతూ అడిగాడతను.

"ఎంతయ్యిందీ?" కారు బోయ్‌నెట్‌మీదికి ఒంగి అడిగిందామె.

"ఫ్లాట్‌కెళ్ళు! నీతూ చెప్తుంది" నవ్వాడు.

"కార్లో అలా ఓ రౌండ్‌వేసి వద్దామా?" అడిగింది. తనని వదిలి వెళ్ళాలని ఆ అమ్మాయికి అన్పించటం లేదని అతనికి ఇంకోసారి అర్థమైంది.

పక్కన పార్క్‌లో చలిగా కదుల్తున్న చెట్లు, పచ్చిక మీద వాలుతున్న మంచు పూలు, జాలువారుతున్న వెన్నెల! అన్నీ వదిలి, మనసైన చెలి నుంచి వీడ్కోలు తీసుకుని కదిలి వెళ్ళాలంటే ఎంత వేదన?

తప్పదు కదా? వీడ్కోలు తీసుకుని అతను కారు స్టార్ట్ చేశాడు. ఖాళీ అయిన మల్లెల మాలల బుట్టలా ఉందతని మనస్సు!

మరుసటి రోజుకి కూడా వాడకూడదని నీళ్ళు జల్లి తడిబట్టలో చుట్టిన మల్లె చెండులా ఆమె గుండె బరువెక్కింది.



రానురాను ఆఫీస్‌లో పని ఎక్కువవ్వటంతో విష్ణుకి మాట్లాడటానికి కూడా టైమ్ ఉండట్లేదు. యశస్వి తన పని పూర్తవ్వగానే వెళ్ళిపోయేది.

ఒక్కోసారి నీతూతో వెళ్ళేది. ఒక్కోసారి తనొక్కతే వెళ్ళిపోయేది. ఫ్లాట్‌కి వెళ్ళిన తర్వాత ఫోన్ చేసేది.

ఫోన్లో కబుర్లు చెప్పుకునేవాళ్ళు! ఆ రోజూ అలానే విష్ణుకి కాల్ చేసింది. అతని ఫోన్ 'ఎంగేజ్డ్' వచ్చింది. అతను తిరిగి కాల్ చేస్తాడు అని ఎదురుచూడసాగిందీ. ఎంతకీ అతని నుంచి తిరిగి కాల్ రాలేదు. ఒక గంటాగి మళ్ళీ కాల్ చేసింది.

అతని ఫోన్ సైలెంట్ మోడ్‌లో పెట్టి వర్క్ చేస్తుండటంతో ఆమె కాల్ ఎటెండవ్వలేకపోయాడు. ఆమెకి దుఃఖం వచ్చింది. తొమ్మిదింటి వరకు చూసి అతను ఫోన్ తీయకపోవటంతో తిరిగి ఆఫీస్‌కి వచ్చింది.

అప్పటికీ అతను పనిచేస్తూనే ఉన్నాడు. ఎంత సీరియస్‌గా పనిచేస్తున్నాడూ అంటే ఆమె వచ్చి ఆఫీస్‌లో కూర్చున్నా అతను గమనించలేదు.

ఆ సంగతి ఆమెకి అర్థమైంది.

అతని క్యాబిన్‌లోకి వెళ్ళి ఫోన్ కాల్ ఎందుకు ఆన్సర్ చేయలేదు అని అతడ్ని అడగటానికి కూడా ఆమెకి నోటమాట రాలేదు.

అతని ఎదురుగా కూర్చుని అడిగింది "నాక్కూడా ఏదన్నా పని చెప్పు!" అని.

"ప్లీజ్ యశూ! ఇందులో నువ్వు చెయ్యగలిగే పని ఏమీ లేదు. ఎక్స్‌క్లూజివ్‌గా నేను చేయాల్సిందే! ఈ పనైపోనీ! క్లయింట్‌తో నైట్‌మీటింగుంది" తల కూడా ఎత్తకుండా చెప్పాడు.

ఆమె అలానే రెండు నిమిషాలు కూర్చుని తర్వాత లేచి వెళ్ళి టీ తీసుకొచ్చి ఇచ్చింది. అతను టీ త్రాగటానికి రెండు నిమిషాలాగాడు.

"ఎందుకింత సీరియస్‌గా వర్క్ చేస్తున్నావ్?"

"నీకు తెల్సుకదా యశూ? ఈ వీకెండ్ మా పేరెంట్స్ యు ఎస్ వెళ్తున్నారు. నాకిక రేపట్నుంచి ఆఫీస్‌కి రావటానికి వీలవ్వదు. ఈ నెలాఖర్లో నా స్టార్టప్ ప్రాజెక్ట్ గురించి సింగపూర్ వెళ్ళాల్సివస్తుందేమో? అందుకే ఈ పనంతా త్వరత్వరగా కంప్లీట్

భయం లేదు

ఏది మాట్లాడాలనుకుంటే ఆ విషయాన్ని బల్ల గుద్దినట్లు చెప్పేయడం నిత్యామీనన్‌కు అలవాటు. ఎంతమాత్రం భయం అన్నది ఆమెలో కనపడనే కనపడదు. ఇదే విషయాన్ని అడిగితే గలగల నవ్వేసింది. 'నేను సినిమాల్లోకి ఏరి కోరి రాలేదు.

ఇక్కడికి వచ్చాకే ఇది నా డెస్టినీ అని అర్థమైంది. తెరమీద నేనెలా వుంటాను, నా గురించి ఎవరు ఏమనుకుంటారు, పాత్ర నిడివి ఎంత వంటి విషయాల గురించిన ఆలోచనలు నాకు రావు.

నేను డబ్బు కోసమో, పేరు కోసమో సినిమాల్లోకి రాలేదు. నాకు నచ్చింది నేను చేస్తాను. నాకు ప్రత్యేకంగా కలిగే నష్టం లేదు. కాబట్టి నేను భయపడను" అంటూ తేల్చేసింది నిత్యామీనన్.



చేద్దామని ఇంతగా వర్క్ చేస్తున్నా!" ఓపిగ్గా చెప్పాడు.

"అంటే వారం రోజులింతేనా...? మరి నేనేం చేయను?" దిగాలుగా, చిన్నపిల్లలా అడిగింది.

"తప్పదు కదమ్మా? నా మాట విని ఇంటికి వెళ్ళిపోయి నెట్‌లో మూవీ చూస్కో! నీ వయొలిన్ ప్రాక్టీస్ చేస్కో! ప్లీజ్ కీప్ యువర్ సెల్ఫ్ బిజీ! తర్వాత నువ్వెలా చెప్తే అలా! ఓకేనా?" ఆమెని దగ్గరకు తీసుకుని తలమీద ముద్దుపెట్టుకున్నాడు.

బుద్ధిగా తలూపి వెళ్ళిపోయిందామె. ఇంటికివెళ్ళినా అతని మీదే ధ్యాస! ఆ రోజు విష్ణు ఇక్కడే ఈ సోఫాలో కూర్చున్నాడు.

గుర్తొచ్చి వెళ్ళి అదే స్థలంలో కూర్చుంది. అతనికి సంబంధించిన ఓ జ్ఞాపకం, ఓ మధురస్మృతి ఆ ఇల్లంతా నిండిపోయినట్టు, అతని తాలూకు పరిమళమేదో ఇంకా అక్కడే మిగిలిఉన్నట్టు అన్పించింది. అతనితో గడిపిన సమయాన్ని రీప్లే చేసుకుంటూ... ఆ క్షణాల్లో తిరిగి జీవిస్తూ!

రోజూ ఆఫీస్‌లో కలుసుకోవటం, ఇంటికొస్తే ఫోన్‌లో మాట్లాడుకోవటం, వారానికి రెండు లేదా మూడు సార్లు బయట కలుసుకోవటం... ఇవేవీ లేకుండా ఎలా? ఆమెకి బెంగగా అన్పించింది.

అతను పంపించిన టెక్ట్స్ మెసేజెస్, మెయిల్స్, వాట్సాప్ మెసేజెస్, వీడియోస్ తిరిగి తిరిగి చూసుకుంటూ, తనకిష్టమైన పాటలు వింటూ కాలం గడిపిందామె. అతని పేరెంట్స్ అమెరికా వెళ్ళారు.

అలసటవల్ల ఇంటిదగ్గర్నుంచే ఆఫీస్‌లో అందరికీ కావాల్సిన సూచనలిస్తున్నాడు. ఆఫీస్ టైమ్ పూర్తయిన తర్వాత అతనికి కాల్ చేసి అడిగిందామె. "ఇప్పుడు చెప్పు! ఎక్కడికి వెళదాం?" అని.

"మా ఇంటికి రా!" చెప్పాడతను. ఆ ఆహ్వానానికి గుండె ఝల్లుమంది. విష్ణు పేరెంట్స్ లేకుండా అతనింటికి వెళ్ళటమా? ఆ ఏకాంతం మంచిదేనా? క్షణంసేపు భయం కూడా వేసింది.

కానీ 'నా విష్ణుయే కదా? నన్నెందుకు బాధ పెడ్తాడు? నాకిష్టం లేని పని తానెందుకుచేస్తాడు?

ఏం కాదు. తనూ విష్ణూ చక్కగా కబుర్లు చెప్పుకుంటారు. అంతే!' అని తనకు తానే ధైర్యం చెప్పుకుంది.

అరగంటలో అతనింటి ముందు ఉంది. పాత కాలంలో బ్రిటీష్ కట్టడాలకు వాడే కొండరాళ్ళతో కట్టిన కాంపౌండ్ వాల్! ఆ రాళ్ళమీద బఠానీ తీగెల్ని పాకించారు. గేటుకిరుపక్కలా ఉన్న స్తంభాలమీద బంగారువర్ణం అక్షరాల్తో రాయబడ్డ 'సురేఖ' 'శ్యామ్ సుందర్' అన్న పేర్లని తాపడం చేయించారు.

కాంపౌండ్ వాల్‌కి లోపలివైపు అశోకా చెట్లు!

ఆ పరిసరాలు చూడగానే మొక్కల పెంపకంపట్ల ఆ ఇంట్లోవారికి చాలా శ్రద్ధ ఉందని ఎవరికైనా అర్థమవుతుంది. ఆ ఇంట్లోకి వెళ్తుంటే ఆమె మనస్సంతా ఉద్వేగానికి లోనయ్యింది.

థ్రిల్లింగ్‌గా కూడా ఉంది. అతను పుట్టి పెరిగిన ఇల్లు, అతని బాల్యాన్నీ విజయాల్నీ, జ్ఞాపకాల్నీ, సెంటిమెంట్స్‌నీ, ఫీలింగ్స్‌నీ... అన్ని టినీ దాచుకున్న ఓ పెద్ద భాండాగారం! ప్రపంచంలో అతనికి అత్యంత ఆత్మీయులైనవారంతా ఉండే ఇల్లు!

తలుపు తీసి చెప్పాడతను. "ప్లీజ్! కమిన్!" గోడకు ఆనించిన వెడల్పయిన సోఫాలు, అందులో కుషన్లు! ఇంకోపక్కన దీవాన్!

"కూర్చో!" సోఫాని చూపించి చెప్పి, తను వెళ్ళి ఇంకో సోఫాలో కూర్చున్నాడు. సోఫా బ్యాక్‌రెస్ట్ మీద ఎడమచేతిని అలా పొడుగ్గా జాపాడు.

ఆమె కూర్చోలేదు. అలానే అతడ్ని చూస్తోంది. "కూర్చో యశూ!" మళ్ళీ చెప్పాడు. తల అడ్డంగా ఊపింది. 'ఎందుకు?' అన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడతను. "నీ మనస్సులో తప్ప నీ పక్కన నాకు చోటు లేదా?" గోముగా అడిగింది.

"ఎవరన్నారలా? కమాన్! రా కూర్చో!" నవ్వుతూ ఆమెనే మురిపెంగా చూస్తూ పిలిచాడతను. బ్యాక్‌రెస్ట్ మీదనుంచి చెయ్యితియ్యబోయి ఆగిపోయాడు.

ఆమె నవ్వుతూ వచ్చి, పక్కనే కూర్చుంది. చెయ్యి తియ్యమనలేదు. ఆ చనువు తియ్యగా ఉంది. అతనేం హడావిడి చేయలేదు. ఆమెని కంగారుపెట్టలేదు.

షోజ్‌లో పెట్టిన టీవీని రిమోట్‌తో ఆన్ చేశాడు. అంతక్రితం చూస్తోన్న యాక్షన్ మూవీ మళ్ళీ మొదలయ్యింది. వాల్యూమ్ పెంచబోతూ, ఆగి "చూస్తావా?" అనడిగాడు.

అతనికిష్టమైన యాక్షన్ మూవీస్ చూడటం ఈ మధ్యే అలవాటు చేసుకుంటోంది. తలూపింది.

సోఫాలో అతని పక్కనే అతడ్ని పూర్తిగా ఆనుకుని కూర్చుని అతని భుజమ్మీద తలవాల్చి సినిమా చూడటం బాగుంది. సినిమా పూర్తయ్యింది.

ఎడమచేత్తో ఆమె తల నిమిరి చెప్పాడు. "కాఫీ తాగుదాం! వన్ మినిట్ కూర్చో! ఇప్పుడే వస్తాను"

అతను లోపలికి వెళ్ళి కాఫీ కలిపి తెచ్చిచ్చాడు. "ఫిల్టర్ కాఫీయా?" అడిగిందామె.

అవునన్నట్టుగా తలూపాడు. ఆమె రెండు చేతుల్తో కప్ పట్టుకుని, కాఫీ తాలూకు వెచ్చదనాన్ని ముందు చేతుల్తో ఆస్వాదించి, తర్వాత నెమ్మదిగా సిప్‌చేసింది. కాఫీ తాగితే అయిపోతుందేమోనన్నట్టుగా ఒక్కోసిప్పే నెమ్మదిగా సిప్ చేస్తూ కాఫీ తాగసాగింది.

ఆమె చూస్తూనే ఉంది. అతను చాలా చాలా కూల్‌గా మామూలుగా ఉన్నాడు.

"ఇంకేంటి విశేషాలు?" అడిగాడు.

కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. తర్వాత ఆఫీస్ విషయాలు మాట్లాడుకున్నారు.

అతను యధాలాపంగా అడిగిన ఓ ప్రశ్నకు ఆమె సాంకేతికపరమయిన విషయాలను కూడా జోడించి మరింత వివరంగా, అనర్గళంగా మాట్లాడుతుంటే ఆశ్చర్యపోవటం అతని వంతయ్యింది.

కాలేజ్‌లో ఒకప్పుడు తనుఇంటర్వ్యూ చేసిన అమ్మాయ్ ఈ అమ్మాయేనా? అని అతనికి సందేహం కూడా వచ్చింది.



కొన్ని పరిణామాలవల్ల మా పార్టీ దెబ్బతిన్నది. మళ్ళీ పైకి లేచే శక్తి కాంగ్రెస్‌కి వుంది. -సోనియాగాంధీ, కాంగ్రెస్ నేత



ఇంత తొందరగా ఇలా ఎలా పికప్ అయ్యింది?

అబ్బురంగా ఒక చిరునవ్వుతో ఆమెనే చూస్తూండిపోయాడు.

అతని ఆరాధనాపూర్వకమైన నవ్వు చూసి, ఆమె మాట్లాడటం ఆపేసింది.

"మైగాడ్! యశూ! నువ్వేనా అసలు?" అని అడిగాడు. "ఏమైంది?" అంది ఆమె అర్థంకాక.

"మీ కాలేజీకి వచ్చి నిన్ను ఇంటర్వ్యూ చేసినప్పుడు ఎలా ఉన్నావ్? ఇప్పుడెలా ఉన్నావు? ఓ మైగాడ్! సబ్జెక్ట్‌లో చాలా ఇంప్రూవ్ అయ్యావ్. దటీజ్ అమేజింగ్" పాడుగుతున్నట్టుగా చెప్పాడు.

"థ్యాంక్యూ! థ్యాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్!" బిడియంగా చెప్పిందామె.

"ఈ ఒక్క ప్రోగ్రామింగ్ జాగ్రత్తగా నేర్చుకుంటే ఇంక నీకు తిరుగు ఉండదు" చెప్పాడు.

"తప్పకుండా!" అంది.

అతనికి మనస్సులోనే ఎంతో సంతోషంవేసింది. ఇంటా బయటా తను, యశు చక్కటి జంట అవుతారు! యశు తనకి చాలా విషయాల్లో రైట్ హ్యాండ్‌గా ఉంటుంది.ఓకే! రాన్రాను ఆమెది పైచెయ్యి కూడా కావచ్చు! అది తనకూ గర్వకారణం!

త్వరలోనే తను ఎలాగూ ఓ కొత్త కంపెనీ స్టార్ట్ చేయబోతున్నాడు. యశు తనకి అన్నిరకాలుగా సపోర్ట్‌గా ఉంటుంది. నెమ్మదిగా ఇక్కడ ముఖ్యమైన పనులన్నీ ఆమెకి అప్పచెప్పేసి తాను ఆ స్టార్టప్ పనులు చూసుకోవచ్చు!

ఏ పని చెప్పినా 'నేను సిద్ధంగా ఉన్నాను' అన్నట్లుగా ఉంటుంది. ఒకసారి ఆమెకేదైనా పని అప్పచెప్తే ఇక నిశ్చింతగా ఉండొచ్చు. అతను మనస్సులోనే ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

ఇంకాసేపు కబుర్లు చెప్పుకున్నారు. టైమవుతోంది. తిరిగి వెళ్ళిపోవాలికదా అన్న బెంగ! అయినా బింకంగా చెప్పింది. "నేను బయల్దేరతాను"

"అప్పుడేనా?" అన్నాడతను. అన్న తర్వాత టైమ్ చూశాడు. "ఓ! చాలా టైమయ్యింది. పద! పద!!" అంటూ తొందరచేశాడు.

వీడ్కోలు చెప్పటానికి గేట్ దాకా వచ్చాడు.

గేటు దాటి బయటకు వెళ్ళిన ఆమెని గేటు మీద ముఖం ఆనించి అలా చూస్తూండిపోయాడు. చిన్న పిల్లల్ని చూస్తే బుగ్గలు సాగదీసి, ముద్దుపెట్టుకోవాలనే కోరిక కల్గుతుంది కదా?

సరిగ్గా అతనికి అలాంటి కోరికే కలిగింది. వెంటనే చేతులు కట్టుకుని నిలబడిపోయాడు.

ఆ సంచలనం ఏమీ తెలీని ఆమె అతనివైపు దిగులుగా చూసింది. ఆ చూపుల్ని చూసి కలవరపడింది. అవే చూపులు! యుగయుగాల జ్ఞాపకాల కోసం తనలో లోలో అన్వేషిస్తున్న భావన కల్గించే చూపులు! ఎంత అపురూపంగా చూస్తాడు?

రానంటున్న తన చూపుల్ని బలవంతంగా లాక్కుని "బై" చెప్పి బైక్ ఎక్కింది.

తరచుగా అతని ఇంటికి వెళ్ళి తిరిగివస్తుంటే ఆమెకు అతనిమీద ప్రేమ మరింత ఎక్కువైంది. అందుక్కారణం అతని ప్రేమ! అతని ప్రవర్తన!! 'నిన్ను మించింది నాకేముందీ ప్రపంచంలో?' అన్నట్టుంటాడు. అతని సమక్షంలో ఉన్నప్పుడు తనకు ఏ సంకోచాలూ ఉండవు.

తను తనతో ఉన్నంత స్వేచ్ఛగా అతనితో ఉన్నప్పుడు కూడా ఉండగలుగుతుంది. అతను తనని అమ్మలా ఆప్యాయంగా చూసుకుంటాడు. బాధ కలిగినప్పుడు అమ్మలా సేదతీరుస్తాడు.

భయం వేసినప్పుడు నాన్నలా ధైర్యం చెప్తాడు. నాన్న సమక్షంలో ఉన్నంత నిశ్చింతగా ఉండొచ్చు! ఇంతకన్నా జీవితంలో కావలసింది ఇంకేముంది?

అతను కూడా ఆమెని గమనిస్తూనే ఉన్నాడు. కొత్తల్లో పద్ధతిగా సోఫాలో బుద్ధిగా కూర్చునేది. ఇప్పుడిప్పుడు దీవాన్ మీద కూర్చుంటోంది.

కాళ్ళు కూడా పైన పెట్టుకుని సౌకర్యవంతంగా, మొహమాటం లేకుండా కూర్చుంటోంది. తినటానికి ఏమన్నా కావాలంటే అడుగుతోంది. ఎప్పుడూ ఒక్కలా ఉంటే అది కాలమెందుకవుతుంది?

వయస్సూ వాతావరణమూ కొత్తకొత్త ఊహల్నీ ఆలోచనల్నీ ఇస్తూనే ఉంటాయ్!

అతని దగ్గర పెరిగిన చనువు వల్ల ఆమె ఆ రోజు బైక్ ఎక్కిన తర్వాత అల్లరిగా గాల్లోకి ముద్దు ఎగరేసింది. అతను వెంటనే రెండు చేతులూ ముందుకి



అదే అసలు సవాల్

తెలుగు చిత్రసీమ తన ఇంటిమాదిరి ఉందని, పరిశ్రమ తనను పూర్తిగా ఆదరించి, పోషిస్తున్నదని లావణ్యత్రిపాఠి నొక్కి నొక్కి చెప్తున్నది.

పాత్రలోకి పరకాయప్రవేశం చేయడం, సెట్స్‌లో సర్దుబాటు వంటి సవాళ్ళు తన వృత్తిలో భాగమేనన్నది ఆమె అభిప్రాయం. అయితే, అసలు సవాలు పలానా పాత్రలు చేయాలంటూ తనను బలవంతపెట్టే వ్యక్తులతోనే వస్తుందని అంటున్నది.

"నేను హిట్లు సాధించినప్పుడు గోల్డెన్‌లెగ్ అన్నారు. నిజానికి నాకు ఇటువంటి ట్యాగ్‌లు ఇష్టం లేదు. ఇవన్నీ అనవసరం కూడా.

ఈ విషయాన్ని చెప్తే నేను యారోగెంట్ అంటూ ముద్ర వేస్తారు. ఇదే కెరీర్‌లో ఎదుర్కొనే ప్రధాన సవాల్" అంటున్నది.

సాచి ఆ ముద్దుని అందుకున్నట్టు చేశాడు. ఆమె నవ్వేసి ఆగకుండా బైక్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయింది. మరుసటిరోజు ఇంటికి వచ్చినప్పుడు బుద్ధిగానే ఉంది. కానీ ఇద్దరి మదిలోనూ ఏదో గిలిగింత!

ఒక వీకెండ్‌లో వాట్సాప్ మెసేజ్ పెట్టింది. 'ముద్దూ ముచ్చట అన్నారు. ఆ ముచ్చట ఎప్పుడు?' అతను తిరిగి బదులిచ్చాడు. 'కొంతకాలం ఆగుదాం!'

ఆమె వెంటనే సమాధానం పంపింది. 'రేపు చేయాల్సిన పనిని ఈరోజు, ఈరోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేయమని కబీర్‌దాస్ చెప్పాడు కదా?'

సమాధానంతోపాటు ముద్దు ఈమోజీలనుకూడా పంపింది. "యశూ! ఆయన చెప్పింది ఇలాంటిపనుల గురించి కాదనుకుంటా?"

అతను సందేహం వెలిబుచ్చాడు. "ము ము ము ము ముద్దంటే చేదా? నీకా ఉద్దేశం లేదా? ఇపుడు వద్దన్నావంటే కుర్రవాడా రేపు ఇమ్మన్నా ఇస్తానా వెర్రివాడా?' పాట వీడియో పంపించింది.

"గుడ్ సాంగ్!" అని, బొటన వేలు, చూపుడువేలు కలిపి 'బావుంది' అన్న ఈమోజీ పంపించాడు. ఆమెకు ఏం చెప్పాలో తోచలేదు. అలా కూర్చుండిపోయింది. తర్వాతెప్పుడో కిటికీలోంచి బయటకు చూసింది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఒంటరిగా ఉన్నవాళ్ళకు మరింత గుబులు పుట్టిస్తున్నాయ్! విష్ణు ఇప్పుడేం చేస్తుండిఉంటాడు? తన గురించే ఆలోచిస్తూ ఉండి ఉంటాడా?

వెంటనే మొబైల్ తీసుకుని అతనికి కాల్ చేసింది. ఆమె కాల్ కోసమే ఎదురుచూస్తున్నట్టుగా అతను ఫోన్ తీసి "హలో!" అన్నాడు.


"రేపు సాయంకాలం కలుద్దాం అన్నావ్ కదా? ఆ అపాయింట్‌మెంట్ క్యాన్సిల్ చేస్తున్నా!"

"అయ్యో! అయామ్ డిజప్పాయింటెడ్! ఎందుకో తెల్సుకోవచ్చా?"

"ఎందుకంటే మనం ఈరోజే కలుస్తున్నాం!"

అతను నవ్వేసి, "ఎక్కడా?" అని అడగబోయాడు. కానీ ఆమె కాల్ కట్ చేసింది. అతనికి ఏమీ అర్థం కాలేదు. తిరిగి తను కాల్ చేశాడు. కాల్ కనెక్టవ్వలేదు. ఇంకో నాలుగుసార్లు చేసినా అదే పరిస్థితి!

ఆమే తిరిగి కాల్ చేస్తుందేమోనని ఎదురు చూడసాగాడు. ఈలోగా కాలింగ్ బెల్ రింగయ్యింది.



రాష్ట్రప్రజల హక్కులు కాపాడే విషయంలో సొంత ఎజెండాలు ఉండకూడదు.
-చంద్రబాబునాయుడు, ఎ.పి. సి.ఎమ్.

తలుపు తీయటానికి మెయిన్‌డోర్ వైపు నాలుగడుగులు వేశాడో లేదో, అంతలోనే టీపాయ్ మీదున్న మొబైల్ రింగయ్యింది.

ఆ రింగ్‌టోన్‌తో మళ్ళీ కంగారుగా వెనక్కివచ్చాడు. 'స్వీట్ హార్ట్ కాలింగ్' అన్న అక్షరాలు డిస్‌ప్లే అవుతున్నాయ్. సంతోషంతో మొబైల్‌ని ఇలా చేతుల్లోకి తీసుకుని ఆన్ చేయబోయాడు.

మళ్ళీ డోర్‌బెల్! అయినా అతను మొబైల్‌ఆన్ చేసి, "ఏంజెల్! ఏమయ్యావ్?" అడిగాడు.

ఆమె కిలకిలా నవ్వింది. "మాయమైపోయాను"

ఈలోగా మళ్ళీ డోర్‌బెల్! ఇంట్లో ఎవరూలేకుండా ఒక్కడే ఉండటం ఎంత అసౌకర్యమో అర్థమైంది.

"కాలింగ్ బెల్ మ్రోగుతున్నట్లుంది. చూడక పోయావా?" అడిగింది.

"చూస్తాను గానీ చెప్పు! నీ ఫోన్ ఎందుకు కలవ లేదు?" బెల్ ఆగకుండా మ్రోగుతూనే ఉంది.

"కాలింగ్ బెల్ ఆగకుండా మ్రోగుతోంది. ఓసారి చూడు! నీ కోసం ఏ దేవతో వచ్చినట్టుంది" అంటూ టీజింగ్‌గా నవ్వింది.

"నా దేవత..." అంటూ అతనేదో చెప్పబోతున్నాడు. కాలింగ్‌బెల్ ఆగటం లేదు. "వన్ సెకన్! లైన్‌లోనే ఉండు!" అంటూ మొబైల్ ఓ చేత్తో పట్టుకునెళ్ళి విసురుగా తలుపు తీశాడు.

ఇంకా ఉంది



హుష్ కాకి

ఎప్పుడూ షూటింగ్‌లతో కెమెరా కళ్ళముందుండే సెలబ్రిటీలకు ఖాళీ దొరికితే చేసే, చేయాలనుకునే పనులు అనేకం వుంటాయి. బిజీగా వుండే తారలు తాము ఎలా సేదతీరతారో చెప్పుకున్నారు.

జంతు ప్రేమ-శ్రద్ధాకపూర్

జంతువులతో ఆడుకోవడం అంటే శ్రద్ధాకపూర్‌కు అమిత ఇష్టం. తన పెంపుడుకుక్క అన్ని ఆందోళనల నుంచీ సేదతీర్చుతుందట.

"హాఫ్‌గాళ్‌ఫ్రెండ్ షూటింగ్‌లో వారాలకొద్దీ సెట్స్‌లో వుండిపోయాను. ఇంటిమీద చాలా బెంగ అనిపించింది. ముఖ్యంగా నేను లేకుండా సరిగ్గా నిద్రకూడా పోని నా పెంపుడుకుక్క షైలోను చాలా మిస్సయ్యా. షైలో నాకు ఎల్లవేళలా గొప్ప స్ట్రెస్ బస్టర్. రోజంతా తను కనపడకుండా వుంటే నాకు కష్టం. అప్పుడు తనను బాగా మిస్సవుతుంటా" అని చెప్పింది.

Courtesy : FEMINA

వంట చేస్తే చాలు-అనుష్కశర్మ

వంటచేయడం బాలీవుడ్ భామ అనుష్కశర్మకు అమిత ఇష్టం. స్పాగెట్టి ప్లేట్‌నిండా తయారుచేసుకుని





తినడంతో ఒత్తిడంతా దూరం అయిపోతుందంటుంది. "ఇంట్లో ఖాళీగా వుంటే వంట చేయడాన్ని ఇష్టపడతాను. ఈ పని థెరపటిక్‌గా వుండి, మంచి భావాలు ఇస్తుంది" అని చెప్పింది.

కలరింగ్ బుక్-అలియాభట్

పాతికేళ్ళ వయస్సుకూడా రాకముందే కలలో సైతం ఊహించని కెరీర్‌ను అందుకున్న అలియాభట్ ఖాళీ దొరికినప్పుడు ఎడల్ట్ కలరింగ్ బుక్‌లో రంగులతో నింపేస్తుందట.

"ఎగ్జయిటింగ్‌గా వుంటుంది. థెరపటిక్. ఒత్తిడిని ఇట్టే తగ్గించగలదు. క్లిష్టంగా వుంటుంది కాని, సరదాగా అనిపిస్తుంది. ఎంత కష్టంగావున్నా గీతలు దాటనీయను. దానివల్ల పూర్తయ్యాక అందంగా, హాయిగా వుంటుంది" అని చెప్పింది అలియాభట్.

ఒంటరి

గుమ్మడి రవీంద్రనాథ్

ఫిబ్రవరి, 14. ఉదయం ఆరుగంటలు.వాట్సాప్‌లో వేద్‌నుండి వచ్చిన సందేశం చదివిన నా పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

"స్వీట్ హార్ట్! హ్యాపీ వేలంటైన్స్‌డే" వేద్ నాపై కురిపించే 'ఆకాశమంత ప్రేమ' ఓ క్షణం హృదయంలో కదిలింది. అతని గురించిన ఊహతో మనసంతా తీయగా అయిపోయింది. "థాంక్యూ మై వేలంటైన్" అని మాత్రం బదులిచ్చాను ఫోన్లో.

వెంటనే వేద్ ఇంకో సందేశం పంపాడు. "ఏయ్! సౌరభా, నువ్వెప్పుడైనా గమనించావా 'వేలంటైన్స్ డే' కి సరిగ్గా తొమ్మిది నెలల తర్వాత చిల్డ్రన్స్ డే వస్తుందని?!" అతని సందేశంలోని చిలిపి అర్థాన్ని గ్రహించి నవ్వుకున్నాను.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రొబేషనర్ అధికారిగా ఏడాది క్రితం విశాఖపట్టణంలోని శాఖలో చేరాన్నేను. మా బ్యాంక్ నిర్వహించిన ఒక లోన్ మేళాలో వేద్‌తో పరిచయమైంది.

వేద్ గీతమ్స్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్.నాకింకా ఆశ్చర్యమే. ఇప్పుడు మామధ్య ఆ ప్రేమఎంత గాఢ మైపోయిందంటే, అతను పీల్చేగాలిలో నేను ప్రాణవాయువైపోయాను, నేను విడిచేశ్వాసలో అతనో గాలిపటమయ్యాడు నా'ఒంటరి' ఉనికికి అతనే ఊపిరి. నా పేరు సౌరభ. కానీ ఆ పేరులోని పరిమళం వేద్!!

అదేరోజు... సాయంత్రం ఐదుగంటలు. "ఏయ్,నీకో శుభవార్త" వేద్ నాకు ఫోన్ చేసి చెప్పాడు. ఆ శుభవార్త ఏమయివుంటుందో ఊహించాను. అయినా నేను ఊహించినదేమిటో బయట పెట్టకుండా "ఏంటి?" అన్నాను.

"మా అమ్మానాన్న మన పెళ్ళికి ఒప్పుకున్నారు"

అది వినగానే ఒక చల్లనిగాలితెమ్మెర నా హృదయాన్ని మీటినట్లనిపించింది.

"ఓ... వేద్! అయామ్ సో హ్యాపీ" అంటూ నా సంతోషాన్ని వ్యక్తపరిచాను.

"బ్యాంక్‌లో పనయ్యాక ఇటొస్తావా మా కాలేజ్‌వైపు. భీమిలీ వెళ్దాం, లాంగ్ డ్రైవ్‌కి?"

"వస్తాను. ఈ రోజు వేలంటైన్స్‌డే కూడా కదా" ఆ మాట అంటున్నప్పుడు నా గొంతులో సన్నని ప్రకంపన. అది కేవలం వేలంటైన్స్ డే మాత్రమేకాదు! ఫిబ్రవరి, పద్నాలుగు! అంటే ఓ గతం కూడా!!

"త్వరగా వచ్చెయ్ ఎదురుచూస్తుంటాను"

"వేద్! అయ్ మస్ట్ థేంక్ యువర్ మామ్ అండ్ డాడ్... మన పెళ్ళికి వాళ్ళంగీకరించరేమో అని భయపడుతూ ఉన్నాను"

"ఈ సంతోషాన్ని సెలబ్రేట్ చేసుకుందాంరా మరి త్వరగా" చెప్పాడు వేద్.

మా బ్యాంకుశాఖ నుంచి వేద్ పనిచేసే కళాశాల ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నేను ఐదున్నరకి బ్యాంక్ పని ముగించేసుకుని, నా కొత్త హోండా యాక్టివ్‌లో బయల్దేరాను. ఉడా పార్క్ దగ్గరున్న ఓ స్టార్ హోటల్ దాటి ముందుకెళ్తుండగా, రెండ్రోజుల క్రిందట జరిగిన సంఘటన గుర్తొచ్చి గుండెల్లో కలుక్కుమంది. ఆ హోటల్లో ట్రైనీ రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్న కావేరి అనే ఇరవై రెండేళ్ళ యువతిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది.

పత్రికల్లో రాసిన ఆ దారుణం గుర్తొచ్చి మనసంతా కలచివేసినట్లయింది. ఇంతలో నా ఫోన్ మోగింది. బండి ఆపి, కాల్ తీసుకున్నాను.

"ఎక్కడవరకూ వచ్చావ్?" వేద్ అడిగాడు.

"పార్క్ హోటల్ దాటానిప్పుడే"

"నేను మా కాలేజ్ బయటే వేచి ఉన్నాను. త్వరగా రా... ప్లీజ్! బట్ డ్రైవ్‌సేఫ్" అన్నాడు వేద్.

నేను ఫోన్ ఆపి తిరిగి ముందుకు సాగాను. అప్రయత్నంగా బండి వేగం పెంచాను. నాలోనూ, వేద్‌తో గడిపే క్షణాలకోసం తహతహ పెరిగింది. కానీ, మార్గం మధ్యలోనే ఓ ప్రమాదం నాకోసం ఎదురు చూస్తోందని నేనాక్షణం ఊహించలేదు.

కైలాసగిరి రోప్‌వే పాయింట్ దాటి ముందుకు వెళ్తున్నాను. కుడివైపు సువిశాలమైన సముద్రం. తీరం వైపుకు పరుగులు పెడుతోన్న తెల్లటి అలలు. గత కొన్ని రోజులుగా కురుస్తోన్న వర్షాలకి పచ్చచీర కట్టుకున్న కొండలు ఎడమవైపు. రిషికొండ-భీమిలి వైపు వెళ్ళే ఆ రహదారి అందంగా ఉంటుంది.

సముద్రజలాలమీదుగా వీచేగాలి, బైక్ వేగానికి జతై గులాబీ రంగు చున్నీని రెపరెపలాడిస్తోంది.

అప్పుడు ఒళ్ళంతా రక్తగాయాలై నిలబడలేక తూలిపడిపోబోతున్నట్టున్న ఓ వ్యక్తి రోడ్డుపక్కనుండటం చూశాను.

'అయ్యో! ఏదో యాక్సిడెంటనుకుంటాను' అలా తూలిపోతూనే 'లిఫ్ట్ ఇవ్వగలరా' అన్నట్టు సంజ్ఞచేశాడు. నేను హోండా యాక్టివా బ్రేక్ నొక్కాను.

అదే సమయంలో నా వెనుకగా వస్తున్న వాహనం కూడా, అతడిని చూసి ఆగింది.అది తెల్లరంగు స్విఫ్ట్ డిజైర్ కారు. దాన్ని నడుపుతున్న వ్యక్తి కూడా కారు దిగి "ఏమైంది?" అంటూ నావైపు వచ్చాడు.

సరిగ్గా అప్పుడు జరిగింది.నేను 108కి ఫోన్ చేయబోతున్నప్పుడు, వాడి ముఖంలో గాయాల బాధ మా..య..మైం..ది!! సన్నగా నవ్వాడు!

నా నుదురు ముడుచుకుంది. కీడు శంకించి టక్కున బండిమీద కూర్చోబోయాను.

అంతే... కారులోంచి దిగినవాడి బలమైన చేయి నన్ను పట్టుకుంది! నిర్ఘాంతపోతూ బండిని స్టార్ట్ చేయాలని ఇగ్నిషన్‌కీ తిప్పబోయాను. గాయాలైనట్టు నటిస్తున్న వాడు నా చేతిని ఆపేశాడు. ఇద్దరూ కలిసి నన్ను బలవంతంగా స్విఫ్ట్‌వెనుక సీట్‌లోకి తోసేశారు. నా యాక్టివా రోడ్డుమీద పడిన చప్పుడు నాకు వినపడలేదు!! నేనెంత ప్రమాదంలో చిక్కుకుపోయానో తెలిసి భయంతో వణికిపోయాను.

'గీతమ్ కాలేజ్ గేట్ దగ్గర... మరో ఐదు నిముషాల్లో సౌరభ నన్ను చేరుకుంటుంది' అన్న ఆలోచనే వేద్ మనసుని పులకరింపచేస్తోంది.

ఈరోజు తనతో గడిపే ఈ సాయంత్రం ఈ జన్మకే ఓ తీపిజ్ఞాపకంగా మిగలాలి. ప్రేయసి కోసం ఇలా నిరీక్షించడం కూడా ఎంత మధురమైన ఫీలింగ్!' అనుకున్నాడు పదేపదే వాచ్‌వైపు చూస్తూ.

నూటపది కిలోమీటర్లవేగంతో దూసుకుపోతోంది ఆ స్విఫ్ట్ డిజైర్. దారి కాచి, నన్ను బలవంతంగా



ఎత్తుకొచ్చేస్తున్న దుండగుల్లో ఒకడు నా ముఖం మీద గట్టిగా గుద్దాడు. నా పెదవి చిట్లిపోయింది. నెత్తురు పెదవి అంచు మీదుగా కారి మెడ మీదికి పాకుతోంది. ఆ సమయంలో కారు గీతమ్ కాలేజ్‌ని దాటుతోంది! కిటికీ అద్దంలోంచి వేద్ కోసం వెతికాయి నాకళ్ళు. కార్ తాళాలు సిద్ధంగా పట్టుకుని, రోడ్డుపై నేను వస్తున్న జాడకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్న వేద్‌ని చూడగానే నా గుండెల్లో బాధ మెలితిప్పింది.

'వేద్...' కన్నీళ్ళు నా ముఖాన్ని తడిపేస్తున్నాయి.

కారు ఆ కాలేజ్ దాటేసి ముందుకు దూసుకుపోతోంది. సంధ్య చీకట్లు లోకాన్ని అల్లుకుంటున్నాయి. కారు సముద్రతీరం వైపుకి వెళ్తూనే ఉంది.

ఇసుకా, రాళ్ళూ, ముళ్ళపొదలూ అడ్డుపడడంతో ముందుకుపోయే వీలులేక ఆగిపోయింది. డ్రైవర్‌సీట్లో వాడు కారు దిగి వెనుక డోర్ తెరిచాడు.

ఇద్దరూకలిసి నన్నాపొదల్లో కొద్దిదూరం ఈడ్చుకు వెళ్ళారు. చీకటి చిక్కబడింది. "ప్లీజ్!" నేను రెండు చేతులూ జోడించాను "మీకేం కావాలంటే అది తీసుకోండి. గాజులూ, చెయిన్, ఐఫోన్, డబ్బూ... అన్నీ ఇచ్చేస్తాను. నన్ను వదిలి పెట్టండి. ప్లీజ్... మీ కాళ్ళు పట్టుకుంటాను" నా వేడికోలుకి సమాధానమిస్తున్నట్టుగా రెండోవాడు నాచెంపమీద,పిడికిలితో గుద్దాడు. నా నోటి నుంచి ధారగా నెత్తురు కారుతోంది.

కారు నడిపిన ఆగంతకుడు టిన్ బీర్ తీసి దాన్లో ఏదో (రేప్ - డ్రగ్స్) కలుపుతున్నాడు! నా జీవితం ముగిసిపోబోతోందని నాకు తెలిసిపోతోంది. సరిగ్గా అప్పుడు చాలా ఏళ్ళక్రితం నా జీవితంలో జరిగిన ఓ సంఘటన కళ్ళముందు కదిలింది.

ఆ రోజు ఫిబ్రవరి, 14.

హైదరాబాద్, బేగంపేట విమానాశ్రయం.

లీవ్ ట్రావెల్ సబ్సిడీ పైనన్ను,అమ్మని గోవా తీసుకెళ్తున్నారు నాన్న వి...మా..నం..లో. గోవాకి బయల్దేరనున్న విమానంలో కూర్చున్నాం మేం ముగ్గురం.

నావైపే చూస్తూ, నేను థ్రిల్ అవుతుండడాన్ని తన కళ్ళల్లో నింపుకుంటున్నారు నాన్న.

నాతొలి విమానప్రయాణం! నాకెంత సంతోషంగా ఉందో చెప్పలేను. మేం కాకుండా ఇంకా ఎనభై నలుగురు ప్రయాణికులు ఉన్నారు లోపల.

సరిగ్గా 12.25కి మా విమానం గాలిలోకి పైకి (టేకాఫ్) లేచింది!!

నాన్న నన్ను తన ఒడిలో కూర్చోబెట్టుకుని, "చూడు చూడు. మేఘాలు ఎంత బావున్నాయో" అంటూ కిటికీలోంచి కనిపిస్తున్న తెల్లని మబ్బుల ముద్దల్ని చూపిస్తున్నారు.

"బ్యూటిఫుల్ డాడీ" అన్నాను. అప్పుడు విమానంలో చిన్ని కుదుపు. టర్బులెన్స్. తర్వాత వేగంగా క్రిందికి దిగిపోతున్నట్లనిపించింది.

"మన ప్లేన్ క్రిందికి దిగిపోతుందా డాడీ?" అనడిగాను. డాడీ బదులేం చెప్పలేదు. కానీ ఎందుకో నన్ను గట్టిగా తన గుండెలకు హత్తుకున్నారు. త్వరత్వరగా మా విమానం ఆల్టిట్యూడ్ తగ్గిపోతోంది.

ఈసారి చాలా భారీ కుదుపు! స్పీకర్‌లో పైలట్ "మనం క్రిందికి దిగిపోతున్నాం" అని చెప్పాడు.

ఈసారి మరింత పెద్ద కుదుపు తల్లక్రిందులైపోతున్నామేమో అన్నంతగా! భయంతో కొందరు గట్టిగా అరిచారు. నాకూ భయం వేసి డాడీని గట్టిగా పట్టుకుని ఉన్నాను. అందరూ ఊపిరి బిగపట్టారు. "డాడీ..." బిగ్గరగా అరిచాను.

అంతే! మా ప్లేన్ గంటకు నాలుగువందల ఎనభై కిలోమీటర్ల వేగంతో వెళ్తూ ఒక కొండ శిఖరాన్నిఢీకొట్టేసింది. విమానం తాలూకు రెక్క ఒకటి తెగిపోయింది. మిగతా విమానభాగం పక్కనున్న ఇంకో కొండని గుద్దేసింది. క్రాష్! నేను కళ్ళు విప్పిచూశాను. నేనింకా విమానం లోపలే ఉన్నాను ఒక శవం కింద.

"డా.. డాడీ" ఏడుస్తూ నాన్నకోసం చూశాను "మమ్మీ" పిలిచాను.

నాన్న సీట్ వెనక్కు విరిగిపోయి ఉంది. ఒంగిచూశాను. స్వచ్ఛమైన తీయని నవ్వు మెరుస్తోంది. నాన్న పెదవులమీద. కానీ..."డాడీ" పట్టుకుని కదిపాను. ఏ చిన్న కదలికా లేదు నాన్నలో.

నా కళ్ళలోంచి ధారాపాతంగా కారిపోతున్నాయి కన్నీళ్ళు. నాన్న ప్రాణాలతో లేరని తెలుస్తోంది నాకు. అమ్మకోసం చూశాను. నాన్న శరీరం క్రిందే ఉంది అమ్మ. "మమ్మీ... మమ్మీ... లే... మమ్మీ" అంటూ ఏడుస్తూ అమ్మ శరీరాన్ని ఊపేస్తున్నాను.

అమ్మ నిశ్చలంగా ఉంది. నిర్జీవంగా కూడా!



ప్రయాణం ఓ ప్రవాహం

తాను సినిమాల్లోకి వచ్చినది మొదలు అప్పటి కప్పుడు తీసుకునే నిర్ణయాలే మినహా ప్రత్యేక ప్రణాళిక అంటూ లేదంటున్నది పూజా హెగ్డే.

పరిశ్రమకంటే కూడా కలిసి పనిచేసే వ్యక్తులు, సినిమాల సంఖ్య కంటే కథలు ముఖ్యమన్నది ఆమె నిశ్చితాభిప్రాయం అట.

"దక్షిణాదిలో ఇన్ని సినిమాలు చేయాలి, హిందీలో ఇన్ని చేయాలి అన్న లెక్కలు నాకు లేవు. నా ప్రయాణం ఓ ప్రవాహం మాదిరి సాగుతున్నది.

కథను అనుసరించి నిర్ణయం తీసుకుంటుంటా" అని చెప్పిన పూజాహెగ్డే మొదటిసారిగా 'రంగస్థలం' సినిమాలో ప్రత్యేకగీతంలో నర్తించింది. సవాల్ వంటి అనుభూతి కలిగిందని చెప్పింది.



నా శరీరం అంతా లోతైన గాయాలు. అక్కడ నా చుట్టూ చెల్లాచెదురుగా పడివున్న శ..వా..లు!

కొన ఊపిరితో ఉన్నవాళ్ళు బాధతో విలవిల్లాడుతూ మూలుగుతున్నారు. నన్ను చూసిన ఒక వ్యక్తి "నేను ఎం.పీ.ని. నన్ను రక్షించడానికి వస్తారు. భయపడకు" అన్నాడు. కానీ మరుక్షణమే ఆయన నోటిమాట ఆగిపోయింది.

మనిషి 'ప్రాణం విడవడాన్ని' చూస్తున్నాను. ఇక అక్కడ ఏ సవ్వడీ లేదు. ఏ చ.ల.న.మూ లేదు! అన్నీ ఆగిపోయాయి... నిశ్శబ్దం. మళ్ళీ అమ్మానాన్నల దగ్గరకు వెళ్ళి వాళ్ళిద్దరిపైన పడి గుండెలు పగిలేలా ఏడ్చాను. అలా ఎంతసేపు రోదించానో తెలీదు.

అంతమంది మధ్య నేనిప్పుడు 'ఒంటరి'ని! రెండు రోజులు అలా అడవిలో గడిపాను. ఏమీ తినలేదు, ఏమీ తాగలేదు. మూడోరోజు వాన కురిసింది. వానలో తడిసిన నా గౌను పిండి ఆ నీళ్ళు తాగాను.

నా కాళ్ళు బాగా ఉబ్బిపోయాయి. నా చేతుల మీద జలగలు పాకుతున్నాయి. నా పక్కనున్న ఒక శవం కుళ్ళిపోతోంది. నాలుగో రోజునగానీ సహాయక బృందాలు అక్కడికి రాలేదు. నన్ను చూసి, వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

మొత్తం తొంభైరెండుమంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి! నిజానికి ఈ లెక్క సరికాదు. తొంభైమూడు! అమ్మ కడుపులో ఉన్న నా చిట్టి తమ్ముడుతో కలిపితే!!

విమాన ప్రమాదం జరిగిన ఆ (ఫిబ్రవరి, 14) నాటినుండి నా చుట్టూ నీడలా నన్నంటి పెట్టుకుని ఉండేది ఒకే ఒకటి. అది భయం. ఒక్కోసారి ఆత్మహత్య చేసుకుని అమ్మానాన్నల దగ్గరకు వెళ్ళిపోవాలనిపించేది.ఆ 'భయం' లోనే ఒంటరిగా పెరిగాను.

వేద్ ప్రేమలో నాకు నాన్న కనిపించారు. వేద్‌ని కలిశాకే నాకు ధైర్యం తెలిసి వచ్చింది. వేద్ ఒక మాట చెప్పాడు-

"సౌరభా! ఆ ప్లేన్‌క్రాష్‌లో మొత్తం అందరూ మరణించినా నువ్వొక్కదానివే బ్రతికావంటే దానివెనుక ఏదో కారణం ఉండి ఉంటుంది. ఒక 'పర్పస్' ఉండి ఉంటుంది.

నీకారణంగా జరిగే ఏదో ఒక మంచి కొరకే ఆ భగవంతుడు నిన్ను బ్రతికించి ఉంటాడు!"

ప్రస్తుతం : చీకటి చిక్కబడుతోంది. సముద్రపు అలల సవ్వడి దగ్గరగా వినిపిస్తోంది. మాదకద్రవ్యాలు కలిపిన బీర్-టిన్ నావైపుకి తీసుకొస్తున్నాడు వాడు.

'సౌరభా! ఆ ప్లేన్‌క్రాష్‌లో మొత్తం అందరూ మరణించినా నువ్వొక్కదానివే బ్రతికావంటే దాని వెనుక ఏదోకారణం ఉండివుంటుంది...' వేద్‌చెప్పిన మాటలు నా గుండెల్లో మారుమోగుతున్నాయి.

"..... నీ కారణంగా జరిగే ఏదో ఒక మంచికొరకే ఆ భగవంతుడు నిన్ను బ్రతికించి ఉంటాడు!" నాలో ఏదోతెలీని తెగింపు.'బ్రతకాలి' అన్న ఆశ.నన్నుచంపాలనుకుంటున్న చావునే చంపేయాలన్నంత ధైర్యం!ఆ ఇద్దర్నీ ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నాను.

"ఇది తాగు. ఇక ఏమీ తెలీదు.నువ్వు పెనుగులాడటం, మేం నిన్ను హింసించడం ఇవేవీ లేకుండా 'సైలెంట్'గా జరిగిపోతుందంతా..." వాడు ఆ టిన్‌ని నా నోటివైపు జరిపాడు. నేను నిశ్శబ్దంగా దాన్ని చేతుల్లోకి తీసుకున్నాను.

"ఊ... తాగు" రెండోవాడు తనచొక్కా విప్పుతున్నాడు. నేను ఆ టిన్‌ని గట్టిగా పట్టుకున్నాను.

శరీరంలోని శక్తినంతా చేతిలోకి తెచ్చుకునిబలంగా ఒకడి కంటిమీద గుద్దేశాను.ఎంత బలంగాగుద్దానంటే టిన్ సొట్టపడి క్రష్ ఐపోయింది. ఆ టిన్ తాలూకు అంచు వాడి కనుగ్రుడ్డులోకి దిగబడిపోయింది.

"రేప్ నవీన్, దాన్నొదలకు ఏసేయ్. కిల్ హెర్" అరిచాడు కనుగ్రుడ్డు చితికిపోయినవాడు.

ఆ నవీన్ అన్నవాడు కోపంతో ఊగిపోతూ నా మీదికి లంఘించాడు. కొద్దిదూరంలో బండరాయి ఒకటి కనిపించింది నాకు. గభాల్న అక్కడికెళ్ళి ఆ రాయి అందుకున్నాను. వాడు కత్తితీశాడు. కత్తి చూడగానే భయంతో వెనకడుగు వేస్తాననుకుని ఉంటాడు. కానీ నేను పారిపోలేదు. వాడు శరవేగంతో నాపైకి దూకి కత్తితో బలంగా పొడిచేశాడు.

అది నా ఛాతిలో దిగబడకుండా నేర్పుగా ప్రక్కకు జరిగేసరికి, భుజంలో దిగిపోయింది.

ఆ కత్తిపోటుని లెక్కచేయలేదు. నేను పంటి బిగువన బాధ ఓర్చుకుంటూనే చేతుల్లో ఉన్న బండ రాయితో వాడి తలపై బలంగా మోదాను.

గ్లోబ్ హాస్పిటల్స్. నా భుజానికి తగిలిన లోతైన గాయానికి, ముఖంలోని ఇతర గాయాలకీ వైద్యులు చికిత్స చేస్తున్నారు. వేద్ నాతోనే ఉన్నాడు. కొద్దిసేపటి తర్వాత, అక్కడున్న టీవీ తెరమీద 'యువతి సాహసంతో సీరియల్ రేపిస్టులను పట్టుకున్న పోలీసులు' అన్న వార్తాంశం ప్రసారమవుతుండటం వేద్‌తోపాటు నేనూ చూశాను.


వేద్ నా చెంతగా వచ్చి నా నుదుటిపైన ముద్దు పెట్టుకున్నాడు నిశ్శబ్దంగా. అప్పుడు నేను వేద్‌చేతిని నా చేతిలోకి తీసుకుని "వేద్! ఎందరి ఆడపిల్లల జీవితాల్నో చిదిమివేసిన రాక్షసులు వాళ్ళు.

నేనూ వాళ్ళ చేతుల్లో చనిపోతాననుకున్నాను. కానీ నీ మాటలే నాలో ధైర్యాన్ని నింపాయి.

చిన్నతనంలో జరిగిన ఆ ఘోర విమానప్రమాదంలో అందరూ చనిపోయినా నేనొక్కదాన్నే 'సోల్ సర్వైవర్'గా మిగిలిపోవడం వెనుక ఏదో కారణం ఉండి ఉండాలి అన్న నీ మాట నిజం అనిపించింది.

నేను చేయవలసింది ఏదో మిగిలి ఉందనిపించింది!! అసలు ఆ దుర్ఘటనతో పోల్చితే ఇది చిన్ని 'సమస్య'లా అనిపించింది. ఇలాంటి నరరూపరాక్షసుల్ని శిక్షించక పోతే ఇంకెందరో యువతుల్ని బలి తీసుకుంటారు. అందుకే పోరాడాను" చెప్పాను.

"పోరాడి,గెలిచావ్.నిజమే నువ్వుచేయవలసింది ఇంకా చాలా మిగిలివుంది! పెళ్ళిపీటలమీద సిగ్గుపడుతూ నాపక్కన కూర్చుని మూడుముళ్ళూ వేయించుకోవడంతో సహా!" నవ్వుతూ, ఆర్తిగాచెప్పాడు వేద్. వేద్ నవ్వులో ఎప్పుడూ 'నాన్నే' కనిపిస్తుంటారు నాకు!!



కేంద్రం అరకొర సాయానికే మమ్మల్ని లెక్కలు తేల్చాలంటున్నది.
-యనమల రామకృష్ణుడు, ఏ.పి. మంత్రి





Courtesy : VANITHA

హ్యాపీ హార్మోన్స్

"ఆనందం చైతన్యశీలమయిన మానసిక అనుభూతి. కోరుకున్నది దొరికినప్పుడు ఆనందం లభిస్తుంది. మీకు ఇష్టమైనది, అనుకోకుండా, అకస్మాత్తుగా లభిస్తే మీలో ఆనందానుభూతి తలెత్తుతుంది. మన సంతోష విషాదాలు, మానసిక స్థితిపై ఆధారపడి వచ్చిపోతుంటాయి" ఇలా అని ఎన్నోసార్లు వినివుంటాం, చాలావరకు ఇది సరైనదే.

మనం ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవితం గడపటానికి మన మనస్సుకు ఆనందం అవసరం.

అలా మనకు ఆనందాన్ని అందించే హార్మోన్‌ల గురించి వివరంగా తెలుసుకుందాం.

ఎండార్ఫిన్స్

ఇవి మన శరీరంలో ప్రకృతిసిద్ధంగా వుండే హార్మోన్. ఇది బాధను తగ్గిస్తుంది.

నొప్పి తలెత్తకుండా ఆపుతుంది. సంతోషానుభూతికి ఈ హార్మోనే కారణం. మనకు బాగా ఇష్టమయినది లేదా మంచిది అనిపించినది, మన అనుభవంలోకి వచ్చినప్పుడు సంతోషం జనిస్తుంది.

సంగీతం, ఆహారం లేదా సన్నిహితుల వ్యక్తుల ద్వారా పొందే విషయాలు సంతోషాన్నిస్తాయి.

ఎండార్ఫిన్ స్థాయిలను పెంచుకోవటం :

* దీర్ఘకాలంగా బాధిస్తున్న, ఇబ్బంది పెడుతున్న నొప్పి లేదా బాధలనుండి ఉపశమనానికి ఎండార్ఫిన్ హార్మోన్లు విడుదల కావటానికి అతి మంచి మార్గం వ్యాయామం చేయడం.
* మిర్చిబజ్జీ కొరికినప్పుడో, బాగా కారంగా వున్న పదార్థాలు తిన్నప్పుడో మన మెదడుకు బాధలాంటి సిగ్నల్స్ చేరతాయి. దాంతో శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి.
* రోజంతా క్షణం తీరిక లేకుండా వున్నప్పటికీ మీరు అమితంగా ఇష్టపడే పనులకు ప్రతిరోజూ తప్పని సరిగా సమయం కేటాయించాలి. అల్గా ఇష్టమైన విషయాలకోసం సమయం గడిపినప్పుడు సహజసిద్ధంగా శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి.

సెరటోనిన్

దీనిని ఆనందపు హార్మోన్ అని పిలుస్తారు.

ఇది మన మానసికస్థితిని సరయిన స్థితిలో వుండేటట్టు నియంత్రిస్తుంది.

ఇది మనసుకు కృంగుబాటు, ఆందోళనరాకుండా అడ్డుపడుతుంది. చికాకును తగ్గిస్తుంది.

ఆనందపు అనుభూతిని సొంతం చేస్తుంది.

అంతా మంచిగా అనిపిస్తుంది.

సెరటోనిన్ స్థాయిని పెంచుకోవటం :

* సూర్యకాంతి మీ మీద బాగా పడేట్లు చూసుకోండి. అందుకు రోజూ కాసేపు బయట కూర్చోవడం, తిరగడం చేయాలి. దానివలన మీలో 'డి' విటమిన్ పెరుగుతుంది.
* గుడ్లు, ఛీజ్, టర్కీ, సాల్మన్ చేపలు, నట్స్, అనాస పండు, పన్నీరులాంటి ఆహారపదార్థాలు తినటం వల్ల సెరటోనిన్ స్థాయిలు పెరుగుతాయి.
* అలాగే పాలు మరియు మొక్కజొన్నలతో చేసిన పదార్థాలవల్ల కూడా సెరటోనిన్ లభిస్తుంది.
* రోజూ ధ్యానం చేయటంవలన శరీరంలో ఒత్తిడి దూరమై సెరటోనిన్ నిల్వలు పెరుగుతాయి.

డోపమైన్

డోపమైన్ మనకు సంతోషాన్ని ఇచ్చే హార్మోన్. ఈ హార్మోన్‌వలన లక్ష్యంపై సరిగ్గా దృష్టి నిలపగలుగుతాం. అనుకున్న పని పూర్తయినవెంటనే తృప్తిని కలిగించే హార్మోన్ డోపమైన్.

లక్ష్యాన్ని అందుకోవటంవలన కొద్ది క్షణాలసేపు తృప్తితో కూడిన సంతోషం మన మనస్సంతా నిండిపోతుంది. దీనికి కారణం డోపమైన్.

డోపమైన్ స్థాయిలను పెంచుకోవటం :

* చేసే ప్రతి పనిలోను, ప్రతి స్థాయిలోను కొన్ని లక్ష్యాలను ఏర్పరచుకోండి. వాటిని అందుకోవటానికీ తీవ్రంగా ప్రయత్నం చేయండి. లక్ష్యాలను చేరుకోవాలన్న ప్రయత్నంవల్ల మనలో ఆనందపు స్థాయి అద్భుతంగా పెరుగుతుంది.
* వ్యాయామం చేయటంలోకూడా కొన్ని లక్ష్యాలను నిర్ణయించుకోండి. వ్యాయామం చేయటంవలన శరీరంలో డోపమైన్ స్థాయి పెరుగుతుంది. పెరిగిన డోపమైన్, సెరటోనిన్ మరియు ఎండార్ఫిన్ శరీరంలోకి చక్కగా విడుదలయ్యేట్టు చేస్తుంది.
* మెదడు పనితీరుకు బాగా ఉపయోగించే సాధనం, రోజువారీ వ్యాయామం.
* డోపమైన్ మెదడులోని కణాలు వయస్సుతోపాటు కృంగుబాటుకు లోనుకాకుండా చేస్తుంది. కొత్త కణాలు ఉత్పత్తి అయ్యేట్టు చూస్తుంది. అంతేకాక మెదడుకు పోషకాలు సరిగ్గా అందేట్టు చేస్తుంది.
* టమోటోలు, బ్రకోలీ, అవకాడో, బంగాళాదుంపలు, కొత్తిమీర, కమలాలు, మొలకెత్తిన విత్తనాలు, మొదలయిన ఆహార పదార్థములలో డోపమైన్ మనకు లభిస్తుంది.
* ముఖ్యంగా అరటిపళ్ళల్లో మనకు డోపమైన్ హార్మోన్ బాగా దొరుకుతుంది.
* ప్రొటీన్లు అధికంగా లభించే ఆహారంలో 'ఐ టైరోసిన్' అనే అమినో ఆమ్లం లభిస్తుంది. అది డోపమైన్‌ను తయారుచేస్తుంది.
* ఇంకా ఆలివ్ ఆయిల్, వేరుశనగపప్పులు, ఓట్స్, పుదీనా జాతికి చెందినవి, రోజ్‌మారి, పుచ్చకాయ, సోయా ఉత్పత్తులు, గుమ్మడి గింజలు, నువ్వుపప్పు, పసుపులాంటి పోషకాలు అధికంగా లభించే పదార్థాలను తినాలి.

ఆక్సిటోసిన్

ఇది ప్రేమ హార్మోన్. ఇది మెదడుకు సంకేతాలను పంపించే రసాయనం.

దీనిద్వారా పునరుత్పత్తి వ్యవస్థ, శిశుజననం, బాలింతల్లో పాలుపడటంలాంటి విషయాలలో కొన్నింటిని ఈ హార్మోన్ నియంత్రిస్తుంది.

మనిషి ప్రవర్తనలో ప్రేమని, నమ్మకాన్ని నింపేది, నిలిపేది ఈ హార్మోనే.

ఇది కృంగుబాటుతనానికి పూర్తిస్థాయి శత్రువు. ఆక్సిటోసిన్ అనుబంధాలను ఏర్పరుచుకోవటంలో, నిలుపుకోవటంలో ఎంతో సహాయం చేస్తుంది.

శరీరంలో ఆక్సిటోసిన్ పెంచుకోవటం :

మనచుట్టూ వున్నవారిని మాటలద్వారా, ప్రవర్తన ద్వారా, రకరకాల చేష్టలద్వారా ప్రోత్సహించాలి,మెచ్చుకోవాలి. అలా చేయటంవలన ఎదుటివారు కూడా మనల్ని మెచ్చుకుంటారు, ప్రోత్సహిస్తారు.

దాంతో మనస్సుకు సంతోషం కలుగుతుంది. ఇతరులు మనల్ని ఇష్టపడటంవల్ల మనమీద మనకి నమ్మకం కలుగుతుంది.

ఇతరులపట్ల ప్రేమగాను, బాధ్యతగాను వున్నప్పుడు మనలో ఆక్సిటోసిన్ హార్మోన్ క్రియాశీలకంగా పనిచేస్తుంది.

* నిర్ణీత సమయాలలో శరీరానికి మసాజ్ చేయించుకోవాలి. దానివలన కండరాలకు విశ్రాంతి లభిస్తుంది. తిరిగి పునరుత్తేజంతో పనిచేస్తాయి. అప్పుడు ఆక్సిటోసిన్ విడుదలవుతుంది.
* ఇతర హార్మోన్‌లులాగానే క్రమంతప్పకుండా వ్యాయామం చేయటంవలన ఈ హార్మోన్ శరీరంలో చక్కగా పనిచేస్తుంది.
* వ్యాయామం చేసినప్పుడు మెదడు ద్వారా ఆక్సిజన్ హార్మోన్ శరీరంలోని అన్ని అవయవాలకూ చేరుతుంది.

అలా అని జిమ్‌కు వెళ్ళి అతిగా కష్టపడిపోనక్కరలేదు. వేగంగా నడక, తేలికపాటి యోగావలన కూడా ఈ ప్రేమ హార్మోన్ మనకు కావాల్సినంత లభిస్తుంది.


పాలపర్తి శ్రీకాంత్



Courtesy : SAMSKAR

సీరియల్

సామ్రాట్ సముద్రగుప్త



"ఏమిటీ, ఈ చీకట్లో ఈ భయంకర కీకారణ్యంలో, ఇలా ఒంటరిగా ఏ రక్షణా లేకుండా... ఏ క్రూర మృగాల నోటపడితే..." సారంగుడు ఈసారి సాష్టాంగ ప్రణామం చేశాడు ఆ మహాభాగుడికి.

సముద్రుడు మౌనంగా గురువును అనుసరించాడు.

ఇద్దరూ లేచి కూర్చున్నారు. అపుడుగానీ సముద్రుడు ఆ వ్యక్తిని పూర్తిగా పరిశీలించలేకపోయాడు.

జరిగిన కథ

13

సముద్రగుప్తుడు ఏమయినాడా అని కలత చెందుతున్న మహారాణి కుమారదేవికి పుత్రుడు సారంగుడి ఆశ్రమంలో క్షేమంగా ఉన్నాడని తెలియజేస్తాడు సామ్రాట్ చంద్రగుప్తుడు. కచుడు వచ్చి తల్లిని కలుస్తాడు. సముద్రగుప్తుడికి రాజ్యభారాన్ని అప్పజెప్పాలని తండ్రి చూస్తున్నాడంటూ తన ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తాడు కచుడు.

యువరాజు అదృశ్యమయ్యాడని తెలిసి లావినియా చాలా ఆందోళనపడుతుంది.

లావినియా సముద్రగుప్తుడిని ప్రేమిస్తున్నదని తెలిసి సౌగంధిని అసూయతో రగిలిపోతుంది.

తాను సన్యసించదలిచానని గురువు సారంగుడికి సముద్రగుప్తుడు చెబుతాడు.

సన్యాసం నీకు పనికిరాదని, క్షాత్రధర్మం నిర్వహించాలని చెప్పినా సముద్రగుప్తుడు వినడు.

ఓ కీకారణ్యంలో రక్తబాహుడు అనే దారి దోపిడీ దొంగచేత తలకిందులుగా బంధించబడి తపస్సు చేసుకుంటున్న జటాధారిని బంధ విముక్తుడ్ని చేస్తాడు సారంగుడు.

సముద్రగుప్తుడిని తనవద్దకు తీసుకురమ్మని ఆ జటాధారి చెప్పేసరికి యువరాజుని వెంటబెట్టుకుని తీసుకొస్తాడు సారంగుడు.

ఇక జరిగేది చదవండి.

ఎదురుగా కూర్చున్న ఆ జటాధారికి తన వయసే ఉంటుందని గమనించిన సముద్రుడికి తీరని ఆశ్చర్యమేసింది.

ఉన్నట్టుండి హఠాత్తుగా అన్నాడు జటాధారి- "ధర్మాన్ని సుప్రతిష్ఠం చేసి ధర్మపాలనను చేసే మహా చక్రవర్తి ఈ దేశానికి కావాలి"

"... ... ..."

"సముద్రగుప్తా! అందుకు నువ్వే అన్నివిధాలా అర్హుడవు"


ఈసారి సముద్రగుప్తుడికి, సారంగుడికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. 'ఈ జటాధారికి తన పేరు ఎలా తెలిసింది. ఒకవేళ సారంగుడు చెప్పాడా' గురువువైపు ప్రశ్నార్థకంగా చూశాడు సముద్రగుప్తుడు.

"జటాధారి సర్వజ్ఞుడు సముద్రా!"

సముద్రుడు అర్థమయీ అర్థం కానట్టు చూశాడు.

"నువ్వు ఎవరో, నేను ఎవరో ఈ మహాతపస్వికి మనం చెప్పకముందే తెలుసు సముద్రా...!" సారంగుడు మరింత వివరణ ఇచ్చాడు.

జటాధారి అన్నాడు- "సముద్రా! మనమిద్దరమూ సమవయస్కులం. నువ్వు రాజాంతఃపురంలో నివసిస్తుంటే, నేను ఈ ఘోరారణ్యంలో జీవిస్తున్నాను. నీవు శృంగార సామ్రాజ్యానికి చక్రవర్తివైతే, నేను వైరాగ్య సామ్రాజ్యానికి చక్రవర్తిని. అర్థమయిందా!"



"నేను కూడా మీ అడుగుజాడల్ని అనుసరిస్తాను మహాభాగా!"

'అలా అని ఈశ్వర సంకల్పం కాదు. సముద్రగుప్తా! నువ్వు ఈ ధరణీమండలానికి సామ్రాట్ కమ్మనమని, నన్ను సర్వసంగపరిత్యాగియైన ఈ సన్యాసి కమ్మనమని ఆ పరమేష్ఠి సంకల్పం.

ఈశ్వర సంకల్పాలను అధిగమించి ఏ మానవ సంకల్పాలూ సాగవు. భగవంతుడు మనకు ఇచ్చిన పాత్రను ప్రశ్నించకుండా స్వీకరించటమే మహాజ్ఞానం యువరాజా!"

"కానీ నాకీనాడు నా బుద్ధి సన్యసించమని ప్రేరేపిస్తోంది మహాభాగా!"

జటాధారి నవ్వాడు.

"అది బుద్ధికాదు. నీ చిత్తచాంచల్యంమాత్రమే"

సముద్రగుప్తుడు తలవిదిల్చాడు.

"యువరాజా! అయినా సన్యాసమంటే నీకెందుకంత మక్కువ?"

"అలా అని మనస్సు కోరుకుంటోంది" అన్నాడు సముద్రగుప్తుడు.

"నిజానికి సన్యాసాశ్రమానికంటే గృహస్థాశ్రమే అసిధారావ్రతం సముద్రా! కాలుష్య ప్రపంచంలో మెలుగుతూ, ప్రపంచంలోని ప్రలోభాలకు లొంగకుండా, ధర్మబద్ధ జీవితం గడపటమే ఒక మహా తపస్సు.

చుట్టూతా అనురక్తి ఉన్నా, దానికి ఆకర్షింపబడకుండా విరక్తిని సాధించటం, నిజమయిన అసిధారవ్రతం. ఇంతకుమించిన తపస్సు ఈ ముల్లోకాలలో దొరుకుతుందా యువరాజా!"

"... ... ..."

"నీకు సత్యాన్ని బోధిస్తున్నాను రాకుమారా! గృహస్థాశ్రమధర్మంకూడా ఒక మహాయజ్ఞమే. నువ్వా భూమికలోనే ఉండాలని పరమేశ్వర సంకల్పం"

సముద్రుడు ఆలోచిస్తున్నాడు... తర్కించుకుంటున్నాడు. అలా ఎంతసేపయిందోకాని ఉన్నట్టుండి సముద్రుడికి ఆకలి మొదలయింది.

ఆహారం లేకుండా ఒకరోజుకుపైగా అయింది. చూస్తుండగా ఆపుకోలేని ఆకలిజ్వాలలు వ్యాపించి అతడ్ని అణువణువునా దహించటం ప్రారంభించాయి.

జటాధారి నవ్వి- "పాపం ఆకలి దప్పులకు అలమటించిపోతున్నాడు సన్యాసి" అన్నాడు.

సముద్రగుప్తుడికి ఆ మాటల్లో హేళన సూటిగా తగిలింది. మౌనంగా తలవంచుకున్నాడు. ఉన్నట్టుండి మళ్ళీ కుండపోతగా వర్షం ఆరంభమయింది. చలిగాడ్పులు మొదలయ్యాయి... ఈసారి ఆ చలిగాలికి శరీరంలో వణుకు ఆరంభమయింది సముద్రుడికి.

పరిస్థితిని గమనించిన జటాధారి "పద యువరాజా! అంతఃపురంలో పెరిగిన సుకుమారుడివి. నీకీనాడు ఎన్ని కష్టాలొచ్చాయ్. అలా వెళ్ళి ఆ మర్రిచెట్టు బోదెదగ్గర కూర్చుందాం"

జటాధారిని మౌనంగా అనుసరించారు, ఆ ఇరువురూ. ఆ ముగ్గురూ వెళ్ళి మర్రిచెట్టు మానుకింద చతికిలపడ్డారు. సముద్రగుప్తుడు ఆకలిదప్పులకు తాళలేక ఆ చీకట్లో చలిలో వణికిపోతూ తన రెండు చేతులతో శరీరాన్ని కప్పుకున్నాడు.

అతికష్టంమీద నిగ్రహించుకుంటున్నాడుగానీ, సారంగుడి పరిస్థితి అలానే ఉంది. ఇంతలో పైనుంచి ఏవో పక్షుల కిలకిలలు వినిపించాయి.

ఆ మర్రిచెట్టుపైన కొమ్మల్లో ఒక గూడు కన్పిస్తోంది.

ఆ గూడులోంచి రెండు పక్షులు తలలు బయటకు పెట్టి చూస్తున్నాయి. అవి రెండూ బయటకు వచ్చి కిలకిలలాడుకోవటం ప్రారంభించాయ్!

జటాధారి అన్నాడు- "పాపం అవి అల్లల్లాడిపోతున్నాయ్!"

సారంగుడు ప్రశ్నార్థకంగా చూశాడు.

జటాధారి "అవి ఏమని మాట్లాడుకుంటున్నాయో తెలుసా సారంగా!"

ఈసారి ఇరువురూ జటాధారివైపు ఆశ్చర్యంగా చూశారు.

"మన నివాసానికి అతిథులొచ్చారు. పాపం చలికి వణికిపోతున్నారు. ఆకలి కూడా వేస్తుందో ఏమో! ఇపుడేం చేద్దాం అని సతమతమవుతున్నాయి"

సముద్రగుప్తుడిలో తీరని ఆశ్చర్యం "పక్షులు మాట్లాడుకుంటాయా? వాటి భాష మీకర్థమవుతుందా!"

జటాధారి అన్నాడు- "అవును. పక్షులకూ భాషఉంటుంది. యోగమార్గంలో అభివృద్ధిచెందే కొందరు యోగులకు, ఒక్కోసారి జంతువులు, పక్షుల భాషలు కూడా కరతలామలకమవుతాయి. నాకూ ఆ సిద్ధి ఉంది... అంతేకాదు, సముద్రగుప్తా...!"

ఆ ఇద్దరూ చెవులు రిక్కించి ఆశ్చర్యంగా వింటున్నారు.



సి.శివరామమూర్తి



నటన, ఇల్లు, నిద్ర

'లోఫర్' పిల్ల దిశాపటాని దశ 'భాగి-2'తో తిరిగిపోతున్నట్లే ఉంది. సినిమా సక్సెస్ బాటపట్టేసి, కాసుల వర్షం కురిపిస్తున్నది.

ఈ విషయమై దిశను కదిలిస్తే సంతృప్తిగా కబుర్లు ఒలికించింది. "నేను ఎటువంటి సినీనేపథ్యం లేకుండా పరిశ్రమలోకి వచ్చాను. నటనంటే నాకు ఎంతో ఇష్టం. నటన, ఇల్లు, నిద్రమినహా మరో ఆలోచన వుండదు.

ముంబయిలో కాలుపెట్టినప్పుడు నా చేతిలో ఉన్నది ఐదువందల రూపాయలే. ఎన్నో ఆడిషన్లు, కొన్నిచోట్ల తిరస్కారాలు, కొన్నిచోట్ల అవమానాలు. అన్నింటినీ భరించాను.

పాజిటివ్‌గా ఆలోచించే తత్వం కావడంతో అన్నీ తట్టుకున్నాను. కష్టాల నుంచి ఎన్నో నేర్చుకున్నాను" అంటూ చెప్పుకొచ్చింది దిశాపటాని.

"కొందరు యోగసాధకులు, కొందరు మహా పురుషులు మానవ శరీరాలే కాకుండా మిగిలిన జీవకోటి శరీరాలు ధరించడం కూడా జరుగుతూంటుంది. ఈ కపోత జంట పూర్వజన్మలో మహా తపస్సంపన్నులు. మహాధార్మికులు. గృహస్థాశ్రమములో పండిపోయిన మహత్ దంపతులు"

"... ... ..."

"నన్ను దొంగలు ఈ చెట్టుకు బంధించి వెళ్ళిపోతే నా శరీరాన్నిచీమలు పీక్కొని తినకుండా కాపలా కాయటం మొదలుపెట్టాయ్ ఈ పక్షులు.

నాకు ఎంతో సేవచేసేవి! ఆ తరువాత నేను, ఈ కపోత దంపతులకు నా రక్షణ బాధ్యతను తొలగించేందుకు, శవాసనము వేసి తపస్సు చేయటం మొదలుపెట్టాను.

ఎప్పుడైతే ఈ శరీరం శవంలాగా జీవంలేని కట్టెలాగా మారిపోయిందో, మిగిలిన కీటకాలు నన్ను భక్షించకుండా వదిలివేశాయ్! అంతటితో ఈ కపోత దంపతులకు నాసేవాభారం నుంచి విముక్తి కలిగింది"

"ఇది నిజమా... కలా!" సముద్రగుప్తుడు ఆ క్షణంలో ఆకలిదప్పులు, చలిని మరచిపోయి ఆశ్చర్యంలోకి జారిపోయాడు.

సారంగుడిలో కూడా అదే భావ సంచలనం. ఈ భూమి తపోభూమి. యోగభూమి, కర్మభూమి, మహామహిమాన్వితులూ, మహాతపస్సంపన్నులూ, మహాపురుషులకు పుట్టినిల్లు.

ఆలవాలం, ఈ మహిమాన్వితావని, ఈ భారతావని, ఈ మహాభూమిలో ఎందరో మహా యోగులు జన్మించారు. కొందరు ప్రచ్ఛన్నంగా, మరికొందరు అప్రచ్ఛన్నంగా. భగవంతుడు వారి వారికిచ్చిన పాత్రలను పోషించి కాల గర్భంలో కలసిపోయారు.

జటాధారి కూడా అటువంటి ఒక మహాపురుషుడే. ఒక్కసారి ఆ ఇరువురూ, జటాధారికి సాష్టాంగ ప్రణామం చేశారు.

జటాధారి అదేమీ పట్టనట్టుగా నిర్వికారంగా కూర్చుండిపోయాడు. మరి ఒక అరఘడియ గడిచింది.

ఇంతలో ఎక్కడనుంచో వచ్చాయి, కపోత దంపతులు. తమ ముక్కులతో చిన్న చిన్న చితుకుల్ని తీసుకువచ్చి వారిరువురికెదురుగా పేర్చటం మొదలుపెట్టాయ్!

సారంగుడికి, సముద్రగుప్తుడికి ఆశ్చర్యం పెరిగిపోతోంది.

చూస్తూండగా మరొక ఘడియలో ఆ కపోత దంపతులు పెద్ద ఎత్తున పొడిచితుకుల్ని పేర్చాయ్! ఈసారి ఆ రెండూ ఎగిరిపోయి చాలాసేపైనతరువాత వచ్చాయ్! అప్పటికి రాత్రి నడిఝాములోకి ప్రవేశించబోతోంది.

సముద్రగుప్తుడికి సారంగుడికి ఈసారి ఆశ్చర్యం పట్టపగ్గాల్లేకుండాపోయింది. ఆ కపోతదంపతుల ముక్కులలో సగం మండిపోయిన అగ్నిసమిథ. ఎక్కడనుంచి తెచ్చాయో కాని, ఆ రెండు సమిథలను ఆ చితుకులమీద పడవేశాయ్!

జటాధారి ఆ ఇరువురితో "కానీయండి... అతిథులకోసం అవి పడ్డ శ్రమను వృథాచేసి ఆ దంపతులకు అసంతృప్తి కల్గచేయవద్దు" అన్నాడు.

సముద్రగుప్తుడు ఆ చలికి తాళలేకపోతున్నాడు. ఎదురుగా పొడిచితుకులు, అగ్ని కనపడేటప్పటికి కళ్ళలో కొత్త కాంతి వచ్చింది.

సారంగుడు వెంటనే రెండు దోసిళ్ళను ముందుకు చాచి ఆ చితుకులపైన అగ్నిని రాజేశాడు. మరికొద్ది క్షణాలలో అగ్ని రాజుకుని మంట వెలిగింది. నలువైపులా వెచ్చదనం ఆవరించింది.

సారంగుడికి, సముద్రుడికి పోయిన ప్రాణం లేచివచ్చినట్టయింది. కాస్త కాస్తగా ఒళ్ళు వెచ్చ చేసుకుంటూ చలి బాధ తీర్చుకున్నారు.

అయితే మరి ఒక కొత్త సమస్య మొదలైంది. అది భరించలేని ఆకలి.

సారంగుడు నిగ్రహించుకోగలుగుతున్నాడు కానీ, సముద్రుడికి మాత్రం వశం కావటంలేదు. ఉన్నట్టుండి సముద్రుడు ఆకలికి తట్టుకోలేక "అమ్మా!" అని ఆక్రోశం చేశాడు.

జటాధారి "ఓహో ఆకలి వేస్తోందా? ఈ సమయంకాని సమయంలో ఆహారమెక్కడ దొరుకుతుంది. తెల్లవారితే నీ సమస్య తీరగలదు. అంతవరకు ఈ జఠరాగ్నిని నిగ్రహించు సముద్రా!"

సముద్రగుప్తుడు నిస్సహాయంగా తల విదిల్చాడు.

'ఏమిటీ ఆకలి... ఇలా దహించి వేస్తోంది' అతనిలో ఆక్రోశం, ఆశ్చర్యం! పైన కపోతాలు మళ్ళీ కితకితలాడుకోవటం ప్రారంభించాయ్! అవి చాలాసేపు కితకితలాడుతూనే ఉన్నాయ్!

ఉన్నట్టుండి అవి చేసే కిలకిలలు కాక మరో చిన్న గొంతుక కూడా వినిపించింది! సముద్రుడు, సారంగుడు తల ఎత్తి చూశారు.

జటాధారి అన్నాడు... "కపోత కుటుంబం నివసిస్తోంది. ఈ దంపతులే కాక వాటి ఒక పిల్లకూడా ఉన్నది"

"అవి ఏం మాట్లాడుకుంటున్నాయి మహాత్మా!" సముద్రుడు అడిగాడు.

జటాధారి నవ్వి "అతిథుల సమస్య వాటికర్థమయింది. మీరిరువురూ ఆకలితో దహించుకుపోతున్నారని అవి చర్చించుకుంటున్నాయ్!"

"మరి..." సముద్రుడు ఆశ్చర్యంగా చూశాడు.

జటాధారి అదోలా నవ్వి-

"చూద్దాం... ఆ సర్వాంతర్యామి ఆ కపోత దంపతులకు ఏ ప్రేరణ ఇవ్వనున్నాడో..." అన్నాడు.

సముద్రుడూ, సారంగుడు కనులు ఆర్పకుండా తల పైకెత్తి చూస్తున్నారు. ఆ దంపతులు అలా చాలాసేపు ముచ్చటిస్తూనేవున్నాయ్!

ఉన్నట్టుండి ఆ దంపతుల్లో మగ పావురం రివ్వుమని వచ్చి ఆ మండుతున్న అగ్నిలోకి దూకి చూస్తూండగా ప్రాణం విడిచింది.

సముద్రుడికి, సారంగుడికి నోట మాటరాక చేష్టలుడిగిపోయారు.

జటాధారి "సముద్రా! నీ ఆహారం కోసం ఆ కపోతం తన శరీరాన్ని అర్పించుకొంది" అన్నాడు.

సముద్రుడు ఒక్కసారి దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు. "అమానుషం... అమానుషం" అని

చూస్తూవుండగానే ఈసారి ఆడ



నాకు రాజకీయాల గురించి తెలియదు... కాని పవన్‌కళ్యాణ్ గనుక రమ్మని పిలిస్తే రాజకీయాల్లోకి వస్తాను.

-నితిన్, నటుడు

కపోతం కూడా తన భర్తను అనుసరిం చింది. ఆ వెనువెంటనే ఆ దంపతుల బిడ్డ కూడా, ఆ అగ్నిలోకి దూకి ప్రాణ త్యాగం చేసుకున్నది.

ఈసారి సముద్రుడు వనమంతా ప్రతిధ్వనించేలా వలవలమని ఏడ్వడం మొదలుపెట్టాడు.

"ఇది అన్యాయం, ఘోర అన్యాయం. నేను అల్పమానవుడ్ని. ఈ త్యాగాన్ని భరించలేను. నేను చాలా ఘోరపాపం చేశాను. ఈ పాపానికి నేను కారకుడ నయ్యాను..." అలా ఆక్రోశిస్తున్నాడు. నిర్విరామంగా సతతధారగా, అలా ఏడుస్తూనేవున్నాడు.

సారంగుడికి అయితే మాట పడి పోయినట్టుగా అయి, శిలావిగ్రహంలా కూర్చుండిపోయాడు.

కొంతసేపు అయ్యాక జటాధారి అన్నాడు మంద్రస్వరంతో "చూశావా, సముద్రా! దీన్నే గృహస్థాశ్రమం అని అంటారు. త్యాగసాధనకవసరమైన మహత్తరభూమిక. ఇపుడు చెప్పు, గృహ స్థుపై త్యాగాన్ని ఆశ్రయిస్తావో, సన్యా సిపై తపస్సును ఆశ్రయిస్తావో!"

మహారాణి కుమారదేవి, లావి నియాను ఉన్నఫళాన రమ్మనమనటం సౌగంధిని, సుకన్యలకేకాక లావినియాని కూడా ఎంతో ఆశ్చర్యపరచింది.

"మహారాణి మనోగతం ఏమిటో?" లావినియా పరిపరివిధాల ఆలోచించు కుంటోంది. ఇక్కడ తన ఉనికి ఇంత వరకు ఎవరికీ తెలియదని అనుకుం టోంది లావినియా అమాయకంగా. కానీ ఎన్ని జతల కళ్ళు, ఎందరో తనను అనుక్షణం గమనిస్తున్నాయన్న విష యము గ్రహించలేకపోయింది.

ఆఖరకు కచుడికి, కశ్యపబ్రహ్మ లకు కూడా లావినియా ఉదంతం చిలువలుపలువలుగా చేరింది.

వాళ్ళిద్దరికీ అర్థమయిన విషయం లావినియా నిరుపమాన సౌందర్యవతి. దివినుంచి భువికేతెంచిన మానవకాంత రూపంలోని దేవకాంత.

కచుడికి తీవ్రమైన అధికారకాంక్షే ఉన్నదికాని స్త్రీ వ్యామోహం లేదు.

స్త్రీలకోసం రక్తపాతాలు జరిగాయి అంటే కచుడు నవ్వుకునేవాడు.

'ఎంతటి బలహీనులీ పురుషులు!' ఒక స్త్రీకోసం దాసోహమని సమస్తాన్నీ పణం పెట్టే మనుషులంటే అతనికి ఎంతో ఏవగింపు ఉండేది.

జ్యేష్ఠుడైన కచుడికి యుక్తవయసు దాటినా ఇంతవరకు వివాహం కాకపోవ టానికి ఒక రాజకీయ మెలిక ఉన్నది.

కుషాన్ల వంశానికి రాజు కిదా రుడు. ఆ కిదారుడు గాంధార దేశాన్ని పరిపాలించేవాడు.

రాబోయే గుప్తసామ్రాజ్య విస్తరణకు కుషాన్లతో శత్రుత్వం వహించి సాధిం చాలా లేక మైత్రి హస్తంతో జయిం చాలా అని అనేక రోజులు కశ్యపబ్రహ్మ, కచగుప్తులు తర్జనభర్జన పడటం జరి గింది. కుషాన్లు పర్వత యుద్ధాలలో ఆరితేరినవారు.

అంతేకాకుండా కిదారుడు భారత దేశానికి పశ్చిమ తీరంనుంచి వచ్చే విదేశీయులను అరికట్టడానికి ఒక ఆనకట్టలా ఉండేవాడు.

కుషాన్లను జయిస్తే పశ్చిమ భార తంలో గుప్తసామ్రాజ్యానికి ఏకచ్ఛత్రాధి పత్యం పశ్చిమ సముద్రతీరంవరకు విస్తరించుకుంటుంది.

కశ్యపబ్రహ్మ మంత్రాంగంలోని పథకం ప్రకారం మూడు సముద్రాల వరకు గుప్త సామ్రాజ్యం విస్తరించు కోవాలి. అంతటి సువిశాల సామ్రా జ్యాన్ని స్థాపించటం సామాన్యమయిన విషయం కాదు.

అందరితో శత్రుత్వం వహిస్తే ఈ అందర్నీ కలిపి జయించే అపార సైనిక పాటవాలు ఆనాడు గుప్త సామ్రాజ్యా నికి లేవు... ఈ సామ్రాజ్య విస్తరణ ఆకాంక్షకు వేసిన పాచికలే కొందరు మిత్రులు, కొందరు శత్రువులు.

మిత్రుల సహాయంతో శత్రువుల్ని జయించి ఆ తర్వాత ఆ మిత్రుల్నికూడా అణగదొక్కాలన్నది కుటిల రాజనీతి విశారదుడైన కశ్యపబ్రహ్మ ఆలోచన. దీనికి వత్తాసుపలికాడు కచగుప్తుడు.

ఇలా ఉండగా కుషాన్లు, గుప్తసామ్రా జ్యానికి స్నేహహస్తం అందించాలని నిర్ణయించుకున్నారు. కారణం విదే శీయులను అణగదొక్కటానికి లోగడ చంద్రగుప్త సామ్రాట్ సైనిక సహాయం చేయటమే కాకుండా చిన్నవాడయిన కిదారుడు కుమారుడికి అతడి రాజ ధానిలో రక్షణ కూడా కల్పించాడు.

కిదారుడు దండయాత్రలకు వెళ్ళి నప్పుడల్లా ఇలా పదిలంగా ఉన్న మైత్రీ బంధాన్ని తమ పాచికకు వాడుకోవా లని కశ్యపుడి పథకం.

ఆ పథకంలో అంతర్భాగం కిదా రుడి కూతుర్ని చంద్రగుప్త సామ్రాట్ పుత్రుడికి అంటే భావిభారత గుప్త సామ్రాట్‌కు కట్టబెట్టాలని.

అయితే ఈ విషయంలో కిదా రుడు ఒక చిన్న మెలిక పెట్టాడు, తన కూతురు గుప్త సామ్రాజ్యానికి పట్ట మహిషి కావాలని.

అయితే ఈ కూతురిని గుప్త సింహాసనం అధిష్ఠించబోయే వారసు డైన సామ్రాట్ పుత్రుడికి మాత్రమే ఇస్తానని అన్నాడు. దీనికి కారణం లేక పోలేదు. కిదారుడికి చంద్రగుప్తుడిలో జరుగుతున్న సంఘర్షణ గురించి లీలగా సమాచారం చేరింది.

'గుప్త సామ్రాట్ వారసుడ్ని ఇప్పుడే నిర్ణయించటం కష్టమని కిదారుడి అభి ప్రాయం. తను తొందరపడి ఆ ఇద్దరు తనయుల్లో ఎవరో ఒకరికి తన కూతు రిని కట్టబెడితే, అతడు రేపు ఏ కార ణంగానయినా సామ్రాజ్య వారసుడు కాకపోతే!' ఐతే కశ్యపుడు కిదారుడితో రహస్య మంతనాలు జరిపి, కాబోయే ప్రభువు కచగుప్తుడని నచ్చచెప్పాడు.

అయినా కిదారుడు తన పట్టును విడవలేదు. ఇక కశ్యపుడికి, కచు డికి గత్యంతరం లేకపోయింది. సమ యంకోసం వేచియుండక తప్పలేదు.

కచుడు సింహాసనాన్ని అధిష్ఠించ గానే కిదారుడి తనయను వివాహ మాడతాడు. ఆ తరువాత చిన్నవాడైన కిదారుడు కొడుకు అంటే కిదారుడి

పెళ్ళి వార్త అబద్ధం

'సిటీ లైట్స్' సహనటుడు రాజ్ కుమార్ రావుతో పత్రలేఖ ఐదేళ్ళుగా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నది.

ఈ ఏడాది వీళ్ళిద్దరి పెళ్ళి అంటూ అదేపనిగా వార్తలు వినపడుతున్నాయి. పెళ్ళి వార్త పత్రలేఖకు అస్సలు నచ్చి నట్లు లేదు. నోరువిప్పి అదేం లేదు అంటూ ఖండించింది.

"ఈ వార్త ఎక్కడినుంచి వచ్చిందో నాకు తెలియదు. రాబోయే ఏడెనిమిది సంవత్సరాలదాకా మాకు పెళ్ళి ఉద్దే శ్యమే లేదు. మేం ఇద్దరం స్వతంత్ర భావాలు గలవారం. ప్రస్తుతం ఇద్దరి దృష్టీ కెరీర్‌పైనే.

మేం ఇద్దరం సహజీవనం సాగిస్తున్నా మన్న వార్తల్లో కూడా నిజం లేదు. నేను, నా సోదరి కలిసివుంటున్నాం" అంటూ నొక్కినొక్కి చెప్పింది.





ప్రయివేట్ రంగంలో ప్రారంభించే విశ్వ విద్యాలయాలు వాణిజ్య కేంద్రాలుగా మారతాయి.

-వి.హనుమంతరావు

తెలంగాణ కాంగ్రెస్ నేత

వారసుడు తమ చేతిలో కీలుబొమ్మను చేసుకోగలుగుతాడు.

ఒకవేళ కిదారుడు, గుప్తుల ఏక చ్ఛత్రాధిపత్యానికి అడ్డువస్తే, అపుడు ఉన్నదిగదా సాధనం - అదే కుటిల నీతి. అవసరమయితే కిదారుడ్ని అడ్డ తొలగించుకోక తప్పదు.

కశ్యపుడి సలహా, కచగుప్తుడికి ఎంత గానో నచ్చింది.

జ్యేష్ఠుడు కచగుప్తుడు వివాహాన్ని వాయిదా వేయడంతో, కనిష్ఠుడు సముద్రుడికి కూడా వివాహ ఘడియలు వాయిదాపడ్డాయి. అయితే ఈ మధ్య రాజమాత కుమారదేవి, కొడుకుల వివాహం గురించి ఎక్కువ ఆలోచించటం ప్రారంభించింది.

సముద్రుడు లావినియా సంతృప్తి కోసమే, సామ్రాట్‌ను ఇంద్రప్రస్థంపై దండెత్తి నాగాయకుడ్ని బంధించమని కోరాడని తెలిసింది.

అట్టి సున్నితమైన సముద్రుడిని అవసరమయితే రక్తపాతానికి కూడా పురిగొల్పిన ఆ అద్వితీయ సుందరిని చూడాలని మహారాణి కుమారదేవికి కోరిక కల్గింది. పైగా అంతఃపురంలో లావినియా సౌందర్యం గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

కాబోయే మహారాణికి సౌందర్య మొక్కటే చాలదు. ఆమెలో క్షాత్ర ముండి క్షత్రియ వంశానుగత స్త్రీ అయివుండాలి' అని కుమారదేవి వ్యక్తిగత అభిప్రాయం.

లావినియా మేలిముసుగులో మహారాణి ప్రాసాదానికి చేరింది. ఆ ప్రాసాదంలోని గుప్తుల ప్రాభవ వైభవానికి లావినియాలో అచ్చెరువు. అవి కుడ్యాలు కావు స్వర్ణ మణిమాన్వితమైన పాలరాయి గోడలు.

ఆ క్రింద నేలపై సౌందర్యం వెల్లువలా నలువైపులా ప్రవహిస్తున్నట్టుగా చిత్ర విచిత్ర రత్నాలు పొదిగిన కాశ్మీర తివాచీలు. అక్కడ ఉన్న సింహాసనాలు, నవరత్న ఖచితాలు.

అంతేకాదు, ఆ స్తంభాలపై చెక్కిన మనోహర అద్భుతమైన శిల్పాలు. ఉన్నట్టుండి నలువైపులా తిలకిస్తున్న లావినియా చూపులు ఆ మూలకు వెళ్ళి ఆగిపోయాయ్! అక్కడ అద్భుతమైన ఓ పాలరాయి శిల్పం ఉంది.

లావినియా తదేకంగా ఆ శిల్పం వైపు చూస్తుండిపోయింది. అంతేకాదు, దూరంనుంచి తనను తదేకంగా పరికిస్తోన్న మహారాణి కుమారదేవిని విస్మరించింది. ఆమెకు అభివాదం చేయటం మరచిపోయింది.

కుమారదేవి లావినియాను ఆశ్చర్యంగా చూస్తోంది.

ఉన్నట్టుండి ఒక్క ఉదుటున వెళ్ళి లావినియా ఆ శిల్పాన్ని చేరింది. నఖశిఖపర్యంతమూ ఆ శిల్పాన్ని చూసి తమాయించుకోలేనట్టుగా, కెవ్వుమని కేకవేసి నేలమీద స్పృహతప్పి పడిపోయింది లావినియా.

ఈ సంఘటనలన్నీ ఒక్క త్రుటిలో జరిగాయ్! కుమారదేవికి ఒక్క క్షణం అయోమయం ఆవరించింది.

ఎదురుగా జరుగుతున్న దృశ్యం లావినియాలోని విచిత్రవైఖరి కుమారదేవికి అర్థంకావటంలేదు.

రెండురోజులక్రితమే ఆ శిల్పం ఆ ప్రాసాదాన్ని చేరింది.

ఇంద్రప్రస్థ నగరం నుంచి వచ్చిన కొందరు వర్తకులు ఆ శిల్పాన్ని కుమారదేవికి కానుకగా ఇచ్చారు.

ఆ శిల్ప సౌందర్యానికి కుమారదేవిలో అపూర్వ సంభ్రమాశ్చర్యాలు... కొన్ని క్షణాలు ఆమెకు నోట మాటలు రానంత తన్మయత్వాన్ని పొందింది.

ఆ అపూర్వ శిల్ప సౌందర్యానికి, అంతటి శిల్పరాజం తన ప్రాసాదాన్ని చేరటం ఒక మహద్దైక అదృష్టంగా భావించింది. "ఈ చిత్రాన్ని చెక్కిన మహాశిల్పి ఎంత గొప్పవాడు. ఇది అమూల్యం. ఇంతటి సౌందర్యాన్ని నేను నా జీవితంలో ఎక్కడా వినలేదు... చూడలేదు... నిజంగా ఈ శిల్పానికి ప్రాణమే ఉంటే" కుమారదేవిలో భావసంచలనం.

వర్తకులకు అపారసంపదను వెలగా ఇవ్వబోయింది మహారాణి.

అందులో ప్రధాన వర్తకుడు ముందుకొచ్చి "ఈ శిల్పాన్ని చెక్కిన శిల్పి నా మిత్రుడు మహారాణీ! ఆ శిల్పి కోరిక ఈ శిల్పాన్ని మీకు బహుమతిగా ఇవ్వమని. ఈ శిల్పాన్ని రక్షించమని అతడి చివరి కోరిక" అని చెప్పాడు.

"అంటే శిల్పి?"

"మరణించాడు మహారాణీ! అతని కుటుంబం ఛిన్నాభిన్నమైంది. దీనికి వెల తీసుకోవద్దని అతడి చివరి కోరిక" ఆ వర్తకుడికి, ఆ శిల్పి కూతురు లావినియాకూడా నాగాయకుడి చేతిలో మరణించిందని అసత్య వార్త చేరింది.

ఇంకా ఉంది

చిలిపి ?

నిజమైన స్నేహితుడంటే?
పరీక్షలో ఆన్సర్ పేపర్ చూపించేవాడు.

విడాకులు పొందాలంటే ఏంచేయాలి?
మొదట పెళ్ళి చేసుకోవాలి.

'నేతిబీరకాయ' అంటే?
ఆర్.టి.సి. బస్‌లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్.

చార్‌మినార్ ఎత్తెంత?
దూకితే చచ్చేంత.

ఇద్దరు భార్యలున్న వ్యక్తిని ఏ విధంగా శిక్షించాలి?
వారిద్దరే అతనికి శిక్ష. ఇంకా వేరే శిక్ష ఎందుకు!?

రాజా... మన పెళ్ళెప్పుడు?
ఏం... మళ్ళీ నెలతప్పావా...


'పిసినారి' కామెంట్ ప్లీజ్!
స్వీట్ చేసుకొని షుగర్ వేసుకొననివాడు.

నువ్వు చూసిన మహిళా చిత్రం ఎలా ఉందోయ్?
హాలంతా ఏడ్పు, పెడబొబ్బలతో నిండిపోయింది.

మీరు తెలుగువారేనా?
ఎస్.

ఆడవాళ్ళు అమ్మలక్కలతో ఎందుకు స్నేహం చేస్తారు?
చిల్లర సామానుల అరువుకోసం..

అదా అందాలతో ఫిదా




బాలీవుడ్‌లో ఎంత ప్రయత్నించినా సక్సెస్ అందుకోలేక, తెలుగువారికైనా తన అందచందాలతో 'హార్ట్ ఎటాక్' తెప్పించగలరన్న ధీమాతో ఇక్కడకు చేరింది అదాశర్మ. ఐతే ఏదో రెండు, మూడు అవకాశాలైతే వచ్చాయికాని, పూర్తిస్థాయి హీరోయిన్‌గా గుర్తింపు రాలేదు, విజయమూ ఆమడదూరంలోనే నిలిచిపోయింది.

ఓపిగ్గా అవకాశాలకోసం ఎదురు చూస్తూ, ఈలోగా సమయాన్ని వృధా పుచ్చక గ్లామర్ షోలతో అదరగొట్టేస్తున్నది అదాశర్మ. అనేక మేగజైన్‌లకోసం శక్తివంచన లేకుండా వీలైనన్ని అందాలను విరజిమ్మేస్తున్నది.

బికినీలతో అదా ఇచ్చిన పోజులు చూసినవారు ఫిదా అవుతున్నారేమోకాని మరి అవకాశాల మాటేమిటో...?

ఫర్U

Life is something of what happens to you and everything else of how you respond to it



రోజుకో ఆకు

కొస్తంత సున్నం, వక్కా కలిపి తమలపాకులు నమిలితే నోరంతా ఎంచక్కా పండుతుంది. నోటికి అందాన్నిచ్చే ఈ ఆకుల్లో ఔషధగుణాలూ వున్నాయి. రోజుకో తమలపాకు నమిలితే గ్యాస్, ఎసిడిటీ తగ్గిపోతాయి. జీర్ణవ్యవస్థ మెరుగ్గా వుంటుంది. తమలపాకులరసం తాగితే కఫం తొలగిపోతుంది.

గొంతులో ఇబ్బందులు తగ్గుతాయి. తమలపాకును తినడంవల్ల రక్తంలోని చక్కెరస్థాయిలు తగ్గి, డయాబెటిస్ అదుపులో వుంటుంది.

శ్వాసకోశసమస్యల పరిష్కారంలోనూ తమలపాకు సహకరిస్తుంది. కొద్దిగా తేనె కలిపి తీసుకోవడం వల్ల ఫలితం వుంటుంది. ప్రతిరోజూ తమలపాకు తినడంవల్ల శృంగార సామర్థ్యం పెరుగుతుందన్నది ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం. ◆

సెల్యులైట్ సమస్య

బొద్దుగా వుండే ఆడవారు ఎక్కువగా ఎదుర్కొనే సమస్య సెల్యులైట్. కొవ్వుకణాలు చర్మంలోపల పేరుకుపోవడంతో చర్మం ఉబ్బుగా అయ్యి, చారలు పడినట్లు కనపడుతుంది.

పిరుదులు, తొడలు, పొత్తికడుపు, చేతుల పైభాగంలో ఈ సమస్య కనపడుతుంటుంది.

ఇటువంటి సెల్యులైట్ సమస్యగలవారు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి.

ప్రతిరోజూ కనీసం ఎనిమిది గ్లాసుల చొప్పున నీరు తాగుతూ, ఉప్పు, కొవ్వుపదార్థాలు తగ్గించాలి. ఆహారంలో ముడిధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకుంటుండాలి.

సైక్లింగ్, స్విమ్మింగ్, ఏరోబిక్స్, రన్నింగ్ వంటి వ్యాయామాలు కొవ్వును కరిగించడానికి ఎక్కువగా ఉపకరిస్తాయి. కొబ్బరినూనెను ప్రతిరోజూ రెండు స్పూన్లు తీసుకుంటుంటే సెల్యులైట్ క్రమంగా కరిగిపోతుంది. అలాగే సెల్యులైట్ గల ప్రదేశాల్లో కొబ్బరినూనెరాసి మసాజ్ చేస్తుండాలి. ◆

మసకవెలుతురు మంచిది కాదు

ఏది తక్కువైనా, ఎక్కువైనా ఇబ్బందులే వెలుగు విషయమూ అంతే. కళ్ళు మిరుమిట్లుగొలిపే వెలుతురు మంచిది కాదు. అలానే మసక వెలుతురులో పనిచేయడమూ ఇబ్బందే.

తక్కువ వెలుతురులో పనిచేసేవారిలో జ్ఞాపకశక్తి, గ్రహణశక్తి బాగా తగ్గుతాయని నిపుణులు తమ అధ్యయనాల్లో గుర్తించారు.

మసక వెలుతురులో పని చేసేవారిలో మెదడు నిర్మాణం ఎక్కువగా ప్రభావితం అవుతుంది.

న్యూరాన్ల నడుమ ఆరోగ్యవంతమైన స్థితిని నిలబెట్టే న్యూరోట్రాఫిక్ ఫ్యాక్టర్లు కూడా మసక వెలుతురులో దెబ్బతింటాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.అంటే వెలుతురు చక్కగా,చాలినంతగా ఉన్నప్పుడు మెదడు పనితీరు బావుంటుందన్నమాట. ◆

పామాయిల్ ప్రయోజనాలు

పామాయిల్ అంటే అనేకమందికి చిన్నచూపు. కాని, పామాయిల్ ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. ధర తక్కువగా వుండి, అందరికీ అందుబాటులో వుండేటటువంటి ఈ ఆయిల్‌లో అనేక పోషక పదార్థాలుంటాయి.

బెటాకెరోటిన్, ప్రొటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి.

చర్మాన్ని తేమగా, మృదువుగా ఉంచడంలో, కొలెస్ట్రాల్ పెరగకుండా నిరోధించడంలో, రక్తపోటును అదుపులో ఉంచడంలో, అల్జీమర్స్ నివారణలో ఉపకరించే గుణాలు పామాయిల్‌లో వుంటాయి.

గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇది సహకరిస్తుంది. పామాయిల్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని గుర్తించినందువల్లనే పదార్థాలు, పిండివంటలు తయారు చేయడంలో పామాయిల్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

వ్యసనం నుండి కొత్త మార్గం



✤ బలహీన మనసువల్ల వ్యసనం ✤ ఒక్కో వయసులో ఒక్కో రకం ✤ పురుషుల్లో అధికం ✤ శారీరక, మానసిక ఇబ్బందులు

స్వతంత్ర జీవనం మానవ లక్షణం. విచక్షణాజ్ఞానం మానవుడికి సొంతం. అయినా మనుషులు ఏదో ఒకదానికి బానిసగా మారుతుంటారు. ఎన్నోరకాల వ్యసనాలకు దాసోహమంటారు.

ఇటువంటి వ్యవసనాలు మనిషిని పతనం చేస్తాయని, పూర్తిగా అతని జీవితాన్ని నాశనం చేస్తాయని పురాణపాత్రలద్వారా పెద్దలు చెప్పారు.

ఎన్నో మంచి లక్షణాలున్నప్పటికీ ఒకేఒక్క వ్యామోహంతో రావణుడి జీవితం అంతమైంది. జూదంవల్ల జీవితాలు నాశనమైనాయి. పేకాటతో కూల్చుకున్న జీవితాలు, నవీనకాలంలో మత్తుపానీయాలు, మాదక ద్రవ్యాలు- ఇలా ఏదోఒక వ్యసనం మనిషిని దెబ్బతీస్తున్నది.వ్యసనం అనేది వాస్తవంలో ఒక నాడీ సంబంధిత జబ్బువంటిదంటుంది సైన్స్. మెదడుకు సంబంధించిన ఇబ్బంది. ఏదో ఒక పదార్థంవైపుకు మనసు పదే పదే లాగి ఉపయోగించమంటుంది.

తాను తీసుకుంటున్న పదార్థంవల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఇతర రకాల ప్రమాదాలు తలెత్తుతాయని తెలిసినా పదేపదే ఆ పదార్థాన్ని తీసుకోమని మెదడు ప్రోత్సహిస్తుంది. సిగరెట్, మత్తు పానీయాలు అటువంటివే. ఆ పదార్థాలకు ఎంతగా బానిసలవుతారంటే వాటిని తీసుకోకుండా వుండలేని పరిస్థితి వస్తుంది. వేళఅవగానే గబగబా బయటకు వెళ్ళి సిగరెట్ తాగేవారు, చీకటిపడుతుండగానే మందుకోసం వెతుక్కునేవారు వ్యసనానికి గురైనవారు.

అటువంటి పరిస్థితి ఎందుకు ఏర్పడుతుందనేది ప్రశ్న. తమ ముందు ఎన్నో రకాల పదార్థాలు పెట్టినా పరిమితంగానే ఆహారం తీసుకునేవారుంటారు.

ఏదైనా ఒక పదార్థం రుచి చూసినా దానికోసమే తహతహలాడని స్థిరత్వం కొందరిది.

దీనికి భిన్నంగా కొందరు ఒక పదార్థానికి బానిసగా మారతారు. అది తీపిపదార్థం అవవచ్చు, ఇతర వంటకాలు కావచ్చు. అదేవిధంగా ఇతర రసాయన పదార్థాల అలవాటుకు మొగ్గుచూపుతారు.

ఇలా ఒక రసాయనంవైపు మొగ్గుచూపేవారి ఆలోచనలు అటూ ఇటూగా వుంటాయి, శారీరక కదలికలు మారతాయి. వారి మెదడు లోపలి మార్పు ఒక పదార్థాన్ని తీసుకోమని ప్రోత్సహిస్తుంది. ఆ ప్రోత్సాహం ఎంతగావుంటుందంటే ఆ పదార్థం తీసుకుంటే తప్పించి మనిషికి తృప్తి వుండదు.

* వ్యసన దశ

ఇటువంటివారి మెదడును అధ్యయనం చేసినప్పుడు నిర్ణయం తీసుకునేందుకు, విచక్షణకు సంబంధించిన మెదడు భాగాలు,జ్ఞాపకశక్తి కేంద్రాలు, ప్రవర్తనా నియంత్రణ కేంద్రాలన్నీ ప్రభావితమై వుండటం గమనించారు.

ఆ భాగాలమీద రసాయనపదార్థాలు చూపించే ప్రభావాన ప్రవర్తనలో మార్పు వస్తుంది. ఆ రసాయన ప్రభావం వున్నంతవరకు ఒకలా ప్రవర్తిస్తారు. అదే సరైన ప్రవర్తన అనుకుంటారు. ఆ రసాయన పదార్థ ప్రభావం ముగియగానే ప్రవర్తన మారుతుంది.

అయితే మెదడు భాగాలు రసాయన ప్రభావంలోని ప్రవర్తనే మెరుగ్గా వుందనుకుని, ఆ స్థితినే కావాలనుకుంటాయి. ఆ స్థితిని తెచ్చేందుకు కారణమైన రసాయన పదార్థాన్ని తీసుకో అంటూ ప్రోత్సహిస్తాయి. ఆ పదార్థాలు అందించేది ఒక రకమైన మత్తు.

వాస్తవ ప్రపంచానికి ఆవల ఆ మత్తులో జోగటంలో ఒక రకమైన ఆనందం వుందన్న భావన మనిషిలో స్థిరపడుతుంది. అది వ్యసనదశ. అన్ని రసాయనపదార్థాలు ఒకలాంటి ప్రభావాన్నే చూపవు. ఒక్కొక్క పదార్థ ప్రభావం ఒకలా వుంటుంది.

ఆరంభంలో అన్ని పదార్థాలు ఉత్తేజం అందిస్తాయి. పొగాకు ప్రభావం ఒకలాంటిదైతే, నల్లమందు ప్రభావం మరొకలాంటిది. మత్తు పానీయం అందించే ఆనందం మరో రకం. అందువల్ల ఆ వ్యసన ప్రవర్తన భిన్నంగానే వుంటుంది.

ఉచ్చనీచాలు మరచిపోయి ప్రవర్తించేలా ఒక పదార్థం తయారుచేస్తే, నలుగురిలోకి రాకుండా చీకటిగదిలో ఒంటరిగా కూర్చుండేలా చేస్తాయి కొన్ని పదార్థాలు. ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో తమను తాము గాయపరుచుకునేవారున్నారు. వ్యసన బానిసలు ఇతరులమీద సులభంగా దాడికి దిగి గాయపరిచేవారున్నారు. నేరప్రవృత్తిని పెంచుతాయి.

ప్రారంభంలో చాలా తక్కువ డోస్‌తో వారు కోరుకున్న 'మత్తు' వస్తుంది. కాని క్రమంగా డోస్ పెరిగితే తప్పించి 'కిక్' ఇవ్వని స్థితి. ఒక సిగరెట్‌తో లేదా ఒక పెగ్గుతో మొదలైన అలవాటు క్రమంగా పదుల సంఖ్యలోకి చేరుతుంది.

అది కూడా నిర్దేశిత సమయానికల్లా ఆ పదార్థం

కావాలంటుంది మనసు. ఈ వ్యసనాలవల్ల ఆరోగ్యం చెడుతుంది. రూపంలో మార్పు వస్తుంది.

స్నేహితులు, బంధువులు దూరమవుతారు. మానవసంబంధాలు దెబ్బతింటాయి. అయినా ఆ అలవాట్లను మార్చుకోలేకపోవటమే వ్యసనం.

ఇన్ని రకాల ఇబ్బందులున్నాయని తెలిసినా, తమ ముందుతరపు వ్యసనపరుల దిగజారుడు జీవితాలు గమనించినా ఇంకా కొత్తవారు సరికొత్త అలవాట్లకు బానిసలు అవుతూనే వున్నారు.

ఈ వ్యసనాలు ఎందుకు వస్తాయి అనే దానిమీద జరిపిన పరిశోధనల్లో ఒకటికన్నా ఎక్కువ అంశాలు కారణమని తేలింది. ఒక్కొక్క వయసులో ఒకలాంటి అంశం వారిని వ్యసనంవైపు తీసుకువెళుతుంది.

స్నేహితులతో కలిసిపోవటమే జీవితం అనుకోవటం వల్ల వారు అలా తయారవుతారు.

మధ్యవయసులో ఎదురయ్యే ఒత్తిడులను ఎలా ఎదుర్కోవాలో చాలామందికి తెలియదు. ఒత్తిడి నుండి బయటపడేసేదిగా మత్తు పానీయం కనిపిస్తుంది వారికి. కొలీగ్స్‌లో ఎవరికో ఒకరికి అటువంటి అలవాటు వుంటే వారిని అనుసరిస్తారు.

అది ఒకరకంగా వారి బలహీనత.మత్తు పానీయం సమస్యలను, ఒత్తిడిని తాత్కాలికంగా దూరం చెయ్యగలదేమోగాని శాశ్వతపరిష్కారం చూపదు.కాని తమ సమస్యలనుండి తప్పించుకునేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుని పలాయనవాదులవుతారు. కొన్ని రకాల వృత్తులలో వున్నవారికి గెలుపు ముఖ్యం.



Courtesy : SANANDA

అయితే అందులో వారి బలహీన మనస్సు ప్రధానమైన అంశం కాదనలేనిది. విద్యార్థిదశలో అధికశాతం చెడు అలవాట్లు స్నేహితులద్వారా అంటుతాయనేది నిస్సందేహం. ఎవరో కొందరికున్న అలవాటులోకి మిగిలిన స్నేహితులను లాగే ఒత్తిడి వుంటుంది.

పొగ తాగటం అనే అలవాటు ఆ విధంగా వచ్చేదే. పొగ వదలటం మగతనంలో భాగంగా భావించి మొదలుపెట్టేవారు లేకపోలేదు. అమ్మాయిలను 'ఇంప్రెస్' చెయ్యాలంటే సిగరెట్ స్టైల్‌గా వెలిగించాలని అభిప్రాయమున్న అబ్బాయిలున్నారు.

ఒక కొత్త రకం అలవాటుమీద ఆసక్తి వుంటుంది కొందరికి. ఒక్కసారి అనుభవించి చూద్దాం అనే ప్రయోగాత్మక మనసు క్రమంగా అది ఒక అలవాటుగా, ఆ తర్వాత వ్యసనంగా మారుస్తుంది.

అలా సాటివారి ఒత్తిడికి లొంగి అలవాటు చేసుకునే పరిస్థితి విద్యార్థిదశలో అధికం. ముఖ్యంగా హాస్టల్స్‌లో చేరిన అబ్బాయిలకు నాటివరకు లేని స్వేచ్ఛ వస్తుంది.తల్లిదండ్రులకు దూరంగా వుండటం,

సినీతారలు, ఆటగాళ్ళు ఎంత బాగా తమనేర్పును ప్రదర్శిస్తే అంతగా మెప్పించగలుగుతారు. తమ 'పర్ఫార్మెన్స్' మెరుగుపరిచేందుకు ఉత్ప్రేరకాలను ఉపయోగిస్తుంటారు. అలా 'డ్రగ్స్'ని వాడి దొరికిపోయినవారున్నారు. కొందరి వ్యసనానికి ఆ రసాయనాలు అందించే 'ఆనందపు'స్థితి మూలం. అవి పడితే వారు ఆకాశంలో తేలిపోతారు.

అటువంటి అలవాటు వ్యసనంగా మారుతుంది. క్లబ్‌లో పేకాట ఒక రకమైన ఆనందం. పదిమందిలో హుషారుగా సమయం గడిపేందుకు ఆడతారు 'హాబీ'గా ఆడటం వేరు. అది వ్యసనంగా మారటం వేరు. 'హాబీ' అనేది సరదాగా సాగుతుంది.

ఒకవేళ కొంతకాలం వెళ్ళకపోయినా, రసాయనం అందకపోయినా బాధ వుండదు. ఎటువంటి ఇబ్బందీ లేకుండా గడిచే 'హాబీ' స్థాయిని దాటి వ్యసనంలోకి చేరినప్పుడు ఆ సమయానికి క్లబ్‌కి వెళ్ళకపోయినా మత్తుపానీయం తీసుకోకపోయినా మూడ్ మారుతుంది. అది వ్యసన దశ. తమ వ్యసనంతో ఇబ్బందులున్నాయని, పతనమవుతున్నామని తెలిసినా అందులో నుండి బయటకు రాలేని పరిస్థితి వ్యసన తీవ్రతను తెలియచేస్తుంది.

* వ్యసన చిక్కులు

వ్యసనంలోకి చేరుకున్నారని తెలియచెప్పే లక్షణాలను ఇంటిలోనివారు గుర్తించాలి. తమ మీద తమకు అదుపు లేక, వ్యసన అంశంకోసం తీవ్రంగా ఎదురుచూడటం, అందనప్పుడు ప్రవర్తనలో మార్పు, ఆ వ్యసన అంశం కొద్దికొద్దిగా అయినా తగ్గించుకోలేకపోవటం ఒక లక్షణం.

తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించటంలో విఫలమవుతారు. చదువు,ఉద్యోగం,సంసార బాధ్యతలన్నింటిలో విఫలమే. నలుగురిలో కలవలేరు.తీరిక సమయంలో సరదాగా వుండక, తీరిక దొరకగానే ఎటో వెళ్ళిపోతారు.

తాము చేస్తున్నది తప్పని, దొరికితే పరువుప్రతిష్ఠలు దెబ్బతింటాయని, పోలీసు కేసుల్లో ఇరుక్కుంటామని తెలిసినా వాటిని ఉపయోగిస్తారు.

ఎక్కడ వున్నాము, ఆ ప్రదేశంలో ఎలా ప్రవర్తించాలి అనే విచక్షణాజ్ఞానం కోల్పోతారు. నచ్చచెప్పబోయినవారిమీద తిరగబడతారు. వారిని శిక్షిస్తారు. ఇది చేతులారా జీవితాన్ని నాశనం చేసుకోవటం.

తమ జీవితాన్ని, జీవనవిధానాన్ని ఆ వ్యసన అంశాలు నియంత్రించటం మొదలవుతుంది. ఉదయం సిగరెట్ వెలిగిస్తేగాని టాయ్‌లెట్‌లోనికి వెళ్ళలేరు.రాత్రి మందు పడితేగాని నిద్రపోలేరు. ఇది జీవితంమీద నియంత్రణ కోల్పోవటం.

జీవితాన్ని మార్చుకోవాలనుకుంటే వ్యసనాలలో నుండి బయటపడాలి. అలవాట్లు మార్చుకుందామనే ఆలోచన కలిగితే సహాయపడేందుకు మనుషులున్నారు. వ్యసనంలో నుండి బయటకు తెచ్చే మార్గాలు వున్నాయి. కాని దానికోసం ముందుగా కావాల్సినది వ్యసనపరులలో మార్పు.

నిజానికి సిగరెట్ అలవాటుచేసినవారు కనిపించరు. ఏ అమ్మాయిని ఇంప్రెస్ చెయ్యటానికి అలవాటుచేసుకున్నారో ఆ అమ్మాయి ఆపైన సిగరెట్ కంపు అంటూ దూరం అవుతుంది.

సరదాగా మందుకొట్టి చిందులేసినవారంతా ఎటువారటు పోతారు. చివరికి బలహీన మనసుగలవాడు, అతని వ్యసనం అతనికి మిగులుతుంది. ఇటువంటి పరిస్థితినుండి బయటకు వచ్చేందుకు ఒక మంచి రోజును చూసుకోండి. మంచి అంటే ముహూర్తం కాదు. గుర్తుండిపోయే రోజు అది.

కొత్త సంవత్సరం, పుట్టినరోజు, నచ్చిన పండుగ, మెచ్చిన పెద్దల జన్మదినం.ఇలా ఏదో ఒకరోజునాడు ఒక్కసారిగా ఆ వ్యసనానికి వీడ్కోలు చెప్పండి. ఎవరికివారే వాగ్దానంచేసుకోండి.అది జీవితంలో అద్భుతమైన మార్పుతెచ్చిన రోజుగా జీవితంలో నిలిచిపోవాలి. అదే వ్యసనబాటనుండి బయటకు తెచ్చేది.

వి.ఆదిత్య

ఇరవైయవ శతాబ్దంలో గాంధీజీ ప్రభావానికి గురికానివారెవరూ భారతదేశంలో లేరు. అన్ని వయసులవారినీ కదిలించిన వ్యక్తిత్వం గాంధీజీ. స్వాతంత్ర్య పోరాట సమయంలో భారతీయులందరినీ ఏకతాటిమీదికి తెచ్చినవాడు మహాత్ముడు.

ఆ రోజుల్లో ఎందరో యువతీ యువకులు తమ చదువులు, వృత్తులు వదిలిపెట్టి గాంధీజీ పిలుపుకు స్పందించి ఉద్యమంలోకి దూకారు. ఆ సమయంలో గాంధీజీని తు.చ. తప్పక అనుసరించారు.

ఆ తర్వాతి కాలంలో చాలామంది గాంధీజీని, ఆయన సిద్ధాంతాలను వదిలివేశారు. తమ సంపద, తమ పదవులగురించి ఆలోచించుకున్నారు. కాని కొందరు మాత్రం నాడు గాంధీజీ ఏమి చెప్పాడో, ఎలా జీవించాలన్నాడో వాటిని చివరివరకు అనుసరించారు. పదవులు వస్తే సేవ చేశారు.

పదవి లేకున్నా ప్రజలతో మమేకమై జీవించారు. నిజమైన ప్రజాప్రతినిధులు ఎలా వుండాలని గాంధీజీ ఆశించారో అదే పద్ధతిలో వారు చివరివరకు ఆదర్శంగా నివసించారు. అటువంటివారిలో ఒకరు ఆంధ్ర ప్రాంతంలో వున్నారు.

గాంధీజీ కట్టినట్లు కొల్లాయి కట్టలేదు. గాంధీ టోపీ కూడా పెట్టినట్లు కనిపించదు. కాని గాంధీజీ సిద్ధాంతాలను అనుసరించాడు. గాంధీజీ బ్రహ్మచర్యం గురించి మాట్లాడేవాడు కాని అనుసరించలేదు. కాని ఈ ఆంధ్ర ప్రముఖుడు గాంధీజీ చెప్పిన బ్రహ్మచర్యాన్ని భుజాన వేసుకున్నాడు.

నిరాడంబరంగా జీవించటమంటే ఏమిటో ఆయన్ని చూసి నేర్చుకోవాలి. ఒంటిమీద ఒక జత బట్టలు, భుజంమీద ఒక కండువా, చేతిలో చిన్న సంచీ.

ఆ సంచీలో మరో జత బట్టలు. ఎక్కడికెళ్ళినా సాధారణ రైలుబోగీలోనే ప్రయాణం. ఇది ఆయన జీవించిన విధానం. ఖద్దరు తప్పించి మరొకటి కట్టలేదు. ప్రజల సమస్యలే ఆయన సమస్యలు. ఆయనకంటూ ఏవీ ప్రత్యేకంగా కోరికలుండేవి కావు.

ప్రజలు అందరూ హాయిగా వుంటే ప్రజాప్రతినిధిగా తాను సంతోషంగా వుండగలను అనేవారు. అందుకే ఆయనను చూసి ఎవరైనా పక్కకు తప్పుకునేవారేతప్ప వేలెత్తిచూపించినవారు లేరు.

మధ్యతరగతి కుటుంబంలో, వందేమాతర ఉద్యమము మొదలైన సంవత్సరంలో విజయదశమినాడు పుట్టిన ఆయన బాల్యంలోనే స్వాతంత్ర్య సమర యోధుల ప్రసంగాలు విని ప్రభావితుడయ్యాడు.

తిలక్, గాంధీజీల ప్రసంగాలు విని నాయకుడు ఎలా వుండాలో అర్థంచేసుకున్నాడు. ఆ ఉత్సాహమే బాలుడిగా ఆయన్ని స్వాతంత్ర్య ఉద్యమంలోకి తీసుకువెళ్ళింది. సహాయ నిరాకరణ ఉద్యమ సమయంలో పోలీసులు పట్టుకువెళ్ళి కోర్టులో నిలబెడితే ఈ బుడతడు ఎవడు? వీడికి ఈ ఉద్యమం ఏమిటి? అంటూ ఈసడించి, శిక్ష వేద్దామంటే ఇంకా 14 ఏళ్ళు నిండకపోవటంవలన నీ సంగతి తరువాత చూస్తా అంటూ పంపించాడు.

మరో బాలుడు అయితే ఆ బ్రిటిష్ పోలీసుల వాతావరణం, కోర్టులు, శిక్షలకు భయపడి మర్యాదగా చదువుకునేవారేమో. కాని ఆ బాలుడు అందరిలాంటివాడు కాదు. అందుకే ఆ తరువాత జరిగిన ప్రతి ఉద్యమంలో పాల్గొన్నాడు.

సైమన్ కమిషన్ బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా... ఇలా గాంధీజీ ఏ ఉద్యమానికి పిలుపు ఇస్తే ఆ ఉద్యమంలోకి దూకటమే. బ్రిటీష్ పోలీసులు పట్టుకుని జైలుశిక్ష విధిస్తే దేశంకోసం ఆనందంగా అనుభవించేవాడు.

6.4.2018 సంచికలో ప్రచురించబడిన 'నేనెవరో తెలుసా!' శీర్షిక సమాధానాలు:
1. మాస్టర్ సి.వి.వి.
2. కుంభకోణం (తమిళనాడు)

₹ 500/- బహుమతి పొందిన విజేత :
ఎస్.వి.రామకృష్ణారావు, ఫ్లాట్ నెం. 103
2వ ఫ్లోర్, సిరి రెసిడెన్సీ, అన్నంరాజు నగర్
కొమ్మాది-530 048, విశాఖపట్నం

నేనెవరో తెలుసా!

అలా 1930-47 మధ్యకాలంలో ఆయన 14సార్లు అరెస్టు అయ్యాడు, ఏడుసార్లు కఠిన కారాగార శిక్ష అనుభవించాడు. స్వాతంత్ర్యం వచ్చినతరువాత ఇతర ఉద్యమాలు నడిపాడు. ఆయనకు బాగా ఇష్టమయినది గ్రంథాలయ ఉద్యమం.

విద్య పెరిగితే ప్రజలు చైతన్యవంతులయి ప్రజాస్వామ్యంలో పాలుపంచుకుంటారని, నిజమైన ప్రజాసేవకులను చట్టసభలకు పంపుతారు అన్నది ఆయన ఆశ. ఆ ఆశతోనే ఆయన భాషోద్యమంలోనూ కృషి చేశాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.

తొలిసారి జరిగిన ఎన్నికల్లో మద్రాసు రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యాడు.

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినతరువాత ఆయన ఉద్యమం విశాలాంధ్ర ఉద్యమమైంది.

తెలుగువారికి ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావాలని ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు కృషి చేశాడు. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు రెండుసార్లు ఎన్నికయ్యాడు.

19 సంవత్సరాలపాటు ఒకే నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఘనత ఆయనది. ఆయన గాంధేయవాదే కాని కాంగ్రెస్‌వాది కాదు. ఏ సమయంలో ఆయన ఒక రాజకీయ పార్టీ సభ్యుడు కాదు. పార్టీ రాజకీయాలకు లోబడి పనిచేయటం ఆయనకు ఇష్టంలేదు.

ప్రజలకోసం పనిచేయటం ఇష్టం. అందుకే ఆయన స్వతంత్ర అభ్యర్థిగానే పోటీచేసి ఎన్నికయ్యాడు.

ఆయన ఓటర్లు ఆ విషయం గుర్తుపెట్టుకుని గెలిపించేవారు. కాని కాంగ్రెస్ పార్టీ ఆయనమీద పోటీకి అభ్యర్థిని నిలబెట్టేది. చివరికి 1971 ఎన్నికల్లో ఆయన్ని ఓడించింది కాంగ్రెస్.

ఒకసారి ఓటర్లు కాదన్నతర్వాత ఇక తిరిగి ఎన్నికల్లో నిలబడటం అనవసరం అని ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా జరిగాడు. అంతేకాని ప్రజా జీవితంలో నుండి తప్పుకోలేదు.

శాసనసభలో సభ్యుడిగా వున్నప్పుడు ఒక్కరోజు కూడా ఆయన సెలవు పెట్టలేదు. ప్రతిరోజూ శ్రద్ధగా వెళ్ళి, వీలు దొరికినప్పుడల్లా సమస్యలు లేవనెత్తేవాడు. ఆయనకు తెలియని ప్రజాసమస్యలు లేవు.

ఆయన చదవని విషయాలు ఉండేవి కావు. అన్ని రంగాలలో ఆయనకు ప్రవేశముండేది.

ఆయన సభలో లేచి పాయింట్ ఆఫ్ ఆర్డర్ అన్నాడంటే అధికార పార్టీవారు భయపడేవారు.

ఈ రోజు ఆంధ్ర ప్రాంతాన్ని సస్యశ్యామలంచేస్తున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుని మంజూరు చేయించుకోవటంలో ఆయన పాత్ర వుంది.

తెలుగు భాషను అధికార భాషగా ప్రకటింపచేసింది ఆయన పట్టుదలతోనే. తొలి తెలుగు అధికార భాషా సంఘానికి ఆయనే అధ్యక్షుడు. ఆయన ఎదుట అధికారులంతా తెలుగులోనే మాట్లాడేలా చేశాడు.

ఆయన పత్రికా రచయిత. పలు పుస్తకాలు రాశారు. నాటికి ఆంధ్రప్రదేశ్‌లో వున్న ఉస్మానియా, ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల సెనెట్‌లలో ఆయన సభ్యుడు.


విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టేలా చేసింది ఆయనే. నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో గని ఆయన. గణాంకాలు మొత్తం ఆయనకు తెలుసు. అసాధారణ వ్యక్తిత్వంతో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఉత్తమ ప్రజాప్రతినిధి అనిపించుకున్నాడు. ఇంతకీ...

1. ఎవరు ఆ గాంధీజీ బాటలో నడచిన నేత?
2. ఆయన ప్రాతినిధ్యం వహించిన నియోజక వర్గమేది?

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు
ఇన్‌లాండ్ కవర్‌పై రాసి
స్వాతి చిరునామాకు
21 ఏప్రిల్ 2018 తేదీలోగా పంపించండి.
కరెక్టు సమాధానాలు రాసినవారిలో లాటరీ
పద్ధతి ద్వారా ఒకరిని విజేతగా
ఎంపిక చేసి ₹ 500/- నగదు
బహుమతిని అందజేస్తాం.

పుత్రోత్సాహం

సింహప్రసాద్



"మిస్టర్ హర్షవర్ధన్..."

ఢిల్లీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ స్టార్టప్ కంపెనీల పేర్లు ప్రకటిస్తూ మొదటగా మా అబ్బాయి పేరు ఎనౌన్స్ చేశారు.

మా వాడి పేరు వింటూనే నా ఒళ్ళు పులకరించింది. ఆనందోద్విగ్నులమై నేనూ, నా భార్య జానకీ, మా అబ్బాయికి షేక్‌హ్యాండిచ్చి అభినందించాం.

"నువ్వు సాధించావురా.నాకు చాలాచాలా హ్యాపీగా ఉందిరా హర్షా..." కళ్ళల్లోంచి ఆనందబాష్పాలు జలజలారాలిపోతోంటే వాడి భుజం తట్టాను. మాకు ముందూ వెనుక వరుసల్లో కూర్చున్నవారంతా లేచి వచ్చి మరీ అభినందనలు తెలియజేశారు.

"మీ కొడుకు అనిపించుకున్నాడు చూడండి..." పొంగిపోతూ అంది జానకి. "నన్ను మించిపోయాడే. ఇంత చిన్నవయస్సులోనే జాతీయస్థాయి గుర్తింపు తెచ్చుకున్నాడంటే చాలాగ్రేట్. చుక్కల్ని చూస్తాడు చూడు" అవార్డు అందుకోడానికి మా హర్ష స్టేజిమీదకి వెళ్తోంటే నేనూ, మా ఆవిడా ఆనందం పట్టలేకపోయాం. లేచి నిలబడి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చాం. చాలా చేతులు మాతో జత కలిశాయి. హర్షవర్ధన్ కేంద్ర మంత్రి చేతులమీదుగా షీల్డు, అభినందన పత్రం, క్యాష్ అవార్డు అందుకున్నాడు. నేను ముందుకు దూసుకెళ్ళి మరీ ఫోటోలు తీశాను. హాలు కరతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది.

దేదీప్యమానంగా వెలిగిపోతున్న మావాడి ముఖం చూసి ఉప్పొంగిపోయాం.

"చూశావా చూశావా. వాడి ముఖంలో కన్పిస్తోందేఅదే విజయానందం.సక్సెస్ సాధిస్తే వచ్చే కిక్కు" అన్నాను.

"వాడికన్నా మీ ముఖం ఎక్కువగా వెలిగిపోతోంది" నవ్వుతూ అంది జానకి.

"నేను బీటెక్ పూర్తిచేస్తూనే అందర్లా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జాబ్‌కి ప్రయత్నించలేదు. ఒక ఎంట్రప్రెన్యూర్‌గా మారాలనుకున్నాను. ఒకరిముందు చేతులు కట్టుకుని నిలబడే ఉద్యోగం చేయడంగాక నేనే ఎందరికో ఉద్యోగాలివ్వాలనుకున్నాను.

తక్కువ పెట్టుబడితో అధికఫలాలు రాబట్టాలనుకున్నాను. నా ఆలోచన వింటూనే మా నాన్నగారు ఎలా రియాక్టవుతారో అని భయపడ్డాను.

కానాయన రెండో ఆలోచన లేకుండా 'గో ఎహెడ్ మై సన్' అన్నారు. ఆ ఒక్కమాటే నన్నివాళ ఇక్కడ ఇంతెత్తులో నిలబెట్టింది. ఈ ఘనతంతా నాకు గాక మా నాన్నగారికి చెందుతుంది. అందుకే దీన్ని మా నాన్నగారికి అంకితం చేస్తున్నాను. డాడ్! దిసీజ్ ఫర్యూ!" షీల్డుని పైకెత్తి చూపిస్తూ బిగ్గరగా అన్నాడు. అంతా నావంక చూసి అభినందనలు కురిపించారు. నాభుజాలు రెండంగుళాలు పెరిగాయి.

రాత్రి ఫంక్షన్ తాలూకు ఫోటోలకు ఫేస్‌బుక్‌లో వచ్చిన లైకులూ కామెంట్లూ చూపించి మురిసిపోయాడు. "ఈ వార్తని తాత నానమ్మలకి చెబుతాను" అంటూ ఉత్సాహంగా సెల్ చేతుల్లోకి తీసుకున్నాడు హర్ష.

ఆయన ఎంతగా అభినందించారో తెలీదు గాని వీడు బాగా సంబరపడ్డాడు. "ఆయన పల్లెటూళ్ళో ఉండే రైతు. ఎన్నడూ పల్లె దాటనివారు. ఏం అర్థమైందో మరి. మీరు కొంచెం వివరంగా చెప్పకూడదూ" అంది జానకి. ఆవిడ మాటకి అప్పీలు లేదు గనుక వెంటనే నేనూ ఫోన్ చేశాను.

"నీ మనవడు సాధించింది ఆషామాషీసక్సెస్‌కాదు నాన్నా. దేశం నలుమూలల్నుంచీ 500 పైచిలుకు మంది పోటీపడితే అవార్డు మన హర్షకి దక్కింది.

టీవీలో మీడియాలో ఈవెంటుని బాగా కవర్ చేశారు. ఎంత గొప్పో మాటల్లో చెప్పలేననుకో..." ఉద్విగ్నుడినై చెప్పాను. "అలాగా...!" భావరహితంగా అన్నాడు నాన్న. తుళ్ళిపడ్డాను.

"అదేవిటి నాన్నా అలా పొడిపొడిగా మాట్లాడతావేంటి... ఇది మనకీ, మన వంశానికే కాదు మన ఊరికీ చాలా గొప్ప తెలుసా?"

"అలాగంటావా!"

"అలా నెమ్మదిగా నీరసంగా అంటావేంటి నాన్నా. ఇది చాలా గ్రేట్. ఇంత చిన్నవయసులో కొత్త సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టి, కొత్త యాప్ సృష్టించి దూసుకెళ్ళటం సామాన్య విషయంకాదు. రేపట్నుంచి రూపాయలు కాదు మనింట డాలర్ల వర్షమే కురుస్తుంది. నీకు కొండెక్కినంత సంబరంగా లేదూ?"

"ఇది నీ కొడుకు గొప్పగానీ, నా కొడుకు గొప్ప కాదు కదరా!" ఛెళ్ళున కొరడాతో కొట్టినట్టు అదిరిపడ్డాను. మరి మాటలురాక లైను కట్ చేశాను.

"మా ఊళ్ళోని అందరికన్నా ఎక్కువ చదివింది నేనే. మా ఊరి మొట్టమొదటి ఇంజినీర్ని. చదువవ్వ

గానే ప్రభుత్వోద్యోగం సంపాదించినవాడ్ని.

త్వరత్వరగా ప్రమోషన్లు తెచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదిగినవాడ్ని. ఎంతో సంపాదించి ఎన్నో ఆస్తులు కూడబెట్టినవాణ్ణి. మా ఊరివాళ్ళు బంధు మిత్రులు అంతా నావంక ఆశ్చర్యంగా అసూయగా చూస్తోంటే ఆయనకి మాత్రం సంతోషంగా, తృప్తిగా లేదు. ఏం మనిషో ఏమో!" ఉక్రోషపడ్డాను.

"తాతయ్య నాతో బాగానే మాట్లాడారే?"

"మీరేంటో నాకు తెలుసు. తాతకి తెలియాలని లేదుగా, ఆయన మనలా చదువుకున్నవారు కాదు. ఆ ఊరూ ఆ మట్టి ఆ పొలంపనులూ తప్ప మరోటి తెలీదు. అది తప్ప ఆయనకి మరో లోకమూ లేదు!"

హర్ష మాటలు సాంత్వన కలిగించాయి. ఒక మాటని పట్టుకుని భూతద్దంలో చూడటం అనవసర మన్పించింది. 'ఆయన్దో చాదస్తం' అనుకుని సరి పెట్టుకున్నాను. "మన ఫ్లయిట్ నైట్‌కి కదా డాడ్. ఈలోగా ఆగ్రా వెళ్ళి తాజ్‌మహల్ చూసొద్దాం. హర్ష ప్రతిపాదనకి జానకీ ఉత్సాహపడింది.

"వెళ్ళిరాగలమంటావా?"

"ఈజీగా వచ్చెయ్యొచ్చు. ట్రావెల్ ఏజెంటుతో మాట్లాడి కారు అరేంజ్‌చేస్తాను, మీరు రెడీ అవ్వండి"

"ఊళ్ళోని పరిస్థితులు బాగోలేవనుకుంటా నండీ" జానకివంక ప్రశ్నార్థకంగాచూశాను. "రాత్రి అత్తయ్యగారితో మాట్లాడాను. 'మాగోడు మీకేమైనా పడుతుందా ఏవిటీ' అంటూ నిష్ఠూరంగా మాట్లాడారు. మళ్ళీ కరువు వచ్చిపడిందేమో ఖర్మ!"

"అనంతపురమూ కరువూ కవలబిడ్డల్లేగాని, అక్కడలా అల్లల్లాడిపోకపోతే ఇక్కడికొచ్చి మనతో ఉండమని చెప్పకపోయావా!"

"ప్రతీ ఏటా చెబుతూనే ఉన్నాను. వింటారేవిటీ. ఆ పల్లెకీ వారి ప్రాణాలకీ లంకె!"

"అయితే అనుభవించాల్సిందే. ఎవరుమాత్రం ఏం చేయగలరు?" అసహనంగా అన్నాను.

"మీరూ ఏమీ చెయ్యలేరా?"

"నేనేమైనా ఆకాశం మీంచి ప్రత్యేకంగా ఊడి పడ్డానా!" అన్నాను. "అహ అదికాదు. కనీసం మీ ఊరు వెళ్ళి ఎలా ఉన్నారు, ఏమి టని పలకరించి రావొచ్చుగా. వారికి కొండంత భరోసాగా తృప్తిగా ఉంటుంది"

"పనులన్నీ గాలికి వది లేసి పల్లెకి పరుగెత్తమం టావు?" "మీకు పనులు లేనిదెప్పుడూ! ఎప్పుడూ ఏవో ప్రాకులాటలు ఉంటూనే ఉంటాయి. కరువుకోరల్లో చిక్కిన తల్లిదండ్రుల్ని ఓదార్చి ధైర్యం చెప్పడానికి కూడా టైము లేదంటే ఏమనుకోవాలి?"

ఆలోచనలోపడ్డాను. "సరే- ఈ సండే వెళ్దాంలే"

"నిజంగానే అంటున్నారా?" అపనమ్మకంగా చూస్తూ అడిగింది. "హర్ష మీద ఒట్టు. సరేనా?"


ప్రామిస్ చేసినట్టుగానే శనివారం మేమిద్దరం బయ ల్దేరి అనంతపురం జిల్లాలోని మా ఊరెళ్ళాం.

కారు ఊళ్ళో ప్రవేశిస్తోంటే ఎన్నో కుటుంబాలు ఎదురొచ్చాయి. తట్టాబుట్టా బండ్లమీద వేసుకుని వెళ్తున్నారు. సంగతేవిటని ఆరాతీశాను.

సాగునీటికే కాదు తాగునీటికీ కరువొచ్చిందనీ, ఇక్కడ బతకలేక పొట్ట చేతబట్టుకుని వలసపోతున్నా మని బాధతో విలవిల్లాడుతూ చెప్పారు.

కడుపులో చేయిపెట్టి దేవినట్టన్పించింది.

నా చిన్నప్పట్నుంచీ ఒక వర్షం రెండు కరువుల్లానే ఉంది పరిస్థితి. ఐనా ఎప్పుడూ ఇంత భారీ వలస



సమాజంలోని మంచి వక్తలు అంతా రచయితలు కాలేరు.

-కాళీపట్నం రామారావు, కథకుడు

ల్లేవు. పరిస్థితి ఇంతగా దిగజారేదాకా ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు?

ఎన్నికల హామీలు ఒక్కరికీ గుర్తుండవు కాబోలు! జీవం, చైతన్యం లేనట్టుగా ఉన్న ఊరిజనాన్ని చూసి కదిలిపోయాను. కన్నీళ్ళు కళ్ళల్లోనే అణచుకుని మా ఇంటికెళ్ళాం.

"సచ్చినమో బతికినమో సూడవచ్చినవా, సావలేక బతకలేక పీనుగుల మాదిరి పడుండాం!" ముఖమ్మీదే అన్నాడు నాన్న. "మిమ్మల్ని తీసుకెళ్దామనొచ్చాను"

పొడిగా నవ్వాడు. "ఈ కట్టె నేల రాలేవరకూ ఈ మట్టిని వదలదుగాని నువ్వెలా ఉన్నా వురా అబ్బాయ్. మనవడిగురించి పేపర్లో రాసేరని ఊరోళ్ళు చెప్పేరు. వాడిదంతా తాత పోలికే. అను కున్నది సాధించేవరకూ నిద్రపోడు" అంది అమ్మ.

"ఏం పంటవేశారూ" మాటమార్చడానికి అన్నాను.

"సెనక్కాయలే. కళ్ళముందే మాడిపోయిందిరా, నీరందక...!" కళ్ళొత్తుకుంది.

"నాలుగు కాయలు పండితే మాత్రం ఏం మిగు లుద్దీ, మిత్తికే చాలదు!" తేలికగా తీసిపారేశాను.

"అట్టనకొరే. మిగిల్నా మిగలకపోయినా పంటని కళ్ళ జూత్తే చాలు కష్టం ఫలించినాది అన్పిస్తాది. రైతుకడుపు నిండిపోతాది..."

"మీ సెంటిమెంట్లతో వచ్చిన చిక్కే ఇది. బోర్లేమీ పనిచెయ్యడంలేదా?" అన్నాను. "మనవేకాదు ఊళ్ళో వన్నీ ఎండిపోయినయ్!" దీర్ఘంగా నిట్టూర్చారు.

"మరేం చేస్తానంటారు?"

"వానదేవుడు పగబట్టినట్టు వానచినుకే ఇదల్చక పాయె! ఆకాశం వంక సూట్టం తప్ప ఏటి సేయగలం!" నిరాశగా అన్నారు నాన్న.

"మా రాతలు మారాల్నంటే ఏ దేవుడో పైనుంచి దిగిరావాల్సిందే" అంది తల్లి.

ఆ రాత్రి నిద్రపోలేకపోయాను.

'ఎవరో రావాలి ఏదో చెయ్యాలని ఆశిస్తూ దేవుడి మీద భారంవేసి ఊరుకోవడం తప్ప ఏమీ చెయ్య లేమా?' అన్న ఆలోచన నా మెదడుని మథించింది.

తెలతెలవారుతూండగా లేచి మా పొలం వెళ్ళాను. మాదే కాదు, ఆ చుట్టుప్రక్కల పొలాలన్నీ ఎండి బీటలు తీశాయి. ఆ ప్రాంతంలోని బోర్లని పరిశీలిం చాను. అన్నీ ఎండిపోయాయి.

ఆలోచిస్తూ గట్టుమీద కూలబడ్డాను. ఏదో గుర్తు రాగా జేబులోని సెల్ బయటికి తీసి జియాలజిస్టు మిత్రుడితో మాట్లాడాను-

"అనంతపురం జిల్లాలో కరువు శాశ్వత నివారణకు వేదవతి, హగరి నదుల పునరుజ్జీవమే శరణ్యం అని రామన్ మెగసెసె అవార్డుగ్రహీత, ప్రముఖ జల

మళ్ళీ వచ్చింది



ఐదేళ్ళ తర్వాత మళ్ళీ స్నేహ ఉల్లాల్ తెలుగు సెట్స్‌లో ఉల్లాసంగా, ఉత్సాహంగా తిరిగేస్తున్నది. 'యాక్షన్ 3డి' తర్వాత తెరకు దూరమైన స్నేహ ఉల్లాల్ 'ఆయుష్మాన్‌భవ' సినిమాతో మరోమారు ప్రయాణాన్ని ఆరంభించింది.

ఎంతో విరామంతర్వాత ఈ షూటింగ్ అనుభవం గొప్పగా వుందంటూ చెప్పుకుంటున్నది. "వెనక్కు రావడం అద్భుతంగా ఉంది. నేనీతెలుగు వాతావర ణాన్ని మిస్సయ్యా. ఈ సినిమాలోని నా పాత్ర ఇంతకు ముందు చెయ్యనిది. చాలా ఆధునికంగా వుంటుంది. స్క్రీన్‌పై కేర్ ఫ్రీగా కనపడడం సరదాగా వుంది. ఓ సన్నివేశంలో బుల్లెట్ రైడింగ్ చేయడం సూపర్ పవర్‌ఫుల్" అంటూ బాజా మోగిస్తున్నది.

సంరక్షణ నిపుణుడు రాజేంద్రసింగ్ చెప్పారు"

"అది సాధ్యమేనా?"

"ప్రజలూ ప్రభుత్వమూ పూనుకుంటే సాధ్యమే నన్నారు. ఎందుచేతంటే అనంతలోని ఇసుకదిబ్బ లను పోలివున్నాయిట. అక్కడికంటే ఇక్కడ వర్ష పాతం మూడింతలు ఎక్కువగా ఉందిట.

ఋతుపవన కాలంలో కురిసే వాననీటిలో ఒక్క చుక్కనీ వృథా పోనీయరాదని సంకల్పిస్తే, భూగర్భ జలసంరక్షణ కార్యక్రమం చేపడితే సత్ఫలితాలు వచ్చితీరతాయి-అన్నారు"

"ప్రభుత్వం సంగతి ప్రక్కన పెట్టు. రైతులు పూనుకుంటే తమ పొలాలకైనా నీటివసతి కల్పించు కోగలరంటావా?"

"తప్పకుండా" అంటూ కొన్ని సలహాలు ఇచ్చాడు.

ఒక నిశ్చయానికొచ్చి ఇంటిముఖం పట్టాను.

"నాన్నా! పోయిన పంటని తీసుకురాలేను గాని, ఇకపై ఒక్క పంట కూడా పోకుండా రక్షిస్తాను"

నాన్న ముఖంలో సృష్టిలోని ఆశ్చర్యమంతా తిష్ట వేసింది.అమ్మ బుగ్గలు నొక్కుకుంది.జానకి ఆశగా ఆసక్తిగా చూసింది. టౌనుకెళ్ళి అవసరమైన సరంజామా కొనుక్కొచ్చాను. పలుగూ పారా అందు కుని "రా నాన్నా" అన్నాను.

ఇద్దరం పొలం వెళ్ళి బోరు ప్రక్కన గొయ్యితవ్వాం. మొదట నాన్న నన్ను తవ్వనివ్వలేదు.

"నువ్వు గట్టుమీద కూర్చుని ఏం చెయ్యాలో చెప్పు నేను చేస్తాను" అన్నారు.

నేను విన్లేదు. "నేను రైతుబిడ్డని నాన్నా" అన్నాను. నాన్నముఖంలో చిరు సంతోషం చిందేసింది.

బోరుచుట్టూ పది అడుగుల లోతూ, పొడవూ, వెడల్పులతో గొయ్యి తవ్వాం. బోరు గొట్టానికి గొయ్యి ప్రారంభభాగం నుంచి మూడు అడుగుల ఎత్తువరకూ నీరు వెళ్ళేందుకు అక్కడక్కడా సన్నని రంధ్రాలు పెట్టాం. దానిలోకి చెత్తాచెదారం వెళ్ళకుండా పల్చని నైలాన్ జాలీని దానిచుట్టూ గట్టిగా కట్టాం.

తర్వాత గొయ్యిలో అయిదు అడుగుల ఎత్తు వరకూ 40 మి.మీ. సైజు రాళ్ళనీ, ఆ పైన మూడు అడుగుల ఎత్తువరకూ చిన్న సైజు రాళ్ళూ వేశాం.

వాటిపైన నైలాన్ జాలీని పరిచాం. దానిపైన దొడ్డు ఇసుకని వేసి, గొయ్యిచుట్టూ అడుగున్నర ఎత్తువరకూ సిమెంటు కట్ట కట్టాం. పొలంలో కురిసిన నీరు అందు లోకి చేరేలా ఒక ప్రక్క ఖాళీ ఉంచాం.

అందుకు అనువుగా దారి ఏర్పాటుచేశాం. తాపీ మేస్త్రి సాయంతో మేం ఈ పనిని చక చకా పూర్తిచేస్తోంటే ఊళ్ళోని రైతులు ఒకరొకరుగా వచ్చి చూశారు. వివరాలు అడిగారు.

"దీన్ని ఇంకుడుగొయ్యి అంటారు. వర్షం నీరు దీనిద్వారా భూమిలోకి ఇంకుతుంది.

దానివల్ల భూ గర్భజలాలు పెరుగుతాయి. బోరు రీఛార్జి అవుతుంది. పంటనీటికి లోటు ఉండదు"

"నిజంగా నిజమేనా. ఇంత చిన్నపనితో అంత ప్రయోజనం ఉంటుందా?"

"ఉంది. వర్షపునీటిని ఒడిసిపట్టుకుని ఇలా ఇంకుడుగుంతల ద్వారా భూగర్భజలాల నిల్వలు పెంచితే చాలు, ఇంతదాకా ఖరీఫ్ పంట మాత్రమే వేస్తున్న మీరు రబీలోనూ సాగుచేయొచ్చు.

దీనితోబాటు బిందు, తుంపర సేద్యం చేబట్టి నీటిని పొదుపుగా వాడితే సాగు విస్తీర్ణం పెంచుకోనూ వచ్చు. వేరుసెనగతోపాటు రాగులూ, సజ్జలూ, టొమాటో, చిక్కుడు, ఉల్లిపాయ, పచ్చిమిరప, చీనీ తోటలు సాగుచేయొచ్చు"

"అది సాధ్యమేనా? అలాంటి రోజులొస్తాయా?"

"తప్పకుండా వస్తాయి. మనకు కురిసే వర్షంలో ముప్ఫయిశాతం నీటిని భద్రపరచుకోగలిగితే చాలు కరువులోనూ బావులూ చెరువులూ కళకళలాడతాయి. వ్యవసాయానికి నదుల పైన ఆధారపడాల్సిన పరిస్థితే రాదు"

నా మాటలు విని మంత్ర ముగ్ధులయ్యారు. "అప్పోసప్పో చేసి మేము కూడా ఇంకుడు గుంతలు తవ్వుతాం. ఏం చేయాలో ఎలా చేయాలో మాకు కూడా చెప్పు" అంటూ చుట్టుముట్టారంతా.

"అంతా చేతులు కలిపితే ఒకరికొకరు శ్రమదానం చేసుకుంటేమూడునాలుగువేలఖర్చుతోనేప్రతీ బోరు దగ్గరా ఇంకుడుగొయ్యి తవ్వుకోవచ్చు" అన్నాను.

అంతా సరే అంటే సరే అన్నారు. నీటికోసం వారి తపన, తహతహ అర్థమైంది.

జలం లేకపోతే జీవం ఉండదు. మొక్క బతక్క పోతే రైతుకి బతుకు ఉండదు!

ఒక నెలరోజులు సెలవు పెట్టేశాను. ఒక స్వచ్ఛంద సంస్థ సహాయసహకారాలూ తీసుకున్నాను. రైతులంతా ఉత్సాహంగా పొలాల్లోని ప్రతి బోరు ప్రక్కనా ఇంకుడుగుంతలు తవ్వారు.

అంతటితో ఆగలేదు.

ప్రతి వర్షపుబొట్టునీ ఒడిసిపట్టుకోడానికి ప్రతి ఇంటికీ ఒక ఇంకుడుగుంత చొప్పున తవ్వించాను. అవసరమైన ఫిల్టర్లు ఏర్పాటుచేసి పరిశుభ్రమైన నీటిని సంపులోకీ బోరులోకీ ఇంకించి తద్వారా భూగర్భ జలాలు పెంచేలా ఏర్పాటుచేశాను.

దీనివల్ల తాగునీటి సమస్య తీరుతుందని నమ్మకంగా చెప్పాను. మా శ్రమ, మా ప్రయత్నం ఫలించాలంటే ఒక అద్భుతం జరగాలి. అంటే వర్షం కురవాలి. దానికోసం గ్రామం చకోరపక్షి అయ్యింది.

మా కళ్ళల్లో మెరుపులు కురిపిస్తూ వర్షం కురిసింది.మా యత్నాలని ఆకాశంలోని దేవతలు దీవించినట్టుగా భారీగానే కురిసింది.

కురిసిన ప్రతి నీటిబొట్టూ ఇంకుడుగుంతల్లోకి మళ్ళింది. మా ఊరి భూమి రీఛార్జి అయ్యింది. ఇంక నీరు లేక పంటలు ఎండవన్న భరోసా చిక్కింది అందరికీ. మాపల్లెకు జలకళ వచ్చింది.

జనానికి జీవకళ వచ్చింది.

జల చైతన్యం తెచ్చిన 'సుజల గాంధీ' అంటూ ఊరిజనం నన్ను ఆకాశానికెత్తేశారు.

మా నాన్న కళ్ళనిండా ఆనందం, అభినందన, గర్వం! నా భుజం తట్టిన నాన్న కళ్ళల్లో అసలైన పుత్రోత్సాహం నా కంటబడింది!



సినిమా భాష తెలిస్తే చాలు

చాలా చిన్న వయస్సులోనే సినిమాల్లోకి వచ్చేసిన మెరుపుతీగ తమన్నా తనకు అస్సలు తెలియని తమిళ, తెలుగు భాషల్లో దూసుకుపోతున్నది.

సినిమా భాష తెలిస్తే అన్ని భాషలు, ప్రదేశాలు అలవాటయినట్లేనన్నది ఆమె అభిప్రాయం.

'పరిచయంలేని భాషల్లో నటించడానికి మొదట్లో భయాలుండేవి. సినిమా భాష అర్థం అయిపోయాక అన్ని అంశాలూ దారిలోకి వచ్చేశాయి.


దేన్నయినా నేర్చుకోవడానికి, అలవాటు చేసుకోవడానికి సిద్ధంగా వుంటే, మిగతావాటిని సినిమానే చూసుకుంటుందని అర్థంచేసుకున్నాను" అంటూ గులాబీ బుగ్గల్లో నవ్వుల మొగ్గలు కురిపించింది తమన్నా.



ప్రతిపక్షాల మధ్య కూటమి విషయంలో సఖ్యత కుదరటం కష్టమే.

-సురవరం సుధాకరరెడ్డి,
సి.పి.ఐ. ప్రధాన కార్యదర్శి

ఆనందం, అమూల్యం



'ఫగ్లీ'తో బాలీవుడ్‌లోకి ప్రవేశించిన కైరాఅద్వానీ 'ఎమ్.ఎస్.ధోని- ది అన్ టోల్డ్ స్టోరీ'తో గత ఏడాది బాగా పాపులర్ అయింది. ఇప్పుడు ఈ హాటెస్ట్ భామ తెలుగునాట కాలుపెట్టి మహేష్‌బాబు సరసన 'భరత్ అనే నేను' సినిమాకు సిద్ధమైంది. రామ్‌చరణ్‌సరసన మరోసినిమా చేయనున్నది.

మహారాష్ట్రలో పుట్టి, పెరిగిన కైరా నాన్న జగదీప్ అద్వానీ వ్యాపారవేత్త. సింధీ హిందూ. అమ్మ స్కాటిష్. ఓ తమ్ముడు- ఇదీ ఆమె వ్యక్తిగత నేపథ్యం.

కైరా అద్వానీతో ఇంటర్వ్యూ విశేషాలు-

తెలుగునాట ప్రవేశించారు. భాషాపరంగా కాని, ఇతర ఇబ్బందులు కాని ఎదుర్కొన్నారా?

భావోద్వేగాలకు భాషాభేదాలేముంటాయి. నటనకూ అంతే. నాకు దక్షిణాది అవకాశాలు చాలా వచ్చాయి. వాటిలో 'భరత్ అనే నేను' బాగా నచ్చింది. నిర్మాతలు సంప్రదించినప్పుడు సంతోషపడ్డాను.ఇదో అమూల్య అవకాశంగా భావించాను. తెలుగు బాగానే అర్థం అవుతున్నది.

మహేష్‌బాబుతో పని ఎలా ఉంది?

తనలో అంకితభావం ఎక్కువ. తానో సూపర్‌స్టార్‌నన్నభావం అతనిలోకనపడదు. సెట్‌లోఅందరినీ సమానంగాచూస్తారు.

నటనఅనేఆలోచనఎప్పటినుంచోమీమనస్సులోఉందా?

నటన ఎప్పుడూ నా పాషనే. అయితే ప్లాన్ లేదు. ప్రజలు తారల జీవితం పూర్తిగా గ్లామరస్‌గా వుంటుందని భావిస్తారు. కానీ కళ్ళకుకనిపించేదానికి మించి మరెంతోవుంటుంది. డిజైనర్లు మాకు అందమైన దుస్తులు రూపొందించడం, అభిమానుల అభిమానాలు-ఇవన్నీ మాకువరాలే. ఇవన్నీ సుదీర్ఘగంటల హార్డ్‌వర్క్, అంకితభావం, క్రమశిక్షణ ఫలాలు.


నటిగా జీవితం మారిందా?

తప్పకుండా మారాలి కదా. ఇంట్లోమాత్రం నేను సాధారణ అమ్మాయిని. మా అమ్మకు ఇంటిపనుల్లో సాయం చేస్తాను. నా వయస్సు మిగతా అమ్మాయిల మాదిరే స్నేహితులతో కలిసి తిరుగుతుంటా.

మీ డ్రీమ్ ప్రాజెక్టు ఏంటి? ఎవరితో కలిసి నటించాలన్న కోరిక ఉంది?

ఏదో ఒక్క పేరు చెప్పడం కష్టం. లక్ష్యం అటు వంటిది. నాకు రొమాంటిక్ కామెడీలు ఇష్టం. పీరియడ్ డ్రామా ఇష్టం. అలాగే యాక్షన్ చిత్రం- ఇలా జాబితా చాలా వుంది.

వైఆర్‌ఎఫ్, ధర్మ ప్రొడక్షన్స్, సాజిద్ నదియా వాలా సర్, సంజయ్‌లీలా భన్సాలీ, రాజు హిరానీ సర్, జోయాఅక్తర్, ఇంతియాజ్ అలి వంటివారితో కలిసి పనిచేయాలని వుంది.



సల్మాన్‌సర్, షారూక్‌సర్, అక్షయ్‌కుమార్, హృతిక్‌రోషన్,రణబీర్‌కపూర్, రణవీర్‌సింగ్,వరుణ్ ధావన్‌లంటే ఎంతో ఆరాధన. భవిష్యత్‌లో వీరితో కలిసి పనిచేయగలిగితే నేను చాలా లక్కీ.

తెలుగు సినిమా చేస్తున్నారు కదా? ప్రాంతీయ భాషాచిత్రాలపట్ల మీ అభిప్రాయంఏంటి?

'బాహుబలి' వంటి సినిమాలు భాషవిషయంలో సినిమాకు సరిహద్దులు లేవని నిరూపించాయి. సినిమాలను అన్ని భాషల్లోకి డబ్‌చేస్తున్నారు. మహేష్‌బాబు సరసన నేను తొలిసారి తెలుగులో నటించడం గొప్పగా వుంది. ఈ అనుభవంతో మరిన్ని అవకాశాలకోసం చూస్తున్నా.

నాలోని ప్రతిభను ఈ చిత్రం చాటిచెప్తుందన్న ఆశాభావంతో వున్నాను.

మీ కెరీర్‌లో మీ తల్లిదండ్రుల పాత్ర ఎలా ఉంటుంది?

నా తల్లిదండ్రులు నా వెన్నెముకలాంటివారు. నేను నేలమీద వుండేలా చూస్తారు. నాకు పూర్తి మద్దతిస్తుంటారు. వీళ్ళిద్దరూ నాకు ఎంతోనిర్మాణాత్మక విమర్శకులు. గొప్ప అభిమానులు.

మీ మనస్సును తాకే సామాజిక కారణం?

విద్యకుఎప్పుడూ తొలిప్రాధాన్యం ఇస్తాను. వీలైనంతమంది పిల్లలు, యువత చదువుకునేందుకు నా శక్తిమేరకు కృషిచేయాలనిపిస్తుంటుంది.

మీ పేరెందుకు మార్చుకున్నారు?

అలియా అన్న పేరు అప్పటికే బాలీవుడ్‌లో ఫేమ్ అయింది కాబట్టి 'ఫగ్లీ' నిర్మాత నా పేరును కైరా అద్వానీగా మార్చారు. కాని, వ్యక్తిగతంగా నేనెప్పుడూ అలియానే. కైరా నా స్క్రీన్ నేమ్.

మీకు నచ్చే సమకాలీన తార ఎవరు?

అలియాభట్. ఎందుకంటే తన బాడీ వర్క్ తన గురించి ఎంతో చెప్తుంటుంది.ఎంతో చిన్నది అయినా, అబ్బురపరిచే పాత్రలు చేసిన క్రెడిట్ దక్కించుకోగలిగింది.

ఆదర్శపురుషుడికి మీరిచ్చే నిర్వచనం ?

నా ఐడియల్ మ్యాన్ లాయల్‌గా, ప్రేమించే తత్వం కలిగివుండాలి. హార్డ్‌వర్క్‌చేస్తూ, కుటుంబానికి ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తి అయివుండాలి.

మంచి సెన్సాఫ్ హ్యూమర్, స్టైల్ అవసరం. ప్రయాణాలు ఇష్టపడాలి.

ఏదైనా బయోపిక్‌చేయాలన్న కోరిక ఉందా?

మధుబాల పాత్ర చేయాలని ఉంది అంటూ ముగించింది కైరా అద్వాని.

అయినపూరి సుజాత

సీరియల్

మనిషిలో మనిషి



ప్రాబ్లమ్ వస్తే తప్పించుకోవడానికి ప్రభుత్వంలో పలుకుబడి కూడా ఉంది. అధికార పార్టీ ఆశీస్సులు వున్నాయి.

వ్యాపారంలో పోటీ, శత్రువులు కూడా ఎక్కువే. అందుకే ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటాడు. అయితే ఆఫీస్ వ్యవహారాలను ఇంటివరకు రానీయడు. అంతా ఫోన్లమీద జరిగిపోతూంటాయి.

అతడు ఊళ్ళో ఉన్నా లేకపోయినా యథావిధిగా పనులు జరిగిపోతూంటాయి. అందుకు సమర్థులు, నమ్మకమైన మనుషులున్నారు.

సాదూభాయ్ శరీరంలోకి పరకాయ ప్రవేశంచేసిన కార్తికేయ ఆ రోజు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి ఇంటికి చేరుకునేసరికి రాత్రి ఎనిమిది గంటలయింది. అతడి కోసం ఎదురుచూస్తూ హాల్లోనే ఉంది సుదీప.


భోపాల్లో విమానం ఎక్కినప్పట్నుంచి సాదూభాయ్ ఆలోచన ఒకటే. ఎంత త్వరగా ఢిల్లీ నుంచి నికరాగ్వా చేరుకుంటే అంత తొందరగా సంజనాను కాపాడుకోవచ్చు. కాదంటే సుదీపకు అనుమానం రాకుండా చూసుకోవాలి. అది పెద్ద కష్టంగాకపోవచ్చు.

పోతే డ్రైవరు దీనారామ్ మాటల్ని బట్టి సాదూభాయ్‌కి దక్షిణమెరికా దేశాల వీసా ఉంది. కాబట్టి ఎప్పుడైనా విమానం ఎక్కేయొచ్చు.

కాదంటే సాదూభాయ్ సంతకాన్ని ఫోర్జరీచేయటం అర్జంటుగా నేర్చుకోవాలి. తనకు తెలిసి సుదీపను ఏమార్చటం పెద్ద సమస్య గాకపోవచ్చు.

ఇలా అనేక ఆలోచనలతో ఇంటికి చేరుకున్నాడు. కాని కారు దిగి హాల్లోకి అడుగుపెడుతూనే సుదీపను చూసి ఆశ్చర్యపోయాడు. తన పర్సులోని, ఫోటోలో కన్నా, నేరుగా మరింత అందంగా ఉంది.

తాకితే కందిపోతుందా అన్నంత సుకుమారంగాను, కలర్‌ఫుల్‌గాను ఉంది. అద్భుతమయిన వంపుసొంపులు. చీర జాకెట్‌లో చక్కెర బొమ్మలా ఉంది.



ముప్పై సంవత్సరాల గుజరాతీ అందం. ఆపైన పిల్లల్లేరు. ఇక చెప్పాలా! సన్యసించినవాడు కూడా ఈ అందం చూస్తే సంసారి కావలసిందే.

ఇంత గొప్ప అందగత్తె కాబట్టే సాదూభాయ్ గుజరాత్ నుంచి ఈమెను ఎత్తుకు వచ్చి తనతో ఉంచుకొని మహరాణిలా చూసుకుంటున్నాడు.

పెళ్ళి చేసుకోలేదుగాని భార్య స్థానం ఇచ్చి గౌరవించాడు. సందేహం లేదు. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అందగత్తె సుదీప. అలాగని సుదీపను తన సంజనాతో పోల్చలేడు. ఎందుకంటే, రాజసంతో కూడిన సోయగాల హరివిల్లు తన సంజనా.

విశాలమైన ఫాలభాగం గమనించినట్టయితే, చాలా చురుకైన తెలివైన యువతిగా తెలుస్తుంది.

సుదీపను ఏమార్చటం తను ఊహించినంత సులువుగాకపోవచ్చనిపిస్తోంది. జాగ్రత్తగా ఉండాలి. సాదూభాయ్ హాల్లోకి రావడము చూసి అలకతో లేచి నిలబడింది. కోపంగా 'హమ్మయ్య' గండం గడిచింది అనుకునేంతలోనే వెనుతిరిగి సుడిగాలిలా వచ్చి అతడ్ని వాటేసుకుంది.

బిత్తరపోయాడు.

ఇబ్బందిగా చూశాడు.

జీవితంలో మొదటిసారి పరాయి స్త్రీ కౌగిట్లో ఉన్నాడు. బలమయిన ఎదపొంగులు తన ఛాతీని అదిమేస్తున్నాయి. స్పాంజ్‌లాంటి ఆమె సుకుమార దేహం మత్తెక్కిస్తోంది. శరీర సుగంధం పరవశింపచేస్తోంది. ఆమె ముద్దుల వేడి నరాల్ని జివ్వుమనిపించింది. వారించలేకపోయాడు.

"అసలు ఏమనుకుంటున్నావ్ నువ్వు...?" అంటూ నిలదీసింది సుదీప.

E-mail: Suryadevaranovelist@gmail.com

సూర్యదేవర రామ్మోహనరావు



"నాతో ఫోన్‌లో మాట్లాడడానికి కూడా కష్టంగా ఉందా? లేక నా మీద ఇష్టము తప్పిందా... ఏమయింది నీకు?" అంటూ వెక్కివెక్కి ఏడ్చేస్తూ, కన్నీళ్ళు పెట్టుకుంటూ కసిగా బుగ్గలు కొరికేస్తుంటే కంగారుపడి ఆమెను విడిపించుకునే ప్రయత్నం చేశాడు.

అనుమానంగా చూసింది.

"సాదూ డియర్. ఏమయింది నీకు? నువ్వేనా... నన్ను కొత్తగా చూస్తున్నావ్. వచ్చీరాగానే విరహతాపమంతా చూపిస్తూ, కొత్తచీరను నలిపినట్టు నన్ను కౌగిట్లో నలిపేసి, తెగ ముద్దులాడేవాడివి.

ఆ మోహమంతా ఏది? ఆత్రం ఏది? ప్రేమ ఏది? నామీద మోజు తప్పిందా లేక నీ ఆరోగ్యం బాగ లేదా?" కళ్ళు చక్రాల్లాతిప్పి, ఆశ్చర్య పోతూ అడిగింది సుదీప.

ఇక మవునంగా ఉండి లాభం లేదు. ఏదోటి మాట్లాడాలి. లేకపోతే అనుమానం బలపడే ప్రమాదం ఉంది.

"అదేం లేదు డియర్" అంటూ పొడిగా నవ్వేశాడు.

"ఒక విధంగా ఇది ఆరోగ్య సమస్యే. హార్ట్ ప్రాబ్లమ్. ఎక్కువ ఎగ్జయిట్ కాకూడదని గుండెకు విశ్రాంతి అవసరం అని డాక్టర్ చెప్పాడు. అరే దీనారామ్. అలా చూస్తావేంటిరా. చెప్పు" అంటూ కౌగిలి విడిపించుకొని దీనారామ్‌ను, ముందుకు లాగాడు.

"అవును మేడమ్. సార్‌కి అడవిలో గొప్ప ప్రమాదం తప్పింది. చిరుతపులి పంజాతో కొట్టిన దెబ్బకి బాస్ చనిపోయారని భయపడ్డాను. దేవుని దయ... మన అదృష్టం. బ్రతికారు. అప్పట్నుంచి సాబ్‌కి ఏదీ చప్పున గుర్తు రాదు. గుండె వేరే బలహీనపడింది" అని అంటూ నమ్మబలికాడు దీనారామ్. అచితూచి మాట్లాడాడు. జరిగింది పూర్తిగా చెప్పలేదు.

"చిరుతపులి ఏమైంది?" సుదీప అడిగింది.

"దాన్ని బాస్ షూట్ చేసి చంపేశారు మేడమ్"

"ఓ మైగాడ్! మీరసలు అడవిలోకెందుకెళ్ళారు? మీతో వచ్చిన మిగతావాళ్ళు ఎక్కడ?"

"వాళ్ళకి వేరే పనులు అప్పగించి వచ్చాను. తర్వాత వస్తారు. నాకు విశ్రాంతి కావాలి. ప్లీజ్. దీనారామ్. నన్ను బెడ్‌రూమ్‌కి తీసుకువెళ్ళు" అన్నాడు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ సాదూభాయ్. కాని అడగనే అడిగింది సుదీప.

"అదేమిటి? మనింట్లో మన బెడ్‌రూమ్ ఎక్కడ వుందో నీకు తెలీదా?" అంటూ.

"సారీ మేడమ్. చెప్పాగదా. చిరుత దాడి తరువాత బాస్‌కి ఏదీ సరిగా గుర్తురావటంలేదు. మనమే గుర్తుచేయాలి. మెట్లు ఎక్కగలరో లేదో మీరు రండి బాస్. జాగ్రత్త!" అంటూ డ్రైవరు దీనారామ్ మేడ మీదకు మెట్లవైపు దారితీశాడు.

వాడి భుజంమీద చెయ్యేసి నెమ్మదిగా మెట్లెక్కుతున్న సాదూభాయ్‌ని ఆశ్చర్యంతో చూస్తూ షాక్‌తో అలాగే నిలబడిపోయింది సుదీప.

బెడ్‌రూమ్‌లోకి రాగానే సాదూభాయ్ ముందుగా చేసిన పని బాత్‌రూమ్ టబ్‌లో దిగి అలుపుతీరా స్నానం చేయటం. టబ్‌లోని చల్లటి నీటిలో పడుకుని చాలాసేపు ఆలోచిస్తూనేవున్నాడు.

ఏదేమైనా పాస్‌పోర్ట్ చేతికి చిక్కితే చాలు. ఒకటి రెండురోజుల్లోనే ఇక్కడ్నుంచి వెళ్ళిపోవచ్చు.

స్నానంచేసి బట్టలు మార్చుకుని కిందికి వచ్చాడు సాదూభాయ్. ఉదయం త్వరగా రమ్మని డ్రైవరు దీనారామ్‌ని పంపించేశాడు.

సుదీపతో కలిసి భోంచేశాడు.

జరిగిన కథ

22

సాదూభాయ్‌కి అడవిలో కార్తికేయ జీప్ కనపడుతుంది.

మలయాళ మాంత్రికుడు భైరవేశ్వర్ ద్వారా రాకుమారిమీద మంత్రప్రయోగం స్వామి సత్యానంద చేయించాడని, ఆమె బ్రతికే రహస్యం కూడా కార్తికేయకు చెబుతాడు మణిసిద్ధుడు.

భూమిలోపల వున్న నరకలోకాలగురించి చెప్పి అందులో ఒకటయిన అగ్నిగుండంలా మండే 'మసాయా'లో పట్టుచిలకరూపంలో సంజనా బందీగా ఉందని చెబుతాడు.

అష్టసిద్ధులు, అతీంద్రియ శక్తుల గురించి మణిసిద్ధునివద్ద తెలుసుకుంటాడు కార్తికేయ. పరకాయ ప్రవేశ విద్యను నేర్పుతాడు మణిసిద్ధుడు.

ఆ విద్యతో చచ్చిపడివున్న చిరుతపులి శరీరంలోకి ప్రవేశించి కిష్టప్పనాయుడు, సాదూభాయ్, అతని మనుషులను వేటాడి చంపుతాడు కార్తికేయ.

ఆ తరువాత సాదూభాయ్ శరీరంలోకి ప్రవేశించి అతడి డ్రైవర్ దీనారామ్ సాయముతో ఢిల్లీలో ఉన్న సాదూభాయ్ ఇంటికి బయలుదేరతాడు కార్తికేయ.

తర్వాత జరగబోయేది చదవండి.

దైవకృప

పరిశ్రమకు వచ్చిన కొత్తల్లోనే తనకు లక్కీ లేడీ ట్యాగ్ రావడం భగవంతుడి కృప అంటున్నది మెరుపుల మెహరీన్.

"నేను భగవంతుడిని బాగా విశ్వసిస్తాను. కాబట్టి, ఇదంతా ఆయన ఇచ్చినదనే అనుకుంటాను. మనం ఏదైనా కోరుకున్నప్పుడు, అదే విషయాన్ని ఇంకెవ రైనా మనకోసం గట్టిగా కోరుకుంటే దేవుడు తప్ప కుండా వింటాడని నేను నమ్ముతాను.

నా మంచి కోరుకునేవాళ్ళు చాలామంది వున్నారు కాబట్టే నన్ను విజయం వరిస్తున్నది. జీవితం మనకు ఎన్నో కిటుకులు నేర్పుతుంటుంది. నేను ఆ ఫ్లోలోనే వెళ్ళిపోతుంటా" అని చెప్పింది.



భోంచేస్తూండగానే ఆమెలోని కసి, కవ్వింపులు తెలిసిపోయాయి. ఖచ్చితంగా రాత్రికి తన పక్కలోకి వచ్చేస్తుంది. పదిరోజుల విరహంతో తహతహలాడు తోంది సుదీప. సహజంగానే కాముకి.

ఆపైన ముప్పైయేళ్ళ పరువాల ఆకలి. అనారోగ్య మన్నా, ఆషాఢమన్నా ఆగే మనిషి కాదు.

సంజనాను తాకిన శరీరంతో పరస్త్రీని తాకలేడు. ప్రమాదాన్ని నివారించటంకోసం భోజనం చేయగానే బెడ్‌రూమ్‌కి వచ్చేశాడు. తలుపులు మూసి లాక్‌చేసు కుని ప్రశాంతంగా నిద్రపోయాడు.

ఆ రాత్రి సుదీప వచ్చి తలుపు తట్టినా తెరవ లేదు. దాంతో ఉదయం తలుపు తెరవగానే వచ్చి అతడితో గొడవకు దిగింది సుదీప.

ఆమెకి సర్దిచెప్పుకునేసరికి, ఆ రోజు పగలు డ్రైవరు దీనారామ్‌తో తమ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ కంపెనీ ఆఫీసుకు వెళ్ళాడు.

దీనారామ్ సాయంతో అక్కడ ఎవరికీ అనుమానం రాకుండా మేనేజ్ చేయగలిగాడు. సాయంత్రం కాసేపు బార్‌లో కూచుని మందు కొట్టాడు.

ఏం చేస్తున్నా సుదీప నుంచి ఎలా తప్పించుకోవా లాని ఆలోచిస్తూనేవున్నాడు. ఇంటికొచ్చాక సుదీపను పాస్‌పోర్ట్ గురించి అడిగాడు.

"బెడ్‌రూమ్ మొత్తం వెదికినా కన్పించలేదు. నువ్వు చూశావా?" అనడిగాడు.

"దాంతో ఇప్పుడేంటి పని...?" అని సీరియస్‌గా అడిగింది సుదీప.

"పాబ్లో ఎస్కోబార్ ఫోన్ చేశాడు. లాటిన్ అమెరికా వెళ్ళాలి" చిన్న అబద్ధం చెప్పాడు.

"తెలుసు. నాకు తెలుసు. రాగానే నన్ను పట్టించుకోకుండా మళ్ళీలాటిన్ అమెరికాకి ఉడాయిస్తావని తెలుసు. అందుకే నీ పాస్‌పోర్ట్ తీసి భద్రంగా దాచేశా" అంది గడుసుగా సుదీప.

ఎంత వెదికినా పాస్‌పోర్ట్ ఎందుకు దొరకలేదో అప్పటిగ్గాని సాదూభాయ్‌కి అర్థంకాలేదు. డౌట్ లేదు. తను సుదీప చేతిలో బుక్కయిపోయాడు. అక్కడికీ చాలా బ్రతిమ లాడాడు. ఆమె ఒప్పుకోలేదు.

"ఇలా కాదుగాని ఓ పనిచెయ్యి. రాత్రిలా డోర్స్ లాక్ చేయకు. వరసగా ఓ అయిదు రాత్రిళ్ళు నన్ను సంతోషపెట్టు. అప్పుడు పాస్‌పోర్ట్ ఇస్తాను. తర్వాత నీ ఇష్టం. ఎక్కడికయినా వెళ్ళిరా..." అని అంటూ షరతు విధించింది సుదీప.

సాదూభాయ్ సంతకమైతే ఫోర్జరీ చేయటం ఒక్కరోజులో నేర్చుకోగలిగాడు. కాని నేర్పుగా సుదీప నుంచి ఎలా తప్పించుకోవాలో అర్థంగావటంలేదు. ఈ దశలో పాస్‌పోర్ట్ తనకు కీలకం.

అదంత సులువుగా చేతికొచ్చేలా లేదు. సందేహం లేదు. సుదీప చాలా తెలివైన యువతి. ఆమె జాణ తనం ప్రతిక్షణం తనను కవ్విస్తూనే ఉంది.

ఏం చెప్పాలో తెలీక బెడ్‌రూమ్‌లోకి వచ్చేసి తల పట్టుకొని కూచుండిపోయాడు.

చాలాసేపు ఆలోచించాక సాదూభాయ్‌కి ఒక సొల్యూషన్ దొరికింది. జ్ఞానోదయం కలిగించినట్టయింది.

ఒకప్పుడు ఇలాగే, ఆదిశంకరాచార్యులవారికి ఒక సమస్య ఎదురయింది. ఒక ఆస్థానంలో ఎందరో కవి పండితుల్ని ఓడించారాయన.

చివరకు ఒక విదుషీమణి, ఆయన బ్రహ్మచారి యని గ్రహించి కామసూత్రాలకు సంబంధించిన ప్రశ్నలు సంధించింది.

అస్ఖలిత బ్రహ్మచారి అయిన స్వామికి ఆ ప్రశ్న లకు సమాధానాలు తెలీలేదు. రెండు మాసాలు గడువు అడిగి తప్పించుకున్నాడు.

తర్వాత మరణించిన ఒక రాజు శరీరంలోకి పర కాయ ప్రవేశం చేసి వేశ్యా సాంగత్యంతో కామ సూత్రాలు అభ్యసించి తిరిగి తన నిజశరీరంలోకివచ్చి గడువులోపలే ఆ విదుషీమణి ప్రశ్నలకు సమాధా నాలు చెప్పి పోటీలో విజేత అయినాడట.

ఇలా చేయటంవలన శంకర భగవత్పాదుల బ్రహ్మచర్యానికి కళంకం ఏర్పడలేదు. ఇప్పుడు తనదీ అదే పరిస్థితి. ఈ శరీరం తనది కాదు.

తను ఇప్పుడు పరకాయ ప్రవేశంలో ఉన్నాడు. తన నిజశరీరం అక్కడ గుహలో మణిసిద్ధుల వారి చెంత భద్రంగా ఉంది.

ఈ పరిస్థితిలో తను సుదీపతో సంసారం చేస్తే తనకు వచ్చిన నష్టం ఏమీలేదు. సుదీప పరస్త్రీ ఎలా అవుతుంది. ఈ దేహం ఆమె భర్తదే కదా.

ఇందులో పాపకళంకం తన ఆత్మకు తాకే ప్రసక్తే లేదు. తనకు పాస్‌పోర్ట్ ముఖ్యం.

దానికోసం, తన సంజనాను త్వరగా చేరుకోవటం కోసం తను సుదీపకు దగ్గరవక తప్పదు. ఆమెను సంతోషపెడితేనే పనులు త్వరగా జరుగుతాయి. ఇలా తనకు తనే నచ్చచెప్పుకున్న సాదూభాయ్ ఇక ఆ రాత్రి తలుపులు లాక్ చేసుకోలేదు.

రాత్రి తొమ్మిదిగంటలతర్వాత సుదీప బెడ్‌రూమ్ లోకి వచ్చి తలుపు మూసింది. ఓరకంట ఆమెను గమనిస్తూనేవున్నాడు సాదూభాయ్. సిల్కు నైటీలో శృంగార రసాధిదేవతలా ఉంది.

ఆమెకు ఇష్టమయిన సెంటు సువాసనలు గదిని పరిమళింపచేస్తున్నాయి.

అయితే తను ఊహించినట్టుగా వచ్చి కౌగిట ఒదిగి పోలేదు సుదీప. అలిగి బుంగమూతిపెట్టి సరసనే అటు తిరిగి పడుకుంది. పిలిచినా ఉలుకూపలుకూ లేదు. భుజంమీద చేయివేస్తే విసిరికొట్టింది.

ఈ ట్విస్ట్ ఏమిటో సాదూభాయ్‌కి అర్థంకాలేదు. చాలాసేపు లాలించి బుజ్జగించి బ్రతిమాలుకుని దగ్గరకు తీసుకున్నాక అప్పుడు పెదవి విప్పింది.

"నీకు నామీద ప్రేమ లేదు. ఉంటే నన్ను ఇంతగా ఏడిపించేవాడివి కాదు. పాస్‌పోర్ట్ కోసమయితే నన్ను తాక నక్కర్లేదులే. పొద్దుట ఇచ్చేస్తాను... ఎక్కడికి వెళ్ళాలో వెళ్ళిపో..." అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ.

ఆమె బాధ చూస్తూంటే సాదూ భాయ్ మనసుకు చాలా కష్టమనిపిం



ఫలితం రావాలంటే సంకల్ప బలం వుండాలి... ప్రత్యేక హోదా విషయంలో సంకల్పమే లోపించింది.

-పవన్‌కళ్యాణ్, జనసేన నేత

చింది. సాదూభాయ్ మోజుపడి గుజరాత్ నుంచి సుదీపను ఎత్తుకువచ్చివుండవచ్చు.

కాని సుదీప అతన్ని తాళికట్టిన భర్తకన్నా మిన్నగా చూసుకుంటోంది. అతడ్నే నమ్ముకుంది. ఇంతటి అందాలరాశి రేపు సాదూభాయ్ ఇక లేడని తెలిస్తే తట్టుకోగలదా? ఏమయిపోతుంది?

"వద్దనుకుంటే నా గదిలోకి ఎందుకు వచ్చావ్. నీ గదిలోనే పడుకోవచ్చుగా" అని కళ్ళలోకి చూస్తూ కొంటెగా అడిగాడు.


"వద్దనుకుంది నేను కాదు... నువ్వే"

'అందుకని... పాస్‌పోర్టిచ్చేస్తావా. వెళ్ళిపోనా... ఎక్కడికి? అలసిపోయి ఇంటికి వచ్చానుగాబట్టి రాత్రి వద్దన్నాను. ఇప్పుడు కాదంటానా... నువ్వే నా ప్రాణమని తెలీదా?' అంటూ కౌగిట బంధించి ముద్దులాడుతూంటే సుదీప కోపమంతా వెన్నలా కరిగిపోయింది.

ఇక ఆ రాత్రంతా ఇద్దరి మధ్య మదనోత్సవంలా, కాముడి పండుగలా కరిగిపోయింది. ఆమె నిద్ర పోలేదు, అతడ్ని నిద్రపోనీయలేదు.

జీవిత మాధుర్యాన్నంతా ఆ ఒక్క రాత్రే తాగేసినంత సంతృప్తి. సుదీప నిజంగానే ఒక అద్భుతమయిన యువతి. వాత్సాయన కామసూత్రాల్ని ఔపోసన పట్టిన నెరజాణ.

"సాదూ డియర్. నిన్ను చూస్తుంటే నాకు చాలా అసూయగా ఉంది తెలుసా? నువ్వు... నువ్వేనా అని సందేహంగా కూడా ఉంది. మన సంసార జీవితంలో నువ్వింత బలంగా రెచ్చిపోటం ఎప్పుడూ చూళ్ళేదు. అమ్మో... ఒంటె పాలుతాగి పెరిగినదాన్నిగాబట్టి తట్టుకున్నాను... లేకపోతే ఏమయిపోయేదాన్నో. థ్యాంక్స్ డియర్. నువ్వు ఇచ్చిన ఈ సుఖానికి నా ప్రాణాలు ఇచ్చినా తక్కువే అనిపిస్తోంది!" తెల్లవారు జామున నిద్రలోకి జారుకునేముందు సుదీప మెచ్చుకోలుగా పలికిన మాటలవి.



ఆమె ధోరణి చూసి మరునాడే పాస్‌పోర్ట్ తనకు ఇచ్చేస్తుందనుకున్నాడు సాదూభాయ్. కాని ఇవ్వలేదు. అడిగితే నవ్వి ఊరుకుంది.

చెప్పినట్టుగానే వరసగా అయిదు రాత్రుళ్ళు అతడితో ఆనందంగా గడిపాకగాని పని జరగలేదు.

ఆరో రోజున మాట తప్పకుండా అతడి పాస్‌పోర్ట్ తెచ్చి చేతిలో పెట్టింది సుదీప.

సరిగ్గా ఆ రోజే డ్రగ్ మాఫియాకింగ్ పాబ్లో ఎస్కోబార్‌నుంచి ఫోన్ వచ్చింది.

"వాట్ హాపెన్డ్ మిస్టర్ సాదూ? యూ ఫినిష్డ్ దట్ బ్లడీ సైంటిస్ట్ కార్తికేయ?" పాబ్లో ఎస్కోబార్ అడిగిన మొదటి ప్రశ్న అది.

"యా... ఐ ఫినిష్డ్ బాస్. ఆ పని ముగించుకుని ఇవాళే ఢిల్లీ వచ్చాను. వాడిని గుర్తించి చంపటంలో నమ్మకమైన నా మనుషులు కొందర్ని కోల్పోయాను కూడా. ఎనీవే. డోన్ట్‌వర్రీ! ఇక కార్తికేయ లేడు" తనూ ఇంగ్లీష్‌లోనే బదులిచ్చాడు సాదూభాయ్.

"వెరీగుడ్ సాదూ. థ్యాంక్యూ సోమచ్. నీ మనుషులు పోయినందుకు అయామ్ వెరీ సారీ. ఆ లోటు భర్తీ చేస్తాలే. అన్నట్టు ఓసారి కొలంబియా రారాదూ. మా వాళ్ళు తయారుచేసిన కొత్త డ్రగ్స్ ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఇండియాకు నువ్వే సప్లై చేయాలి"

"ష్యూర్! నేనే రావాలనుకొంటున్నాను. ఒకటి రెండ్రోజుల్లో వస్తున్నాను. మీ వద్దకొస్తాను. థ్యాంక్యూ! ఉంటాను" అచ్చం సాదూభాయ్‌లాగే ఇంగ్లీష్‌లో మాట్లాడి మేనేజ్‌చేసి లైన్ కట్‌చేశాడు సాదూభాయ్.

కాని అతడి ఆలోచనలు ప్లాన్స్ అతనికున్నాయి. తను కొలంబియా చేరగానే చేయాల్సిన మొదటి పని పాబ్లో ఎస్కోబార్‌ని చంపటం. ఎందుకంటే వాడు బ్రతికుంటే తనను చంపటానికి తిరిగి తిరిగి ప్రయత్నిస్తూనే ఉంటాడు.

వాడు బ్రతక్కూడదు. ఆ తరువాత మసాయా గుహ చేరుకుని తన సంజనాను కాపాడుకోవటం.

సాదూభాయ్ ఢిల్లీ వచ్చిన పదో రోజున కొలంబియా, అక్కడినుంచి నికరాగ్వా ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తిచేసుకున్నాడు.

ఆ రోజు రానేవచ్చింది.

మధ్యాహ్నం రెండుగంటలకి ఫ్లైట్.

పన్నెండు గంటలకే ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరాడు సాదూభాయ్.

డ్రైవర్ దీనారామ్ తనవెనకే సూట్‌కేసు మోసుకు వస్తూండగా మెట్లు దిగసాగాడు సాదూభాయ్.

అంతలో రెండు పోలీసు వాహనాలు రివ్వున పోర్టికోలోకి దూసుకువచ్చేశాయి.

శకునమే, ఇంత చండాలంగా ఉందేమిట్రా బాబు అనుకుంటూ అక్కడే మెట్లమీద ఆగిపోయి, భార్య సుదీపకోసం చూశాడు. ఆమె దిగువ హాల్లోనే ఉంది. పోలీసుల రాక చూసి ఆమె కూడా షాకయినట్టుంది. కాస్త ఆలస్యంగా వాళ్ళని ఆపాలని ముఖద్వారం వైపు కదిలింది. కాని వాహనాలు దిగుతూనే చరచరా లోనకొచ్చేసింది పోలీసు బలగం.

వాళ్ళు తనను చూసేశారు. కిందకు దిగలేదు, వెనక్కి పోలేదు. ఎందుకు వచ్చారో తెలీక మెట్లమీదే నిలబడిపోయాడు సాదూభాయ్.

పునఃపరిశీలన

జీవితంలో కొన్ని ముఖ్యమయిన అంశాలను పునఃపరిశీలన చేసుకుంటున్నానని చెవుతోంది శ్రద్ధాకపూర్. జీవితంలో భాగంగా కొత్త సంవత్సరం మొదలయ్యాక అనేక ప్యాషన్లు అలవరుచుకున్నదట కూడా.

"శాకాహారిగా మారిపోయా. పుస్తకాలు చదవడానికి ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నాను.

ముంబయిలో వీధి కుక్కలు, పిల్లుల ఎడాప్షన్ డ్రైవ్‌కు సహకరించడాన్ని ఆరంభించాను" అంటూ వ్యక్తిగత సంగతులు ఏకరువుపెట్టింది.

కాలుష్యాన్ని హరించేందుకు సరికొత్త అధిశోషకం

తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేసిన శాస్త్రవేత్తలు: వాయు, జల కాలుష్యాన్ని తగ్గించగల సరికొత్త అధిశోషకాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.

ఈ పదార్థ ఉత్పత్తికయ్యే వ్యయం చాలా తక్కువని తెలిపారు.



వాతావరణం, జలంలోని కాలుష్య కారకాలను శోషించుకునేందుకు ప్రస్తుతం ఎక్కువగా వినియోగిస్తున్న క్రియాశీల కార్బన్‌కు ఇది ప్రత్యామ్నాయం కాగలదని పేర్కొన్నారు. క్రియాశీల కార్బన్ ఖరీదైన పదార్థమని గుర్తుచేశారు.

ప్రకృతిలో విరివిగా లభించే సోడియం ఆల్జినేట్, పరిశ్రమల్లో అధిక స్థాయిలో ఉత్పత్తి అయ్యే సిలికా పొంగులను జోడించి తాజా అధిశోషక పదార్థాన్ని తాము సృష్టించినట్లు ఇటలీలోని బ్రెసియా విశ్వవిద్యాలయ పరిశోధకులు ఎల్జా బొంటెంపి తెలిపారు.

క్రియాశీల కార్బన్ కంటే మెరుగ్గా జలం, వాతావరణంనుంచి కాలుష్య కారకాలను నూతన అధిశోషకం పీల్చుకుంటుందని పేర్కొన్నారు. ◆



ఏం మారలేదు

ప్రస్తుత సినిమాల్లో స్కిన్‌షో ఎక్కువ అయిందంటే రాధికా ఆప్టే అస్సలు ఒప్పుకోదు.

"బాలీవుడ్‌లో స్కిన్‌షో ఎప్పుడు లేదు? బాలీవుడ్‌లో రెండు కోణాలూ ఉన్నాయి.

పదేళ్ళక్రితం గ్లామర్ ప్రదర్శన ఎలా వుందో ఇప్పుడూ అంతే ఉంది. ఏం మారలేదు.

స్క్రిప్టు డిమాండ్‌ను అనుసరించి కొన్ని తప్పవు. స్కిన్‌షోకు, న్యూడిటీకి వ్యత్యాసం వుంది.

న్యూడిటీ ఎందుకు అవసరం అనేదానికి కారణం వుంటుంది. నా ప్రాథమిక సూత్రాలకు సదరు కారణాలు నప్పితే చేయడానికి నాకు అభ్యంతరం ఉండదు. అనవసర స్కిన్‌షోకు నేను వ్యతిరేకం" అంటూ ఎప్పటిలాగే ఫ్రాంక్‌గా చెప్పింది.

ఒక ఎ.ఎస్.పి., ఒక ఎస్.పి., ఒక ఎస్సైతో కూడిన పదిమంది పోలీసుదళం. వాళ్ళని ఆపే ప్రయత్నం చేసింది సుదీప.

"సారీ మేడమ్. ఒక కేసు విషయంగా సాబ్‌తో మాట్లాడి వెళ్ళాలని వచ్చాం. కంగారుపడాల్సినదేమీ లేదు" అన్నాడు ఎ.ఎస్.పి.

"సాబ్ లేరు. మీరు తర్వాత రండి" అని అరిచింది సుదీప.

"లేకపోవడం ఏంటి మేడమ్..." అంటూ మెట్ల మీదకు చూసి నవ్వాడు ఎ.ఎస్.పి.

అప్పటివరకు సాదూభాయ్ బయటికి వచ్చిన సంగతి గమనించలేదు సుదీప. ఏం చెప్పాలో అర్థం కాలేదు. అప్పటికే మెట్లమధ్య ఉన్నాడు సాదూభాయ్. బెడ్‌రూమ్‌లోనే ఉంటే మేనేజ్ చేయగలిగేది.

"రండి సాబ్. జస్ట్ ఫైవ్ మినిట్స్ మాట్లాడి వెళ్ళిపోతాం. రండి..." అని అంటూ పిలిచాడు ఎస్.పి.

ఏం చేయాలో సాదూభాయ్‌కి తోచలేదు. బ్యాడ్ టైమ్ అంటే ఇదే.

సరిగ్గా ఇరుక్కున్నాడు. జస్ట్ మాట్లాడి వెళ్ళిపోవడానికే అయితే ఇంతమంది రానక్కర్లేదు. మరేదో ఉంది.

మనసు కీడును శంకిస్తోంది. అలాగని పారిపోలేడు. ఫేస్ చేయాలి తప్పదు.

ఆలోచిస్తూనే మెట్లు దిగి హాల్లోకి వచ్చాడు. వచ్చాక అర్థమైంది వాళ్ళంతా ఎందుకు వచ్చారో.

చెంతకు రాగానే సాదూభాయ్ చేతులకు బేడీలు బిగించాడు ఎ.ఎస్.పి.

"సారీ మిస్టర్ సాదూభాయ్. మీకు సంబంధించిన పాత కేసులో సరయిన సాక్ష్యాధారాలు లభించాయి. ఇక తప్పించుకోలేరు.

కోర్టు ఆర్డర్‌తో అరెస్ట్ వారెంట్ తీసుకుని మరీ వచ్చాం. మాతో రండి..." అంటూ అసలు విషయం కాస్త చల్లగా బయటపెట్టాడు ఎస్.పి.

సుదీప అరెస్ట్ వారెంట్ అందుకుని చదివింది. ఎస్.పి. చెప్పిందాంట్లో అసత్యం ఏమీలేదు. కన్నీళ్ళ పర్యంతమయింది సుదీప.

పోలీసులమీద కోపం ముంచుకువస్తోంది. "ఒకే ఆఫీసర్స్! మీరు చీట్ చేసి, నా భర్తను మా ఇంట్లోనే అరెస్ట్ చేసి తీసుకువెళుతున్నారు. దీనికింత అనుభవిస్తారు. నేను వదలను. తీసుకువెళ్ళండి. మీ వెనకే మా లాయర్లు వస్తారు" అనరిచింది సుదీప.

సాదూభాయ్ మౌనంగా ఉండిపోయాడు.

ఎవరితోనూ పెదవి విప్పి మాట్లాడలేదు.

కనీసం సుదీపకు ధైర్యవచనాలు కూడా చెప్పలేదు. పోలీసుల వెంట కామ్‌గా వెళ్ళి వ్యాన్‌లో కూచున్నాడు. అతడి ఆలోచనలు వేరుగా ఉన్నాయి.

ఎంత హడావుడిగా వచ్చాయో అంతే హడావుడిగా వెనుతిరిగాయి పోలీసు వాహనాలు.

వ్యానులో పోలీసుల మధ్యన కూచున్నాడేగాని సాదూభాయ్ తీవ్రంగా ఆలోచిస్తూనేవున్నాడు.

చివరి క్షణంలో ఇలా జరిగిందేమిటాని బాధపడుతున్నాడు. ఒక్క పావుగంట పోలీసులు ఆలస్యంగా వచ్చుంటే తను వీళ్ళకి చిక్కేవాడే కాదు.

తను సాదూభాయ్ శరీరంలోకి పరకాయ ప్రవేశం చేసివచ్చింది త్వరగా లాటిన్ అమెరికా చేరుకోవాలని గాని, ఇలా పోలీసు కేసుల్లో తగులుకొని జైలులో కూచోడానిక్కాదు. తను తప్పించుకోవాలి.

ఏదేమయినా ఈ రోజే తను ఢిల్లీ వదిలిపెట్టాలి. ఏం చేస్తే తను తప్పించుకోగలడు.. ఎలా తప్పించుకోవాలి...? పాత ఢిల్లీ వీధుల్లో పోలీసు వాహనాలు పరుగుతీస్తున్నాయి.

అంతకన్నా వేగంగా సాదూభాయ్ మస్తిష్కంలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

ఆ పరిస్థితుల్లో అనుకోకుండా ఒక చచ్చిన బల్లి సాదూభాయ్ కంటబడింది. కీడులో మేలంటే ఇదేనేమో అన్పించింది సాదూభాయ్‌కి.

జాన పొడవు ఉన్న పెద్ద బల్లి అది. ఎదురు సీటు కింద వెల్లకిలా పడుంది. అంతక్రితమో ఉదయమో అది మరణించివుండాలి.

ఆ బల్లిని చూడగానే అప్పటికప్పుడు సాదూభాయ్ మనసులో ఒక పథకం రూపుదిద్దుకుంది. అంతే... క్షణం కూడా ఆలస్యం చేయకుండా సాదూభాయ్ శరీరం నుంచి బల్లి శరీరంలోకి పరకాయ ప్రవేశం చేశాడు కార్తికేయ.

ఎప్పుడయితే కార్తికేయ తప్పుకున్నాడో ఆ మరుక్షణమే సాదూభాయ్ శరీరం తోటకూర కాడలా వంగిపోతూ పక్కకు వాలిపోయింది.

అదే సమయంలో అంతవరకు నిర్జీవంగా పడున్న బల్లిలో చలనం వచ్చింది. చివ్వున బోర్లాతిరిగి నిశ్శబ్దంగా సీటు వెనక్కి పరుగెత్తింది.

సాదూభాయ్ ఒరిగిపోయాడు.

పక్కకు పడిపోయాడు.

ఉన్నట్టుండి సాదూభాయ్‌కి ఏమయిందో అర్థం గాక పోలీసులు ఉలిక్కిపడ్డారు. తృళ్ళిపడ్డారు. తట్టి చూశారు. పిలిచి చూశారు.

ఒళ్ళు వెచ్చగా ఉందికాని నాడీ అందటంలేదు. గుండె కొట్టుకోవటం మానేసింది.

నోట మాటరాక కొయ్యబారిపోయారు పోలీసులు. సాదూభాయ్‌కి ఏమయింది?

వీడు మరణించాడా... పోలీసు కస్టడీలో ఉండగా నేరస్తుడు మరణిస్తే ఎంత గోల అవుతుందో, ఎన్ని పరిణామాలకు దారితీస్తుందో కొత్తగా చెప్పక్కర్లేదు.

గత అనుభవాలు నేర్పిన పాఠాలు చాలా ఉన్నాయి. అందుకే పోలీసులు భయపడిపోయారు. కలకలం రేగింది.

"ఆపండి. వ్యాన్ ఆపండి" అంటూ ఇద్దరు పోలీసులు ఒకేసారి గొంతుచించుకుని అరిచారు.

అంతే- సడెన్ బ్రేక్‌తో ట్రాఫిక్ మధ్యలో ఆగిపోయాయి పోలీస్ వాహనాలు. **ఇంకా ఉంది**

మీ శరీరం, మనస్సు, మాటలను జగత్కల్యాణానికే ధారపోయండి. మాతృదేవోభవ, పితృదేవోభవ- మాతాపితరులను దైవస్వరూపులుగా ఆరాధించాలని చదివేవుంటారు. కానీ పేదలు, నిరక్షరాస్యులు, అజ్ఞానులు, పీడితులు- వీరే ప్రత్యక్ష దైవాలు. వారి సేవే సర్వోన్నతం.

Whats App

ఒకసారి కుండను ఎవరో అడిగారుట... "నువ్వు ఎలాంటి పరిస్థితులలోనయినా చల్లగా, ప్రశాంతంగా ఉంటావు గదా! ఇది ఎలా సాధ్యం" అని.
అపుడు కుండ 'నేనెప్పుడూ ఒకటే విషయం గుర్తుపెట్టుకుంటాను. నేను వచ్చింది మట్టిలో నించి. వెళ్ళేది మట్టిలోకే. మధ్యలో గర్వం, ఆవేశంలాంటివి అవసరమా..." అని చిరు నవ్వుతో జవాబిచ్చింది.

⩓

☺ మగజాతంతా ఫాలో అవ్వాల్సిన లాజిక్-
భార్య : "కొత్త చీర కొనుక్కుంటానండీ"
భర్త : "ఇప్పటికే అల్మారా పట్టట్లేదు కదే?"
భార్య : కట్టిన చీరలే కడుతున్నానని, కాలనీ లేడీస్ అంతా గుసగుసలాడుతున్నారండీ.
భర్త : "అంతమాత్రాన కొత్త చీరలు కొనటం దేనికి. కాలనీ మార్చేద్దాం. మనది అద్దె ఇల్లే కదా?" అన్నాడు.

⩓

☺ తేడా : యోగా-యోగం
నువ్వు ప్రశాంతంగా వుంటే 'యోగా'
"నా భార్య ప్రశాంతంగా వుంటే 'యోగం'

⩓

☺ వివిధ వృత్తులలో ఉండే మగవాళ్ళను, వాళ్ళ భార్యలు ఎలా తిడతారో చూడండి.
పైలెట్ భార్య : "నా దగ్గర మరీ అంతలా ఎగరకండి"
డాక్టర్ భార్య : "ఎవరి రోగం ఎలా కుదర్చాలో నాకు బాగా తెలుసు"
టీచర్ భార్య : "మీరు క్లాసులు పీకటానికి నేనే దొరికానా?"
జడ్జి భార్య : "ఈ విషయంలో ఇంకా వాయిదా లేస్తే కుదరదు. నేను చెప్పిందే ఫైనల్"
లాయర్ భార్య : "నా దగ్గర కావల్సినన్ని ఆధారాలున్నాయి. ఇంక తగ్గండి"
ఇంజనీర్ భార్య : "బోడి ప్లానులు వేయటం మాకూ వచ్చు"
జర్నలిస్టు భార్య : "మీ కవరేజ్ మీ ఛానల్‌లో చూపించుకోండి. ఎక్స్ట్రా చేస్తే మీ లైవ్ వీధంతా చూపించాల్సివస్తుంది"

⩓


☺ బంజారా హిల్స్‌లోని ఒక బ్యూటీపార్లర్ ఎదుట ఇలా బోర్డు పెట్టారు.
"మా పార్లర్ లోపలినుండి బయటకు వచ్చే అందమయిన అమ్మాయిని చూసి "ఈల" వేయకండి. ఆ అమ్మాయి మీ పక్కింటి బామ్మకావచ్చు"

⩓

☺ "నాలుగేళ్ళ కుర్రాణ్ణి మనం పెంచలేక హాస్టల్‌లో పారేస్తున్నప్పుడు వాళ్ళకి నలభై ఏళ్ళు వచ్చినతరువాత మనల్ని వృద్ధాశ్రమంలో వదిలేస్తే తప్పు ఏమయినా ఉందా?" - గరికపాటి

⩓

☺ సముద్రం నీరు ఆవిరై మేఘమవుతుంది.
నది నీరూ ఆవిరై మబ్బుగా మారుతుంది.
మురికి కాలువలోని నీరుకూడా ఆవిరయి మేఘమవుతుంది.
అలా మేఘంగా మారి, ఆకాశం చేరాక ఆ మేఘంలోని నీరు ఎక్కడిదో ఏ మేధావీ చెప్పలేడు.
ఆపై ఆ మేఘం వర్షంగా మారి భూమిపై కురుస్తుంది. పడే ప్రతి చినుకు గంగనీరంత స్వచ్ఛమైనదే. కాని, ఆ చినుకు సముద్రంలో పడితే ఉప్పగా, నదిలో పడితే మంచిగా, మురికి కాలువలో పడితే మురికి నీరుగా మారిపోతుంది.
కనుక భూమిమీద మురికిని తొలగిస్తే నీరంతా స్వచ్ఛంగా, గంగాజలంలా ఉంటుంది.
"మంచి మనసుతో ప్రయత్నిద్దాం"



⩓

☺ ఆఫ్రికా ఖండంలోని ఓ దేశం వాతావరణ శాఖ వారు తమ కార్యాలయం ముందు నారతో చేసిన తాడు, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కొక్కానికి కట్టారు. దానిపక్కనే వున్న నోటీస్ బోర్డుపై ఇలా రాశారు.

* తాడు తడిగా ఉంటే వర్షమని అర్థం.
* తాడు కదులుతూవుంటే గాలి బాగా ఉందని.
* తాడు వేడిగా ఉంటే వేసవి నడుస్తోందని.
* తాడు చల్లగా ఉంటే ఆకాశం మబ్బుపట్టిందని.
* తాడు గట్టిగా ఉంటే చలి ఎక్కువైందని.
* తాడు తెల్లగా ఉంటే మంచుపడుతోందని.
* తాడు కనిపించకుండాపోతే సురక్షిత ప్రాంతంలో తలదాచుకోవాలని అర్థం.


⩓

☺ నెట్ సూక్తులు :

★ నిద్ర కళ్ళు మూసుకుంటే రాదు, 'నెట్ ఆఫ్' చేస్తే వస్తుంది.
★ ఆకలితో ఉన్నవాడికి అన్నం, మొబైల్ ఫోను వాడికి 'ఛార్జర్' అందించటం పుణ్యం.
★ మొబైల్ ఫోన్ పాడైతే పిల్లలు చేశారంటాము. పిల్లలు పాడైనా ఫోన్ కారణమంటున్నాం.
★ ఒకప్పుడు ఇంటి బయటకు వెళ్ళేటప్పుడు 'పెద్దల ఆశీర్వాదం' తీసుకునేవారు. ఇప్పుడేమో 'బ్యాటరీ ఫుల్' చేసుకుని వెళుతున్నాం.
★ అనుకోకుండా ఫోన్ మిత్రులదగ్గర వదిలేస్తే, మన అమాయక ప్రేయసిని శక్తిమాన్ దగ్గర వదిలేసినట్లు అనిపిస్తుంది.
★ ఎంత గొప్పవారికైనా 'తలవంపులు' తెస్తుంది మొబైల్ ఫోన్. ◆

☺ శశికళ పెయింటింగ్ కోర్సు పూర్తిచేసింది. 90 రోజులు కష్టపడి ఓ గొప్ప పెయింటింగ్ వేసింది. ప్రజల అభిప్రాయం తెలుసుకోవటం కోసం పదిమందీ తిరిగేచోట ప్రదర్శనకు పెట్టి, దానికింద ఇలా రాసింది-
'నేను గీసిన మొదటి పెయింటింగ్ ఇది. ఇందులో లోపాలు కనిపించవచ్చు. మీకు లోపం, కనిపించినచోట ఒక 'X' మార్కు పెట్టండి.
మరుసటి రోజు చూస్తే పెయింటింగ్ అంతా 'X'లే. దాంతో శశికళ ఏడుస్తూ తనకు పెయింటింగ్ నేర్పిన మాష్టారు దగ్గరకు దాన్ని తీసుకుని వెళ్ళింది. ఆ మాష్టారు మళ్ళీ ఆ పెయింటింగ్ వేయమన్నాడు. ఈసారి దానికింద ఇలా రాయించాడు మాష్టారు.
"నేను గీసిన మొదటి పెయింటింగ్ ఇది. దీనిలో మీకు లోపాలు కనిపించవచ్చు. ఎక్కడైనా లోపం కనిపిస్తే కిందపెట్టిన రంగులు, బ్రష్‌లతో సరిచేయవలసిందిగా ప్రార్థన"
వారంరోజులు గడిచిపోయాయి. ఆశ్చర్యం! ఏ ఒక్కరూ ఒక్క మార్పుకూడా చేయలేదు.
అప్పుడు మాష్టారు శశికళతో ఇలా అన్నారు- "అమ్మాయీ! లోకంలో ఎదుటివారిని విమర్శించటం చాలా తేలిక. సరిచేయుటం కష్టం. నేటి మన సమాజపు తీరు ఇది.

కదిలే బొమ్మల కబుర్లు



Review

విశ్రాంతికే బయుటకు ఛలో... మోహన్ రంగా

త్రివిక్రమ్ శ్రీనివాస్ కథ... పవన్‌కళ్యాణ్ సమర్పణ... నితిన్ 25వ సినిమా. ఈ మూడు అంశాలు చాలు,ఓ సినిమామీద ప్రేక్షకుల అంచనాలు పెరగడానికి. పైగా యూత్‌ఫుల్ లవ్ స్టోరీ అంటే చాలు, కుర్రాళ్ళు ఫస్ట్ డే, మార్నింగ్ షోకు స్లింగ్ బ్యాక్‌లు భుజానవేసుకుని మరీ రెడీ అయిపోతారు.

మరి అలాంటి జోనర్, త్రివిక్రమ్, పవన్ లాంటి పెద్ద పేర్లు. ఈ వారం విడుదలైన 'ఛల్ మోహన్ రంగ'కు అదనపు అర్హతలు.

మరి ఇన్ని ఆడిషనల్ క్వాలిఫికేషన్లతో వచ్చిన ఈ సినిమా ఎలా వుందో చూద్దాం. అలా చూసేముందు కథేంటంటే అని అనుకోవడం మామూలే.

కానీ చిత్రంగా ఈ సినిమాలో కథేంటీఅంటే దర్శకుడు కూడా క్లియర్‌గా చెప్పలేడేమో? ఎందుకంటే అసలుకథ ఆవగింజంత. దాంట్లో కాన్‌ఫ్లిక్ట్ ఆవగింజలో ఆరోభాగం అంత.

ఇంతకీ విషయం ఏమిటంటే... సగటు మధ్య తరగతి కుర్రాడు మోహన్‌రంగా (నితిన్) చదువులో అడుగున వున్నా, చిన్నప్పుడెప్పుడో చూసిన పిల్లను కలుసుకోవడంకోసం అమెరికా వెళ్ళాలనుకుంటాడు. ఆ పిల్ల ఎవరో తెలియదు.

పెద్దయి ఎలావుంటుందో తెలియదు. అమెరికా వెళ్ళిందనిమాత్రం తెలుసు. అసలు అమెరికా వెళ్ళాలన్నది ఆ పిల్లకోసమో, ఆ పిల్ల అమెరికా వెళ్ళింది కనుక, తాను అమెరికా వెళ్తే బాగుంటుందనో అన్న క్లారిటీ అయితే సినిమాలో లేదు. సరే, ఓ అరడజను కామెడీ సీన్ల తరువాత అమెరికా వెళ్ళాడు.

అక్కడ ఓ అమ్మాయి మేఘ సుబ్రహ్మణ్యం (మేఘా ఆకాష్)ను చూడగానే ప్రేమలో పడిపోతాడు. ఇద్దరూ కలిసి కొంత దూరం ప్రయాణించాక, ఓ రోజు ఓ దగ్గర కలవాలనుకుంటారు.

కానీ ఆమెకు తనకు తగునా అని ఇతగాడు,తనకు తగునా అని ఆమెఆలోచించేసుకుని, కలిసే టైమ్‌కు డుమ్మాకొట్టేస్తారు. ఇలా ఇద్దరూ కలుసుకోకుండానే బ్రేకప్. దాంతో ఇంటర్వెల్.

కానీ తరువాత మళ్ళీ మోహన్ రంగాలో ఏదో వెలితి. ఆ అమ్మాయిని కలసి సారీ చెప్పాలనుకుంటాడు. కానీ ఆమె అప్పటికే ఇండియా వెళ్ళిపోతుంది. అలా వెళ్ళిన ఆమెకు ఏదో గిల్టీ. కిందా మీదా అయిపోతుంటుంది. ఇంతలో మోహన్ కూడా ఇండియా వచ్చేస్తాడు. ఇద్దరూ కలుస్తారు.

కానీ అప్పటికే ఆమెకు పెళ్ళి ఫిక్సయిపోతుంది. ఇక అక్కడినుంచి మొదలవుతుంది ఒక అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కు..ఇలా సాగి... సాగి... సాగి... చివరకు సుఖాంతం అవుతుంది.



పని బావుంది

తనలో ఎంత ప్రతిభ దాగివుందో శృంగార తార సన్నీలియోన్ పదేపదే చెప్పుకుంటున్నా వస్తున్న అవకాశాలన్నీ హాట్ ఇమేజ్‌నే అంటిపెట్టుకుంటున్నాయి. ఈ దశలో తమిళంలో లభించిన 'వీరమాదేవి' నటిగా తన ఎదుగుదలకు తోడ్పడగలదని ఆశల పందిరి అల్లేస్తున్నది.

"'వీరమాదేవి' ఓ నటిగా, వ్యక్తిగా ఎదిగేందుకు ఎంతగానో సహకరించగలదని భావిస్తున్నాను. కథ ఆసక్తికరంగా వుంటే ప్రాంతీయ భాషాచిత్రాలూ చేస్తా. యుద్ధ వీరురాలి పాత్రలో నటిస్తున్నాను. ఇటువంటి సినిమాలో నటించాలన్నది నా కోరిక. యుద్ధవిద్యల్లో శిక్షణ తీసుకుంటున్నా.

దక్షిణాదిలో మంచి అవకాశాలు వస్తే నటిస్తాను. కొత్తవాతావరణంలో పనిచేయడం ఎప్పుడూ బావుంటుంది"అంటూ హుషారుగా చెప్పింది. ◆



యూత్‌ఫుల్ లవ్ సినిమాల్లో కీలకంగా కనిపించేది, ప్రేమ, బ్రేక్ అప్, పెళ్ళి. ఈ ప్రేమ, బ్రేకప్‌వరకు సినిమాలు బాగానే వుంటాయి. సరిగ్గా ఇంటర్వెల్ బ్యాంగ్ వేళకు బ్రేకప్ పడడం అన్నది కామన్. కానీ సమస్య అంతా ఆ తరువాత వస్తుంది.

అక్కడనుంచి హీరో, హీరోయిన్ల మధ్య భావోద్వేగాలు, సరైన సన్నివేశాలు, పెర్‌ఫెక్ట్ ఎడిటింగ్ ఇలాంటివి అన్నీ కీలక పాత్ర వహిస్తాయి.

ఎక్కడా ఏమాత్రం బ్యాలెన్స్ తప్పకుండా చూసుకోవాలి. ఏమాత్రం తప్పినా, ప్రథమార్థంకన్నా ద్వితీయార్థం బాగులేదనే మాట వస్తుంది.

'ఛల్ మోహన్ రంగ' సినిమా కూడా ఇందుకు ఏమాత్రం అతీతం కాదు. పైగా ఈ సినిమాకు ఓ అదనపు క్వాలిఫికేషన్ వుంది. సాధారణంగా ఇలాంటి సినిమాల్లో బ్రేకప్‌కు ఓ బలమైన పాయింట్ వుంటుంది. ఇందులో అది వుండదు. పైగా దర్శకుడే విశ్రాంతి సమయంలో ఓ కార్డ్ వేస్తాడు... "ప్రేమించడానికి బలమైన కారణాలు వుండవు. విడిపోవడానికి దారుణాలు జరగక్కర్లేదు" అని.

దర్శకుడు తను పేలవంగా రాసుకున్న బ్రేకప్ ఎపిసోడ్‌ను సమర్థించుకోవడానికి ఇలా ఓ మాట అనివుండొచ్చు. కానీ అంతమాత్రంచేత ప్రేక్షకుడు కన్విన్స్‌అయిపోడు. సినిమాలో అదే జరిగింది. సినిమా ప్రథమార్థం అంతా సులువుగా నడచిపోతుంది.

త్రివిక్రమ్ స్టైల్ డైలాగులు, సీన్లన్నీ అలరిస్తాయి. దాంతో సినిమా తొలిసగం చులాగ్గా సాగిపోతుంది. నూటికి నూరుమార్కులు సంపాదించేస్తుంది. కానీ మలిసగం ప్రారంభమై, సినిమా ఎప్పుడైతే అమెరికా నుంచి ఊటీదగ్గరి కూనూరుకు చేరుతుందో,అప్పుడు మొదలవుతుంది నస లేదా సాగదీత.

అమ్మాయి, అబ్బాయి మధ్య ఏమీ సంఘర్షణలేదు. అతగాడు వచ్చాడు తానే వెళ్ళలేదని ఈమె. ఆమె వచ్చింది తానేవెళ్ళలేదని ఇతగాడుఅనుకుని కాస్సేపు, ఆ తరువాత ఎవ్వరూరాలేదు అనితెలిసి మరికాస్సేపు, ఎందుకు ఎడమొహం,పెడమొహం అవుతారో అన్నది ప్రేక్షకుడికి బుర్రచించుకున్నా అర్థం కాదు.

సింపుల్‌గా ఒకరిని ఒకరు ఇష్టపడుతున్నాం అని చెప్పేసుకుంటే పోయే చిన్న సమస్య. పైగా ఇద్దరికీ ఇష్టమే. తల్లిదండ్రుల అభ్యంతరం లేదు.

దర్శకుడి దృష్టిలో ఆ అమ్మాయి క్యారెక్టర్ టిపికల్. తనకేం కావాలో తను డిసైడ్ చేసుకోలేదు.

ఆ విషయం క్లైమాక్స్‌లో తల్లిపాత్రతో ఒక్క మాటలో చెప్పిస్తాడు. కానీ దాన్ని ముందునుంచీ ప్రేక్షకుడికి కన్వేచేయడంలో మాత్రం దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు.పైగా ప్రేమకథలకు, బ్రేకప్ కథలకు భావోద్వేగాలు ముఖ్యం. కథ ఫ్లాట్‌గా సాగిపోతే ఏమాత్రం ఆసక్తిగా వుండదు.

'ఛల్ మోహన్ రంగ' ఆ విషయంలో పూర్తిగా విఫలమయ్యింది. దాంతో సినిమా ద్వితీయార్థం మొత్తం కలిపి ఓ పెద్ద సినిమా చూసిన అనుభూతి వుంటుంది. అదే సమయంలో సీన్‌కు సీన్‌కు సింక్ లేక, ముక్కలు ముక్కలుగా వుంటుంది.

కేవలం ఫన్‌తో బండి లాగిద్దామని దర్శకుడు అక్కర్లేని ఫన్ సీన్లు అన్నీ రాసుకున్నాడు.

ఇవన్నీ వేటికిఅవి బాగానే వుంటాయి. ముక్కలు ముక్కలుగా కామెడీ టీవీ ఛానెల్‌లో వేసుకోవడానికి బాగుంటాయి. అన్నీ కలిపి సినిమాగా చూడడానికి మాత్రం పనికిరావు. అదీ అసలు సమస్య.

ఎప్పుడైతే సీన్లు వచ్చి నవ్వించిపోతుంటాయో? ఎప్పుడైతే అవన్నీ కలిసి ఓ కథ నడుస్తున్న భావన కలగదో, అప్పుడే ప్రేక్షకుడు సినిమానుండి డిస్కనెక్ట్ అయిపోతాడు.దాంతో సినిమాగాడి తన్నేస్తుంది. కాదు... కాదు... తన్నేసింది. హీరో నితిన్‌కు ఇది 25వ సినిమా. అందువల్ల నటనకు వంకపెట్టడానికి ఏముంటుంది. హీరోయిన్ మేఘా ఆకాష్ పాత్ర అయోమయంగా డిజైన్‌చేశారు. ఇంక అలాంటి దాంట్లో నటన ఏముంటుంది.

త్రివిక్రమ్ స్టైల్‌లో ప్రతిపాత్రను ప్రత్యేకంగా డిజైన్ చేయాలని ప్రయత్నించారు. దాంతో అన్ని పాత్రలూ ఒక్కోరకంగా బిహేవ్ చేస్తుంటాయి.

సినిమామొత్తానికి అద్భుతంఅనేది లేదా సూపర్ అనేది నటరాజ్ సుబ్రహ్మణియం సినిమాటోగ్రఫీ. చాలాబాగుంది. సినిమా చూడబుల్‌గా వుందీ అని అంటే అదే ప్రధాన కారణం అవుతుంది.

థమన్ రెండుపాటలు ఓకె. కానీ కొన్నిసీన్లలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరీ బాదేశాడు.

దర్శకుడు కృష్ణచైతన్య తనకు అందివచ్చిన అవకాశాన్ని చేజేతులా పాడుచేసుకున్నాడు.

ఎందుకంటే ఇంత రేంజ్ అవకాశం మళ్ళీ మళ్ళీ వచ్చేది కాదు. అలాంటప్పుడు కథ, కథనాల విషయంలో ఎంత జాగ్రత్తగా వుండాలి? ఆ జాగ్రత్త ఎక్కడా కనిపించలేదు.

కేవలం ఫన్ మీటర్‌మీదవెళ్తే సరిపోతుంది అనుకున్నాడు. కానీ అలా కుదరలేదు. 'ఛల్ మోహన్ రంగ' అంటే జనాలు ఛలో అంటూ లగెత్తుకువస్తారు అనుకున్నాడు... కానీ అలా వచ్చిన జనాలను ఇంటర్వెల్‌వేళకే పోలోమంటూ పంపేసేలా సినిమా తయారుచేస్తాడని జనం అనుకోలేదు.

ప్లస్‌పాయింట్స్...
ఫస్ట్ హాఫ్, సినిమాటోగ్రఫీ, ఫన్ సీన్లు

మైనస్‌పాయింట్స్...
సెకండాఫ్, సరైన కథ లేకపోవడం
సాదాసీదా కథనం

పంచ్‌లైన్
ఛలో... నీరసంగా ◆

భలే 'దూకుడు'

'రంగస్థలం'లో రామలక్ష్మి పాత్రతో టాలీవుడ్‌లో సమంత స్థానం పరుగులెత్తింది.

గ్లామర్‌పాత్రలతో ఇప్పటిదాకా ఆడిపాడినసమంత హావభావాలను చక్కగా పండించిందన్న క్రెడిట్ కొట్టేసింది. సమంత నటిస్తే సినిమా హిట్ అన్న ఇమేజ్‌ను మరోమారు దృఢపరుచుకున్నది.

ఇప్పటిదాకా తెలుగు, తమిళంలో కలిపి ముప్పై అయిదు సినిమాల్లో నటించిన సమంత తన కెరీర్ 'దూకుడు'కు పెళ్ళయినంతమాత్రాన పగ్గాలు వుండవని రుజువు చేసింది. పెళ్ళయ్యాక సాధించిన ఈ సూపర్ హిట్ విజయంతో లక్కీ లెగ్ ట్యాగ్‌తో ఇంకెంత పరుగు ప్రదర్శిస్తుందో! ◆

ఎలా ఆడుతున్నాయి?

- ఆరేడు నెలలబట్టి సరైన బ్లాక్‌బస్టర్ లేక వెలవెల పోతున్న బాక్సాఫీస్‌ను ఓ కుదుపు కుదిపేసింది 'రంగస్థలం' సినిమా. తొలివారంలోనే వంద కోట్లకు పైగా గ్రాస్ సంపాదించేసింది.
తొలి పదిరోజుల్లోనే సినిమా కొన్నవాళ్ళందరినీ ఒడ్డుకు చేర్చేసింది. అమెరికాలో ఆడిన తెలుగు సినిమా లెక్కల్లో మూడో ప్లేస్‌కు చేరిపోతోంది. ఈ మధ్య భారీదెబ్బలు తినివున్న ఎగ్జిబిటర్లకు కాస్త ఊరట కలిగించింది.
- ఆ విధంగా సమ్మర్ సీజన్‌కు మాంచి బోణీనే కొట్టింది 'రంగస్థలం'.
- ఈ వారం విడుదలైన 'ఛల్ మోహన్ రంగ' సినిమాకు మంచి ఓపెనింగ్స్ దక్కలేదు. పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ బొమ్మలు వాడినా ప్రయోజనం లేకపోయింది.
- సమ్మర్ సీజన్‌లో ఇంకా చాలా సినిమాలు రెడీ అవుతున్నాయి. సినిమాలు ఎలా వున్నా, థియేటర్లు కాస్త కళకళలాడతాయి. ◆




పెద్ద 'ట్విట్టర్' కుటుంబం

చక్కదనాల చుక్క శృతిహాసన్ ట్విట్టర్‌లో అత్యధిక అభిమానులు కలిగిన తారగా శృతీహాసన్ చరిత్ర సృష్టించింది. ట్విట్టర్‌లో ఆమె ఫాలోవర్స్ అక్షరాల ఏడు మిలియన్‌లమంది!

ఇంత పెద్దకుటుంబం తనతో ఉందంటూ సంతోషాన్ని వ్యక్తం చేసింది శృతి.

"మూడు భాషల సినిమాలతో తీరిక లేకుండా గడిపాను. ఈ హడావిడిలో నన్ను నేను తెలుసుకోవడం మర్చిపోయాను. అసలు నా గురించి ఆలోచించుకునే సమయమే చిక్కడంలేదు. నన్నుకొత్తగా ఆవిష్కరించుకోవాలనుకుంటున్నాను.

సామాజిక మాధ్యమాలలో చురుగ్గా ఉండడం నాకు ఇష్టం. నా అభిమానులతో అనుబంధాన్ని కొనసాగేందుకు అది ఉపకరిస్తుంది" అంటూ ఉప్పొంగిపోతూ చెప్పింది శృతి. ◆



ఎంతో పరిపక్వత

ఐదు వరసచిత్రాలతో డైరీ నింపేసుకుని సోకులమ్మ సోనాక్షిసిన్హా వెరీవెరీ బిజీగా ఉన్నది.

గతంలో కొన్ని మూసపాత్రలు చేశాను కాని ఇప్పుడు చాలా పరిపక్వంగా ఆలోచిస్తున్నానంటూ చెప్పుకుంటున్నది. "విభిన్న పాత్రలు చెయ్యడమనేది ఎప్పుడూ సవాల్‌గానే వుంటుంది.

అందుకు కొంత ధైర్యం కావాలి. ఇప్పుడటువంటి ధైర్యాన్నే ప్రేక్షకులు స్వాగతిస్తున్నారు. ప్రస్తుతం చిత్రపరిశ్రమ అంతా సాహసాలు చేస్తున్నది. ఇటువంటి ఆలోచనలు వచ్చాక 'అఖీరా', 'ఫోర్స్ 2' వంటి సినిమాలు చేశాను. కొత్తకథల్లో నటించడానికి ప్రయత్నిస్తున్నాను" అని తెలిపింది సోనాక్షిసిన్హా. ◆



పాత్ర ఏదైనా సరే

'ఇంతలో ఎన్నెన్ని వింతలో' చిత్రంలో ప్రస్తుతం ప్రేక్షకుల ముందున్న పూజా రామచంద్రన్ కథలో కీలకం అయితే ఎంత చిన్నపాత్ర అయినా చేస్తానంటున్నది.

ఫేమ్‌లోకి రాకపోయినా సినిమాల సంఖ్యనైతే సోసోగానే తన కెరీర్‌కు జతచేయగలిగింది.

"'లవ్ ఫెయిల్యూర్' నుంచి తెలుగులో నా ప్రయాణం మొదలయింది. 'స్వామిరారా', 'పిజ్జా', 'దోచెయ్', 'కాంచనగంగ', 'త్రిపుర', దేవిశ్రీప్రసాద్ సినిమాలలో నటించాను.

తొలిరోజుల్లో తెలియక తప్పులు చేసి వుండవచ్చు. కొన్ని అవకాశాలను చేజార్చుకోవాల్సివచ్చింది. ఏదైనా ఓ సినిమా హిట్టయితేనే తదుపరి అవకాశాలు రాగలవన్నది నా అభిప్రాయం" అని చెప్పింది. పూజా రామచంద్రన్ ఇన్ని సినిమాలు చేసిందా... చెప్పుకుంటే కాని తెలియడంలేదు కదా! ◆



బెస్ట్ గిఫ్ట్

తన పుట్టినరోజునాడే శర్వానంద్ సరసన కొత్త సినిమాకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందంటున్నది 'హలో' ఫేమ్ కల్యాణి ప్రియదర్శన్.

"సినిమాల ఎంపిక విషయంలో చాలా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాను. మంచి పాత్ర, మంచి కథ అయితేనే అంగీకరిస్తున్నాను. దీనివల్ల కొంచెం ఆలస్యం జరగవచ్చునేమో. అయినా పర్వాలేదు. హడావిడిపడదలుచుకోలేదు. నా పుట్టినరోజునాడు వృత్తి రీత్యా బిజీగా ఉండడానికి మించిన మంచి బహుమానం మరేముంటుంది" అంటోంది.

చివరి రోజుల్లో...



జాన్ కీట్స్ (1795-1821)

డాక్టర్ కాబోయి యాక్టర్‌ని అయ్యానని చాలా మంది నటులు చెపుతుంటారు.

డాక్టర్ వృత్తికి, ఇతర వృత్తులకు, అందునా నటనకు సంబంధం ఏమీ వుండదు. అయినా అలా చెప్పటం ఒక ఫ్యాషన్‌గా వచ్చింది. కాని కొంతమంది డాక్టర్ కోర్స్‌లో చేరికూడా మరెటో తొంగిచూసి ఆ మెడికల్ కోర్స్‌ని వదిలేస్తుంటారు.

అలా వదిలేసినవాళ్ళలో చాలామంది నిజంగానే డాక్టర్ వృత్తిద్వారా సంపాదించేదానికన్నా ఎక్కువ పేరుప్రతిష్ఠలే సంపాదించారు. అటువంటివారిలో ఒకరు ఇంగ్లీషు కవి జాన్ కీట్స్.

ఎంతకాలం బతికామన్నది కాదు ఎలా బతికామన్నది ముఖ్యం అనేదానికి అతికినట్టు సరిపోయే జీవితం జాన్ కీట్స్‌ది. ఈ లోకంలో కీట్స్ బతికింది కేవలం 25 సంవత్సరాలే. అతిత్వరలో ఆయన 200 వర్ధంతి జరుగుతుంది. అయితేనేం ఆయన కవిత్వం అంతకాలం నిలిచివుంది. ఇంగ్లీషు రొమాంటిక్ కవుల్లో ఒకరిగా కీట్స్ పేరు నిలిచిపోయింది.

ఇప్పటికీ ఇంగ్లీషు లిటరేచర్ చదివేవారంతా తప్పనిసరిగా కీట్స్ కవిత్వం చదవాల్సిందే. అయితే ఆయన్ని ఇంతగా తలచుకునే ఇంగ్లీషు సాహిత్యలోకం కీట్స్ జీవించివున్న రోజుల్లో, కవిత్వం చురుకుగా ప్రచురిస్తున్న రోజుల్లో అంతగా అంగీకరించలేదు. మరణం తర్వాత ఆయనకు పేరుప్రతిష్ఠలు వచ్చాయి.

కీట్స్ కుటుంబం ఆర్థికంగా ఉన్నతమైనది కాదు. అందువల్ల ఆనాటి ప్రముఖ విద్యాసంస్థలైన ఏటన, హారో వంటివాటికి కీట్స్‌ని పంపలేకపోయారు.

సాధారణ పాఠశాలలోనే చదువుకున్నాడు. ప్రతిభ వుంటే ఎక్కడ చదివినా ఒకటేనని నిరూపించాడు. ఎనిమిదవ ఏట తండ్రిని, 14వ ఏట తల్లిని కోల్పోయాడు. అమ్మమ్మ అండన పెరిగాడు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. ఒక వైద్యుడి దగ్గర సహాయంచేస్తూ, సర్టిఫికెట్ కోర్స్ పొందాడు. దాదాపుగా అది నేటి కాంపౌండర్ వృత్తిలాంటిది.

ఆసుపత్రిలో కట్లు కట్టేవాడిగా పనిచేస్తూ, మెడికల్ వృత్తిలో మిగిలిన శిక్షణ పూర్తిచేయాలనుకున్నాడు. కాని ఈలోగా కవిత్వ పురుగు తొలిచింది.

ఆర్థిక ఇబ్బందులు, సరైన నివాసం దొరకలేదు, కవిత్వం రాస్తే ప్రచురించేవారు లేరు. అది తన 16వ ఏట కీట్స్ ఎదుర్కొన్న ఇబ్బందులు. దానితో కొంత కాలం డిప్రెషన్‌కి గురయ్యాడు. ఆ తర్వాత మెడికల్ సర్టిఫికెట్ కోర్స్ పూర్తిచేసినా, అప్పటికే ప్రముఖులైన కవుల జీవితాల్ని చూసి కవిగా మారాడు.

> కవిగా నిలదొక్కుకునేందుకు కష్టపడ్డాడు. ఈలోగా ప్రేమలో పడ్డాడు. 'ప్రేమ నా మతం. మతం కోసం జీవితాలు త్యాగం చేస్తారంటారు. ప్రేమ నా మతం కాబట్టి నా జీవితాన్ని నీ కోసం త్యాగం చేద్దామనుకుంటున్నాను' అంటూ కవిత్వం రాసి తాను ప్రేమించిన అమ్మాయికి అందించేవాడు.

తొలి కవితా సంపుటాన్ని ఆదరించినవారు లేరు. కవిగా నిలదొక్కుకునేందుకు కష్టపడ్డాడు. ఈలోగా ప్రేమలో పడ్డాడు. 'ప్రేమ నా మతం. మతంకోసం జీవితాలు త్యాగం చేస్తారంటారు. 'ప్రేమ నా మతం కాబట్టి నా జీవితాన్ని నీ కోసం త్యాగం చేద్దామనుకుంటున్నాను' అంటూ కవిత్వం రాసి తాను ప్రేమించిన అమ్మాయికి అందించేవాడు.

ఆ అమ్మాయిని తన సొంతం చేసుకోవాలనుకున్నాడు. హద్దులు దాటే యత్నం చెయ్యలేదు. తన వయసు ఇంకా పాతికేళ్ళకు చేరలేదు... అనుభవించేందుకు ఇంకా చాలా సమయం వుందని అనుకున్నాడు. కాని తన జీవితం అర్థాంతరంగా ముగిసే మార్పులు శరీరంలో వస్తున్నాయన్న విషయం కీట్స్‌కి తెలియదు.

కీట్స్ తల్లి క్షయవ్యాధితో మరణించింది. ఆమెతో ఎక్కువ సమయం గడిపినందునో ఏమోకాని ఆ రోగం కీట్స్‌కి చిన్నతనంలోనే అంటింది. అయితే క్షయ సోకిందన్న అనుమానం అతనికి రాలేదు.

ఇరవై ఐదవ ఏట అడుగుపెడుతుండగా తొలిసారిగా దగ్గితే రక్తం పడింది కీట్స్‌కి. ఊపిరితిత్తుల్లో రక్తస్రావం అయిందన్నారు వైద్యులు. లండన్ వాతావరణం క్షయకు ఇబ్బందులు పెంచుతుంది కాబట్టి రోమ్‌కి వెళ్ళిపోవటం మంచిదన్నారు.

ప్రయాణంమధ్యలో వారి నౌక తుపానులో చిక్కుకుంది. అల్లకల్లోల సముద్రంనుండి తప్పించుకుని, నేపుల్స్ రేవుకి చేరితే ఇతరులకు క్షయ సోకుతుందనే భయంతో పదిరోజులు ఒంటరి గదిలో బందీగా వుంచారు. వైద్యులు లండన్ వదలమని చెప్పినతర్వాత ఎనిమిదినెలలకుగాని ఇటలీకి వెళ్ళలేదు కీట్స్. అప్పటికి రోమ్ వాతావరణం మారిపోయింది.

ఏ ఆశతో కీట్స్ రోమ్ చేరాడో అది తీరలేదు. వాతావరణం చల్లగా వుంది, సరయిన వైద్యచికిత్స జరగలేదు. అతని క్షయవ్యాధి మూలం కడుపులో ఉందని అక్కడి వైద్యుడు భావించి రోజుకు ఒక చేపపిల్లముక్క, ఒక్క బ్రెడ్‌ముక్కమాత్రం ఇచ్చేవాడు.

క్షయకు పోషక పదార్థాలు బాగా లభించాలి. అది దొరకటంలేదు. శక్తి సన్నగిల్లింది. బాధ భరించలేనిదైంది. తన వ్యాధి ముదిరితే దాని బారినపడకుండా తానే ప్రాణం తీసుకోవాలనుకున్నాడు కీట్స్.

ఇంగ్లండ్ నుండే భారీగా మత్తుమందు తీసుకువెళ్ళాడు. అది గమనించి డాక్టర్ లాక్కున్నాడు. బాధ భరించలేక కొద్దిగా మత్తుమందు ఇమ్మన్నా ఇవ్వని మిత్రుడు, వైద్యుడిమీద కోపం పట్టలేక కేకలు వేసేవాడు. 'నేను బతికిలేను. ఎప్పుడో చచ్చిపోయాను. నాది నేడు మృతజీవనం... ఇటువంటి జీవనం నాకెందుకు' అంటూ ఏవేవో మాట్లాడేవాడు. కవిత్వం రాయగలిగిన పరిస్థితి కాదు.

ఆలోచనలన్నీ మరణంచుట్టూ తిరుగుతున్నాయి. ఎదురుచూసే మరణం రావటంలేదు. చివరిగా ఓపిక కూడగట్టుకుని ప్రేయసికి ఒక ఉత్తరం రాశాడు.

'గొంతులో నుండి రక్తం పడింది' ఆ రంగు నాకు తెల్సు. ఆ ఎర్రనిరంగు నా మరణానికి వారంట్ అని చెప్పాడు కీట్స్. 1820లో క్షయవ్యాధిని గుర్తిస్తే 1821 వచ్చేసరికి అది తీవ్రంగా ముదిరిన వ్యాధి అయింది. గుర్తింపు ఆలస్యం. తగిన చికిత్స మార్గాలు లేవు.

చేసింది తప్పు చికిత్స. ఇచ్చిన మందులు సరయినవి కావు. ఫలితంగా అతి వేగంగా కీట్స్ ఆరోగ్యం దిగజారింది. త్వరగా చచ్చిపోవాలని వుందంటూ నీరసంమీద నిద్రపోయేవాడు.

మధ్యలో మెలుకువ వస్తే లేచి అటూఇటూ చూస్తూ 'నేనింకా బతికివున్నానా!' అని అరిచేవాడు. ఎందుకు బతికివున్నానని ప్రశ్నించేవాడు. ఎంతో జాగ్రత్తగా నర్స్ కనిపెట్టుకుని చూసుకుంటున్నా కీట్స్ శరీరం చెమటపోసి, ఒణికిపోయింది.

నర్స్ దగ్గరకు తీసుకుంది. కళ్ళె గొంతుకు అడ్డం పడింది. 'అదిగో మరణం... పంపిన ఆ దేవుడికి ధన్యవాదాలు... నేను పోతున్నా...' అంటూ నర్స్ చేతిలోనే మరణించాడు కీట్స్.

జీవితంలో రొమాన్స్ అనుభవించని రొమాంటిక్ పొయెట్ జీవితం అలా దేశం కాని దేశంలో, పాతికేళ్ళ వయసులో ముగిసింది.

ఈ శీర్షిక మీదే

ఉత్తమ ప్రశ్న-సమాధానం

* ఎల్.లక్ష్మీనాయుడు, సింహాచలం
మనుషుల తలతిక్క పనులకి పరాకాష్ఠ?
పుట్టినరోజున దీపాలార్పి... చనిపోయినప్పుడు దీపం వెలిగించడం.

* డి.వి.చంద్రశేఖర్, కర్నూలు
'పన్నులు' పెరిగితే?
'తినడం' కష్టం.

* డి.వి.చంద్రశేఖర్, కర్నూలు
ఈనాటి హీరోలు, హీరోయిన్లు 'సన్న'గా ఎలా వుండగలుగుతున్నారు?
పాటలన్నీ ఎక్సర్‌సైజులే కాబట్టి.

ఉత్తమ ప్రశ్నకు ₹ 500
ప్రతి ప్రశ్నకు ₹ 300 బహుమతి

* పి.వి.రమణకుమార్, చిలకలూరిపేట
మనుషులకీ, మృగాలకీ తేడా?
మృగాలు స్వజాతిని నాశనం చేసుకోవు.

* ఎమ్.కృష్ణ, కాకినాడ
భార్య స్థానబలం?
బెడ్‌రూమ్.

* పి.వి.రమణకుమార్, చిలకలూరిపేట
ఏ'హాస్యం'గా దాగలేనిది?
'హాస్యం'.

* ఎన్.సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం
నేర్చింది? నేర్వాల్సింది?
బిందువు, సింధువు.

* పి.వి.రమణకుమార్, చిలకలూరిపేట
ఎన్ని భాషలు నేర్చినవాడికయినా మాతృభాష ఎప్పుడు బయటకు వస్తుంది?
ఎదురుదెబ్బ తగిలినప్పుడు.

B హ్యాపీ

నియోజకవర్గంలో పార్టీ టిక్కెట్ ఒక వైద్యుడికి ఇచ్చింది. 'ఆ నియోజకవర్గంలోని బలహీనవర్గాలకు ఏం వాగ్దానం చేస్తారు మీరు' అనేసరికి-

"బలహీనంగా ఉన్నవారికి మంచి టానిక్‌లు ఇస్తాం... ఇంకేముంది" అన్నాడు ఆ డాక్టర్. వెంటనే టిక్కెట్ క్యాన్సిల్ చేశాడు పార్టీ ప్రెసిడెంట్.

విజయ్ మోడీ ఓ లంచగొండి అయిన బ్యాంక్ ఆఫీసర్‌ని కలిసి పెద్ద మొత్తంలో అప్పు అడిగాడు-

అందుకుగాను కాంటెస్సా కారు బహుమతిగా, ఆఫీసర్ ఇంటికి పంపిస్తానన్నాడు.

ఆఫీసర్ : నేను ఏదీ ఉచితంగా తీసుకోను.

నీరవ్ మోడీ : పోనీ, రూపాయిచ్చి తీసుకోండి.

ఆఫీసర్ వెతికి రెండురూపాయల నాణెం మోడీ చేతిలో పెట్టాడు.

నీరవ్ రూపాయి చిల్లర లేదన్నాడు.

ఆఫీసర్ : పోనీలే, ఆ రూపాయి ఉంచుకొని మా ఆవిడక్కూడా ఓ కారు పంపించు.


నీరవ్ మోడీ స్పృహ తప్పాడు.

బానపొట్ట, బట్టతల ఉన్న ఓ 62 ఏళ్ళ ముసలాయన జిమ్‌కొచ్చి కోచ్‌ని అడిగాడు-

"నేను 16 ఏళ్ళ అమ్మాయిని పడేయటానికి ఏ మిషన్ వాడాలి?" అని.

కోచ్ : ఆ మిషన్ మా దగ్గర లేదు. ఈ సందు చివర బ్యాంక్ ఏటిఎమ్ మెషీన్ ఉంది.ట్రైచేయండి.

ఈ కార్టూన్ మీదే



"మా ఆవిడ తప్పిపోయింది తిరునాలలో..." లోపలికి పరుగెత్తుకుంటూ వచ్చి కంప్లయింట్ ఇవ్వబోయాడు చలపతి.

"ఇది పోస్టాఫీస్. పోలీస్ స్టేషన్ కాదు" వచ్చింది సమాధానం.

చలపతి : "దీనమ్మ జీవితం, సంతోషంలో ఎక్కడి కెళుతున్నానో కూడా తెలీట్లేదు.

భర్త : ఛాటింగ్ చేస్తూ వంటచేయద్దని ఎన్నిసార్లు చెప్పాలే నీకు. మామిడికాయ పప్పు తియ్యగా ఏడిచి చచ్చిందేమిటే?

భార్య : మొబైల్ చూస్తూ అన్నం తినద్దని మీకెన్ని సార్లు చెప్పాను. మీరు కలుపుకుంది పరమాన్నం, పప్పు కాదు"

లత, తన భర్త గోపీతో-

"నిన్న వచ్చిన మీ ఫ్రెండ్ మోహన్‌కు దొంగ బుద్ధులున్నాయండీ!" అంది.

గోపీ : "లేవు, వాడు నిప్పు. అయినా నీకెందు కొచ్చిందీ అనుమానం?"

లత : "నిన్న రాత్రి ఆయన మంచంమీద వేసిన కొత్త దుప్పటి సంచిలో పెట్టుకుపోయాడు"

గోపీ : "ఏ కొత్త దుప్పటి?"

లత : "అదే, అంచున 'భీమా హోటల్' అని రాసి వుంటుందే అది"

గోపీ : "అదా... వాడు మొన్న వారమే భీమా హోటల్‌లో మేనేజర్‌గా చేరాడు"

అనుకున్నది సాధించడానికి రెండో ఆలోచన లేకుండా లక్ష్యంపైనే మనసు కేంద్రీకరించాలి.



Akshaya tritiya
మీకు ఐశ్వర్యం
సమకూరి
సకల సౌభాగ్యాలు
సిద్ధించాలని
మా శుభాకాంక్షలు
₹100
తగ్గింపు గ్రామ్ మీద
IMP
India's Most Preferred Jewellers
THE ALL NEW
GROW GOLD
Flexi
SAVING SCHEME
మా సేవింగ్ స్కీమ్‌లో చేరండి
మొదటి వాయిదా ఉచితంగా పొందండి
వజ్రాలు కేవలం
₹57,900
కేరట్‌కి
NAC
JEWELLERS
విజయవాడ: యం.జి. రోడ్డు, హోటల్ డివి మానర్ దగ్గర | చెన్నై | తిరువళ్ళూర్ | కాంచీపురం
కస్టమర్ కేర్: 1860 500 6262 ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ కొనండి: www.nacjewellers.com

SWATI SAPARIVARA PATRIKA PRINTED AT ANIL SWATI PRESS AUTONAGAR VIJAYAWADA
RNI 38008 / 1984 REGD NO.VJ / 025 / 2018-20

